గురువులు

# బాబాలు, స్వామీజీలు, గురుమహరాజ్ లు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org    Mobile App: Free Gurukul    email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul    Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!



మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# బాబాలు, స్వామీజీలు,
# గురుమహారాజులు

గ్రంథకర్త :
భాషా విశారద, సాహిత్య విభూషణ, సాహిత్యరత్న
**రెవ. డా॥ ఆర్. ఆర్. సుందరరావు**
ఎమ్.ఏ., బి.డి., పిఎచ్.డి. [విస్కాన్సిన్]
ఆచార్యులు, ఆంధ్ర క్రైస్తవ వేదాంత కళాశాల
గాంధినగర్, హైదరాబాద్ – 500 380.

సౌవార్తిక ప్రచురణలు
హైదరాబాద్
**మార్చి 1987**

# లోపలి విషయాలు


పరిచయం iv

A Word of Appreciation v

పాఠకమహాశయులకు viii

భారతీయ సంస్కృతిలో గురువ్యవస్థ : పుట్టుపూర్వోత్తరాలు 1–23

షిర్డీ సాయిబాబా పారంపర్యం 24–101

షిర్డీ సాయిబాబా 25

కాశీనాథ్ గోవింద్ ఉపాసని బాబా 36

మెహర్‌బాబా 49

సత్యసాయిబాబా 64

ఆచార్య రజనీష్ 82

స్వామీజీలు 102–164

స్వామి శివానంద 102

స్వామి భక్తి వేదాంత ప్రభుపాద 117

స్వామి ముక్తానంద పరమహంస 133

మహర్షి మహేష్ మహాయోగి 150

గురుమహారాజులు 165–196

రాధాసామి సత్సంగ్ 165

మహారాజ్‌జీ బాలయోగీశ్వర్ 191

మాతృమూర్తులు 197–220

మాతృమూర్తి పాండిచేరి మాత 198

మాతృమూర్తి ఆనందమయి 205

గోదావరి సతి మాతాజి 213

ఉపసంహారం 221

# పరిచయం


డి. రైట్. రెవ. డా. పి. విక్టర్ ప్రేమసాగర్
ఎమ్.ఏ , పిహెచ్ డి. (యు.కె.); మెదక్ బిషప్


డాక్టర్ ఆరార్ సుందరరావుగారు వ్రాసిన యీ గ్రంథాన్ని తెలుగు చదువరులకు పరిచయం చెయ్యడానికి నేనెంతో సంతసిస్తున్నాను, ఆంధ్రా ఎవాంజిలికల్ లూథరన్ సంఘ పాస్టరుగా, ఆంధ్ర క్రైస్తవ వేదాంత కళాశాలయందు అధ్యాపకులుగా సుందరరావుగారు సేవిస్తూ, ఆంధ్ర సాహిత్యంపై శ్రద్ధ వహించి, ఆంధ్ర క్రైస్తవులు తెలుగు సాహిత్యానికి సలిపిన సేవను పరిశోధనాత్మకంగా చాలా కాలం కృషిచేసి 'తెలుగులో క్రైస్తవ సాహిత్యం' అనే ఉత్తమ గ్రంథాన్ని యిదివరలో (1976) ప్రచురించారు. దీన్ని అందరూ యెంతగానో శ్లాఘించారు. విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో డాక్టరు పట్టము కోసం పరిశోధన జరిగించిన దినాల్లో, ఆంధ్ర క్రైస్తవ కీర్తనలను వాటి సాహిత్య వేదాంత భావాలను సూచిస్తూ, ఆంగ్లములో నొక గ్రంథాన్ని ప్రచురించారు. దీనివల్ల ఆంధ్ర క్రైస్తవ కీర్తనలను తెలుగు తెలియనివారు గ్రహించి వానిలోని ఆధ్యాత్మిక సాహిత్య వేదాంత విషయాలను గ్రహించడానికి సహాయపడ్డారు. ఇటీవల కవిసామ్రాట్ గుర్రం జాషువాగారి కావ్యాల్ని విమర్శనాత్మకంగా చర్చిస్తూ తెలుగులో 'మహాకవి జాషువ: వ్యక్తిత్వం, కవిత్వం' అనే గ్రంథాన్ని వెలువరించారు.

బాబాలు, స్వామీజీలు, గురుమహారాజులు అనే ప్రస్తుత గ్రంథంలో నూతన మత నాయకులు, గురువులు, బాబాలను, వారి జీవిత బోధలను వివరిస్తూ వ్రాశారు. సమకాలీన భారతీయ మత ధోరణులను క్షుణ్ణంగా పరిశీలించి, నూతన పంథాలను త్రొక్కుతూ, ప్రజల్లో మత చైతన్యం, దైవసాన్నిధ్యాభ్యాసం, యోగాభ్యాసం పెంపొందించిన మతగురువులూ, యోగులను గూర్చి యీ గ్రంథాన్ని చక్కగా వ్రాశారు. ఈ గ్రంథం వేదాంత విద్యార్థులకూ, అధ్యాపకులకు మాత్రమే గాక, సామాన్య ప్రజలకు గూడా యీనాటి భారత మతధోరణులను పరిచయం చేస్తుంది. ఈ కృషి నిమిత్తం డా. సుందరరావుగారిని అభినందిస్తున్నాను. దేవుడు వీరిని దీవించి యీ గ్రంథం అనేకులకు ఆశీర్వాదకరంగా వుండునట్లు దయచేయాలని ప్రార్థిస్తున్నాను.

మార్చి 8, 1987 — డి. రైట్. రెవ. డా. పి విక్టర్ ప్రేమసాగర్
మెదకు, — మెదక్ బిషపు.

# పాఠకమహాశయులకు!

ప్రస్తుత గ్రంథం ఆధునిక గురూద్యమాలలో అత్యంత ప్రధానమైన వానిని గూర్చి స్థాలీపులాకంగా పరామర్శిస్తున్నది. ఇది నా అభిలాషకొద్ది సాగిన పరిశోధనా ఫలితం. ఏ పరిశోధన కూడ కొనసాగుతూ వుంటుందే గాని ముగింపుకు రాదు. ఇదీ అంతే! ఇప్పటికిది మరొకనాటికి మరికొంత విస్తృతమైన విశ్లేషణను, విశదీకరణను పొందవచ్చు. వేచి చూడవలసి వుంది.

ప్రాథమికంగా ఈ గ్రంథం క్రైస్తవ వేదాంత విద్యార్థులకు ఆధునిక గురూద్యమ ప్రభావం యొక్క అవగాహనను కలిగించుటకే ఉద్దేశింపబడినప్పటికి గ్రంథస్థ విషయాలు మతాంశాల పఠనకుపక్రమించే సాధారణ పాఠకులలో కూడ అభిలాషను, తద్వారా పఠనాసక్తిని పెంచుతుందని ఆశిస్తున్నాను.

గ్రంథ రచనలో అనేక గ్రంథాలను సంప్రతించాను. అవి అన్ని ఇంగ్లీషు గ్రంథాలు కావడం విశేషం. ఆయా సందర్భాలలో నాకు సహాయపడిన గ్రంథ కర్తలను, గ్రంథాలను పాదపీఠికల్లో ఉదహరించాను. నాకంటె ముందు ఈ అంశంపై అమూల్యమైన సమాచారాన్ని సేకరించి నావంటివారికి ఉపయోగపడిన పై గ్రంథకర్త లందరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

ఈ గ్రంథానికి పరిచయాన్ని, అభినందనలను వ్రాసిన వారిరువును ఉద్దండ పండితులే! మొదటివారు పాత నిబంధనా గ్రంథంలో, రెండవవారు ఆసియా మతాల తులనాత్మకాధ్యయనంలో. వారి మన్నన, మెప్పు పొందడం నా అదృష్టం. వారికి నా కృతజ్ఞతలు.

ఈ గ్రంథ రచనలో, ప్రచురణలో ఎప్పటికపుడు నన్ను ప్రోత్సహిస్తూ వచ్చిన నా శ్రేయోభిలాషులు, జాతీయంగా, అంతర్జాతీయంగా పేరు ప్రతిష్ఠల నార్జించిన డా. కె. రాజారత్నంగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. చరాత్మకమైన వారి నాయకత్వం చిరకాలం కొనసాగాలని కాంక్షిస్తున్నాను.

మీ అందరికి నమస్కారాలు.

ఏ. సి. టి. సి.

10-3-87

తమ

సుందరరావు

# భారతీయ సంస్కృతిలో గురువ్యవస్థ : పుట్టుపూర్వోత్తరాలు

భారత దేశం పారంపర్యంగా మతాత్మక దేశం. ప్రకృతి శక్తుల్లో, వికసించిన పూవుల్లో, మండే నిప్పుల్లో, ప్రవహించే నీళ్ళల్లో, వీచే గాలిలో దైవాన్ని దర్శించి, ఆరాధించే చిత్త ప్రవృత్తికి నిలయమైన సంస్కృతి వెల్లివిరిసిన దేశం. అయితే ఇలా మర్మగర్భితంగా ప్రకృతి పరిణామ ఫలితంలో దాగిన దైవ మహిమను చూడగలగడం ప్రతి నేత్రానికి సాధ్యం కాదు అట్టి అంతర్య దృష్టిని పెంచుకోడంలో ఆధ్యాత్మిక జిజ్ఞాసువులు అనేక సాధనాలు అలవర్చుకొంటారు, అభ్యసిస్తారు. అట్టి సాధనాలలో ఒకటి గురుశుశ్రూష. విశ్వంలో దైవాన్ని, దైవంలో విశ్వాన్ని దర్శించే అంతరంగిక సూక్ష్మదృష్టిని ప్రసాదించి తమ శిష్య వర్గాన్ని ఆధ్యాత్మిక విషయానురక్తులను చేసి, జీవితం ధన్యం చేసికొనేవారు గురువులు. అందువల్ల ఈ గురువ్యవస్థ ఈనాడు జన్మించిందీ కాదు, ఏ ఒక్క మతానికో, దేశానికో పరిమితమైందీ కాదు. ఆ వ్యవస్థ సర్వకాలీనం, సార్వత్రికం, సర్వ సంస్కృతులకు కరతలామలకం.

అతి పురాతన మతంగా పేరొందిన హెబ్రీ మతంలో ప్రవక్తల వ్యవస్థ వున్నది. దాదాపు ఆ మతాభ్యాసాలు ఆ జనానికి పరిచయమైనప్పటి నుండి ఈ వ్యవస్థ స్థిరపడి ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగించ ప్రయత్నించింది. వారు ప్రవక్తల పాఠశాలల్లో- ఇవి ఒక రకంగా మన గురుకులాల వంటివి- యువకులకు శిక్షణ నిచ్చి, వారికి తమ బాధ్యతల నప్పగించారు. వీరి ప్రధమ కర్తవ్యం దైవోక్తులను ప్రజలకు వినిపించి, రాగల ప్రమాదాన్ని గూర్చి హెచ్చరించి, ఆధ్యాత్మిక పరిణామాన్ని ప్రబోధించడం. ఈ ప్రవక్తలనే పాత నిబంధన, 'దీర్ఘదర్శు'లని, 'దూరదర్శులని' సంబోధిస్తున్నది. వీరు ఋషి వర్గానికి చెందినవారు.

ఈ దీర్ఘదర్శులు తమకు నచ్చిన, దైవామోద ముద్ర లభిస్తుందని తాము భావించిన తమ శిష్యవర్గంలో ఒకరికి తమ విధుల నప్పగించిన సందర్భాలు కూడ పాత నిబంధనలో ఉదాహృతమై వున్నాయి ఈ ప్రవక్తల వ్యవస్థ కొన సాగుతుండగనే 'రబ్బీ'- బోధకుడు లేదా మన పరిభాషలో ఆచార్య-వ్యవస్థ కూడ ప్రారంభమైంది. విశాలం, మర్మగర్భితమైన 'మిష్నా' అనబడే యూదా మత ధర్మశాస్త్ర గ్రంథాన్ని సూక్ష్మదృష్టితో అధ్యయనం చేసి, అవగాహన చేసి కొని, విశేషించి విడమర్చి, వ్యాఖ్యానించి, శిష్యవర్గానికి మతాసక్తి గల ప్రజా నీకానికి బోధించడం వీరి ప్రథమ కర్తవ్యం. అపొస్తలుడైన పౌలంతటి సమ ర్పిత క్రైస్తవ సౌవార్తిక యోధుడు 'గమలియేలు పాదముల చెంత ధర్మశాస్త్రము నభ్యసించితి న'ని ఎరూషలేం దేవాలయ సోపానాల మీద నిలచి తనను బంధింపచూస్తున్న యూదులకు ప్రకటించినాడు. కాగా జైన బౌద్ధ మతాల ఆధ్వర్యంలో వెలసి నిర్వహింపబడిన మఠాలు, ఆధ్యాత్మిక, మానసిక క్రమశిక్షణతోపాటు కఠినమైన తపోచర్య ద్వారా, శరీర శుష్కీకరణ ప్రక్రియను కూడా మఠసన్యాసుల్లో అలవడడానికి తీవ్ర కృషిచేశాయి. ఆ మత నాయకులను గురువు లనడంలో పొరపాటు లేదు. ఇస్లాం మతంలోని సూఫీ లిట్టి వ్యవస్థకు చెందిన వారే! అతి సామాన్య జీవితాన్ని జీవిస్తూ ప్రజల్లో-ముఖ్యంగా తమ శిష్యవర్గంలో-ఆధ్యాత్మిక జీవితం క్రమబద్ధం కావడానికి అది సామాజిక పురోగతికి తోడ్పడ డానికి కృషి చేశారు. వారి కార్యక్రమం, జీవిత సరళి, ధ్యేయం, కేవలం అలౌకిక జీవన పురోగతికి మాత్రమేగాక లౌకిక సమాజాభివృద్ధికి కూడ దోహదం కలిగించిందని వారి చరిత్రను పరిశీలించినవారికి అవగతం కాకపోదు.

క్రైస్తవ మత వ్యవస్థాపకుడైన యేసు భగవానుని "సద్బోధకుడ"ని సమ కాలికులు సంబోధించారు. ఆదర్శవంతం, నిందారహితమైన ఆయన ముప్పది మూడు సంవత్సరాల ఐహిక జీవిత యాత్రను ముంగుర్తుగా వుంచుకొని, క్రైస్తవులేగాక ఇతర మతాలవారు సైతం ఆయన్ని అనుకరించడం పరిపాటి. ఆయన శిష్య ప్రశిష్య వర్గాలు ఆయన బోధనా సారాంశాన్ని శిరసావహించి, క్రైస్తవ సంఘ స్థాపనాకాలంనుండి ప్రత్యేక మఠాల ద్వారా, జీవనసరళి ద్వారా ప్రజల్లో ఆధాత్మిక చింతనకు దోహదం కలిగిస్తూనే వున్నారు. గత రెండు సహస్రాబ్దాలలో ఈ మతం శాఖోపశాఖలై దేశదేశాలలో వ్యాపించింది. ప్రపంచంలో నేడు అధిక సంఖ్యాకులు-మొత్తం ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు-ఈ

మతాన్ని ఆశ్రయించి జీవన గమనం కొనసాగిస్తున్నారు. రకారకాల సంస్కృతు ల్లోనికి చొచ్చుకొనిపోయిన ఈ మతం ఆయా సాంస్కృతిక ధోరణులకు తగినట్లు రూపొందింది. బహుకాలం క్రితమే ఈ మతం భారతదేశంలో ప్రవేశించినా సంపూర్ణంగా భారతీయం కాలేదనే నింద ఒకటున్నప్పటికి, గురు వ్యవస్థకు సంబంధించి కొంతవరకు దేశీయమైందనే చెప్పాలి. భారత సంస్కృతి కను గుణంగా ఆశ్రమాలు గురుకులాలు అల్పసంఖ్యలో నైన భారతంలో స్థాపింపబడినవి.[1]

భారతదేశంలో హిందు మతానికి చెంది సుమారు 500 గురువులున్నారని ఒక అంచనా. అయితే ఈ సంఖ్యలో గ్రామ గ్రామాన వెలసిన సన్యాసి, యోగి, సాధువు, ఋషి, గురువుగా చెలామణి ఔతున్నవారి సంఖ్య చేరలేదు. పై పంచ శత గురువులు జాతీయంగా, అంతర్జాతీయంగా లబ్ధప్రతిష్ఠులైన వారు. వీరిని దర్శించి, గౌరవమర్యాదల్ని, దక్షిణలను సమర్పించి, వారుద్బోధించే విషయాలను ఆలకించి, జన్మ తరించినట్లు భావించి తరలిపోయే ప్రజానీకం యొక్క సంఖ్య దిన దినం ప్రవర్ధమానం ఔతున్నదే గాని, తరగడం లేదు ఈ ప్రజానీకంలో అన్ని మతాల వారు, చదువరులు, పామరులు, వృద్ధులు, యువజనులు, ధనికులు, దరిద్ర నారాయణులు, పురుషులు స్త్రీలున్నారు కొందరు తాము దర్శిస్తున్న గురు వుల్లో దైవ ప్రత్యక్షతను చూచి తరిస్తే, మరికొందరు గురువులే దైవాలని నమ్మి పొంగిపోయి, వారినే ఆరాధిస్తున్నారు.[2]

అతి పురాతన కాలం నుండి గురు వ్యవస్థ భారతదేశ సంస్కృతిలో భాగ మైనప్పటికి, నేడున్నంత అలజడి, తీవ్రత మున్నెన్నడు లేదనే చెప్పాలి. ఉపనిష

1. For more elaborative study on this refer to Werner Hocrschelmann, *Christliche Gurus; Studies in the Intercultural History of Christianity*, Frankfurt : Peter Lang, 1977. This is an excellent exposition of Christian Gurus in India written in German language.
2. Khushwant Singh, *Godmen and their Disciples* in *Illustrated Weekly of India* Vol. XCIV. No. 11, March 18, 1978. p. 8.

త్కాలంలో కొంత పరిణితి చెందినప్పటికి అనేక పరిణామాల తదనంతరం ఈ వ్యవస్థ ప్రస్తుత స్థాయికి చేరింది. అందువల్ల ఆయా గురువులను గూర్చి వివరంగా చర్చించక ముందు గురువుకు పర్యాయ పదాలుగా గాని, లేదా విచక్షణా రహితంగా గాని, లేదా కేవలం తెలియని అమాయకత్వంచేగాని ప్రజానీకం ఉపయోగిస్తున్న 'సన్యాసి', 'ఋషి', 'సాధువు' మొదలైన పదాలు సూచించే అర్థాలను, వ్యక్తిత్వా లను పరిశీలించడం అవసరం.

'సన్యాసి', అంటే సర్వసంగ పరిత్యాగి. లోకేచ్ఛలను వీడి, దైనందిన జీవన స్థితి గతులకు దూరంగ వుంటూ, కఠోర క్రమశిక్షణా చర్యను పాటిస్తూ, కందమూలాదులతో కడుపు నింపుకొంటూ, అనంత శక్తిని అన్వేషించే వ్యక్తి. భోజన పానీయాలను, వస్త్రాభరణాలను పట్టించుకొనక, తనదొక లోకంగా, గమ్యంగా తరుచు జీర్ణవలువలను గాని, కాషాయరంగు వస్త్రాలనుగాని ధరించి బహు కాలం తైల సంస్కారం లేనందువల్ల, జడలు గట్టిన కురులతో, నొసట విభూతితో, చేత కమండలం, చంక మంత్ర దండంతో దర్శనమిచ్చే వ్యక్తి. వ్యక్తిగత క్రమ శిక్షణాభ్యాసంగా ప్రారంభమైన ఈ సన్యాస క్రమం, సాంఘిక వ్యవస్థగా పరి ణామం చెంది, పేరుప్రఖ్యాతులను సంపాదించిన సర్వసంగ పరిత్యాగులను జితేం ద్రియ వ్యక్తులను ఈ వ్యవస్థ ప్రసాదించింది. అయితే తమకు లభించిన ప్రత్యేక అవకాశాలను వ్యక్తిగత సుఖభోగాల కుపయోగించుకొని భ్రష్టులైన సన్యాస బ్రువులు ఈ క్రమంలో కొందరున్నారనేది జగమెరిగిన సత్యం. ఈ సన్యాసులు సమాజంపై తమకున్న పట్టు సడలిపోకుండ వుండడంకోసం, అనేక మంత్ర తంత్రాలను కొన సాగిస్తూ వుంటారు.[3] కఠిన తపోచర్యలవల్ల మానవాతీత కార్యసాధనకు తోడ్పడే అతీంద్రియ, తాంత్రిక శక్తిని సముపార్జించాలనేది వీరి తహ తహ. వీరిని మునులని కూడ గ్రామీణ ప్రజ సంబోధించడం కద్దు.

'సాధు' అనే పదం అతి పురాతన కాలంనుండి వాడుకలో వుంది. హిందూ సంప్రదాయంలో ఉన్నతమైన ఆధ్యాత్మిక ప్రమాణాలను, మతవిలువలను పాటించే వారిని 'సాధు'వులని సంబోధించడం పరిపాటి. సత్యం, శివం, సుందరం యొక్క

3. G. S Ghureye, *Indian Sadhus*, Bombay : Popular Prakasan, 1964. p. 220.

పారమార్థిక విలువలను పరిపోషిస్తూ, 'మనస్యేకం', 'వాచస్యేకం', 'కర్మన్యేకం'- మనోవాక్కర్మలలో ఏకత్వాన్ని సాధించే మహాత్ముడు - అనే నిర్వచనం కూడ గ్రంథస్తమైవుంది. మోనియర్ విల్యమ్స్ సూచనమేరకు ఈ పదం ఋగ్వేదకాలం నుండి సాహిత్యంలో స్థానం పొందివున్నదని, 'గురితప్పక లక్ష్యాన్ని చేరగలవా' డనే భావంకూడ వాడుకలో వున్నదని తెలుస్తున్నది.[4] ఇక అమర కోశం 'సాధు' అంటే 'ఆర్య', 'సభ్య', 'సజ్జన' అనే అర్థాలను వ్యక్తం చేస్తున్నది. 'సాధయతి పరకార్యాని ఇతి సాధుః' అనే నిర్వచనంకూడ సర్వజన విదితమే!

సాధువుయొక్క మూలధాతువు 'సాధ్'. దీనికి 'ఉ' కారాంతాన్ని చేర్చి నందువల్ల సత్కార్య సాధకుడనే భావం సిద్ధిస్తున్నది. ఈ సాధువులు తమశాఖ విధించిన నీమ నిష్ఠలను నిర్వహించడంలో తనను తాను నిమగ్నం చేసికొనిన వ్యక్తులు అనే భావం కూడ కొంతవరకు లోకవిదితమే! అయితే, బి. డి. త్రిపాఠి ఈ 'సాధువు'కు కొన్ని గుణలక్షణాలను సూచించాడు. అవి గమనార్హాలు.[5]

1. గృహస్థాశ్రమానికి తిలోదకాలిచ్చి సంసారచక్రంనుండి విముక్తి పొందిన వాడు.
2 తన మతశాఖకు చెందిన గురుతులను, నియమించిన రంగు వస్త్రాలను ధరిస్తూ, గంధపుగుజ్జునుగాని, గోపీచందనాన్ని గాని, విభూతినిగాని ధరించి దేశాటనం చేస్తూవుండే పరివ్రాజకుడు.
3 కేశఖండన నిషేధాన్ని పాటించేవాడు.
4. సంచారం, భిక్షాటనం ప్రధానంగా గలవాడు.
5. మతచర్చల్లో పాల్గొని, సమన్వయ భావాన్ని పెంపొందించవలసిన వ్యక్తి.

కాగా సంస్కృత సాహిత్యంలో 'ఋషి' అంటే జ్ఞాని, 'పూర్వపితరుడు' 'దివజకవి' అనే అర్థాలు సుప్రతిష్ఠమై వున్నప్పటికీ, సామాన్య వాడుకలో అసాధా

4. See Monior Williams, *Sanskrit to English Dictionary*; Delhi : Motilal Banarsidas & Co 1976.

5. B. D. Tripathi, *Sadhus of India*, Bombay : Popular Prakasan 1978 pp 14–18.

రణ జ్ఞాన సంపత్తిని శక్తిని సాధించిన మహాపురుషునిగా ప్రసిద్ధి ఇది గూడ అతి పురాతనమైన వ్యవస్థయని పాఠకులు గమనింపవలసి వుంది. వారి వ్రాతలవల్ల గాని, చేతలవల్లగాని, ప్రత్యేకంగా గుర్తింపబడిన వ్యక్తులు ఋషులు. 'ఋషి' అనే పదం పురాతన వేదసాహిత్యానికి చెందిన 'ఋష్' అను ధాతువునుండి ఆవిర్భవించింది. 'ఋష్' అంటే చూచుట. ఈ ఋషులు పురాతన కాలంలో తమకొరకై నిర్మించుకొన్న ఆశ్రమాలలో జీవించేవారు. నేడు ఆశ్రమాలు అనబడే సర్వభోగ భాగ్య విలసితమైన హర్మ్యాలు కావు ఆనాటి ఆశ్రమాలు. అవి ఆ పేరుకు తగినట్లు స్వీయ క్రమశిక్షణా కేంద్రాలు. తమ తపోచర్య, స్వీయ క్రమశిక్షణా కార్యక్రమాల సాధనంగా సముపార్జించిన శక్తివల్ల సామాన్య మానవులేగాక ఆకాశ దేవుళ్ళు కూడా వీరి దయాదాక్షిణ్య భిక్షపై ఆధారపడేవారని ఆ విషయాలను పరిశోధించిన పండితుల అభిప్రాయం.[6] ఇట్టి ఋషుల్లో కూడ సత్యవ్రతులైన సాధువులున్నారు, గోముఖ వ్యాఘ్రాలున్నారు. ఇందు ఎవరు సత్యమో, ఎవరు కాదో నిశ్చయించి చెప్పడం కష్టసాధ్యమైన విషయం.

'యోగి' తనలోని జీవాత్మను పరమాత్మతో లీనం చేయడానికి యోగ విధానాన్ని అభ్యసించి. అనుసరించే వ్యక్తిగా అభివర్ణించవచ్చు.[7] తరుచుగా 'యోగి', 'సాధు' ఒకదానికి మరొకటి పర్యాయపదాలుగా ఎంచి మాట్లాడడం ఆనవాయితీగా వస్తున్నది. భారతదేశం అంతటిలో వ్యాపించిన వందలకొలది శాఖలను, వర్గాలను ఈ పదాలు సూచిస్తాయి. ఎక్కువగా వీరు మానవాతీత కార్యాలను సాధిస్తామని చెప్తూ, సంచారం చేస్తూ వుంటారు. హిందూ మతాభ్యాసం, అధ్యయనం వీరి కోరిక, అయినా అందుకు అవలంబించే పద్ధతులు అధికభాగం జనాకర్షణకే గాని, ఆధ్యాత్మిక సాధనకు కాదు[8] వీరు అవలంబించే ప్రజాకర్షణా

6. **Campbell Omen J.** *The Mystics, Ascetics, and Saints of India,* **A Study of Sadhuism with an account of the yogis, Sanyasis and the Strange Hindu Sectarians, London.** 1903. **p** 19.
7. **J N. Farquhar,** *The Crown of Hinduism,* **Oxford Press,** 1913 **p** 255.
8. **Benjamine Walker,** *Hindu World, Vol.* 1, **London : George Allen and Unwin,** 1968 **p.** 322.

సాధనాలలో కొన్ని : కలలను వ్యాఖ్యానించడం, హస్తసాముద్రికం, దయ్యాలను వెళ్ళగొట్టడం, మంత్రక్రియలు, గారడీలు చేయడం ఒక రకంగా వీరి జీవనభృతి సాధనాలు కూడ ఇవే. వీరిలో నిక్షేపంగా వున్న అపూర్వమైన మంత్రశక్తివల్ల వీరు ఈ కార్యాలను సాధిస్తారని ప్రజల నమ్మకం. ఈ విధమైన జీవన విధానం గ్రామీణ జీవితంలో లీనమైపోయింది వీరందరిలో కొన్ని సామాన్య లక్షణాలు కనిపిస్తున్నవి. అరణ్యవాసాన్ని అధికంగా వీరు ఆశిస్తారు. కఠోర తపోచర్య, క్రమశిక్షణ మరియు తదేక ధ్యాన విధానాన్ని కొనసాగిస్తూ, మానవాతీతశక్తిని సముపార్జించవలెననే కాంక్ష వీరిలో సహజంగా వుంటుంది.

అయితే వీరందరి ప్రప్రథమ కార్యం, కర్తవ్యం లౌకేచ్ఛలతో సంబంధం ఉన్న ఏ చిన్న అంశాన్నైనా తమ హృదయాలనుండి తొలగించుకొనడం. ఆ విధంగా చెడును, చెడును చేయడానికి ప్రేరేపించే సహజాతాన్ని దూరం చేసికొనుట ద్వారా, సర్వ దౌష్ట్య కార్యాతీతులై పవిత్రంగా జీవించాలనేది వీరి ఆకాంక్ష. కాని ఆయా సాధువుల, యోగుల, సన్యాసుల జీవితాలలో ఇది తరచు అగోచరమైన అంశం సంగవిముక్తమైన నిర్మల హృదయం, ఏ కొందరిలోనో అసాధారణంగా కనిపించే ఖరీదైన వస్తువు. కాగా గౌడ పాద కాలం నుండి కొనసాగుతున్న ఆచార్య వ్యవస్థ కూడ భారతీయులకు చిరపరిచితమైందే. ఇప్పటివరకు తెలియ వచ్చిన ఆచార్యులందరూ దిగ్గంతుల వంటి వేదాంత పండితులు, సంస్కృత భాషా నిష్ణాతులు, తాత్విక జ్ఞాన వ్యాఖ్యాతలు. శంకరాచారి ఆదిగా వీరు తమదైన ప్రత్యేక సిద్ధాంతాన్ని వ్యాపింపచేయడానికి మఠాల నెలకొల్పి, దేశాటనం చేసి, ప్రజలను ఆధ్యాత్మిక చింతనాపరులను గావింప ప్రయత్నించారు. వారి సేవలు ఆధ్యాత్మిక తృష్ణనుండి జనించినందువల్ల ఆ సేవల్లో స్వార్థం కన్న పరార్థం చోటుచేసుకొని, తరతరాలు నిలువగల గ్రంథ రచనకు, సిద్ధాంత నిర్మాణానికి వారిని ప్రోత్స హించింది. అయితే ఈనాడు గురువ్యవస్థ ఆనాటి గురు వ్యవస్థకు, ఆచారి వ్యవస్థకు పూజారి వ్యవస్థకు భిన్నంగానే గాక, ఈ మూడు ప్రధాన వ్యవస్థల ఏకైక రూపంగా రూపొందినది. బౌ గక! ఆ రూపం వక్రించినందు వల్ల తర తరాలుగా గౌరవమర్యాదలకు నోచుకున్న ఈ ఆధ్యాత్మిక వ్యవస్థ నేడు బాబాలుగ, స్వామీజీలుగ, గురుమహారాజులుగ, చెలామణీ ఔతున్న కొందరివల్ల అపఖ్యాతి పాలు ఔతున్నది ఈ వర్గాలకు చెందిన కొందరి వ్యక్తుల జీవితాలను, బోధలను వివరంగా చర్చించకముందు 'గురు' వ్యవస్థ యొక్క పూర్వాపరాలను కూడ పరామర్శించవలసి వుంది.

## గురువ్యవస్థ పుట్టు పూర్వోత్తరాలు :

"సర్వోన్నతమైన ఆకాశమధ్యంలో దేదీప్యంగా వెలుగుతున్న జ్యోతి నిక్షిప్తమై ఉంది. గురు శిక్షణను పొందుతున్న వ్యక్తి మాత్రమే దానిని దర్శించ గలడు" అనే వాక్యంలో పీటర్ బ్రెంట్ భారతీయ ఆధ్యాత్మిక జీవితంలో గురు స్థానాన్ని క్రోడీకరించాడు.[9] ఈ గురు వ్యవస్థ హిందూ జన జీవనంలో మున్నె న్నడు లేనంతగా మిళితమైవుంది. గురువు నుండి మరో గురువుకు సంక్రమిస్తూ, ఈ ఆధ్యాత్మిక జ్యోతి ఒకరిని మరొకరితో అనుబంధిస్తున్నది. హిందువులలో నిత్యం కొనసాగే ఆధ్యాత్మిక చింతనకు మూలాధారమైంది. హిందూమతంయొక్క అస్థిపంజరమీ గురువ్యవస్థ అన్నంతగా దైనందిన మత జీవితంలో భాగమైంది.

గురువు అనే పదానికి-అధ్యాపకుడు లేదా బోధకుడు లేదా మార్గదర్శి అనే అర్థాన్ని సూచిస్తున్నాడు డ్యూబియోస్ అనబడే గత శతాబ్దపు క్రైస్తవ రచయిత.[10] ఆయన వివరణ ప్రకారం తల్లి దండ్రులు ప్రథమ గురువులు. ఎందు కంటే, వారు తమ బిడ్డలికి మొట్టమొదట అక్షరజ్ఞానానికి అలవరుస్తున్నారు గనుక. అలానే రాజు తన ప్రజలందరికీ మార్గదర్శి కనుక ఆయన కూడ గురువనబడి నాడు. అయితే ద్వయోపనిషత్ గురువునకు వేరొక నిర్వచనాన్ని సూచించింది.

గు శబ్ద స్త్వంధకారే స్యాత్
రు శబ్ద స్త న్నిరోధకః
అంధకార నిరోధి త్వాత్
గురు రిత్య భి ధీయతే

'గు' అనే అక్షరం అంధకారాన్ని సూచిస్తే 'రు' అనె అక్షరం ఆ అంధ కార నిరోధాన్ని సూచిస్తున్నది. అంధకారాన్ని నిరోధించి పటాపంచలు చేసేవాడే గురువనే నిర్వచనం పై శ్లోకంవల్ల ప్రస్ఫుట మౌతున్నది. ఇక్కడ అంధకారం

9. Peter Brent, *Godmen of India*, **Hirmondsworth; Penguin Books**, 1973 **p.** 1.

10. **J. A. Dubios**, *Hindu Manners, Customs and Ceremonies*, **Oxford Press** 1968 **ed. p.** 125, 126.

అంటే సూర్యుడు కనుమరుగైనందువల్ల కలిగినదిగా గాక, అవిద్యవల్ల, అజ్ఞానంవల్ల ఏర్పడినదని గ్రహించవలసి వుంది. ఇది అజ్ఞానాంధకారం. గురువునొక ఆదర్శ ప్రాయునిగ, ఆచార్యునిగ, అధ్యాత్మిక జ్ఞాన ప్రదాతగ ఈ నిర్వచనం ప్రత్యక్ష పరుస్తున్నందువల్ల ఈ నిర్వచనం అంగీకార యోగ్యంగా వుంది.

ప్రజా బాహుళ్యాన్ని ఆకర్షించేందుకే అనుకుందాం, కొందరు 'గు' గుప్తమై యున్నదానిని 'రు' రూపవతి అనగా రూపాన్ని ప్రసాదించి (ప్రబోధించు) వాడని అర్థాన్ని వెలికితీశారు. ఇదికూడ ఒకవిధంగా పై శ్లోకం వ్యక్తం చేసిన భావాన్ని బలపరుస్తున్నది. సామాన్య మానవ మనసు కగోచరమైన పారమార్థిక విషయాలను వెలికితెచ్చి, తమ శిష్యవర్గానికి బోధించేవాడు గురువనే భావం ఇందున్నందువల్ల ఇది సమర్థనీయమైన నిర్వచనమే.

'గుర్' అనే ధాతువునుండి 'గురు' శబ్దం జనించిందని సూచిస్తూ 'గుర్' అంటే పైకెత్తడం, 'ప్రయత్నించడం,' చంపడం అనే అర్థాలున్నందువల్ల గురువనగా 'స్వయంసిద్ధి' అని, అట్టి స్వయంసిద్ధ జ్ఞానాన్ని శిష్యుల్లో ప్రబోధించేవాడే గురువని, అంధకారాన్ని సంహరించేవాడనివ్యక్తం చేశారు కొందరు. సంస్కృత నిఘంటు నిర్మాత మోనియర్ విల్యమ్స్ గురు అనే పదానికి 'మర్యాదస్తుడు', 'గౌరవనీయుడు', 'ఆధ్యాత్మిక తండ్రి' లేదా 'యువకునికి మతదీక్షను ప్రసాదించే బోధకుడు', 'మంత్రోపదేశకుడు[11], అని సూచించాడు. సన్యాసి, సాధు, యోగి, పూజారి, మాంత్రికుడు, గురు మొదలైన పదాలు విచక్షణా రహితంగా ప్రజానీకం వాడుకలో స్థిరపడినందువల్ల వారు చేసే పనులను గూర్చిన స్పష్టమైన అవగాహనకూడ అదృశ్యమైందనే డ్యూబిమోస్ అభిప్రాయం[12] సక్రమమైందని పాఠకులు గమనించగలరు. గత కొన్ని శతాబ్దాలుగ కొందరు గురువులు యోగనిద్ర, గారడీ, మంత్రప్రయోగం, ఆధ్యాత్మిక పారవశ్యం మొదలైన వానిని అభ్యసిస్తూ, ప్రయోగిస్తూ ప్రకృతికి అతీతమైన శక్తులను సాధించే ప్రయత్నాలు కొనసాగిస్తూ వున్నారు. అయితే అట్టి

11. **Monior Williams**— *op.cit.*

12. **Dubios,** *po.cti.* **p.** 126.

ప్రయోగాలను జె ఎన్. పార్కుహర్ కేవలం మోసకరమైన చర్యలుగా ఒక్క మాటలో కొట్టిపారవేశాడు[18]. ఆయన తన గ్రంథాన్ని వ్రాసే సమయానికి పైఅంశాలను గూర్చిన పరిశోధనలు జరగలేదు సరికదా ప్రారంభంకూడా కాలేదు. ఇప్పటికింకా వానిని గూర్చిన పరిశోధన ఒక కొలిక్కి రానపుడు సుమారు తొంభై ఏళ్ళ క్రితమే వానిని అబద్ధాలని కొట్టివేయడంలో ఆనాటి కాలప్రభావం ఈ క్రైస్తవ మిషనెరీ రచయితపై పనిచేసిందనే చెప్పాలి. ఇలా వ్రాసినందువల్ల ఈ గ్రంథకర్త పై సాధనాలను సమర్థించినట్లుగా భావించరాదు. కాని ఏదైనా ఒక నిర్ణయాన్ని గ్రంథస్తం చేయకముందు వారి పరిశోధనా ఫలితాలను తెలుసుకోవలసిన అవసర మున్నదని నొక్కిచెప్పదమేనని మనవి అలా చేసినందువల్ల గ్రంథం విలువ, రచయిత యొక్క నిష్పాక్షిక వైఖరి లోకానికి వెల్లడై గౌరవ మర్యాదలు పెరుగుతవేగాని తరుగవు ఆ విషయాన్నలా వుంచండి. హిందూ మతానికి సంబంధించినంతవరకు వేదాలలో చెల్లాచెదరుగ ఉపనిషత్తులలో కోకొల్లలుగా 'గురు' పదం ప్రయోగింపబడింది. ఋగ్వేదం పన్నెండవ మండలంలో ఆత్మను గూర్చిన జ్ఞానార్జనకు ఆధారం, దోహదకారి గురువనే సూచనవుంది (XII:౬:౮). ఆతడు స్వయంకృషితో గాని లేదా మరొక గురువుయొక్క నడిపింపుతోగాని సిద్ధుడైనందువల్ల ఇంకొక శిష్యుని ఆ స్థాయికి నడిపింప సమర్థుడనే భావన అందిమిడివుంది. 'ఆధ్యాత్మిక జ్ఞానార్జనా సంపన్నుడవు కమ్ము' అని దీవించేవ్యక్తి గురువని యజుర్వేదం సూచిస్తున్నది (VII : 27) ముండకోపనిషత్తు జ్ఞానం కావాలంటే గురు సాన్నిధ్యాన్ని కాంక్షించుమని (I:2:12) సూచింప, కఠోపనిషత్ (1 : 2 : 8) ఆత్మజ్ఞానసత్యం ఆరితేరిన వ్యక్తులచేతనే బోధింపబడవలెనని హెచ్చరించింది. శిష్యుడు తనను తాను సంపూర్ణంగా గురువుకు సమర్పించు కొనకుండా ఈ జ్ఞానాన్ని ఆర్జించలేడనే విషయం సనాతన సత్యం సనాతన గురు శిష్య సంవాదంలో క్లిష్టమైన తాత్విక, తార్కిక, వేదాంతపరమైన అనేక అంశాలు వెలికివచ్చాయి ఆ తాత్విక వేదాంశాలను వ్యాఖ్యానించడంలో ఆ తరువాత వచ్చిన ఆచార్యులు తమకు తోచిన, నచ్చిన భావాన్ని పెంచి పెద్దచేసి వ్యాఖ్యాన గ్రంథాలను నిర్మించారు. శాఖ లేర్పడ్డాయి. తాత్విక హిందూశాఖ ఒకటి స్థిరపడింది ఇంతగా ఆనాటి గురూద్యమం అప్పటి వేదాంతులను, విద్యావంతులునేగాక, నేటి నవీన శాస్త్ర విజ్ఞానులనుకూడ తాత్విక చింతనలో సంభ్రమాశ్చర్యాదులలో ముంచెత్తినది.

18. **J. N. Farquhar,** *op cit.* 272.

ఈ గురువ్యవస్థ అనాదివిధంగా అభివృద్ధి చెందడానికి మూడు ముఖ్య కారణాలు కనిపిస్తున్నాయి. సనాతనాచార పరాయణత్వం పాదుకొని మార్పులకు చేర్పులకు దూరంగా అచేతన జడ పదార్థంలా వుండిపోయిన బ్రాహ్మణిక హిందూ మత పారంపర్యంపై తిరుగుబాటు చేయాలచే కోరిక. అధిక ప్రజానీకం యొక్క అందక లోనికి రాక ఏ కొందరి ఎత్తుబిడ్డగనో వుండిపోయిన పూజారుల ఆధీనంలోని ఆచార కర్మకాండ, యజ్ఞయాగాదుల నిర్మాణ ప్రాధాన్యతను తగ్గించి, సర్వజనోప యోగకరమైన వేరేమార్గాన్ని అన్వేషించాలనే తపన. "ద్విజన్ములు" కానివారి యెడల ద్విజన్ములన బడేవారు చూపుతున్న విచక్షణ. ఈ మూడు కారణాల ప్రేరణకు లోనైన మేధావి వర్గంలో ఆర్థిక, ఆధ్యాత్మిక స్తోమతుగలవారు గురువులుగ బాధ్యతలను స్వీకరించి శిష్య ప్రశిష్యులను తయారుచేసి, లోక కళ్యా ణార్థం ప్రతిష్టించినారనవచ్చు.

గురు బాధ్యతలను, గౌరవ మర్యాదలను, ఉపనిషత్కాలం, ఆ తరువాత మధ్య యుగాలు అంగీకరించినంత సులభంగా ఈనాటి వైజ్ఞానిక యుగం అంగీకరించలేక పోవచ్చు. ఆనాడు దేవునికి మానవునికి గురువు మధ్యవర్తి మాత్రమే కాదని, కనిపించని దేవునికి కనిపించే రూపమే గురువనే విశ్వాసం ప్రబలంగా వ్యాపించి వుంది. కబీరు కీర్తనల్లో, సిఖ్ మత స్థాపకుడైన గురు నానక్ బోధల్లో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తున్నది.

దైనందిన లోక వ్యవహారాలకు, వ్యాపారాలకు అతీతంగా, ఒంటరిగా జన సంచారంలేని తావుల్లో గురువులు ఆశ్రమాలను నిర్మించుకొని తమ జీవితానుభవం ద్వారా సంపాదించిన అనుభవైక ఆధ్యాత్మిక జ్ఞానాన్ని శిష్యవర్గానికి పంచిపెడుతూ నిస్వార్థంగా, నిష్కామంగా జీవించేవారు పూర్వం. పరమార్థ సాధన అందరి అందిక లోనికి రావాలని ప్రకటించి, అందుకవసరమైన శిష్యవర్గాన్ని ఆనాడు వారు తయారు చేశారు.

వారు బ్రహ్మనిష్ఠగల గురువులు తాము దైవ రూపాన్ని, శక్తిని ధ్యానిస్తూ తాము నమ్మిన దేవునిలో ప్రతిష్టితమైనవారు. బ్రహ్మనిష్ఠను గూర్చి ముండ కోపనిషత్తు (II 12) సవివరంగ ముచ్చటిస్తున్నది. వేదవేదాంగాలను పుక్కిట బట్టి, ఆ సూత్రాల కనుగుణ్యంగా జీవితాలను రూపొందించుకొని ఆదర్శవంత

మైన జీవితాన్ని తుదమట్టుకు జీవించినవారు. బ్రహ్మనిష్ఠులు. వారు 'శ్రవణ్' అనే ప్రతీతి వుంది. దేవుని గూర్చిన వార్తలను, విశేషాలను వింటూ తదితరాంశా లను చెవి కెక్కనీయని నిష్ఠాగరిష్టులు. హిందూ లేఖనాలను పఠించి, వల్లించి ధ్యానించి, తద్వారా లభించిన జ్ఞానాన్ని యోగసాధనలో వినియోగించి, అనేకుల నా విద్యలో ప్రవేశపెట్టినవారు. అందుకే గురువు స్వర్గానికి ముఖద్వారమనే అభిప్రాయం స్థిరపడింది.

మరికొందరు మౌనముద్ర ధరించి ప్రజల కంటబడ నిచ్ఛగింపక యోగ ముద్రలో పద్మాసనాప్రతిష్ఠులై జ్ఞానేంద్రియాలను నవరంధ్రాలను బంధించినవారు. తప్పనిసరిగా ప్రజా దర్శనానికి బలవత్తరమైన వత్తిడి ద్వారా మినహా ముందుకు రానివారు. వారి మౌన ముద్రయే వారి అనుచరవర్గానికి రక్షరేఖ లేదా అవసర మైన నడిపింపు అని నమ్మినవారు. వారి జీవిత ధ్యేయం ఆధ్యాత్మిక సాధనద్వారా కర్మ సంసారం నుండి విముక్తి, ఆ పిదప సర్వసంగ పరిత్యాగంతో శిష్య వర్గానికి శిక్షణనిచ్చి, వారి వ్యవస్థలో ప్రవేశపెట్టడం, వాస్తవిక బ్రహ్మను గ్రహించే విధంగా శిష్యవర్గాన్ని తయారుచేసి లోక కళ్యాణార్థం వారిని ప్రేరే పించడం. ఆధ్యాత్మిక అన్వేషణ, అందు కవసరమైన శిక్షణ రెండు వారికి రెండు పాదాలు, చేతులు, నేత్రాలు. ఇందు ఏ ఒక్కటి లోపించినా వారి వ్యవస్థ, వారి పరిచర్య అస్తవ్యస్తం, అసంపూర్ణం.

తపోసాధన వల్ల సాధించిన అద్భుతశక్తితో అనేక కార్యాలను కొనసాగిస్తూ ఆ దైవికశక్తిని స్పర్శద్వారా గాని, మాటద్వారా గాని, చూపు ద్వారా గాని శిష్యునికి సంక్రమింప చేసేవారు గురువులు ఇలా గురు స్పర్శ, మాట, చూపు వల్ల శిష్యునిలో కలిగే పరిణామమే ఆతని ఆధ్యాత్మికానుభవం. అందుకే గురువునకు 'శక్తి' పర్యాయపదంగా చెలామణీ ఔతున్నది. ఈ అపూర్వ శక్తికి గురువులో వుండే విశ్వాసం కంటేకూడా ఆతని కఠిన తపోచర్య కారణమనే పీటర్ బ్రెంట్ అభిప్రాయం సహేతుకమైందిగా కనుపిస్తుంది.[14]

హిందూమత గురువులు అనాదిగా సామాన్య జీవనం, వినయ విధేయతలు, నిరుపేదరికానికి మారు పేరులుగా సుప్రసిద్ధులైనారు. రహస్య జీవితాన్ని జీవిస్తూ

14. **Peter Brent** *op.cit.* **p. 181.**

నిరీక్షణ, అన్వేషణ మూల సూత్రాలుగ జీవిత యాత్ర గడిపినవారు. తనలో నిక్షిప్తంగా వున్న జీవ శక్తిని కనుగొని, తద్వారా తాను పవిత్రంగా జీవిస్తూ తన అనుచర వర్గాన్ని కూడ కడతేర్చే మహా మనీషి గురువు[15]. హేతువాదం ద్వారా లోపలున్న చీకటిని తెలుసుకోవచ్చు గాని, పారద్రోల లేరు. అట్టి అంతర్గతమైన అంధకారాన్ని పారద్రోల గలది యోగ జ్ఞానం. అట్టి యోగ జ్ఞాన సముపార్జనకు ప్రధాన సోపానం గురు సేవనం. అందుకే గురు శిష్య సంబంధం ఆనాడు లోకాతీతంగా అవినాభాజ్యంగ స్థిర పడింది. ఆనాడు గురువులే శిష్యుల్ని ఏర్పరచుకొనే వారు. అలా ఏర్పరుచుకొని, శిష్యుడు తన స్థితిని తాను గ్రహించే వరకు శిక్షణ నిచ్చి, గురు వ్యవస్థ లోనికి దీక్ష నిచ్చి, లోక సేవార్థం ప్రస్థానం చేయించారు. ఎవరైనా శుశ్రూష చేయకుండా అంటే గురుదేవుని సాన్నిధ్యంలో తీవ్ర ఆధ్యాత్మిక శారీరక క్రమశిక్షణ, శుష్కణలేకుండా గురువు కాలేరు. ఈ శిక్షణతోనే లోలోపల వున్న 'అహం' క్రమంగా నశిస్తుంది. అలా అహం నశించిన వారే గురువులు. గురువులు తమ శిష్య వర్గం నుండి కోరే ప్రధానమైన అంశం గురూపదేశాన్ని శిరసావహించగలమనే వాగ్దానం. ఆయన చెప్పిన ప్రతి మాటను బైటకు పొక్కనీయకుండ హృదయంలో భద్రపరుచుకోవలసింది. 'గురువాజ్ఞ' తన ప్రాణం కంటె విలువైందనే విషయాన్ని ప్రతి శిష్యుడు గ్రహించాలి. గురు శిష్య సంవాద తీరుతెన్నుల గూర్చి పరిశోధించిన కొందరు గ్రంథ కర్తలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడిస్తున్నారు. గురువు మౌనం వహించి శిష్యులను దృష్టించితే ఆ మౌనమే వారుభయుల్లో సహవాసానికి, సంభాషణకు మించిన అపూర్వ సంబంధానికి నడిపిస్తుందని, ఇది మామూలు జాగృదావస్థ కంటే భిన్నమైందే గాక మరింత లోతైనదని, అలానే గురువు పెదవి విప్పి శిష్యునితో సంభాషిస్తే ఏ స్థాయి నుండి గురువు సంభాషిస్తున్నాడో ఆ స్థాయికి శిష్యుడు ఎదిగి నపుడే ఆ మాటలు బోధ పడి, సార్థకం కాగలవని ఒక గ్రంథకర్త అభిప్రాయం.[16]

15. Sr. Vandana, *Gurus, Ashrams and Christians*, Madras: CLS, 1980 p. 26.

16. Swamy Abhishiktananda, *Saccidananda* : A christian Approach to advaitic experience, New Delhi : ISPCK, 1974. pp. 27–28.

శిష్యునికి శక్తి, జ్ఞానం గురువు సంక్రమింప చేసే విధానాన్ని గూర్చి పీటర్ బ్రెంట్ వివరంగా తెలియచేస్తున్నాడు. 'అనవి' గురు శిష్యుని కుపదేశించే మంత్రం. సంభవి-గురు శిష్యుల మధ్య జరిగే అవ్యక్త క్రియ. స్పర్శ, చూపు, మాట, శబ్దం ద్వారా శిష్యునిలో నిద్రాణంగా వున్న చైతన్య శక్తిని విప్లవాత్మకం చేసి, ఆకస్మికంగా, అయత్నంగా కార్యోన్ముఖం చేస్తుంది. ఇక మూడోది గురువు యొక్క శక్తి, వారిరువురు వేర్వేరు స్థలాలలో వున్నప్పటికి, శిష్యునిలో ప్రవేశించడం. ఈ మూడు మార్గాల ద్వారా గురువులు తమ దైవిక శక్తిని శిష్యులకు సంక్రమింప చేస్తారు.[17] వీటి ఆంతర్యం ఒకటే- పుస్తక పఠనం వల్ల, వ్యక్తిగత ధ్యానాభ్యాసాల వల్ల గాని కాక, జ్ఞానసిద్ధులై పారంపర్యంగా ప్రసిద్ధి గన్న గురు శిక్షణ వల్ల మాత్రమే ఆధ్యాత్మిక జ్ఞానం, జీవితానుభవం సంప్రాప్తమౌతాయని తెలియచెప్పడమే.

గురుశిష్య సంబంధాన్ని గూర్చి ముచ్చటిస్తూ స్వామీ అభిషిక్తానంద 'నిజమైన జ్ఞానదృష్టిగల వాస్తవిక శిష్యుడుగాని, నిజజ్ఞాన ప్రధానం అవసరం గనుక అట్టి జ్ఞానాన్ని దాచుకోక శిష్యునికి ప్రసాదించగల వాస్తవిక గురువు కాని నేడు తటస్థపడడం కష్టం' అని సూచించాడు.[18] నిజానికి ఈ అభిప్రాయం వాస్తవమైందనే చెప్పాలి. గురుశిష్యులు పరిస్పరాన్వేషితులేకాదు, పరస్పరాకర్షితులు కూడ. గురువ్యవస్థలో సగభాగాన్ని గురువు, మిగిలిన సగభాగాన్ని శిష్యుడు భరించవలసి వుంది. గురువు లేని మతం, కాలం లేనట్లే శిష్యుడు లేని గురువుండడం కూడ అసంభవం. వీరుభయులు పరస్పరం బలపరచుకొంటూ అనివార్యమైన జీవిత గమనాన్ని కొనసాగిస్తూ, తమ ధ్యేయాలను చేర ప్రయత్నిస్తారు. వాస్తవానికి వారుభయులుగ కనిపించినప్పటికీ వారి ఆలోచనా ధోరణి, కార్యనిర్వహణా విధానం సంపూర్ణంగా ఏకీభవించి ఒకటై వుండడం అవసరం అలా కాలేనపుడీ వ్యవస్థ ఛిన్నాభిన్నమై కూలిపోయే ప్రమాదం వుంది. అయితే ఇక్కడ గురువంటే పుస్తక పరిచయంవల్ల సముపార్జించిన జ్ఞాన సమన్వితుడనిగాని, అధ్యాపకుడు ఆచార్యుడని కాని కాదు-మును పెన్నడో స్వయంసిద్ధుడైనవాడు. బ్రహ్మజ్ఞానాన్ని అనుభవపూర్వ

17. Peter Brent *Op.cit* p. 17.

18. Swami Abhishiktananda, *Guru and Disciple*, London : SPCK, 1974. pp. 28–29.

కంగా గ్రహించినవాడు ఇతరులను గురువ్యవస్థలోనికి ప్రవేశ పెట్ట సమర్థుడైనవాడు. ఇట్టి గురువును సందర్శించడమే ఒక వ్యక్తి జీవితంలో మలుపు. జ్ఞానేంద్రియాల అవధుల నధిగమించినపుడే ఉభయుల్లో-గురుశిష్యుల్లో-ఒకరివల్ల మరొకరు పొందగల ప్రయోజనం సాధ్యమౌతుంది.

గురువుతో మనోవాక్కర్మలలో ఏకం కావడానికి ఇచ్ఛగించి ప్రయత్నింప గోరేవాడు శిష్యుడు. శారీరక స్పర్శతో నిమిత్తం లేకుండా అధ్యాత్మికానుభవ సముపార్జనే జీవిత ధ్యేయంగా ఎంచుకొనే గురువుని సేవించడం శిష్యుని ధర్మం కాగా అన్నివిధాల తన శిష్యుని తనంతటి వానినిగ తయారుచేయడం గురు ధర్మం. గురువు తన శిష్యుల నెంత త్వరితంగ, ఎంత తీవ్రంగా స్వయంసిద్ధులను చేయ గలడో అంత విస్తృతంగా, త్వరితంగా ఆయన పేరు ప్రతిష్టలు వ్యాపిస్తవి. అంతే గాదు స్వామి ముక్తానంద ఇట్టి గురు దీక్షలను గురు ప్రసాదాలుగ అభివర్ణిస్తున్నారు ఇట్టి దీక్షను గురు ప్రసాదమని, గురు కృప అని, గురు దీవెన అని, గురు దీక్ష అని లేదా కేవలం గురు దయాదాక్షిణ్య భిక్ష లేదా ఆయన ఇచ్ఛ అని ఏ పేరు పెట్టి పిలిచినా సరే అది గురు దీక్షే! అట్టి దీక్షను పొందక శిష్యునికి గత్యంతరం లేదు. అలా శిష్యునికి తన దీక్షను ప్రసాదించి నిగూఢ జ్ఞానాన్ని, శక్తిని సంక్రమింప జేయక గురు విద్యకు ప్రయోజనం లేదని బ్రెంట్ వివరించాడు.[19] గురువుయొక్క అభిమానాన్ని చూరగొనడానికి శిష్యవర్గం చేసే ప్రయత్నాలు కూడ అవధులను దాటిపోతాయి గురువు దైవ ప్రతినిధిగాన ఆయనలో దాగిన అపూర్వ శక్తిని, దైవాంశను ఆరాధించాలి గనుక శిష్యులు ఆయన్ని పూజిస్తారు, ఆయనకు దాసోహం చేస్తారు. సాష్టాంగపడి పాదాభివందనం చేస్తారు. పాద ప్రక్షాళనం గావించి ఆ నీటిని సేవిస్తారు లేదా తలపై ప్రోక్షించుకొంటారు.ఆయన సాన్నిధ్యంలో మౌనులై సందేశ సారాంశాన్ని ఆలకించి, గ్రహించి, శిరసావహించి అనుస రిస్తారు. స్త్రీ, పురుష తారతమ్యం లేకుండ ఈ మర్యాదలు కొనసాగుతూ వుంటాయి గురువుల్లో బాహాటంగా తెలియవచ్చిన క్షమింపరాని దోషాలను సైతం ప్రక్కకు నెట్టి తమ గురువునే సమర్థిస్తారు.[20] హిందూమత ఆధ్యాత్మిక సోపాన

19. Quoted from **Peter Brent**, *op. cit*, p. 279.

20. **Khushwant Singh**, *Gurus, Godmen and Goodpeople*, New Delhi: Orient Longman 1975 pp. XIV–XV.

పంక్తిలో ప్రతి గురువొక మెట్టు. పారమార్థిక గమ్యానికిది రాచబాట. అందుకే దీనిని అద్భుతమైన వ్యవస్థగా భావింపవచ్చు.

కుష్వంతసింగ్ తన గ్రంథంలో సూచించినట్లు[21] భారతదేశం మత ప్రవక్తలు, మెస్సీయలు ఆవిర్భవించడానికి, తయారు కావడానికి అనువైన మత పరంగా సారవంతమైన దేశం. ప్రతి యుగంలో ఒకరో ఇద్దరో అపూర్వ వ్యక్తులు జన్మించి మతోద్ధారకులుగా, మానవ ఆధ్యాత్మిక జీవిత పునరుద్ధారకులుగా ప్రకటించుకొంటూనే వున్నారు. తామర తంపరగా వ్యాపిస్తున్న శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంగాని, నాస్తికవాదమే ప్రాణంగా స్థానం సంపాదిస్తున్న సామ్యవాద సిద్ధాంత సరళిగాని భారతీయుల్లో ఆధ్యాత్మిక శక్తులపై గల అచంచల విశ్వాసాన్ని అరికట్ట లేకపోయాయి ఇంతగా ఆధునిక జీవిత వ్యవస్థను హేతువాదం, సామ్యవాదం, సాంఘికవాదం, సెక్యులరిజం ఆశ్రయించి వున్నప్పటికి, భారత భూమిలో గురూద్యమాలు ప్రబలడానికి గల కారణాలను ఆయా రచయితలు వారికి తోచిన విధంగా సూచిస్తున్నారు.

ఆయా గురువుల నాశ్రయించి ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తున్న యువతను ప్రశ్నించిన మీదట పీటర్బ్రెంట్ రెండు మూడు ముఖ్య కారణాలను సూచించాడు ఇతర దేశ సాంఘిక విధానంకన్న భారతీయ జీవనం భిన్నమైనందువల్ల యువతకు తండ్రుల అధికారానికి లొంగి జీవించే పరిస్థితినుండి బయటపడడానికి గురు ఆశ్రయం తరణోపాయంగా, ప్రత్యామ్నాయంగా తోచిందనేది మొదటి కారణం. ఇట్టి అస్వతంత్ర మనస్తత్వంతో తండ్రిచాటు బిడ్డలుగా పెరగడం వారికిష్టం లేక పోవడంవల్ల ఏర్పడిన నిరుత్సాహం నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్న భారతీయ యువతకు ఆధునిక గురువులు ఆదరణకర్తలుగా కనిపించినందువల్ల ఆధునిక గురూద్యమంలో యువకుల ప్రవేశం తరుచు కనిపించే దృశ్యమని ఈతని వాదం. ఆ రచయిత చూపిన రెండవ కారణం వత్తిడి చేయడం ద్వారా యువకుల్లో సాధు జీవనం అలవడాలనే కోరికకు బదులు సాధుజీవనాభ్యాసానికి స్వేచ్ఛకూడ దోహదం చేస్తుందనే గురువుల ఉద్బోధ. యువతీ యువకులకు వేర్వేరు విద్యాసంస్థల ఏర్పాటు, వారి మనసుల్లో పెల్లుబికే లైంగిక భావాలను తోడి సమయస్కులతో వ్యక్తం

21. *ibid.* p. VII.

చేసికోడానికి కూడ అవకాశం లేని సాంఘిక-కుటుంబ వ్యవస్థలో అణగద్రొక్క బడిన భావోద్రేకాలుగల యువత వాటిని స్వేచ్ఛగా వ్యక్తం చేసికొనే అవకాశం వున్న గురుసాన్నిధ్యాన్ని ఆశ్రయిస్తున్నారనేది మూడో కారణం.[22]

తల్లిదండ్రుల దగ్గర యువతకు ఏమి లభించడంలేదో దానిని గురువుల దగ్గర పొందగలుగుతున్నారు. ఒకరకంగా గురు శిష్య సంబంధం, తండ్రి బిడ్డల సంబంధం వంటిదైనందువల్ల తండ్రి వంటి గురువు సాన్నిధ్యంలో మనసు విప్పి మాట్లాడి సలహాలను పొందాలనే తహతహ యువతలో కనిపిస్తున్నదనే ప్రతిపాదన సబబుగానే కనిపిస్తుంది. కాని తల్లిదండ్రుల బిడ్డల సంబంధాలు ఈనాడు క్రొత్తగా తలెత్తినవి కావు. పురాతనం నుంచి వున్నవే. అయినప్పుడు అపుడులేని ఈ "తిరుగుబాటు మనస్తత్వం" ఇపుడెలా వచ్చింది? ఎందుకు వచ్చింది? అనే ప్రశ్నలకు విద్యావేత్తలు, పరిశోధకులు సమాధానం చెప్ప వలసివుంది.

కాని మొత్తం భారతీయ జన జీవన విధానంలోనే ఈనాడు మార్పు కనిపిస్తున్నది. పాశ్చాత్య నాగరికతపై కొంత ఏవగింపు, జాతీయ ధోరణి, దేశీయ విధానం ఎడ కొంత ఆకర్షణ ప్రారంభమైంది. ముఖ్యంగా స్వాతంత్ర్యం తదనంతరం ఈ ధోరణి ప్రబలి, యువత మనస్తత్వం, మానసికధోరణిపై ముద్ర వేసినది భారతదేశంలో గురూద్యమానికి వ్యాప్తికి ఇవి కొన్ని కారణాలు కాగా, ఈ ఉద్యమాలు విదేశాలలో వ్యాపించి, రాణించడానికి మరికొన్ని కారణాలు కనిపిస్తున్నాయి.

ఆనాటి గురువులు మాతృభాష లేదా కష్టపడి నేర్చుకున్న సంస్కృత భాషపై ఆధారపడి తమ ఉద్యమాలను నిర్వహిస్తే, ఈనాడు భారతీయ గురువులు అన్ని విభాగాలలో ఉన్నత విద్యా యోగ్యతలు, ముఖ్యంగా ఆంగ్ల భాషాధ్యయనం కలిగినవారు ఇది అదనంగా ఆధునిక గురువులకు అందివచ్చిన అవకాశం. వారి మనోగత భావాలను ధారాళంగా పశ్చిమ ప్రపంచ సమాజానికి నచ్చేవిధంగా ఆంగ్లంలో ఉపన్యసించి అశేష జనాన్ని ఆకర్షించగలుగుతున్నారు.

22. **Peter Brent**, *op.cit*, p. 287.

వారికి లభిస్తున్న ప్రచార సాధనాలు మరో కారణం. ఈనా దభివృద్ధి చెందిన ప్రయాణ వసతులవల్ల, దూరదర్శిని, దూరశ్రవణ యంత్రాల అభివృద్ధి వల్ల నేటి ప్రపంచం మునుపెన్నడూ లేనంతగా సన్నిహితమైంది. ఏ సంఘటనైనా తక్షణమే ప్రపంచం నలుమూలలకు వ్యాపించడమే గాక, 'జెట్' ప్రయాణాల ద్వారా కొన్ని గంటల్లో ఏ వ్యక్తి అయినా ఏ దేశాన్నైనా చేరడానికి అవకాశం ఏర్పడింది. తరుచు గురువులు విదేశీయానం ద్వారా స్వయంగా శిష్యవర్గాన్ని, వారి ఉద్యమానికి చెందిన వ్యవసస్థను పరామర్శించి, తగిన సలహాల నిచ్చే అవకాశం ఏర్పడింది. అందువల్ల ఏ గురువుదగ్గర ఎంతమంది విదేశీ శిష్యు లున్నారనే విషయం ప్రతిష్ఠాకరమైన అంశంగా తయారైంది.

స్వీయ ప్రతిభా శక్తి సామర్థ్యాలకన్నా గురువుల నాశ్రయించి, భూరివిరాళా లను సమర్పించి, యజ్ఞయాగాదులు పూజా పురస్కారాల ద్వారా అసాధ్యమైన వానిని సాధించాలనే తపన నేడు దేశంలోని కొందరు రాజకీయ పెద్దల్లో బలీయంగా వున్నందువల్ల వారిచ్చే ప్రోత్సాహం కూడా ఆయా గురువుల యొక్క వ్యక్తిగత పేరుప్రతిష్టలు పెరగడానికి తోడ్పడుతున్నది.

కుష్వంతసింగ్, ఆధునిక భారతీయ గురువునొక మనస్తత్వ విశ్లేషణ కర్తగా పేర్కొంటున్నారు.[28] నిజానికి గురువు బోధకుడు. మనస్తత్వ విశ్లేషణ కర్త, మానసిక వైద్యుడు. ఒకరు ఆధ్యాత్మిక విషయాలను సంబోధిస్తే, మరొకరు మానసిక ఆరోగ్యాన్ని ప్రసాదించే వ్యక్తి; ఒకరు 'మాయా మాత్రమైన' ప్రపంచం నుండి తన శిష్యులను వేరు చేయ ప్రయత్నిస్తే, మరొకరు ప్రపంచ పరిస్థితులకు అనుకూలంగా సర్దుబాటు చేసికోడానికి సహాయం చేయ ప్రయత్నించేవాడు. అందువల్ల ఇటు ఆధ్యాత్మిక చింతనను, అటు లోక పరిస్థితిని వివరించి, వ్యక్తి జీవిత గమనానికి తోడ్పడగల ద్వివిధ వ్యక్తిత్వం గురువులో పుంజీభవించి వుండడం గురూద్యమ వ్యాప్తికి కారణమని ఆయన సూచన. అంటే, గురువు వైద్యుడై శిష్య వర్గం అవసరాలను తీరుస్తున్నాడు. దురదృష్టవశాత్తు కొన్ని కొన్ని ఆశ్రమాలలో 'ఫిజియోథెరపి' అనే పేరు మీద అవాంఛితం, అసభ్యకరమైన లైంగిక కార్యాలు

23. **Khushwant Singh,** *Gurus, Godmen and Goodpeople,* **p. VIII. Also see Peter Brent, op. cit p.** 308.

కొనసాగుతున్నవనే ప్రథ కూడ వున్నది. ఇట్టి అసభ్యకరమైన ఆచారాలను గూర్చి తరువాత ఆయా గురు పరిచర్యను పరిశీలించేపుడు కొంత వివరంగా చర్చించే అవకాశం వుంది.

ఆధునిక గురువు ఆధ్యాత్మిక ప్రబోధకుడు, మనస్తత్వ విశ్లేషకుడు మాత్రమే కాదు - ఆయన పూజారి. ఆయన ఆచారి. ఆయన సిద్ధాంత నిర్మాత. ఈనాటి గురు ఆశ్రమాలలో ప్రవేశించిన వ్యక్తుల యొక్క మతాచార కర్మకాండకు మరొక దేవాలయాన్ని గాని, పూజారిని గాని ఆశ్రయించనక్కరలేదు. ఆశ్రమం లోనే ఆచార కర్మకాండను గురువు నిర్వహిస్తున్నాడు. శిష్య గణాభివృద్ధికి సరిపడే నైతిక సూత్రాలను సిద్ధాంతాలను నిర్మించుకొని, వానిని గురువులే వ్యాఖ్యా నిస్తున్నారు.

ముఖ్యంగా పాశ్చాత్యుల నాకర్షించేందుకు వారి సామాజిక స్థితిగతులకు సరిపడే విధంగా ఆశ్రమాలను నిర్మించి, ఆచార వ్యవహారాలను ఏర్పరుస్తున్నారు. స్వేచ్ఛా లైంగిక జీవనం, మాదకద్రవ్యాల సేవనం, దిగంబర సంచారం మొదలైన 'అత్యాధునికం', అవాంఛితం, ప్రమాదకరమైన పద్ధతుల నవలంబించి కొందరు గురువులు స్థాపించిన ఆశ్రమాలు పాశ్చాత్యులను బహుగా ఆకర్షిస్తున్నాయనే విషయాన్ని కూడ ఇక్కడ ఉదహరించవలసి వుంది.

అరవ భాషలో ఒక సామెత వుంది. 'కాషాయరంగు వస్త్రాలు ధరించి, నొసట విభూతి పెట్టినవారెల్ల గురువులా? యోగులా? వారి నిజానిజాలు తేల్చ వలసింది శివుడే'నని ఆ సామెత భావం. సాధారణంగా గురువులుగా చెలామణి అవుతున్న వారిలో పైన చర్చించిన విషయాలనుబట్టి అంచనా కట్టి, అసలు గురువు లెవరో మోసపు గురువులెవరో తేల్చుకోడానికి అందరికి సాధ్యంకాదు. శిష్యుడు సమర్థుడైతే తన గురువును తానే అన్వేషించగలడనే వాదన ఉన్నప్పటికి, ఆధునిక గురువులు ఆ విధమైన అవకాశాన్ని శిష్యవర్గాని కివ్వడంలేదు. గురువులే తమ శిష్యుల్ని వెదకుకొంటూ దేశాటనాలు చేస్తూన్నందువల్ల శిష్యుడు తన గురువును అన్వేషించే అవకాశం లేకుండా పోయింది. ఇది విడ్డూరమైన సంగతి. దాహం గొన్నవాడు నీటికోసం వెదుకుతూ పోవాలి. తనకు నచ్చిన, రుచించిన జలాన్ని సేవించాలి. అంతేగాని నీరు, దాహంకొన్న వ్యక్తి ఎక్కడ వున్నాడా అని

వెతుకుతూ పోదుగదా! సనాతన గురువ్యవస్థకు ఆధునిక గురువ్యవస్థకు ఇది ప్రాముఖ్యమైన వ్యత్యాసంగా కనిపిస్తున్నది.

సనాతన వ్యవస్థకు ఆధునిక వ్యవస్థకున్న మరో వ్యత్యాసం ధనార్జనం. పూర్వీకులు తమ జ్ఞానాన్ని, తమ ఆధ్యాత్మిక అనుభవాన్ని, తమను ఆశ్రయించిన శిష్యులతో పంచుకొని తాము తరించినట్లు తృప్తిపొందారు. అన్ని దానాలలో విద్యాదానం, జ్ఞానదానం గొప్పదని ఉప్పొంగిపోయారు. తమకున్న అనుభవంతో ఎంత చిన్నదీపాన్నైనా వెలిగించాము గదా అని ఆనందించారు ఈనాడు గురువులు తమకు జ్ఞానంవుంటే,అతీంద్రియధ్యానశక్తివుంటే బజారున వెలకట్టి అమ్ముతున్నారు. ఆనాడు దానమే ప్రధాన ధ్యేయం అయితే, ఈనాడు ధనార్జనే ప్రధాన గమ్యమైంది. ఆధ్యాత్మిక అనుభవాన్ని వ్యాపారంలో పెట్టి,కూడ పెడుతున్న గురువులు పవిత్రమైన ఈ గురువ్యవస్థకే అప్రతిష్ఠగా భావించవచ్చు. ఇలా యోగశక్తిని, అతీంద్రియ జ్ఞానాన్ని వెలకట్టి అమ్ముకొనేవారు గురువు లనబడడానికి యోగ్యులేనా ? అని పాఠకులు యోచింపవలసివుంది.

అరణ్య ప్రదేశాలకు, గురుకులాలకు మాత్రమే పూర్వం పరిమితమైన ఈ వ్యవస్థ ఈనాడు అత్యంత ఆధునికమైన ఆకాశహర్మ్యాలకు, సుఖభోగ విలాస జీవితాలకు ఆలవాలమైంది. పాదయాత్రలతో ఆనాడు ప్రజల నాధ్యాత్మికంగా ఉత్తేజితులను చేసిన వ్యవస్థ ఈనాడు దేశీయ సాంస్కృతిక హద్దులను దాటి విదేశాలలో ప్రాపకాన్ని, వ్యాపకాన్ని సంపాదించింది. వినయ విధేయతలకు, నిస్వార్థానికి ఆనాటి గురువులు పర్యాయపదాలైతే ఈనాడు ఆడంబరానికి, అహంకారానికి, స్వార్థానికి మారుపేరులైనారు. వ్యక్తిగత ప్రతిష్ఠ ఆనాడు ప్రాణప్రదంగా భావింపబడితే బాహ్య గౌరవమర్యాద లీనాడు ఈ వ్యవస్థలో రాజ్యం చేస్తున్నాయి. ఆనాడు గురువులు వ్యక్తిగత గుణవిశేషాలను, తృష్ణను పరిగణించి శిష్యవర్గాన్ని ఎన్నుకొంటే ఈనాడు శిష్యవర్గం చొరవ చేసికొని తమ అభిరుచులకు, అలవాట్లకు అంతరాయం కలిగింపని గురువులెవరో వారిని వారే ఎంచుకొని ఆశ్రయిస్తున్నారు. ఆనాడు స్త్రీ గుర్వాశ్రమంలో ప్రవేశింపతగునా అనేది చర్చనీయాంశమై, ఆ అవకాశాన్ని తృణీకరిస్తే ఈనాడు స్త్రీ ప్రమేయంలేని గురువులు అరుదుగా కనిపిస్తున్నారు. రాజకీయాల్లో ప్రత్యక్షంగా కాకపోయినా తమ నాశ్రయించిన రాజకీయ నాయకులద్వారా పరోక్షంగా కొందరు ఆధునిక గురువులు

తమ ప్రభావాన్ని చూపుతున్నారు దీనికి మంచి ఉదాహరణ ధీరేంద్ర బ్రహ్మచారి. రకరకాల మహిమలు, మహత్మ్యాలపేరిట మాంత్రిక విద్య, గారడీ చేష్టలతో ప్రజల్ని మభ్యపెడుతున్న గురుబ్రువులుకూడా పెక్కు రున్నారనే విషయాన్ని విస్మరింపరాదు.

పూర్వకాలం శిష్యులు తమ గురువులను ప్రేమించి, వారి ప్రేమకుపాత్రమై వారిని నమ్మి జీవించారు. లేదా వారిని విడిచి వేరొక గురువుని ఆశ్రయించారు. అదికూడ అతికష్టంమీద. ఈనాడు వేరొక గురువును ఆశ్రయిస్తారేమోనని భయపడి గురువులు శిష్యులు పాడేపాటలకు తందానాతానా పలుకుతున్నారు. ఇది ఈనాటి గురు వ్యవస్థయొక్క పరాధీనత్వానికి ప్రబల నిదర్శనం. అంతేగాదు, గురువుల మధ్యవున్న అంతఃకలహాల వల్ల వారిలో వారికి ద్వేషం రగుల్కొని వుంది. అయితే, తమ అంతఃకలహాలు రచ్చకెక్కితే ఎక్కడ వారి పుట్టి మునుగుతుందో నని భయపడి సమస్తాన్ని దాచిపెట్టుకొని లోలోపల శాపనార్థాలు పెట్టుకొంటు న్నారు. ఉదాహరణకు కృష్ణచైతన్య సంఘాన్ని స్థాపించి అఖండ ప్రఖ్యాతిని పొందిన స్వామి భక్తి వేదాంత ప్రభుపాదకు, ప్రపంచం మాయాజనితం అని చెప్పే శంకర పీఠాధిపతులకు వైమనస్యమే గాని, సామరస్యం లేదు. ఇందుకు కారణం వ్యక్తిగత ద్వేషంగాక వారి ప్రబోధాలవల్ల తమతమ శిష్యవర్గం ఎక్కడ చెదిరి పోతుందోననే భయం. అలానే శివానందుని శిష్యుడైన విష్ణుదేవానందకు మహర్షి మహాయోగికి మధ్య పచ్చగడ్డి భగ్గున మండేటంత వైషమ్యం వుంది. కారణం అతీంద్రియ ధ్యానంలో ప్రయోగించే మంత్రాన్ని మహర్షి మహాయోగి తనకు, తన శిష్యవర్గానికి మాత్రమే పరిమితంగా వుంచుకొని మిగిలినవారికి తెలియనీయడం లేదనే అక్కసు

కేవలం గురువుల అనుభవం యొక్క సార్థకతపై మాత్రమేగాక, హిందూ మతగ్రంథాల నవగాహన చేసికొని సక్రమంగా వ్యాఖ్యానించి, జీవిత నౌకకు చుక్కాని పట్టినవారు పూర్వపు గురువులు. ఈనాడు సంస్కృత గ్రంథ పఠనా సక్తి, వ్యాఖ్యాన పటిమ అలా వుంచండి- కేవలం లోతైన అనుభవం కూడా లేకుండానే పడికట్టు రాళ్ళవంటి కొన్ని ఆంగ్లేయ పదాలను పదేపదే ప్రయోగిస్తూ, ఆంగ్లోపన్యాసాలను కావిస్తూ అమాయకులైన యువతీయువకుల జీవితాలను భ్రష్టం చేస్తున్నారు కొందరు ఆధునిక గురువులు. వీరు పాశ్చాత్య శిష్యుల్లో స్వాభావికంగా

జనిస్తున్న జ్ఞానార్జన సహజాతాన్ని నిలువునా త్రుంచుతున్నారు శిష్యులకై శిష్యులే గ్రంథ పఠనాన్ని జ్ఞానాన్వేషణను కొనసాగించుకోవడానికి ఇట్టి గురువులు అడ్డుబండలుగా వున్నారనేది జగమెరిగిన విషయం. అందువల్ల జ్ఞానం జ్ఞానంగా కాక గురువులు ప్రబోధించినట్లుగా శిష్యుడు నేర్చుకోవలసి వస్తున్నది. విన్నన్న చెప్పిందే వేదమౌతున్నది. ఈ గురువులు తమ శిష్యవర్గంలో నిజమైన తార్కిక, తాత్విక ధోరణి ఏర్పడడానికి కొన్ని సందర్భాలలో మూల వ్యతిరేకులౌతున్నారు. అందువల్ల భారతీయ గురువుల కేర్పడిన పాశ్చాత్య శిష్యవర్గం చరిత్రహీనులై, జ్ఞానహీనులై, గురువేదానికి దాసులై, తమ మూలకోరికకు వ్యతిరేకంగా బ్రతుకు నీడ్వవలసివస్తున్నది.

గురువర్గాన్ని కారణగురువు, జ్ఞానగురువని స్వామి అభిషిక్తానంద రెండుగా విభజించినాడు. కార్యసాధనా ప్రేరణా దశలో కారణగురువుగా వుండి ఆ పిదప పరిణతిని పూర్ణసిద్ధిని పొంది జ్ఞానగురువుగా పరిణామం చెందునని ఆయన భావం.[24] అట్టి పరిణామానికి తమనుతాము లోబరచుకొనే గురువు లిపుడున్నారా? అనేది ప్రశ్న. ఈనాడు తగిన అనుభవం, శుశ్రూష, సంస్కృతపరిజ్ఞానం లేకపోయినా, అంతర్జాతీయ ప్రఖ్యాతి పొందినవా రనేకులున్నారు.

సత్యసాయి బాబా, ఆచార్య రజనీష్, జెట్ యోగిగా ప్రసిద్ధిపొందిన మహేష్ మహాయోగి, గురు మహరాజ్, బాలయోగీశ్వర్ (డివైన్‌లైట్ మిషన్), ఇంకా చెప్పవలసివస్తే ధీరేంద్ర బ్రహ్మచారి, ఇంకా అనేకానేకమంది ఎక్కడికక్కడే ఏ ప్రాంతానికా ప్రాంతంలోనే పుట్టుకొస్తున్నారు. అనతికాలంలోనే తమదైన ఒక స్థానాన్ని ఏర్పరచుకొంటున్నారు.

అయితే, ఆధునిక గురువుల అందరి కార్యక్రమాలు వక్రించాయి అనడం పొరపాటే ఔతుంది. ఎందుకంటే. నిష్ఠాగరిష్ఠులై, వాస్తవికంగా ఆధ్యాత్మిక తృష్ణతో, అందరికీ అపూర్వ అనుభవాన్ని పంచిపెట్టాలని కోరి, చిత్తశుద్ధితో తాము నమ్మిన సూత్రాలను వ్యాపింపచేసికొంటున్న సద్గురువులు కూడ వున్నారు. ఆయా

24. **Swami Abhishiktananda**, *Guru and Disciple* **pp.** 109–110.

సందర్భాలలో ఆయాచోట్ల అవాంఛిత సంఘటనలు జరిగినంత మాత్రాన అందరిని అదే గాట కట్టివేయడం భావ్యంకాదు. మంచి ఏదో గుర్తించి ప్రోత్సహించాలి. చెడును నిరుత్సాహపరచాలి. సాధ్యమైతే నిర్మూలించాలి.

గురువులు సాధించే మహత్కార్యాలు కేవలం వారట్టి కార్యాలు చేయగలరని ధృవపర్చుకోడానికి, అవసరాన్నిబట్టి శిష్యుల నాకర్షించి, తమ గురుత్వాన్ని పదిలం చేసికొనడానికేనని గమనించవలసి వుంది. ఒకసారి గురువుగా తెలియబడిన మీదట ఇట్టి మహత్కార్యాలతో ప్రమేయముండదు. ఆధునిక గురువు వేద వేదాంగ పారాంగతుడై, తానునమ్మిన మత గ్రంథాలు బయలుపరచే సిద్ధాంతాలను ఆకళించుకొని, శిష్యవర్గానికి గురువ్యవస్థలోనికి దీక్ష నివ్వగలిగితే అంతకన్న వాంఛింప తగింది లేదు. అయితే, పై ప్రమాణాలనుబట్టి ఏ గురువునైనా వైజ్ఞానికంగా, శాస్త్రీయంగా పరిశీలించితే, ఆ పరీక్షకు ఆ గురువు నిలవగలడా? ఇదే ప్రశ్న నీ గ్రంథకర్త తాను మెచ్చుటిస్తున్న ఒకానొక గురువుతో లేవనెత్తితే ఆ గురూజీ 'మత గురువుని వైజ్ఞానికంగా పరీక్షించడమా' అని వెలవెల పోయాడు. ఈనాడు మత శాస్త్రజ్ఞులైనవారు ఆయా మతాలను, మత సిద్ధాంతాలను, ఆచార్య, గురువుల జీవిత సరళిని సిద్ధాంత సముదాయాన్ని వైజ్ఞానికంగా శాస్త్రీయంగా పరిశీలించవలసి వుంది. ఆ గమ్యంవైపు ప్రస్తుత గ్రంథకర్త చేస్తున్న ప్రస్థానంలో ఈ గ్రంథం మరో మెట్టు.

# షిర్డీ సాయిబాబా పారంపర్యం

భారతదేశము ఆధ్యాత్మిక సేవకు, అలౌకిక జీవనాభ్యాసానికి జీవగర్ర సామాన్య జీవిత దశల నధిగమించిన అతీంద్రియ శక్తి సమన్వితులు మర్మయోగులు, స్వయంసిద్ధులు ఈ దేశ సంస్కృతికి పాత కాపులు భారతీయ అలౌకిక జీవన ప్రగతికి వారసులు. మానవాతీతమైన మహత్క్రియలు చేసేవారిని ప్రజలు గౌరవించడం క్రొత్తగాదు. అయితే ఇలా వారిని ప్రజలు గౌరవించడానికి గల కారణాలనుగూర్చి భేదాభిప్రాయాలున్నవి మహత్క్రియలు చేసే గురువుల్లో ప్రచ్ఛన్నంగా వున్న దైవాంశను బట్టి వార సాధించిన సిద్ధస్థితినిబట్టి ప్రజలు పూజిస్తున్నారనేవారు కొందరైతే, వారిని గౌర విం చకపోతే ఏ ముప్పు ముంచుకొస్తుందోనని భయపడి గౌరవిస్తున్నారనేవారు మరి కొందరు. పోగాక, అట్టి మహత్క్రియలు చేసి చూపిస్తున్నారనే బాబాలకు ఈనాడు కొదవలేదు, వారికి లభించే ప్రచారానికి లోటులేదు. ఇట్టి సంప్రదాయానికి షిర్డీని కేంద్రంగా చేసికొని, అతిసామాన్యంగా నిరాడంబరంగా జీవించి, ప్రజాక్షేమం, ఆధ్యాత్మికాభ్యున్నతికి కృషిచేసిన సాయిబాబా మూలపురుషుడు. ఆయన వారసుల మని, అవతారాలమని చెప్పుకొనే బాబాలు నేడు, భారతావని అంతటిలో వ్యాపించి వున్నప్పటికీ, వారివారి ప్రభావాలు, ప్రాపకాలు, పరిచయాలు వారున్న ప్రాంతాలకే పరిమితంగా వున్నందువల్ల, దేశవ్యాప్తంగా వారికున్న ప్రచారం దాదాపు వ్యర్థమైనందువల్ల, ఈ విభాగంలో ఆయనతో ఏదో విధంగా సంబంధం వున్నదని భావింపబడుతున్న వారిలో ముఖ్యుల్ని మాత్రమే సమీక్షించడం జరిగింది. షిర్డీకి మూడుమైళ్ళ దూరంలో వున్న 'సకూరి' గ్రామం వెలుపల తన నిరాడంబర జీవితాన్ని గడిపి, స్త్రీ జనోద్ధరణకై కన్యాకుమారి స్థాన్ నిర్మించిన కాశీనాథ్ గోవింద్ ఉపాసని బాబా, ఉపాసనిబాబా ప్రభావంవల్ల భగవాన్ మెహర్ బాబాగా లోకానికి పరిచయమైన మేర్వాన్ సేహరియార్జీ ఇరానీ, సాక్షాత్తు షిర్డి సాయిబాబా అవతారాన్నని ప్రకటించుకొంటూ వున్న పుట్టపర్తి సత్య సాయిబాబాల జీవితాలు, బోధలు, వారి అను

చరవర్గం తీరుతెన్నులు మాత్రమే స్పృశింపబడుతున్నాయి. ఉపాసని బాబాతో ప్రత్యక్ష సంబంధం వుండి, ఆయన స్థాపించిన 'కన్యాకుమారి స్థాన్'కి నాయకత్వం వహించి, అసంఖ్యాక దీన వనితా రత్నాల జీవితాలను తీర్చిదిద్దిన సతి గోదావరి మాతాజీని కూడ ఈ పారంపర్యంలోనే సమీక్షించ వలసి వుండగా 'మాతృ మూర్తులు' అనే శీర్షికలో చేర్చడమైంది. అందుకు కారణం మిగిలిన స్త్రీ మూర్తులతో పాటుగా ఆమెను కూడ పాఠకులకు పరిచయం చేయ గోరడమేనని వేరుగా చెప్పనక్కర లేదు.

## 1. షిర్డీ సాయిబాబా (1839-1918) నిరాడంబర ఆధ్యాత్మిక జీవి.

పుట్టపర్తి సత్యసాయిబాబా భక్తుడు, అఖండ పండితుడు, జాతీయంగా, కొంతవరకు అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతుల నార్జించిన గ్రంథకర్త శ్రీ వి.కె. గోకాక్ ప్రచురించిన సమాచారాన్ని బట్టి[1] షిర్డీ సాయిబాబా జననీజనకులు దేవగిరిమ్మ, గంగా భవాడియా. వారి కీయన మూడవ సంతానం ప్రక్కనే ప్రవహిస్తున్న నదిలో పడవాడించి జీవన భృతిని సంపాదించే వ్యక్తి భవాడియా. క్రమక్రమంగా గంగా భవాడియా లోక వ్యవహారాలపై ఆసక్తిని కోల్పోతూ, నిర్లక్ష్యంగా, వైరాగ్య జీవితాన్ని గడుపాలని ఆశపడుతూ దేవుణ్ణి ముఖాముఖిగా చూడాలనే కోరికతో ఒకానొకనాడు భార్యాబిడ్డల్ని విడిచి దేశాటనం బయలుదేరాడు విషయాన్ని గ్రహించిన దేవగిరిమ్మ భర్తతో తాను తరలివెళ్లడం తన ధర్మంగా భావించి, ఇద్దరి పిల్లల్ని తల్లిగారింటిలో వదలి నిండు చూలాలిగా భర్తను వెంబడించింది. కొంత దూరం నడిచాక ఆమెకు పురిటి నొప్పులు ప్రారంభమై ప్రసవ వేదన తీవ్రమైనపుడు, భర్త నొక నిమిషం మర్రిచెట్టు చాటున ఆపి, మర్రి ఆకులతోనే పత్ర పాన్పు నమర్చి ఆమె ప్రసవించింది. ఏం చేయాలో దిక్కు తెలియని పరిస్థితుల్లో పాటిల్ అనబడే ధనవంతుడు పుట్టింటిలో వున్న భార్యను టాంగాలో తీసికొనివెళ్తూ, శంకానివృత్తి కొసం టాంగాను ఆపినపుడు ఆయన భార్య, చంటి బిడ్డ కేక విని, ఆ దంపతులను సమీపించి, వారి పరిస్థితిని పసిగట్టి పసికందును

1. V.K Gokak, *Bhagavan Sri Satya Sai Baba*, New Delhi: Abhinava Publications 1976, 61 ff.

చూచి, భర్తకు చెప్పి, వారికి సంతు లేనందువల్ల తల్లిదండ్రుల అనుమతితో, బిడ్డను ఇంటికి తీసికొని వెళ్ళి, కన్నమరుల కంటె పెంచిన మరులు అధికం గనుక, అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసింది. ఈతడే ఆ తరువాత శాయిబాబాగా ప్రసిద్ధి చెందాడు. కాని ఇతర రచయితలీయన జీవన విశేషాన్ని ప్రచురించలేదు. తల్లి తండ్రుల పేర్లు, వృత్తి విశేషాలు, ఆయన జనన విధానాన్ని గూర్చి గోకాక్ పండితునికి ఏ ఆధారంనుండి సమాచారం లభించిందో తెలియదు. పీటర్ బ్రెంట్ 'ఆయన జనన మొక మర్మగర్భితం. ఆయన జననీజనకులెవరో ఎవరికి తెలియదు' అని ఉదహరించాడు.[2]

క్రమక్రమంగా పెరిగి పెద్దవుతున్న బాలుని చేష్టలు అనేకులకు విపరీతంగా తోచాయి. హిందూ దేవాలయంలో ఖురాన్ పఠనం, మసీదులో హిందూ విగ్రహం ప్రతిష్ఠ చేస్తున్నందువల్ల ఉభయ వర్గాలలోను బాలుని ఎడ కొంత అశాంతి, అసహనం పేర్కొన్నాయి. ఈ పరిస్థితుల్లో దరిదాపుల్లోనే వున్న ఆశ్రమంలో వెంకుస గురూజి అజమాయిషీలో తల్లితండ్రిలేని పిల్లలు శిక్షణ పొందుతున్నారని తెలుసుకొన్న పెంపుడు తల్లిదండ్రులు, అయిష్టంగానైనా, బిడ్డ క్షేమంకోసం ఆశ్రమంలో చేర్పించారు. అంతకు క్రితం రాత్రి వెంకూసకు ఈ సంఘటన స్వప్న రూపంలో బయల్పరచబడినందువల్ల, నిరభ్యంతరంగా బాలునికి ఆశ్రమంలో స్థానం కల్పించి, ఆతని ఎడల ఎనలేని గౌరవ మర్యాదలను కనపరచడం అనేకులకు ఆశ్చర్యం కలిగించింది. వెంకుస గురూజి ఈ బాలుని అధికంగా అభిమానించడం మిగిలిన ఆశ్రమ బాలురలో అసూయకు కారణమైంది. ఒకరోజు బిల్వ పత్రాలను సేకరించుకొని రమ్మని వెంకుస గురువులు బాలుని ప్రక్కనే వున్న అరణ్యానికి పంపడాన్ని అదునుగా తీసికొని, మిగిలిన బాలురు చుట్టుముట్టి, కొట్టి, ఇటుకను విసరినందువల్ల అది వచ్చి బాలుని నొసటుకు తగిలిందని, అయినా మారు మాటాడకుండ రక్త సిక్తమైన ఆ ఇటుక బెడ్డతోనే గురువును దర్శించినపుడు, ఆయన దుఃఖాక్రాంతుడై పై పంచెను చింపి కట్టుగట్టి, బాలుని ఆ స్థితిలో చూచినందువలన కలిగిన బాధ ఫలితంగా స్రవించిన కన్నీటితో ఆ ఇటుకను తడిపి, తన దగ్గరే భద్రం చేసికొన్నాడని ప్రతీతి. అలా భద్రం చేసికోడానికి కారణం ఆ రక్తం బాలుడైన సాయిబాబాదే అయినా అతడు శివావతారమైనందువల్ల,

2. **Peter Brent**, *op cit*, p. 140.

శివ రక్తాన్ని భద్రం చేయడం పుణ్య కార్యమని ఎంచి వెంకుస గురువు అలా భద్రం చేశాడని పెద్దల సూచన. వెంకుస మరణానంతరం ఏర్పడిన సమాధి మీద మొదట సాయిబాబా కూర్చుని ఆ తరువాత తనజీవితాన్ని ప్రారంభించాడు.

ఇంకా అనేకానేక వివరాలను గోకాక్ పండితుడు చర్చించాడు. ఆ వివరాలను పరిశీలించిన వారికి పౌరాణిక లేదా ఇతిహాస కథల లక్షణాలే అధికంగా కనిపిస్తాయి. మారు రూపంలో ఆగంతుకుడు నిండు వర్షంలో అర్ధరాత్రి వచ్చి దేవగిరిమ్మ యొక్క సపర్యల నందుకొని దీవించడం, ఆ తరువాత సాయి బాలుని జననం, అది కూడ మార్గాంతరంలో దయనీయమైన పరిస్థితుల్లో జరగడం, పురిటి కందుని పెంపకానికి ఇచ్చిన తల్లిదండ్రుల ప్రస్తావన ఆ తరువాత లేకపోవడం, వెంకుసకు కలిగిన దర్శనం 'ఈశ్వర, రక్తం' అని బాలుని రక్తంతో తడిసిన ఇటుకను భద్రపరచడం మొదలైన వివరాలు పౌరాణిక సంఘటనలుగా కన్పించడంలో ఆశ్చర్యం లేదు. ఇంతా చెప్పి, ఆయన స్వగ్రామాన్ని కాని, జనన తేదీ లేదా సంవత్సరాన్ని కాని గోకాక్ సూచించలేదు. గోకాక్ పుట్టపర్తి సత్య సాయిబాబా భక్తుడైనందువల్ల, పుట్టపర్తి సత్యసాయిబాబా తాను షిర్డీసాయి బాబా అవతారాన్నని చేసిన ప్రకటనను గోకాక్‌తో సహా అనేకులు నమ్ముతున్నందువల్ల, గోకాక్ గ్రంథంలో చారిత్రక సంఘటనలకన్న, అభిమాన పూర్వక పౌరాణిక వర్ణన అధికంగా కన్పిస్తున్నదని అనవలసి వస్తున్నది.

ఈ సాయిబాబాను గూర్చి శాస్త్రయుక్తమైన ఆమోదం పొందగల సమాచారం కోసం ప్రస్తుత గ్రంథకర్త వేచివున్నాడు. అయినా 1854 సం॥ నాటికి, దాదాపు పదహారు సంవత్సరాల ప్రాయంలో మహారాష్ట్రలోని అహమ్మదానగర్ జిల్లాలో వెలసిన షిర్డీ అనబడే కుగ్రామం వెలుపల వేపచెట్టు క్రింద ఈయన్ని ప్రజలు గమనించి, 'ఫకీర్' అని భావించి పిలిచారు.[8] 1854 నాటికి పదహారేళ్ళ వయస్సువాడని చెప్పబడింది గనుక, ఈయన 1838 ప్రాంతంలో పుట్టివుండవచ్చు.

షిర్డీ సాయిబాబాను చపలచిత్తుడని ఆనాటి ప్రజలు కొంతకాలం భావించి, వేధించారనే ప్రతీతి వుంది. ఇందుకు వస్త్రధారణ సరిగా లేకపోవడం,

8. **Mervin Henry Harper**, *Gurus, Swamis and Avataras*, **Philadelphia: The Westminister Press**, *1976*, **p.** *17.*

మురికిగుడ్డలు, తైలసంస్కారం లేని జుట్టుతో చూడడానికి వికారంగా చాదస్తంగా కనపడడం ఒక కారణం కాగా, మూడు సంవత్సరాలపాటు గ్రామం వెలుపల వేప చెట్టు క్రింద ఉండి, ఆకస్మికంగా అదృశ్యం కావడం మరో కారణం కావచ్చు.[4] ఈ అదృశ్యమైన ఏడాది కాలంలో, ఆయన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో సంచరిస్తు చంద్‌పాటిల్ అనబడే ముస్లిం నిష్ఠాగరిష్ఠుని ఆకర్షించాదని, ఆ తరువాత ఎద్దులబండిమీద వీరందరు ప్రయాణం చేసి, షిర్డిచేరి అక్కడ ఏనాటి నుండో పాడుపడిన మసీదును తన నివాసంగా ఏర్పరుచుకొన్నాడని, ఆ సమీపంలోని 'కండోబ' దేవాలయం నుండి అపుడే వస్తున్న యాజకుడు, ఈ యువ ఫకీర్‌ను చూచి, 'ఆ సాయి' అన్నాడని, దాని అర్థం 'స్వాగతం' అని, అనాటినుండి ఆయనకు సాయిబాబా నామమమే స్థిరపడి పోయిందని ఆయన చరిత్రకారుడు వివరంగా వ్రాస్తున్నాడు.[5]

ఆ పైలాపచ్చీసు వంటి వయస్సులో లోకేచ్ఛలను త్యజించి, జితేంద్రియుడై మనోనిగ్రహాన్ని పాటిస్తు అతి నిరాడంబరం, సర్వసామాన్యమైన జీవితాన్ని కొనసాగిస్తున్న బాబా ప్రజలదృష్టిని ఆకర్షించడంతో ఆయన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని, ఆధ్యాత్మిక క్రమశిక్షణను, స్వయంగా సాధించిన సిద్ధ లక్షణాల ప్రభావాన్ని ప్రజలు గమనించ ప్రారంభించారు. అంతకుముందు చపలచిత్తుడేమో నని అనుమానించినవారే ఈనాడు ఆయన ప్రత్యేక ఆధ్యాత్మిక శక్తి సమన్వితుడని, మహత్క్రియలు చేయ సమర్థుడని కొనియాడుతూ, జనాన్ని ప్రోగుచేసి, ఆయన్ని గూర్చి తెలియచెప్పడాన్ని నిత్యకృత్యంగా కొందరు పాటించారు.

ఇలా జరుగుతున్న ప్రచారాన్ని బలపరుస్తూన్నట్లు ఎప్పుడూ జ్యోతిని వెలిగించి వుంచే వాడుక, వేడుక గల బాబా ఒకరోజు వ్యాపారులు అవసరమైన నూనెను అరువివ్వడానికి గాని, దానం చేయడానికి గాని అంగీకరించనందువల్ల కేవలం నీటితోనే జ్యోతిని వెలిగించి, గ్రామీణులకు, సన్నిహితులకు ఆశ్చర్యం కల్గించడంతో పాటు, తనలో మహత్క్రియలు చేయగల శక్తిని ప్రప్రథమంగా వ్యక్తం చేశాడట.

4. Refer to Nagesh Vasudeva Gunaji, *Sri Sai Satcharitra*, Bombay: Nirnaya Sagar Press, 1965 p. 20.

5. *ibid*. pp. XXV-XXVII.

ఆయన జీవించిన సర్వ సామాన్య జీవితానికి ఒకటి రెండుదాహరణలు చాలు. భిక్షాటనంలో తనకు లభించిన గోధుమ వగైరా ధాన్యంలో ఇతర భిక్షకులకు పంచినంత పంచి, మిగిలిందానిని స్వయంగా తిరగలితో విసరి, తన రొట్టె తాను తయారించుకొనడం బాబా అలవాటు. ఎవరైన ఆ దారివెంట వెళ్ళే స్త్రీ జనం సహాయానికి వచ్చినా, వారి సహాయాన్ని అపేక్షించటం బాబాకు సుతరాము గిట్టని కార్యం. అలా తిరగలి విసరడంలో కూడా ఆయనొక ఆధ్యాత్మిక భావాన్ని దర్శించగలిగాడు. రెండు తిరగళ్ళు రెండు మార్గాలు-ఒకటి కర్మమార్గం, మరొకటి భక్తి మార్గం. పైనున్న తిరగలిని త్రిప్పడానికి ఉపయోగించే చెక్కపిడి జ్ఞానమార్గం. అలా తిరగలిలోబడి నుగ్గు నుగ్గు అయి రూపాన్ని కోల్పోయి బయటకు వస్తూన్న పిండి, మనోవాక్కర్మల ద్వారా ప్రజలు చేసిన పాపకార్యాలు. ఇతరుల పాప ఫలాన్ని బాబా అలా నుగ్గునుగ్గు చేస్తున్నాడన్నమాట. ఆ విధంగా తిరగలి పట్టడానికి సాయంగా గాని తామే ఆ పని చేస్తామని గాని ముందుకువచ్చిన వారిని బాబా వారించి, తానాపని చేయలేకపోతే వారికి ముక్తి లేదు గనుక తానాకార్యాన్ని చేయకతప్పదని ప్రకటించేవాడు.

ఆయన వస్త్రధారణ కూడా విచిత్రమైందే! పొడుగాటి అంగీ వంటి చొక్కా, అది కూడ చినుగులతో మాసిపోయిన జీర్ణవస్త్రం ఒక లంగోటి. ఆయన పరుపు నేలపై పరుచుకొన్న గోనెపట్ట. ఆనాడు ఆయనకున్న ప్రభావం కొద్దీ ఎవర్ని ఏమి అడిగినా వల్లంతా బంగారమై వుండేవి. అడుగకపోయినా, తెచ్చిన కానుకల్ని స్వీకరించినా అవసరానికి మించిన అర్థబలం చేకూరి వుండేది. ఆయనకు అడగడం ఎంతగా గిట్టుబాటుకాదో, ఇచ్చింది పుచ్చుకోవడం కూడ అంత గిట్టుబాటు కాదు. బలవంతంగా ఎరరైనా ఏమైనా ఆయన పాదాల దగ్గిర పెట్టిపోతే, దానిని ముట్టకనే ఆ వెనువెంటనే వచ్చిన భిక్షకులకు చూపించి 'తీసికొని పొండ'ని దానం చేయడం ఆయన వాడుక. ఆయన లోకేచ్ఛల విసర్జనకు భోగభాగ్యాల త్యాగానికింతకన్న వేరేవుదాహరణలు అవసరం లేదు.

ఆయనదొక విలక్షణమైన వ్యక్తిత్వం. ప్రజలతో కలసిమెలసి జీవించడం గాని, సంభాషించడం గాని ఆయన జీవితంలో జరుగని సంఘటనలు. మౌనమే ఆయన వ్రతం. ఎవరైనా ప్రశ్న అడిగితే దానికి అవసరమైతే బదులు చెప్పడం లేదా మౌన ముద్ర నవలంబించడం ఆయన ఆస్తి ఏ పూట కా పూట భిక్షాటనం వల్ల లభించే, ఆహారం, వంటిమీదున్న జీర్ణవస్త్రం, పండుకునే గోనెపట్ట. ఆయన

జ్ఞానం గ్రంథ పఠనం వల్లగాని, శుశ్రూషవల్లగాని లభించింది కాదు. కాని కఠినమైన శరీర శుష్కణ, తపోచర్యలవల్ల కలిగిన మానసిక వికాసంవల్ల అబ్బిన అపూర్వానుభవజన్యం.

నీటితో జ్యోతిని వెలిగించి కొనసాగించడంతో ప్రారంభమైన ఈయన మహత్క్రియా పరంపర నిరాఘాటంగా సాగిపోయిందని ఆయన జీవితచరిత్రకారు లుద్ఘాటిస్తున్నారు. ఈయన చేశాడని లోకానికి తెలియవచ్చిన మహత్క్రియల్లో కొన్ని - కుష్టువ్యాధి నివారణ, దృష్టి ప్రసాదం, కుంటివారు నడవగలగడంగా మెర్విన్ హెన్రీ హార్పరు ఉదాహరించాడు.[6] అంతేగాక తానున్న మస్జీదులో నిత్యం మండుతూవున్న నిప్పు నుండి వచ్చిన విభూతి అనేక మందిని స్వస్థత పరచిందని మరొక సూచన. ఆయన మరణించిన పిదప కూడా. ఈ మంటను ఆర్పివేయక అలా వెలిగిస్తూ ఆ విభూతిని- ఆయా సమయాలలో ఆశ్రమ సందర్శనానికి వచ్చే సాయిబాబా భక్తులకు పంచిపెట్టడం ఇంకా కొనసాగుతూనే వుంది.

ఆయన ఆయా సమయాలలో పరార్థ శ్రమనుకూడా అనుభవించాడని ఆయన జీవితచరిత్రకారులు వివరిస్తున్నారు ఒకానొకనాడు మండుతున్న నిప్పు దగ్గరవుండి తనచేతిని మండే మంటల్లో పెట్టి కాల్చుకొని, శిష్యవర్గం ఆశ్చర్య పడుతూ ఎందుకు ఇలా చేశారని ప్రశ్నిస్తే, "నా భక్తురాలు కంసాలి స్త్రీ. కొలిమి లోకి గాలిని పంపే గాలితిత్తులు కదలిస్తూ భర్తకు సాయం చేస్తూ వుండగా, ఆమె కొడుకు ఆడుకొంటూ వచ్చి కొలిమిలో పడి వళ్ళు కాల్చుకొన్నాడని, తన భక్తురాలి కుమారుని బాగుచేయాలంటే ఆ శ్రమను ఆ బాలునికి బదులు తానుభవింపవలసి వున్నద"ని ఆయన బదులు చెప్పాడట. అలాగే మరో సమయంలో బొబ్బలు ప్లేగు వ్యాధితో బాధపడుతున్న కొడుకు స్వస్థతను కోరి ఒక తల్లి ఆయన చెంతకురాగా ఆ బొబ్బల ప్లేగును తన శరీరం మీదకి కోరుకుని ఆమె కుమారుని స్వస్థతపరచాడని మరో సూచన వున్నది.[7] ఈ రెండు సంఘటనల గూర్చి విన్న

6. **Mervin Henry Harper**, *op.cit*. p. 20.
7. **Sri Nagesh Vasudeva Gunaji**, op.cit. pp. 42-43. **See also Brahmana Natha Nadre** *The Living Force of Sri Sai Baba*, **Poona: Swananda Mudranalaya**, 1965 **pp**.15-24 **passim**.

సాయిబాబా శిష్యులు ఆయన నిజంగా తన భక్తుల సంక్షేమాన్ని కోరి, వారికొరకు శ్రమపడుట ద్వారా పరార్థశ్రమ సేవకుడైనాడని భావించారు.

దాదాపు అర్థశతాబ్దంపాటు వ్యాధిగ్రస్తులకు స్వస్థతను, పేదలకు ఆహారాన్ని, నిరాశ, నిస్పృహల్లో చిక్కుకున్న వారికి అదరణను, శిష్యులకు ఉపదేశామృతాన్ని ప్రసాదించాడు బాబా. చిన్న చిన్న మాటలు ఉదాహరణలతో అపూర్వమైన ఆధ్యాత్మిక విషయాలను బోధిస్తూ తన చుట్టూ చేరిన అనేకులను సంతృప్తిపరచాడు. అత్యంత విద్యాధికులు, ఉన్నతాధికారులు, వైద్య నిపుణులు మొదలు సామాన్య గ్రామీణుల వరకు ఆయన శిష్యవర్గంలో వున్నారు. అడిగిన వారందరికి నిత్యం మండుతూ వుండే నిప్పుల నుండి తీసిన విభూతి పంచిపెట్టబడింది. అసంఖ్యాక జనవాహినులు షిర్డిని వెతుకుతూ వచ్చి, భక్తిప్రేమలతో ఆయనకు పాదాభివందనం చేసిపోయారు. అంతేకాదు, ఆయా దూర ప్రాంతాల్లో వుండి, ఆయన్ని వ్యక్తిగతంగా దర్శించలేనివారు సైతం ఆయన స్వరాన్ని వింటున్నామని, స్వప్నంలో దర్శిస్తున్నామని ప్రకటించారు.

1918 సంవత్సరం అక్టోబరు 14వ తేదీ షిర్డీ సాయిబాబా తనువును చాలించినపుడు, ఆయన తన మరణాన్ని సూచిస్తూ చెప్పిన అనేక విషయాలు వెలుగులోనికి వచ్చాయి. ఆయన మరణానికి రెండు సంవత్సరాల ముందే తన కత్యంత విశ్వసనీయులైన శిష్యత్రయం నుండి ప్రత్యేకించి ఇద్దరిని చేరబిలిచి వారికి తన మరణాన్ని సూచిస్తూ మర్మంగా వారిలో మూడవ శిష్యుడైన 'తత్యా' ఇంకా రెండు సంవత్సరాలకు దశరా ఉత్సవాలు కొనసాగేపుడు మరణిస్తాడని చెప్పాడట ఇది పరమ రహస్యమైనందువల్ల ఎవరికీ తెలియనీయ వద్దనే సాయిబాబా ఆజ్ఞను శిరసావహించి, ఈ శిష్యద్వయం నోటికి తాళం వేసికొన్నారు ఆయన చెప్పిన విధంగా 'తత్యా' అనారోగ్యానికి గురికావడం, దిన దినం క్షీణించిపోవడం ప్రారంభమైంది. అతడు మరణిస్తాడని తెలిసినవారు జరుగుతున్న సంఘటన హృదయాలను పిండుతూ వుంచే కూడ వేదనను తమలో తాము సహించి, భరించారేకాని, పెదవి విప్పలేదు. 'తత్యా' మరణించేరోజు ఆసన్నమైంది. 1918 అక్టోబరు 14 తత్యాపని తారుమారైంది. చుట్టూ వున్నవారు తబ్బిబ్బుపడుతున్నారు. ఇపుడా ఇంకొంచెం సేపా అని చూస్తున్న సమయంలో, తత్యా కనుకొలుకులు తెరిపిడి పడ్డాయి శ్వాస పరిస్థితి మెరుగైంది. అతడు జీవిస్తాడనే

ఆశ పెరుగుతున్నది. సంతోషంగా గంతులువేస్తూ ఈ వార్త తెలియచెప్పడానికని సాయిబాబా దగ్గరకు పరుగులెత్తినవారు నిశ్చేష్టులై, నోటమాట లేక ఉండి పోయారు. సాయిబాబా అసువులు అనంత వాయువుల్లో లీనమైపోయాయి. 'తత్వ'ను పోల్చుకొని, సాయిబాబా తన మరణవార్తను శిష్యవర్గానికి తెలియచేశాడనే నమ్మిక అనుచర వర్గంలో ప్రబలింది.[8] ముస్లిం మతంనుండి శాయి అనుచరులైనవారు, హిందూ మతంనుండి ఆయన్ని అనుసరించినవారు సాయిబాబా మృతదేహం కోసం పోటీపడుతున్న సమయంలో సాయిబాబా దర్శనంలో కనిపించి, ఆజ్ఞాపించిన మేరకు భూపే సాహేబ్ బూటె ఆ మృతదేహాన్ని తన భవన ప్రాంగణంలో నిర్మింపబడిన శ్రీకృష్ణ మందిరంలో రెండోరోజు సాయంత్రం భూస్థాపితం గావించాడు.

## షిర్డీ సాయిబాబా బోధలు :

ఈయన జీవితంలో ప్రధానంగా కనిపించే లక్షణం సర్వ సామాన్య జీవన విధానం. భారతీయ సంస్కృతిలో గురువులు ఎలా వుండాలని ఆయా గ్రంథాలు సూచించాయో, ఏ సూచనలను సనాతన గురువులు పాటించారో, ఆ సత్సంప్రదాయాని కనుకూలంగా నిరాడంబర జీవితాన్ని ఎన్నుకొని, దైనందిన ప్రజాజీవన వ్యాపారాలకు అతీతంగా జీవించాడు షిర్డీ సాయిబాబా. జీర్ణ వస్త్రధారణ, భిక్షాటన, దీనజనోద్ధరణ ఆయన జీవితధ్యేయం. మితభాషిగా పేరొంది, మౌనాన్ని శిరసావహించాడు. విస్తరించి మాటలాడక, అడిగితేనే సమాధానం చెప్పి విలువైన మాటకు మరింత విలువ నాపాదించాడు.

ఆయన ఆరాధ్యదైవం నిర్గుణ బ్రహ్మ. ఆయన బోధల్లో ప్రత్యక్షమైంది నిర్గుణబ్రహ్మ. ఆయన పురుషభేద రహితుడు, గుణాతీతుడు, మానవమేధకు అందని లక్షణాలు, వ్యక్తిత్వం కలవాడు 'శుద్ధచైతన్యమే' బ్రహ్మగా భావించి, బ్రహ్మ అంతిమ సత్యమని నమ్మినవాడు. 'బ్రహ్మ పరాత్పర బ్రహ్మ' పరాత్పర అంటే సర్వోన్నతమైనవాడు. ఉన్నతం, సర్వసర్వోత్కృష్టమైన దానికన్న సర్వోన్నతుడు. ఆయన దేనికి అందని అబంధితుడు. ఆయన నిర్గుణుడు కాడు, నిరంకారి కాడు. అలాగని సగుణుడు కూడ కాడు, అకారి కాడు. ఇట్టి ఆపాదిత లక్షణా

8. **Nagesh Vasudeva Gunaji.** *ob.cit.* p. 282.

లన్నిటికి అతీతమైనవాడు ఆయన సారాంశానికి సారాంశం. అనంతుడు, మూలాధారం, నిత్యం, ఆయనే పరమాత్మ. ఆయన దూరంగా వుండి ప్రేక్షకునివలె జగన్నాటకాన్ని చూస్తూ వుండేవాడు కాదు ఆయన ఆ జగన్నాటకంలో ప్రముఖ పాత్రధారి. మానవ సుఖ దుఃఖాలలో, శ్రమ బాధలలో ఆయన భాగస్వామి. అపూర్వ శక్తి సమన్వితుడు. మానవుడు దైవాంశ కలవాడని, దైవిక స్వభావం అతనిలో నిద్రాణంగా ఉన్నందున దానిని చైతన్యవంతం చేయడమే బాబాయొక్క ప్రధాన కర్తవ్యమని విశ్వసించాడు షిర్డీసాయిబాబా.

నేడు ప్రపంచంలో అవాంచిత కార్యాలు, మానవ దౌష్ట్యం, క్రౌర్యం మొదలైనవన్నీ మానవ బుద్ధి ప్రేరేపితాలైనందువల్ల మానవునిలో దైవాంశ ఉన్నదని చెప్పడం సబబు కాదనే వాదనను సాయిబాబా ఖండించి, మానవునిలో దైవాంశను పురికొల్పి, మంచివైపు మరల్చలేనపుడిట్టి అనర్థకాలు సంభవించుట సహజమని, అలాకాక అతనిలోని దైవాంశ మేల్కొని, జాగృతి పొందినపుడు మంచి జరుగుతుందని ప్రబోధించాడు. ఎంత అనర్థకమైన పరిస్థితుల్లో కూడ మానవ మనసును మంచివైపు మరల్చవచ్చునని ఆయన దృఢ విశ్వాసం.

అవిద్య ఫలితమైన అజ్ఞానమే పాపం. మానవుడు బ్రహ్మ ఒకటేనను సత్యాన్ని ఈ అవిద్య ప్రభావంవల్ల గ్రహించలేకపోవడమే మానవ పాపమని షిర్డీ సాయిబాబా ప్రబోధం ఇలా గ్రహించకుండా అడ్డుపడేది మాయ. మాయను పారద్రోలి, బ్రహ్మను చేర్చుకొనుచే జ్ఞానం. అట్టి జ్ఞానార్జనయే విమోచన. స్వయం సాధ్యమైన బ్రహ్మజ్ఞాన సముపార్జనే రక్షణ, ఆనందం. జీవాత్మకు పరమాత్మకు మధ్య ఏకత్వమేగాని, భిన్నత్వం లేదు. జీవాత్మ కంటికి గోచరమైన విషయాలలో ఆనందించి, అగోచరమైన పరమాత్మను దూరం చేసినందువల్ల కలిగే ఫలితం పాపం. అట్టి స్థితిని దాటి ధ్యానమనస్కులు కావడమే రక్షణ. ఏ వ్యక్తి తన పూర్వ స్థితిని గ్రహించి, సాధించడానికి ప్రయత్నిస్తాడో ఆ వ్యక్తి పాపాన్ని జయించినవాడు. అట్టి విజయమే విముక్తి, రక్షణ అని షిర్డీ సాయిబాబా విశ్వాసం. మానవుడు ఎంతకాలం పరమాత్మకు దూరంగా వుంటాడో అంతకాలం అతడు మాయ యొక్క ప్రభావంలోనే వుండిపోతాడు. అది పాప స్థితి. అట్టి స్థితినుండి బైట పడడమే రక్షణ. మానవునిలో అంతర్యామిగా వున్న బ్రహ్మను శాశ్వ

తంగా నిలుపుకొనుటే రక్షణ. ఇంకొక రకంగా చెప్పితే, జీవాత్మ పరమాత్మల సమ్మేళనమే రక్షణ అని ఆయన ప్రబోధం.

షిర్డీ సాయిబాబా భక్త పరాధీనుడనని ప్రకటించుకొన్నందువల్ల తన జీవిత ధ్యేయం భక్తులకు సాయం చేయుటే నని బోధపడుతున్నది. ఆయన్ని గూర్చి అనుచర వర్గం జ్ఞానాని కీయన అపరావతారమని విశ్వసిస్తున్నారు.

షిర్డీ సాయిబాబా బోధలు సంప్రదాయ సిద్ధమైన విశ్వాసానికి, సిద్ధాంతానికి కట్టుబడి కొనసాగాయి. జ్ఞానం అంటే అవిద్యను నిర్మూలించుటే నని, ద్వైతాన్ని రూపుమాపి, 'సర్వం ఏకం ఏవ' అనే అద్వైత భావానికి మానవుడు పురోగమింప వలసి వున్నదని, అపుడే జీవాత్మ పరమాత్మ ఏకమై అభిన్న స్థితిని అనుభ విస్తుందని ప్రకటించినపుడు, మధ్య యుగాల నాటి, అద్వైత సిద్ధాంత మూల పురుషుడు శంకరాచారి కెంత సన్నిహితంగా తన బోధల్ని కొనసాగించాడో గ్రహించవచ్చు. శిష్యుడు తన గురువువలె జ్ఞానానికి ప్రతిరూపం కావాలి. గురు శిష్య వ్యత్యాసం వారుభయులు గ్రహించగల దివ్యజ్ఞాన పరిమాణం, సాధించ గల స్వయంసిద్ధ స్థితి మొదలైన అపూర్వ దశను చేరడంలో గల శక్తి సామర్థ్యాలపై ఆధారపడిందే కాని కేవలం వ్యక్తిత్వాలపై కాదని ఆయన ప్రకటన. తాను ప్రపంచాన్ని పునరుద్ధరించి, మానవ జాతిని ఆధ్యాత్మికంగా పైకెత్తడానికి మాత్రమే శరీరాన్ని ధరించానని, ఆయనలో నిండి నిబిడీకృతమైన గుణ రాహిత్య స్థితి ఇట్టి మానవ శరీర ధారణవల్ల కించిత్ కూడ మార్పు చెందలేదని సాయిబాబా ప్రకటించాడు.[9]

గత శతాబ్దం రెండవ అర్ధభాగం నుండి ఈ శతాబ్దం మొదటి పాదంవరకు తాను మకాం వున్న మహారాష్ట్రంలో మాత్రమేగాక యావద్భారతదేశంలో తన ప్రాభవాన్ని వెలార్చి తనకొక శిష్యవర్గాన్ని తయారుచేశాడు షిర్డీ సాయిబాబా. కబీరు తరువాత హిందూ ముస్లిమ్ ధోరణులను సమన్వయ పరచిన మత సమన్వయ ప్రచారకుడీ సాయిబాబా. మాటల్లోనే గాక ఆయన రూపంలో కూడ ఈ రెండు విభిన్న సంస్కృతుల సమ్మేళనం కన్పిస్తున్నది. ఆయన మరణించి

9. *ibid*. p. 216–217.

నపుడు హిందువులు, ముస్లిములు ఆయన మృతదేహానికి మేము వారసులమంటే మేము వారసులమని ప్రకటించడంలోనే ఆ రెండు సమాజాలపై ఈయన ముద్ర ఏ మేరకున్నదో గ్రహించవచ్చు. వేలకొలది మైళ్ళదూరంలో వున్న తన భక్తుల అవసరాలను తెలుసుకొని, వారి గావుకేకలను వినగలడని లోకం నమ్మిన, ఈయన కేవలం ఫకీరుగా జీవించాడంటే ఆశ్చర్యపడక తప్పదు. అది ఆయన నిరాడంబరానికి మచ్చుతునక.

బాబా మరణించి ఇప్పటికి అరవై ఎనిమిది సంవత్సరాలైంది. 'నేనీ తనువును చాలించిన మీదటకూడ నా భక్తులకు, అనుచరులకు తమను తాము నాకు లోబరచుకొనువారందరికి నేను సహాయ పడుతూనే వుంటా'నని సాయిబాబా వాగ్దానం.[10] ఈ వాగ్దానాన్ని అక్షరార్థంగా విశ్వసించి, ఆయన అనుచర వర్గం ఆయా నగరాల్లో, పట్టణాల్లో, గ్రామాల్లో వెలసిన సాయిబాబా కేంద్రాలలో ప్రతి లక్ష్మివారం సాయంత్రం సమావేశమౌతుంటారు. ఈ సమావేశాల్లో పూజా కార్యక్రమం కొనసాగుతుంది, అగరువత్తులు, దీపాలు వెలిగించి పెట్టి, వెలుగుతున్న దీపాలపై ఆజ్యం పోస్తూ వుండగా, సమావేశమైన వారంతా భజన సంకీర్తనలు గానం చేస్తూ వుంటారు. మంటపానికి సమీపంలో కూర్చున్న స్త్రీ టెంకాయ నారికేళాన్ని సాయిబాబా విగ్రహానికి లేదా పటానికి అర్పించిన మీదట, నీటిని విగ్రహంపై ప్రోక్షించి, కొబ్బరి ముక్కలను ప్రసాదంగా చేరినవారికి పంచిపెడుతుంది. ఇది మామూలుగా ప్రతి లక్ష్మివారం ఆయా సాయి కేంద్రాలల్లో జరిగే కార్యక్రమం.

షిర్డీ సాయిబాబా తనదైన ఒక సంస్థను స్థాపించలేదు. అందరికి వలె కొట్టవచ్చినట్లు కనిపించే భవనాలు కట్టించలేదు. కాని వేలకొలది ఆయన భక్తులు ఆయన సూక్తులను మననం చేసికొని, ఆయన విగ్రహాన్ని పూజించి, ఆయన తరువాత దాదాపు ముప్పాతిక శతాబ్దం గడచినా ఆయన బోధల్ని ఆచరణ రూపంలో ప్రచారం చేస్తున్నారు. షిర్డీలో ఆయన మకాం చేసిన స్థలం ఈనాడు అనేకులకు పుణ్యక్షేత్రమైంది.

10. **Arthur Osborne**, *The Incredible Sai Baba*, **Bombay Orient Longman's, 1957, p. 100.**

## 2. శ్రీ కాశీనాథ్ గోవింద్ ఉపాసని బాబా 1870-1941:[1] ఆధ్యాత్మిక శ్రమైకజీవి

షిర్డీ సాయిబాబాను దర్శించి, ఆయన దీవెనలను పొంది, బహుకాలం షిర్డీకి కేవలం మూడుమైళ్ళదూరంలో తనదైన ఒక ఆశ్రమాన్ని స్థాపించుకొని, ప్రజలను, భక్తులను ఆకర్షించిన వ్యక్తి శ్రీ కాశీనాథ్ గోవింద్ ఉపాసనిబాబా జననం 1870 మే నెల 15. జన్మస్థలం నాసిక్ జిల్లాలోని సతారా అనబడే కుగ్రామం. జననీ జనకులు రుక్మిణీబాయి, గోవిందశాస్త్రి, ఈయన పుట్టింది బ్రాహ్మణ కులమైనందు వల్ల సంప్రదాయకంగా అలవడే పురోహిత లక్ష్యాలతోపాటు, బరోడా మహారాజు కొలువులో పండితునిగా పనిచేస్తున్న పితామహుని పెంపకంలో జ్ఞానాభిలాష కూడ పెరిగింది. మహారాజా మరణం తరువాత తాతగారి పదవి పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ప్రారంభమైనాయి అయినా కాశీనాధుని విద్యాభ్యాసం పితామహుని ఆధ్వర్యంలో చురుగ్గానే సాగింది. 'వ్యక్తిలోని ఆత్మకు శరీరమొక కారాగారం' అనే సంప్రదాయ బోధ కాశీనాధుని చిన్న మనసుపై తీవ్రంగా పనిచేయసాగింది. అందువల్ల తన ఆత్మను బంధిస్తున్న దేహాన్ని శిక్షించాలనే వుద్దేశంతో దేహ పోషణ కుపయోగపడగల సమస్త భోజన పదార్థాలను విడనాడి, వ్యాయామ సంబంధమైన కార్యక్రమాన్ని అవలంబించడంలో ఆసక్తిని కనపరచాడు కాశీనాధ్. భౌతిక విశేషాలకన్న అధిభౌతిక విశేషాలే బాలుని అధికంగా ఆకర్షించాయి. మంత్ర శక్తులను గూర్చి విన్నవు డుప్పొంగిపోయాడు. పౌరాణిక పురుషులు చేసిన కఠోర తపోచర్యలను చదివి, గ్రహించి, మనసు కరిగిపోయింది. ఆసనాలను, ప్రాణాయామాన్ని, మంత్రజపాన్ని అయితే ఇంటిలో, లేదా శ్మశాన వాటికలో అభ్యసించడం ప్రారంభించాడు ఆ ఫలితంగా కొందరు ఈ "మత

1. For detailed study of his life and teachings refer to a. Madhav Nath, *Satguru Upasani Maharaj Yancha Charitra*, Bombay: R S. Irani, 1923. b. B.V. Narasimha Rao and S. Subbarao, *Sage of Sakuri*, Bombay: New Bharat Printing Press, 1966 and c. S. N. Tipnis, *Contribution of Upasani Baba, to Indian Culture*, Bombay. New Bharat Printing Press, 1966.

పిచ్చి"కి ఆయన్ని నిందిస్తే, మరికొందరు బాల్యంలోనే ఈ కఠోర మతానుష్ఠాన కార్యక్రమం ఏమిటని జాలిపడ్డారు. "హంసల కుటుంబంలో ఇటువంటి బాతు పుట్టిందేమ'ని మరికొందరు విస్తుపోయారు.[2]

బాల్యంనుండి మతాసక్తిని ప్రదర్శిస్తున్న కుమారుని, పరిశీలిస్తున్న తల్లి దండ్రులు, వివాహం చేస్తే సంసార విషయాలవైపు దృష్టి మరలగలదని భావించి వివాహాది కార్యాలు ముగించారు. తనను తానే పోషించుకోలేనవుడు పైన భార్య ఎందుకని వాదించాడు కాశీనాథ్. కాని ప్రయోజనం లేకపోయింది. అయినా కొద్ది కాలానికే ఆయన ఇల్లువదలి వెళ్ళిపోయాడు. తల్లికి అనారోగ్యం తటస్థించిందని విని, ఇంటికి చేరాడు. కాని తన ఎనిమిదేళ్ళ భార్య ఆ పిదప మరణించింది. అప్పటికి ఆయన వయస్సు పధ్నాలుగు సంవత్సరాలు.

తన భార్య పోయిన కొన్ని వారాలకే తొమ్మిది సంవత్సరాల బాలికతో మళ్ళీ ఆయనకు వివాహం చేశారు తల్లిదండ్రులు, తదితర పెద్దలు. ఒక ఏడాది దాటాక మళ్ళీ పరారైనాడు కాశీనాథ్, ఆయన భార్యను బంధువుల దగ్గర వదలి. పూనా నగరం వెలివాడలలో నిర్మింపబడిన ఒకానొక జీర్ణాలయంలో వుంటున్న భిక్షుకులతో కలిసి కాశీనాథ్ అయితే పస్తులు, తప్పితే ఒంటిపూట అన్నం తింటూ కాలం గడుపుతున్నాడు. భిక్షాటనంలో దొరికిన భోజనం తోటి భిక్షకులకు పెట్టి, మిగిలితే తినడం, లేకుంటే పస్తులుండడం ఆయనకు నిత్యకృత్యమైంది. ఆయన రెండో వివాహం జరిగిన నాలుగేళ్ళకు, అనగా, ఆయన వయస్సు పందొమ్మిది సంవత్సరాలున్నపుడు ఇంటికి వెళ్ళాలనే కోరికతో అరణ్యాలను, కొండ మిట్టలను దాటుతూ గృహోన్ముఖుడైన కాశీనాథ్ ఒకానొక కొండపై స్వాభావికంగా ఏర్పడివున్న గుహను చూచి, ఆకర్షితుడై అది తన స్థావరం కావాలని ఆశించాడు. మరో మనిషి ప్రవేశించడానికి కాని, భోజన పదార్థాలు దొరకడానికి గాని వీలుగాని ఆ తావులో తన ప్రాయోపవేశాన్ని ప్రారంభిస్తే త్వరలో తన జీవితాశయం నెరవేరుతుందని ఆశించాడు తన జీవితాశయం తన ఆత్మను బంధిస్తున్న తనువును చాలించడమే! అందుకు ఆ సమయంలో అక్కడ తటస్థించిన సాధనం ప్రాయోపవేశ దీక్ష రెండు దినాలు గడిచిపోయాయి ప్రాయోపవేశం చేస్తూనే, జపస్మరణ, మంత్రోచ్చారణ

2. B.V. Narasimharao and Subbarao, *op cit.* p 42

కొనసాగించాడు ఒకనొక అనిర్వచనీయ స్థితిలో దర్శనం పొందాడు. ఆదర్శనంలో ఒకరు తన చర్మాన్ని నిలువునా ఒలిచివేస్తున్న స్పర్శ, బాధ కలిగింది. కన్ను తెరచి చూచాడు. ఆకలి మంట, దానికి మించి నిద్రాలేమి బాధ, అంతకంటే రెట్టింపు దాహం. ఇంతలోనే కుంభవృష్టి, ఎదురుగా నీటి కుంట. దాహం తీర్చు కొన్నాడు కాశీనాథ్. లేని ఓపికతో అడవి అంచుల్లో ఉన్న ఆటవికుల గ్రామం చేరాడు. ఆటవికులైనా వారాయన్ని ఆదరించారు. సంతృప్తిగా భోజనం పెట్టారు. స్వస్థలం చేరాక తన నొక తపస్విగా బంధువర్గం గుర్తించింది.

1890 లో బహు కాలం ధ్యాన నిమగ్నమైన జీవితాన్ని గడిపి, 1891 లో తండ్రి మరణానంతరం సంగ్లీ గ్రామం చేరి ప్రసిద్ధి చెందిన సంగ్లీ వెంకటరమణాచారి గురుత్వంలో సంస్కృత వ్యాకరణాన్ని ఆయుర్వేద వైద్యాన్ని అభ్యసించాడు. 1895లో ఈ అధ్యయనం ముగించి, అమ్రోవతి చేరి, 1895 నుండి 1905 వరకు వైద్య వృత్తి కొనసాగించాడు.[8] అపారంగా ఈ వృత్తిద్వారా ధనం సంపాదించ డంతో, మరింత ధనార్జనపై మోజు కలిగి వ్యాపారంలో పెట్టుబడి పెట్టడం, ఆ వ్యాపారంలో తిరిగి పుంజుకోలేనంత నష్టం రావడంతో అతనిలో మిణుకు మిణుకు మంటున్న పూర్వపు ఆధ్యాత్మిక తృష్ణ పెల్లుబికి, లోకేచ్ఛల సహజాతాన్ని జయించింది, ఆ ఫలితంగా శేష జీవితాన్ని కేవలం ఆధ్యాత్మిక సేవలో కొనసాగించడానికి నిశ్చయం చేసికొన్నాడు కాశీనాథ్ ఉపాసని. భార్యతో కూడ పుణ్య క్షేత్రాలను, పుణ్య పురుషులను దర్శించాలని, వదిలిన ఆధ్యాత్మిక అనుష్ఠాన క్రియలను కొనసాగించాలనే తలంపుతో తీర్థయాత్రలకు సమకట్టాడు. ప్రాణాయామాన్ని అభ్యసిస్తున్న కాశీనాథ్ ఒకానొకనాడు అపస్మారకంగా ఊపిరి కూడ పీల్చలేని స్థితిలో పడి ఉండడాన్ని భార్య గమనించి, ముఖంపై చల్లని నీరు చల్లి ఉపశమన క్రియలు చేసి, తిరిగి ఆయనలో చలనాన్ని తీసికొని రాగలిగింది. కాని ఉచ్ఛ్వాస నిశ్వాసలు కష్టంగానే సాగుతున్నందువల్ల ప్రయాణాన్ని ఆపి, తిరిగి ఇంటికి చేరారు. ఇదంతా తాను గత జన్మలో చేసిన పాపకార్య ఫలితమని ఆయన భార్య తలంచి, ఆ పాపకర్మ విమోచనకోసం పుణ్య వృక్షం చుట్టూ 1,25 000 సార్లు ప్రదక్షిణం చేసింది.

8. **D P. Shama Rao,** *The Contemporary Gurus in the Shirdi Tradition,* **Madras : The Christian Literature Society,** 1972 p. 10.

తన మానసిక అశాంతిని, శారీరక అనారోగ్యాన్ని స్వస్థత పరచగల యోగి కొరకు కాశీనాథ్ ఉపాసని వేచి వున్నపుడు, షిర్డీ సాయిబాబాను దర్శించ వలసిందిగా ఒక ఆగంతుకుడు సలహా ఇచ్చి వెళ్లాడు. కాని, షిర్డీ సాయిబాబా మహమ్మదీయుడని ఎంచి, ఆయన్ని సందర్శింప ఇచ్చగింపలేదు. ఆ తరువాత తాను త్రాగ గలిగినంత వేడి నీటిని త్రాగవలసిందిగా మరొక సన్యాసి ఇచ్చిన సలహాను పాటించడానికి కూడ ఆయన సమ్మతించలేదు. ఈ దశలో కాశీనాథ్ ధ్యాన సమాధిని పొందాడు. ఎనిమిదవ రోజు, ప్రవాహజలాన్ని చూచి, త్రాగ సంసిద్ధమై వున్నపుడు వేడినీరు త్రాగవలసిందని సలహా ఇచ్చిన సన్యాసి తిరిగి కనిపించి, తన సలహాను గుర్తు చేయడం మాత్రమే గాక, వెంటనే షిర్డీ సాయి బాబాను దర్శించవలసిందిగా సూచించాడు. ఆ సలహా మేరకు 1911 జూన్ 27వ తేదీని షిర్డీలోవున్న సాయిబాబాను దర్శించి, ప్రథమ దర్శనంలోనే ఆయన్ని తన గురువుగా అంగీకరించాడు. ఆ పిదప నాలుగు సంవత్సరాలు సాయిబాబా సాన్ని ధ్యంలో ఆధ్యాత్మిక శిక్షణలో గడిచిపోయాయి అయినా గురువును అంటిపెట్టుకొని వుండాలని ఉపాసని బాబా ఆశించలేదు. వెళ్ళిపోడానికి అనుమతిని కోరినపుడు సాయిబాబా 'తిరిగి ఎనిమిది రోజుల్లో వస్తావులే, వెళ్ళు'మని చెప్పాడట. ఆ విధం గానే ఎనిమిదవ రోజు తిరిగిరావడం, ఆ పిదప సాయిబాబా తానే ఆయనకు సన్యాసి రూపంలో కనిపించి వేడినీటిని త్రాగుమని సెలవీయడం మొదలైన సమాచారాన్ని తెలియచెప్పాడు.

సాయిబాబా శిష్యవర్గం ఆయన్ని దైవావతారంగా భావించి, ప్రతి చిన్న అనుజ్ఞను శిరసావహించడాన్ని కాశీనాథ్ గమనించాడు. మొదట ఈ విధా నానికి అంతగా ఇష్టపడకపోయినప్పటికీ తానుకూడ తనకు తెలియకుండానే సాయిబాబా ఆజ్ఞలను నేరవేరుస్తున్నట్లు గమనించాడు. అట్టి సాయిబాబా ఆజ్ఞల్లో ఒకటి కాశీనాథ్ వెంటనే శిథిలావస్థలో సమీపంలో వున్న ఖండోబ దేవాలయంలో మకాం పెట్టి, సాధ్యమైనంత తక్కువ మందితో మాత్రమే మాట్లాడాలి అనేది. ఇది నిజానికి తీవ్రమైన ఆజ్ఞ. కారణం ఏదైనా ఆశ్రమాన్ని విడిచి వెళ్ళడానికి కాశీ నాథ్ కోరిన అనుమతిని సాయిబాబా నిరాకరించి, సమీపంలోని ఖండోబ దేవా లయంలో నాలుగు సంవత్సరాలుండవలసిందని, నాలుగు సంవత్సరాలు ముగిసిన మీదటనే దేవుని సంపూర్ణ కృప వర్షిస్తుందని తెలియచేశాడు. ఈ మాటలతో సాయి బాబా కాశీనాథ్ యొక్క జీవిత గమనాన్ని శాసించినట్లైంది. కాశీనాథ్ గృహస్థ

జీవితాన్ని అప్రయత్నంగా విడిచిపెట్టినట్లైంది. జీవితంలోని ఆ పాత అధ్యాయం అలా ముగిసింది.

> కాశీనాథ్ సద్గురువుగా పరిణామం చెందడానికి శ్రీ సాయిబాబా ఇచ్చిన ఈ ఆదేశం ఎంతో సహాయపడింది. ఆ విధమైన సద్గురు లేదా సత్పురుష ఆయనలో రూపం పొందడానికి కావలసిన సిద్ధ పాటు ముగిసింది.[4]

ఆ తరువాత కొంది సంవత్సరాలలో అసాధారణమైన కొన్ని అనుభవాలు కాశీనాధ్‌బాబాకు సంభవించాయి. ఐహుకాలం తన భోజన పానాలకోసం ఇతరు లపై ఆధారపడినందువల్ల భిక్షాటనమే జీవాధారమైంది. ఒకనాడు తన కాహారం పెట్టడానికి ఎవరూ సమ్మతించనందువల్ల భోజనాన్ని మానివేయడానికి నిశ్చయించు కొన్నాడు. భక్తులు తమకై తాము తెచ్చి సమర్పించిన ఆహారాన్ని సైతం, ఒక సంవత్సర కాలంపాటు ముట్టుకోలేదు. ఇట్టి కఠోరానుభవం ఆయన్ని ఇతర మానవ అవస్థల నుండి కూడ విమోచించింది. ఈ సమయంలోనే ఒక నూతన అనుభవం ఆయనకు కలిగింది. అది స్వయంసిద్ధ స్థితి. ఒకానొక గురు పూర్ణిమ రోజు, సాయిబాబా తన కత్యంత సన్నిహితు శిష్యురాలైన చంద్రాబాయిని పంపి, కాశీనాథ్‌కు గురుపూజ జరిపించవలసిందిగా ఆదేశించాడు. ఈ ఏర్పాటు కాశీనాథ్‌ను ఆశ్చర్యచకితుని చేసింది ఆయనకు ప్రతిష్ఠ. కుంభాభిషేకం చేసి, హారతి పట్టింది చంద్రాబాయి. ఆయన్ని ఉపాసని మహారాజ్ లేక ఉపాసని బాబా అని పిలవడం ఆనాటి నుండి ప్రారంభమైంది.

అయినా ఉపాసని బాబా సాధన ఇంకా ముగియలేదు. ఆహాన్ని, కనకాన్ని, కాంతాన్ని జయించందే ఎవరు కూడ సత్పురుషుడు కాలేదు ఉపాసని బాబాకు శోధనలు కలిగించడం ద్వారాగాని లేదా, అనేక కఠిన అనుష్టాన క్రియల్ని ఆచరించ వలసిందని ఆదేశించడం ద్వారాగాని అట్టి జితేంద్రియస్థితిని పొందడానికి సాయి బాబా సహకరించి తోడ్పడినాడని చెప్పవలసివుంది. తుట్టతుదకు 'నీకు నాకు మధ్య భేదం లేదు, నా స్థితిని నీవు చేరగలిగావు' అని సాయిబాబా ప్రకటించాడు.

---

4. **Bharatan Kumarappa**, *The Hindu Conception of The Diety in Religious Quest of India*, **Calcutta: Y M.C A. Press** 1925

మూడు సంవత్సరాల కఠిన శిక్షణ, తపసు ముగిసాక ఉపాసని బాబా 1914 వ సంవత్సరం తన అనుచరుడైన డాక్టర్ పిళ్ళాయి యొక్క ఆహ్వానాన్ని పురస్కరించుకొని, సాయిబాబాకు తెలియకుండ అర్ధరాత్రి వెళ్ళిపోయాడు. వారింట మకాంచేస్తూ భిక్షాటనంవల్లనే భుక్తిని సంపాదించుకొన్నారు. అలా భిక్షాటనలో లభించిన ఆహారంలో కొంత ప్రసాదంగా పిళ్ళాయి కుటుంబానికి పంచడం ఆనవాయితీ అయింది. ఆయన మకాం రహస్యంగా ఉంచబడినా, ఎంతోకాలం ఈ పరమ రహస్యం దాగలేదు. వచ్చిపోయే భక్తుల సందడి అధికం కావడంతో ఉపాసని బాబా పిళ్ళాయి ఇంటిని విడిచి, పట్టణానికి వెలుపల గల పారిశుద్ధ్య కార్మికుల గుడిసెల్లో ఒకదానిలో మకాం ఏర్పాటు చేసికొన్నారు. అక్కడే ఆయా సందర్భాలలో బాబాజీ ఇచ్చే, ఆధ్యాత్మికోపదేశాలచే ఆకర్షితులైన అనేకులు సమావేశం కావడం, ఆ విధంగా జనసందోహం పెరగడానికి ఎంతోకాలం పట్టలేదు. ప్రతి సాయంత్రం గుడిసె వెలుపల వెలసిన వేదికపై కూర్చుండి ఉపదేశించడం ఆయనకు పరిపాటి.

ఉపాసని బాబాకు ఏం సంభవిస్తుందో, అతడేమి చేస్తున్నాడో అంతా సాయిబాబాకు తెలుసనే నమ్మిక ఉభయ బాబాల శిష్యవర్గం మనసుల్లో స్థిరపడివుంది. 1917 లో షిర్డీ సాయిబాబా ఉపాసని బాబాను ఆకర్షించిన ఫలితంగా తిరిగి షిర్డీకి వచ్చి, మునుపున్న ఖండోబదేవాలయంలోనే మకాం ఏర్పాటుచేసుకొన్నాడు. ఆ తరువాత అదే సంవత్సరం అక్కడకు దాపులో వున్న 'సకూరి' గ్రామస్థుల కోరికపై మకాం మార్చాడు. ఆయన కావాలని చెప్పినట్లే, వూరి వెలివాడల శ్మశాన వాటికకు దరిదాపుల్లో ఒక చిన్న కుటీరాన్ని నిర్మించారు. ఆయన క్రమంగా గావిస్తున్న ఆధ్యాత్మికోపదేశాలు బహు జనాన్ని దూర ప్రాంతాలనుండి కూడ ఆకర్షిస్తున్నాయి. అప్పటికే క్లుప్తంగా ఆయన జీవిత గాథ ప్రచురింపబడి అనేకులకు పఠనీయాంశమైంది. 'ఉపాసని వాక్సుధ' అనబడే మరాఠీ మాసపత్రిక ఆయన బోధల సారాంశాన్నిగాని, యథాతథంగా గాని ప్రచురించడం ప్రారంభించింది. ఈ ఉపన్యాస పరంపర మిగిలిన వాటితో కలిపి తరువాత ఉపాసని 'వాక్సుధ' గ్రంథంగా వెలువడింది.

ఈ కాలంలోనే ఆయన అనేక మహత్కార్యాలు చేశాడని ప్రతీతి. అనేక వ్యాధులు నిర్మూలనం కావడం, భక్తుల ఆర్థిక ఇబ్బందులు పరిష్కరింపబడడం-

వాటిలో కొన్ని. ఉద్యోగం నుండి ఖర్తరఫ్ అయిన ఉద్యోగి తిరిగి బాబా మహిమ వల్ల తన ఉద్యోగాన్ని పొందడం ఆ రోజుల్లో గొప్ప వింతగా ప్రజలు చెప్పు కొన్నారట. ఇవన్నీ కూడ తన భక్తులు తనపై వుంచిన విశ్వాసంవల్ల సాధ్యమైనవే కాని. తాను చేసిన ఘనకార్యంవల్ల కాదని ఉపాసని బాబా అభిప్రాయంగా తెలుస్తున్నది.

భక్తుల సంఖ్య పెరగడంతోపాటు అర్పింపబడే కానుకల సంఖ్య కూడ పెరగడం ప్రారంభమైంది. శ్రీ దత్తాత్రేయ అనబడే దేవుని కొక మందిరం ఆ కానుకల నుండే నిర్మింపబడింది. ఆ తరువాత మిగిలిన దేవతా మందిరాలు కూడ వెలిశాయి. వీనిలో ముఖ్యమైంది యజ్ఞ మందిరం. తన తల్లి సంస్మరణార్థం 'కన్యా దేవత' మందిరం కూడ తయారైంది దీనితోపాటే కార్యాలయం, యాత్రి కులకు కావలసిన వసతి భోజన సదుపాయాల నమర్చగల భవనాలు వెలిశాయి

1౮ 0 లో మధ్య, పశ్చిమ భారతంలో ఉపాసని బాబా పర్యటనం చేశాడు. ఆయన పలుకుబడి పెరగడంతో అసంఖ్యాకులైన భక్తులు అనేక కేంద్రాలలో వారికై వారే ఉపాసని బాబా శిష్య వర్గాలుగా రూపొంది, ప్రార్థనా మందిరాలు, భజన కేంద్రాలు నిర్మించుకొన్నారు అట్టి కేంద్రాలు ఏర్పడిన కొన్ని నగరాలు నాగపూర్, సూరత్, ధరమ్‌పూర్, హైదరాబాదు మొదలైనవి. ఈ కేంద్రాలు అన్నిటిలో భోజన, విడిది వసతులు కూడ కల్పించబడినై. ఆయన నిష్ఠాగరిష్టుడైన హిందువే అయినా, ఆయన అనుచర వర్గంలో అన్ని మతాలకు చెందిన వారున్నారు.

ఆయన జీవితానికి వన్నె తెచ్చిన రెండు ప్రధాన సంఘటనలను గూర్చి ముచ్చటించవలసి వుంది. అందొకటి 'కన్యాకుమారి స్థాన్' స్థాపన. ఆయన ఉప దేశాలలో ఏదో ఒక మూల అవివాహిత స్త్రీల గూర్చిన సానుకూల ప్రస్తావన వుండడం కద్దు ఆ అనుకంపతోనే బాల వితంతువులకు, అవివాహిత స్త్రీలకు ఆశ్రయ దుర్గంగా కన్యాకుమారి స్థాన్ తీర్చిదిద్దాడు బాబా. స్త్రీలు బాబా దృష్టిలో సాత్వికులు, స్వాభావికంగా అమాయకులు, నిస్వార్థ జీవులు. అంతేగాదు, స్త్రీ ప్రారబ్ధ కర్మఫలంలేని నిష్కళంకురాలు. అట్టి సాత్విక స్వభావికులైన స్త్రీలు, దైవ చైతన్య స్థితిని పొంద అర్హులు. స్త్రీ చేసే పుణ్యకార్య ఫలితాన్ని ఆమె మాత్రమే

గాక ఆమె కుటుంబం అంతా పొందుతుంది అని ఆయన అభిప్రాయం. స్త్రీ జనానికవసరమైన ఆధ్యాత్మిక సాధన, ఉపదేశాని కనుకూలంగా కన్యాకుమారి స్థాన్ నిర్మింపబడింది.

హిందూ సంప్రదాయం మత లేఖన అధ్యయనాన్ని, పారాయణాన్ని సర్వ సభ్యులకు ఆచరణీయం కాదని ప్రకటించింది. బాబా ఆ సంప్రదాయానికి వ్యతిరేకంగా స్త్రీ జనోద్ధరణలో భాగంగా కన్యాకుమారి స్థాన్‌లో సంస్కృత భాషాధ్యయనం, తద్వారా హిందూమత గ్రంథపఠనాన్ని సులభ సాధ్యం చేశాడు. ఆశ్రమంలోని కన్యలు ఆ విధంగా ఆధ్యాత్మికోన్నతితో పాటు, విద్యాభ్యాసాన్ని కొనసాగించే ఏర్పాటు సమకూరింది. ఈ దృష్టితో చూచినపుడు బాబా గొప్ప స్త్రీ జనోద్ధరణ సంస్కర్తగా కొనియాడబడడంలో పొరపాటు లేదు. అంతేగాక, ఈ కన్యాకుమారి స్థాన్ నిర్వహణను, 1928 లో తన శిష్యురాలిగా అంగీకరించిన సతి గోదావరి మాతాజీకి అప్పగించి, రాబోయే అర్ధశతాబ్దానికి సరిపడా నాయకత్వాన్ని కుమారి స్థాన్‌కు ప్రసాదించి, తన దీర్ఘ దృష్టిని ప్రదర్శించాడు బాబా.

రెండో ముఖ్య కారణం - సతి గోదావరి మాతాజీకి కన్యాకుమారి స్థాన్ బాధ్యత నప్పగించడానికి సరిగా ఏడు సంవత్సరాలు ముందు (1921 డిశంబరు 25) తనను తాను చెక్కబోనులో బంధించుకొన్న ఆయనతో పాటు గుహలో కొన్ని దేవతా విగ్రహాలు మాత్రం వెంట తీసికొని వెళ్ళారు. అలా తనను తాను బంధించుకొన్న చెక్క గుహను ఎవరు ఆరాధిస్తారో వారికి సమస్త విమోచన సాధ్యమని ఆయన ప్రకటించాడు. ఈ విధంగా తన భక్తుల కోసం తనను తాను బంధించుకొనడం ఉపాసని బాబా జీవితంలో ఒక అపూర్వ సంఘటనగా భావించవచ్చు.

ఈ చెక్క గుహను వదలి అపుడపుడు బాబా దేశాటనం చేస్తూ తన భక్తులను దీవించి, ఉపదేశించి, స్థిరపరచి, విశ్వాసాన్ని నూతనీకరించి వస్తూ వుండడం బాబాకు అలవాటు. అంతేగాక, ఆయన అనుచరులర్పించిన కానుకలతో పూజా మందిరాలను, భజన కేంద్రాలను నిర్మించడం, ఆ నిర్మాణ కార్యక్రమాన్ని పర్యవేక్షించడం, బాబా కొనసాగించే మరో తప్పనిసరి కార్యక్రమం, 1941 లో హైదరాబాదును దర్శించినపుడు, రాజా నర్సింగరాజుగారికి ముఖ్య అతిథిగా మకాం

చేశాడు. తిరుగు ప్రయాణంలో 'సతానా' అనే తన గ్రామంలో విడిది చేసి, పన్రెండు జ్యోతిర్లింగాలను, ఆ గ్రామంలో మునుపు తానున్న ఇంటి స్థలంలో నిర్మించబడిన దేవాలయంలో స్థాపించాడు బాబా. డిశంబరు 23 వ తేదీ అలసి సొలసి 'సకూరి' చేరిన బాబా ఆ తరువాత రోజే (డిశంబరు 24, 1941) తన తనువును శాశ్వతంగా చాలించాడు. ఆ తరువాత సమాధి నిర్మాణం, సమాధి ముందు బాబా పాదుకల ముద్ర ప్రతిష్ఠించడం జరిగింది

ఇంతగా ఆయన జనాన్ని ఆకర్షించడానికి కొన్ని ప్రత్యేక కారణాలున్నవి:-

1. తాను సాధించిన స్వయంసిద్ధస్థితి. ఆ స్థితిని గూర్చిన ఉపాసని బాబా ఎరుక. ఉపాసని వాక్ సుధలో తనను గూర్చి తాను వాకృచ్చిన అనేక అంశాలు ఆయన భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా పనిచేశాయి.[5]
2. శ్రమ, బాధల యొక్క స్వాభావిక లక్షణాలను బాబా గ్రహించి వానిని తన స్వీయ జీవితంలో అనుభవించిన విధంకూడ జనాకర్షణకు తోడ్పడింది. భారత దేశంలో శ్రమ, బాధ తెలియని లక్షణాలు కావు. అశేష జనవాహిని, తమ దినభృతి కోసం, నివాసంకోసం కాయకష్టం చేసి జీవించే అవకాశం కోసం కుమిలి మానసికంగా కృశించి పోవడం దైనందిన చర్య. అట్టి శ్రమైక జీవులకు ఉపాసని బాబా శ్రమైక జీవనం ఒక ఆకర్షణ కావడం ఆశ్చర్యపడవలసిన విషయం కాదు.
3. శారీరకంగా తటస్థించే ఇట్టి శ్రమలనే ఆయన 'తపసు' గా అభివర్ణించాడు. వారు కోరుకొనకుండనే, వారిపైబడిన బాధాభారాన్ని సహించడం ద్వారా తమకు తెలియకుండనే తమలో రూపొందే సహన శీలం దైవలక్షణమని, అట్టి స్థితిని చేరడం, పూర్ణసిద్ధ స్థితిలో భాగమనే ఉపాసని బాబా ఉద్బోధ మరింతగా శ్రమజీవుల నాకర్షించింది.
4 ఆధ్యాత్మిక ప్రగతికి శారీరక శ్రమ మొదటి మెట్టు అనే నమ్మిక భారతీయులకు క్రొత్తఅంశంకాదు. కాని అట్టి శ్రమకోసం కందమూలాదులను భక్షిస్తూ

5. See Upasani Baba, *Upasani Vak Sudha*, Sakuri : R.G. Vakil, 1934, III: 1.6. and Also see S.N. Tipnis, *op.cit.* p. 87.

కాననాలుపట్టుకొని వెళ్ళనక్కరలేదు. మీరుపొందే ఆ శ్రమ ద్వారానే ఈ ఆధ్యాత్మిక ప్రగతిని సాధించవచ్చుననే బోధ ఆకర్షణీయమే గాదు, భారతీయులకు సరిక్రొత్తది కూడ. ఈ సరిక్రొత్త బోధ ద్వారా ఇంటిని అంటి పెట్టుకొని మామూలు జీవితం జీవిస్తూ గూడ ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని సాధించవచ్చుననే బాబా యొక్క ఉద్బోధ సామాన్యులకు వచ్చింది.

5. గురువుపై ఆధారపడి, సత్క్రియలుసాధించుటద్వారా, భవిష్యత్ జీవితంలో సుఖ జీవనం కొనసాగించవచ్చు లేదా, పరమాత్మలో లీనం కావచ్చుననే ఆయన ఉపదేశం మరో కారణం. అసంఖ్యాకంగా యజ్ఞ యాగాదులు చేయడమే సత్కార్యాచరణ అని ఉపాసని బాబా విశ్వసించినట్లు తెలుస్తున్నది. ఎవరైనా ఉపవాస దీక్షను కొనసాగిస్తూ, మతానుష్ఠాన కర్మకాండను ఆచరిస్తూ వుంటే, వారికి రక్షణ లేదా విమోచన తప్పక లభిస్తుందని ఆయన ప్రచారం[6].

6. హిందూ పర్వదినాలన్ని వరుస తప్పక సంప్రదాయ సిద్ధంగా ఆయన ఆధ్వర్యంలో నిర్వహింపబడడం మరో కారణం ఆ విధంగా సంప్రదాయక భారతీయుల నాకర్షించడానికి ఆయనకు సాధ్యమైంది.

7. ఆశ్రమవాసులకు ఇరవైనాలుగు గంటల కవసరమైన సాధన, అభ్యాసాలు కూర్చబడి వున్నందువల్ల దైనందిన వ్యాపారలంపటంలో ప్రవేశింపనొల్లని వారికి ఆశ్రమ జీవితం ప్రధాన ఆకర్షణైంది.

8. విశేషించి ఉపాసనిబాబా బోధలు పండిత పామరులకు శ్రవణోపేయంగానే గాక, విషయ విశదీకరణ, ఆధ్యాత్మిక సందేశభరితమై అనేకుల ను తేజ పరచ గలిగినవి.

## ఉపాసనిబాబా బోధల సంగ్రహం :

ఆయన జనాన్ని ఆకర్షించడానికి పై కారణాలు ఎంతగా ఉపకరించాయో, ఆయన బోధలు కూడ అంతకంటె అధికంగా సహకరించాయి అని పాఠకులు గమనించాలి. స్థూలంగా ఆయన బోధల సారాంశాన్ని మూడు ముఖ్య అంశాలుగా విభజించి పరిశీలించవచ్చు.

6. S N. Tipnis *op.cit.* p. 102.

1. ప్రకృతికి దేవునికి గల సంబంధ బాంధవ్యాల గూర్చి బాబా వివరించాడు 'ప్రకృతి మరియు ఆదిపురుష ఇద్దరు కూడ నిత్యజీవులు. వీరిద్దరి సహకారంవల్ల విశ్వసృష్టి జరిగింది. అందున్న సమస్తం రూపొందాయి. ఈ రెండు శక్తుల సారాంశం కూడ ఒకటె పురుషకు సుఖభోగానురక్తి కలిగినపుడు తనకై తానే ప్రకృతిగా పరిణామం చెంది, ప్రకృతిని అనుభవిస్తాడు. అంతిమ సత్యమైన బ్రహ్మ పురుష, ప్రకృతి రెంటికి ఆధారభూతుడు'.

ఈ అంతిమ సత్యమైన బ్రహ్మను 'సత్', 'చిత్', 'ఆనంద్' సంపూర్ణంగా అభివర్ణించే గుణాలు కావని, ఆ శక్తి వాటికి లేదని ఆయన అభిప్రాయం. ఈ సత్, చిత్, ఆనంద్ అనేవి ఆయా వ్యక్తులు బ్రహ్మయొక్క పౌర లౌకిక స్వభావాన్ని గ్రహించడానికి ఏర్పరచుకొన్న సాధనాలేనని, అందువల్ల బ్రహ్మ సత్, చిత్, ఆనంద్‌కు అతీతుడైన గుణాంచితుడని బాబాజీ బోధ. అంతేకాదు. ఆ బ్రహ్మ సత్వ రజ స్తమోగుణాతీతుడు కూడ కాగా, 'మాయ' శూన్యస్థితికి సూచన అని బాబాజీ ఉద్బోధ

2. మానవుడు జన్మతః పాప స్వభావి కాడు. ఆతడు దైవాంశ సంభూతుడు. ఏ మనుష్యుడైనా ఆతడు కేవలం శరీరధారి మాత్రమే కాదు. 'ఊహాతీత సత్యం' అనగా తానేనని గ్రహించగలగడమే జ్ఞానం జీవాత్మకు పరమాత్మకు సంబంధం ఏకత్వమేగాని, భిన్నత్వం గాదని చెప్తూ అట్టి సర్వోత్కృష్ట పరమాత్మలో లీనంకాగోరడమే జీవాత్మయొక్క పరమావధి అని ఆయన ప్రకటించాడు. మానవతకు సంబంధించిన స్త్రీత్వ లక్షణాన్ని ఉపాసని బాబా ప్రోత్సాహపరచాడు. పుంస్తత్వం కంటే స్త్రీత్వం శ్రేష్టమైందేగాక ఉన్నతమైందని బాబా ముఖ్యోద్దేశం. ఎందుకంటే, సాత్వికులు, సద్ధర్మచారిణులైన స్త్రీలు ప్రారబ్ద కర్మాతీతులై దైవసిద్ధ స్థితిని పొందడానికి సన్నిహితులై ఉంటారని ఆయన విశ్వాసం, ప్రబోధం కూడ. అందువల్ల ఏ పురుషుడైనా అట్టి స్త్రీత్వ దశను చేరనిదే దైవసిద్ధ స్థితి అసాధ్యమనేది ఆయన నినాదం. ఇట్టి స్త్రీత్వాన్ని పొందడం అంటే అట్టి గుణ సమన్వితులు కావడమేనని ఆయన ఉద్దేశం. చైతన్యుడు, రామకృష్ణ పరమహంస అభ్యసించిన భాగవతం ప్రబోధించే మధురభక్తికి ఈ ధోరణి సన్నిహితంగా వుందనే విషయం వేరుగా చెప్పనక్కరలేదు.

3. తనలో వున్న దైవాంశను గుర్తించలేకపోవడమే పాపం. అట్టి శక్తి హీనతకు కారణం అవిద్య. జీవాత్మకు పరమాత్మకు ఏకత్వమేగాని, భిన్నత్వం లేదు. అవి రెండు ఒక్కటే. అయితే జీవాత్మ మానవుడు తనకంటే ముందు కనిపించే లోకేచ్ఛల మాయకు లొంగి తనలోనే వున్న పరమాత్మను గుర్తించలేకపోతున్నందువల్ల పాపస్థితి ఏర్పడుతున్నది. ఆతని ముఖ్యస్వభావం సత్ చిత్ ఆనంద్ ఆ స్థితిని గుర్తించలేకపోవడమే పాపస్థితికి మూలకారణం. అందువల్ల అట్టి స్థితినుండి విముక్తి పొందడమే రక్షణ.

ఉపాసని బాబా తాను గురువు గాని, శిష్యుడు గాని కాదని ప్రకటించు కొన్నాడు. అందువల్ల భక్తజనుల సంఖ్యను పెంచడం తన కోరిక కాదని, నా వలే మిమ్మల్ని సన్మార్గ గాముల్ని చేయ ప్రయత్నించే నిజాయితీ గల గురువులు మీకు నూటికి కోటికి ఒకరైనా దొరకరని ఆయన ధైర్యంగా చాటినాడు. 'సన్మార్గ గాములైన ప్రజల బాధ్యతలను నేను మోస్తున్నాను. వారు పొందే శ్రమానుభవాలను నేను పొందుతున్నాను. అందువల్ల వారికి విమోచన సంప్రాప్తిస్తున్నద'ని బాబా ప్రబోధించాడు, తాను ప్రస్తుతమున్న గుహ మానవుడు అనుభవించే అన్ని రకాలైన బంధకాలకు సూచనగా వున్నదని, 'నా గుహ జీవితాన్ని జ్ఞాపకం చేసికొని, గుహను ఆరాధించే వారికి బంధ విమోచన ప్రాప్తిస్తుం'దనే ఉపాసనిబాబా బోధలు అశేష జనం శ్రద్ధాభక్తులతో ఆలకించడమే గాక, ఆ విధంగా నడుచుకొన్నారు.

ఉపాసని బాబా జీవిత విధానం, ఆయన బోధలు మధ్య సమన్వయంకన్న అనన్వయమే అధికంగా కనిపిస్తున్నది. ఆయన చెప్పేవి ఆధ్యాత్మిక బోధలే అయినప్పటికి, అట్టి ఆధ్యాత్మికోపదేశాలను వ్యక్తం చేయడానికి వాడిన భాష, అభినయం కొన్ని కొన్ని సందర్భాలంలో అపహాస్యంగా, అసహ్యంగా వుండడం అనేకమార్లు శ్రోతలకు విస్మయాన్ని కలిగించింది. ఉపదేశిస్తూనే చిన్నచిన్న రాళ్ళను ప్రేక్షకులపై విసరడం ఆయనకు అలవాటు. అలా విసిరిన ఒక రాయి మెహర్బాబాకు తగిలిన సంఘటనను మనం తరువాత పరిశీలిస్తాం. ఆయన

అనేకానేకోపన్యాసాలు కావించాడు. అయినా పదాడంబర ప్రయత్నం లేదు ఎంత సులభశైలిలో ప్రసంగిస్తే ప్రజలు అర్థంచేసికోగలరో అంత సులభశైలిలో ఆయన ప్రసంగాలు కొనసాగాయి. 'వర్షం అన్ని ప్రదేశాల్లోను కురుస్తుంది. కొండపైబడ్డ వర్షపునీరు జారి క్రిందికిపోగా, గుంటలో పడిన నీరు నిలుస్తుంది. అలాగే గురు మహారాజులు భక్తులందరిని సమానంగా తేరిచూస్తారు. అయితే, మేము గొప్ప వారమనుకొనే వారిమీదనుండి ఆ కృపాదృష్టులు జారిపోయి క్రింద ఎక్కడో వున్న వినయగుణ సంపన్నుల తృప్తిపరుస్తవి.'[7] వంటి సూక్తులు ఆయన బోధల్లో కోకొల్లలుగా వెలువడినై.

స్వాతంత్ర్య సమరంలో ఆయన పాల్గొనకపోయినా, మాతృభూమి శృంఖలాలను ఛేదించి, స్వాతంత్ర్యాన్ని సముపార్జించడంలో ప్రతి భారతీయుడు కృషి చేయాలని ప్రబోధించిన స్వేచ్ఛా ప్రియుడు బాబా. అయితే ఆధ్యాత్మిక పునరుజ్జీవనం లేని దేశ స్వాతంత్ర్యం వలన ప్రయోజనం లేదని ఆయన ప్రకటించాడు.[8] అంతవరకే గాని, వితంతు వివాహం, అస్పృశ్యతా నివారణ మొదలైన ప్రాముఖ్య సాంఘిక సంస్కరణలకు సంబంధించి ఆయన వ్యతిరేకంగానే నిలిచి పోయాడు.[9] ఇది శోచనీయమైన విషయం. ఎంతగా ఆయన ఆధ్యాత్మిక ప్రగతికి కృషి చేశాడో అంతగా సాంఘిక సంస్కరణలు అవలకు నెట్టినాడు. సాంఘికంగా అణగద్రొక్కబడిన వ్యక్తి సమాజంలో మృత తుల్యుడు. ఆ స్థితినుండి అతనిని ఉద్ధరించకపోతే ఆధ్యాత్మిక ప్రగతి అధ్యాన్నమే అనే సత్యాన్ని నిష్ఠాగరిష్ఠుడైన ఉపాసని బాబా గ్రహించక పోవడం, గ్రహించినా మానవ జీవితంలో సాంఘిక రంగానికి తన సేవలను విస్తృతం చేయకపోవడం శోచనీయం.

---

7. *Upasani Baba Vak Sudha*, L. XX. 889.
8. **Madhav Nath** *op.cit.* p. 132. also see **S. N. Tipnis,** *op.cit.* 282.
9. **S.N. Tipnis**, *op.cit.* p. 231.

## 3. మెహర్‌బాబా (1894-1969)[1] ప్రేమోపదేశి :

మెహర్‌బాబాని గాని, ఆయన పటాన్నిగాని చూచినవారికి ఆయనొక యోగి పుంగవునిగ, ఆధ్యాత్మికాభ్యున్నతికి కృషి చేస్తున్న సారథిగా కనిపించకపోవడంలో ఆశ్చర్యం లేదు. తలనీలాలు మామూలు యోగులకు వలె జడలు గట్టలేదు. పెరిగిన గడ్డంలేదు కాని, గుబురు మీసాలున్నాయి. ఆయన నేత్రాలు మర్మయోగి నేత్రాల వలె తీక్షణంగా కాని, అర్ధనిమీలితంగా కాని కనిపించకపోగా, మిణుకు మిణుకుమంటూ చూపరుల నాకర్షిస్తాయి. ముఖంలో కరుణరస వాత్సల్యం తొణికిసలాడుతుంది. అందుకేనేమో ఆయన అనుచరులు ఆయన్ని అమితంగా ప్రేమిస్తారు. అనేక మంది స్వామీజీలు, గురు మహారాజులు, బాబాలు తామే భగవంతుని అపరావతారాలమని ప్రకటించుకోగా, మెహర్‌బాబా ఈ యుగ అవతార పురుషునిగ ప్రకటించుకొని, తన అవతారంపై కాలప్రధానమైన అంశలను తానే విధించుకొన్నాడు. 'శరీర రక్తాలలో కనిపిస్తున్న నేనే సనాతన పురుషుడను, ఎల్లప్పుడు ఆరాధింపబడినవాడను, నిరాకరింపబడినవాడను, నిత్యం స్మరింపబడినవాడను, మరువబడినవాడను. నేనే నిత్యజీవిని, నా గతం ఆరాధింపబడింది, స్మరింపబడింది, నా వర్తమానస్థితి నిరాకరింపబడింది, మరువబడింది, నా భవిష్యత్తు అధికంగా పరీక్షింపబడుతుం'దని తనను గూర్చి ప్రకటించుకొన్నాడు.[2] తనకై తానే తానొక దైవ మానవుడనని ప్రకటించుకొన్నట్లు పూర్డమ్ వ్రాస్తున్నాడు.[3] దైవ మానవుడు దైవసిద్ధి మధ్య గల తారతమ్యాన్ని చర్చిస్తున్నప్పుడు పై భావం వ్యక్తం చేయబడింది. తరచు మెహర్‌బాబా తన స్థితిని, కార్యక్రమాన్ని వర్ణిస్తూ, ఆరోపించు

1. See Warren C. Healy, *Who is Mehar Baba*, Ahmadnagar : Mehar Publications 1967. b. W. Le. Page, *Avatar Mehar Baba*, Rose Bay: NSW, MGA Publications n d. c Mehar Baba, *The Highest of High*, Seattle: W. C. Healy Press 1954 and d. Charles B. Purdom, *The God-man*, London: George Allen and Unwin, 1964.
2. Warren C. Healy *op.cit.* p. 2.
3. Charles C. Purdon, *op.cit.* p. 398.

కొన్న బిరుదు ఉన్నతుల్లో అత్యున్నతుడు (The highest of the high) 'నేను మహాత్ముడనుగాని, మహాపురుషుడనుగాని, సాధువునుగాని, పరిశుద్ధుడనుగాని, యోగినికాని కాదు. నేను ఉన్నతుల్లో అత్యున్నతుడను, నా చిత్తమే న్యాయం, నా కోరికే న్యాయాన్ని, చట్టాన్ని పరిపాలిస్తుంది. నా ప్రేమే విశ్వానికి జీవాధారం' అని ఆయన విశ్వసించాడు.[4]

మెహర్ బాబాకు తల్లిదండ్రులు పెట్టిన పేరు మేర్వాన్ షెహరియార్జీ ఇరాని. 1894 ఫిబ్రవరి 25వ తేదీ పూనాలో జననం. శ్రీంబానూ, షెహరియార్జీ ముండెగర్ ఇరాని జననీ జనకులు. వీరు పార్శీ సమాజానికి చెందినవారు. బాల్య దశ ఒడిదుడుకులు లేకుండానే గడిచింది. 1911 లో పూనాలోని దక్కన్ కళాశాలలో ప్రవేశించిన మీదటే ఆయనలో నిద్రాణంగా వున్న క్రియాత్మక లక్షణాలను, జీవిత ధ్యేయాన్ని గ్రహించగలిగాడు మెహర్ బాబా. 1913 లో కళాశాలనుండి ఇంటికి తిరిగి వెళ్తున్నపుడు మహమ్మదీయ భక్తురాలు హజ్రత్ బాబజాన్ మౌన ముద్రాంకితయై అచేతనంగా కూర్చుండడాన్ని గమనించి, మేర్వాన్ ఆమెను సమీపించినపుడు, ఆమె ఆయన్ని చేర రమ్మని కనుసైగ చేసి, వచ్చిన మీదట లేచి నొసటను ముద్దాడడంతోనే తనలో ఏదో ఒక అపూర్వ శక్తి ప్రభావం సోకినట్లు అనుభూతిని పొందాడట మేర్వాన్. అప్పటినుండి ప్రపంచ స్పర్శ లేకుండ దాదాపు తొమ్మిది నెలలు నిరుత్తరుడై గడిపాడు. 1914 లో స్పృహ, పరిసరాలకు స్పందించడం జరిగింది. ఆ తరువాత తల్లిదండ్రులు ఆయా బాబాల సన్నిధికి తీసికొని వెళ్ళారు. ముందు సద్గురు నారాయణ మహరాజ్, ఆ తరువాత తాజుద్దీన్ బాబా, చివరిసారిగా షిర్డీ సాయిబాబా దగ్గరకు తీసికొని వెళ్లారు. సాయిబాబా ఆయన్ని చూచి 'సర్వశక్తి మయుడైన ఆధార భూతుడ'ని కొనియాడి ఖండోబ శిథిలాలయంలో, దిగంబరిగా ఉపవాసాలుంటున్న ఉపాసని బాబా దర్శనార్థం వెళ్ళవలసిందిగా ఆదేశించాడు. ఉపాసని బాబా మేర్వాన్‌ను చూచి చూడకముందే విసరిన రాయి సూటిగా హజ్రత్ బాబజాన్ ఎక్కడ ముద్దు పెట్టుకొన్నదో సరిగా అదే స్థలంలో తగిలింది. ఆయనలో నిద్రాణంగా వున్న చైతన్య శక్తిని 'మేల్కొల్పుటకే ఈ రాతి దెబ్బ' అని తరువాత సూచించాడు మేర్వాన్. ఉపాసని బాబాను మేర్వాన్ వెంబడించి సకూరి ఆశ్రమంలో బహుకాలం మకాం చేసి ఆధ్యాత్మిక అభ్యాసాలను అలవర్చుకొన్నాడు.

4. Warren C. Healy, *op.cit.* p. 3.

మెహర్ బాబా - దయామయుడైన తండ్రి - అనే పేరు ఆయన శిష్య వర్గం ఆయన గుణ లక్షణాలనుబట్టి పెట్టిన పేరు. అప్పటికి జన వినికిడిలో వున్న పంచ గురు మహారాజుల ఆధ్యాత్మిక శక్తి ప్రభావం చేతనే దైవావతారం భూమిమీద వెలయవలసి వున్నదని మెహర్ బాబా ప్రకటించాడు.

> "క్రితంలోను ప్రస్తుతం నేనేమై వున్నానో, భవిష్యత్తులో ఏమి కానై వున్నానో అది పంచ గురు మహారాజుల ఆధ్యాత్మిక శక్తి వలననే సాధ్యం. వారు తమ శక్తి చేత దైవావతారం భూమిమీద వెలయడానికి తోడ్పడతారు. సాయిబాబా, ఉపాసని మహారాజ, బాబజాన్, తాజుద్దీన్, నారాయణ మహరాజ్ - వీరే పంచ గురు మహరాజులు. వీరిలో కూడ ఉపాసని మహారాజ్, బాబజన్ ఇద్దరే ముఖ్య సూత్రధారులు. ఒక సెకెండులో పది లక్షల వంతు సమయంలో నా పూర్వ స్థితిని గ్రహించ గలుగునట్లు బాబజన్, నేను దైవ అవతారాన్నని గుర్తించ గలుగునట్లు ఉపాసని బాబా సహాయపడినారు. ప్రస్తుతం నేనేం చేయాలో సాయిబాబా సూచించారు."

అని ఆ తరువాత ఆయన తెలియచెప్పాడు.[5]

1921 వ సంవత్సరాంతంలో మెహర్ బాబా సకూర్‌ను వదిలి పూనాకు చేరాడు. అప్పటికే తనకు నివాసంగా ఒక చిన్న గుడిసె ఏర్పాటైంది. శిష్యవర్గం క్రమక్రమంగా చేరడం ప్రారంభమైంది. తన శిష్య వర్గాన్ని ఆధ్యాత్మిక సాధనలో ప్రవేశపెట్టిన మీదట అహమ్మద్ నగర్ సమీపంలో ఒక చిన్న ప్రవాస స్థలాన్ని ఏర్పాటు చేసికొన్నాడు మెహర్ బాబా. ఇక బాలుర కొక పాఠశాల, ఒక వైద్య శాల, చికిత్సా కేంద్రం కూడ వెలిశాయి. 1925 లో తన దృష్టిని క్రియాన్ముఖం చేయడానికి నాందిగ మౌనవ్రతాన్ని ప్రారంభించాడు. ఆయన శిష్యులు ఈ మౌనం ఆయన మరణం వరకు కొనసాగిందని విశ్వసిస్తారు. ఆయన ఉపదేశాలను అక్షర మాల నుపయోగించి, నల్లబల్లపై చెప్పి వ్రాయించేవాడు. ఈ పద్ధతిని 1954 లో విడిచిపెట్టడం జరిగింది. ఆ తరువాత ఆయన చేసే చే సంజ్ఞలను శిష్యవర్గం మాటల్లో వ్యాఖ్యానించి మిగిలినవారికి తెలియచేశారు.

5. *ibid*. p. 5.

భారతదేశంలోను, విదేశాలలోను తీవ్ర ప్రయాణాలు కావించాడు మెహర్ బాబా. అమెరికాలో, అనేక నగరాల్లో ముఖ్యంగా న్యూయార్క్, ఫ్లారిడా, వర్జీనియా, వాషింగ్టన్ డి. సి. మొదలైన రాష్ట్రాలలో మెహర్ బాబా కేంద్రాలు స్థాపింప బడ్డాయి. బాబా జీవితాన్ని పూర్డమ్ పది దశలుగా వివరించాడు.[6]

1. సిద్ధపాటు—1894-1922
2. మొదటి పది సంవత్సరాలు — 1922-1931
3. ప్రపంచ యాత్ర — 1931-1939
4. భారతీయ యాత్రలు — 1939-1949
5. నూతన జీవితం — 1949-1952
6. స్వేచ్ఛా జీవనం — 1952-1953
7. ఉన్నతుల్లో అత్యున్నతుడు — 1953-1954
8. అంతిమ ప్రకటన — 1954-1957
9. సహవాస్ — 1958
10. సార్వత్రిక లేక విశ్వసందేశం — 1958-1962

మానసికంగా నిలకడలేనట్లు కనిపించే అనేకమంది భారతీయులను మెహర్ బాబా గమనించి వారు మానసిక వ్యాధిగ్రస్తులు కారని, దైవ ప్రమత్తుల-నిత్యం దేవుణ్ణి గూర్చి ఆలోచిస్తున్నందువల్ల ఏర్పడిన మత్తు వల్ల అలా ప్రవర్తిస్తున్నారని నమ్మి, ప్రకటించి, వారిని గూర్చి ప్రత్యేక శ్రద్ధ తీసుకోడానికి కృషి చేశాడు. వారు పిచ్చివారు కాని, ఉన్మాదులు కాని కాదు. కాని వారు దైవోన్మత్తులు, కాదంటే దైవోన్మత్తత వల్ల ఏర్పడిన మతోన్మాదులు, వారు దేవుని ప్రేమకోసం ఎదురు చూస్తున్నారని బాబా ప్రకటించాడు.[7] వారిలో ఉన్న తీవ్ర దైవోన్మత్తత వారిని లోకానురాగ విషయాలను విసర్జించి, లోకం గ్రహింపనేరని జీవితం కోసం పురి కొల్పుతుందని బాబా ప్రకటించాడు. వారి తన్మయత్వంలో దైవ ప్రేమ వారిని లోగొన్నదని, అట్టి వారిని చేరదీసి ఆదరించి, బలపరచవలెనని ఆయన 1939-49 దశాబ్దంలో భారత దేశాటనాన్ని కావించాడు. ముందుగా నల్గురు లేక అయిదుగురు

6. Charles B. Purdom, op cit. p. 9.
7. *ibid*. p. 137.

గల మండలాలను శిష్యుల్లో ఏర్పరచి, వారు వెళ్ళి అట్టి దైవోన్మత్తుల సమకూర్చితే, బాబా వారికి దర్శించి సలహా లిస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించేవాడు. మహా రాష్ట్రంలో ఏర్పాటైన మెహర్‌బాబాలో పేరికొక ఆశ్రమం కూడ నిర్మింపబడింది. అయితే ఆయన తీవ్ర మౌనవ్రతాన్ని పాటించాలని నిర్ణయం తీసికొనడంతో ఈ ప్రయత్నం కొంతవరకు వెనుకపడింది.

ఆయన శిష్యవర్గం అపుడపుడు ఆయనచేసే వింత కార్యాలను గ్రహించలేక తికమక పడేవారు. నూతన జీవితోద్యమాన్ని ఆయన ప్రారంభించి నపుడిదే జరిగింది. తన శిష్యవర్గం లేదా అనుచరవర్గం జీవితాలలో తీవ్ర మార్పు జరగ బోతున్నదని ప్రకటించాడు మెహర్ బాబా. ఆ తరువాత 1949 ఫిబ్రవరి 15 వ తేదీ అబూ పర్వత శిఖరాన్ని అధిరోహించి, ఆగస్టు 14 వ తేదీవరకు అక్కడే ఉండిపోయాడు తిరిగి వచ్చి మెహర్‌బాద్‌లో ఉన్న ఆస్తులమ్మి, మండలిని రద్దు చేయాలని నిశ్చయించాడు. ఆ నిర్ణయ ప్రకారం ఆస్తుల అమ్మకం, మండలాల రద్దు జరిగింది. ఆస్తుల నమ్మగా వచ్చిన రాబడిన "దైవోన్మత్తుల" సంక్షేమం కోసం కేటాయించడమైంది. ఆయన శిష్యుల సంఖ్య క్రమంగా క్షీణిస్తూ, అక్టోబరు పదహారవ తేదీకి కేవలం ఇరవైనాలుగు మంది (20 పురుషులు, 4 స్త్రీలు) మిగిలిపోయారు. శిష్యవర్గం కాలినడకను, బాబా రైలులో బెల్గాంనుండి బయలుదేరారు. వారి గమ్యం వారణాసి. అక్కడ శిష్యవర్గం జంటలుగా వెళ్ళి బిక్షాటనం చేసి, ఆహారాన్ని సంపాదించాలి వ్యాపారులను కాని, కార్యాలయోద్యోగులనుగాని యాచించక, కేవలం గృహస్తంగా వున్నవారిని మాత్రమే అడిగి పొందాలి. నూతన జీవనోద్యమ సాంవత్సరీకోత్సవం నాడు బాబా తన శిష్యవర్గాన్ని చేరబిలిచి తమ నిర్ణయాన్ని పునర్విమర్శించుకోవలసిందిగా కోరాడు. నూతన జీవనంలో ప్రథమ దశ గడిచిందని రెండో దశ క్లిష్టమైన సేవకదశ గాన ఆ దశలో ప్రవేశింపకముందు ఎవరికైవారే తమను పరీక్షించు కొనుటవసరమని ఈ దిగువ ప్రకటన కావించాడు.

> "నా సరికొత్త జీవితం నన్నొక సాత్వికమైన దైవసేవకునిగ ప్రోత్సహిస్తు న్నది. నేను నా దేవుని, ఆయన ప్రజలను సేవింపవలసి వున్నది.... నన్ను మీరెలా గ్రహించినా ఫరవాలేదు. కాని నన్నెవరు దీవెనలను, స్వస్థతను కోరరాదు. వానిని అడుగరాదు. మీరేగాక దూరతీరాల్లో వున్న నా అను

చరులెవరైనా అట్టి సేవా జీవితాన్ని అనుసరించి, ఆచరించ ప్రయత్నించితే నాకెట్టి అభ్యంతరం లేదు వారలా స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా ఆ సేవను కొనసాగించవచ్చు."[8]

1951 అక్టోబరు 16 వ తేదీ నూతన జీవితంలోని రెండవ దశ ప్రారంభ మైంది. ఈ దశను శూన్యదశ- తననుతాను రిక్తుని చేసికొనే దశగా- మెహర్‌బాబా పేర్కొన్నారు. ఇదే మనోవినాశన స్థితి. తన కత్యంత విశ్వాసపాత్రులైన నల్గురు శిష్యులతో- వారిని సేవకులని కూడ పిలుస్తారు. అక్టోబరు 16 వ తేదీ నుండి 1952 ఫిబ్రవరి మధ్య తేదీల వరకు ఏకాంతవాసానికి వెళ్ళిపోయాడు బాబా. ఆయన అనుచరులకు ఈ శూన్యస్థితి లేదా మనో వినాశన స్థితి అత్యంత ప్రధానమైంది. ఈ దశలో ఆయన తనకున్న ఉన్నతమైన అధిక స్థితులన్నిటిని స్వచ్ఛందంగా- తాత్కాలికంగానే- విడిచిపెట్టి, సామాన్యునిగా- వాస్తవిక సత్యాన్వేషిగా రూపొందాడు. సాధారణంగా మనసును భ్రమింపచేసే లోకం యొక్క పోకడలన్ని ఈ మనోవినాశన స్థితిలో నిర్మూలనమైనందువల్ల మనసు దైవిక పవిత్రీకరణను సాధించిందని ఆయన ప్రగాఢంగా విశ్వసించాడు.

1952-53 కాలంలో ఇటు భారతదేశంలో, అటు విదేశాలలోను, మెహర్ బాబా విస్తృతంగా ప్రయాణాలు కొనసాగించాడు అమెరికాలో దక్షిణ కరోలీనా రాష్ట్రంలో వున్న మిర్టిల్ బీచ్‌లో ఆయన దర్శన జ్ఞాపకార్థంగా ఒక కేంద్రం స్థాపింపబడింది. ఈ సమయంలోనే కారు ప్రమాదానికి లోనైన మూలంగా శాశ్వతంగా ఆయన కుంటివాడు కావలసివచ్చింది.[9] జొరదుష్ట్ర మతవ్యవస్థాపకుడైన జొరాస్టర్ పుట్టినదినంగా పరిగణన పొంది ఆచరింపబడుతున్న సెప్టెంబరు ఏడవ తేదీ (1953) ఒక ప్రాముఖ్యమైన ప్రకటన కావించాడు మెహర్‌బాబా. అది సుదీర్ఘమైన దైనప్పటికి ముఖ్య సారాంశాన్నిందు పొందుపర్చడమైంది.

> ........మనుష్యుడు దేవుడుగామారి,సద్గురువుగా గుర్తింపబడతాడు. దేవుడు మానవునిగా ప్రత్యక్షమై తన దైవాత్వాన్ని బయలు పరచినపుడు

8. *ibid.* p. 189.

9. *ibid.* p 207.

అవతారంగా గుర్తింపబడతాడు. ఆ విధంగా దేవుడు మానవుడుగా మన గలుగుతున్నాడు. దేవు డెల్లపుడు ఏకరీతిగ, అపరిణామశీలిగా వున్నందు వల్ల, ఆయన అవతారం కూడ అలానే ఏకరీతిగా, అపరిణామశీలిగా వుంటుంది. .... ...ప్రపంచంలో అసంఖ్యాకంగా సాధువులు,మహాత్ములు, మహాపురుషు లుదయించారు. నేను మహాత్ముడను కాని, మహాపురుషుడను కాని, సాధువును, పరిశుద్ధుడను కాని, యోగినికాని కాదు. అయితే, మరి నేనెవరిననే ప్రశ్న జనిస్తుంది నేను సర్వసాధారణ మానవుడినైనా కావాలి లేదా ఉన్నతుల్లో అత్యున్నతుడనైనా కావాలి. ........మీ బాబాను మీరు నిజంగా ఉన్నతుల్లో అత్యున్నతుడని విశ్వసిస్తే మీ జీవితాలను ఆయన పాదాంకితం చేయండి. ఆయన ప్రేమమాత్రమే మిమ్మును మీ అశాశ్వతం, అంధకారమయమైన ప్రస్తుత జీవిత సంకటాలనుండి క్షేమంగా కడతేర్చ గలదు.[10]

అంతేగాక, ప్రతి మతం ఆయనకు చెందినదని, తానే సనాతన వర్తమాన భవిష్యన్మూర్తియని, ప్రేమ దేవుడు గనుక మతమంటే ప్రేమయే అని ప్రకటించాడు మెహర్‌బాబా

ఆయన తన అనుచరవర్గాన్ని శిష్యులనికాని, భక్తులనిగాని గాక, "బాబా ప్రేమికులు" అని సంబోధించేవాడు. 1954 జూన్‌లో తన 'ప్రేమికుల' కందరికి ఇచ్చిపుచ్చుకొనే విధానంలో ఏర్పాటైన సహవాస్‌నకు హాజరు కావలసిందిగా ఆహ్వానం పంపించాడు బాబా. ప్రధానంగా ఈ సహవాస్ ఆహ్వానం భారతీయ, పాకిస్తాన్ బాబా ప్రేమికులకి పరిమితమైనప్పటికీ పాశ్చాత్యదేశ పురుషులకు కూడ విస్తృతం చేయడం జరిగింది దాదాపు లక్షమంది హాజరై ఆయన దర్శన భాగ్యాన్ని పొందారని, ఉపదేశామృతాన్ని ఆస్వాదించారని ఒకఅంచనా. ఇక్కడ జరిగిన దైనందిన కార్యక్రమం వివరింపబడిన పెక్కు గ్రంథాలు ప్రస్తుతం ప్రజోపయోగంలో వున్నవి.[11]

---

10. Mehar Baba. *The Highest of the High*, pp 1-3, passim.
11. See Don E Stevens Ed. *Listen Humanity*, Dodd Mead and Co. 1957, pp. 9-90.

ఈ సహవాస్ కూటాలు జరుగుతున్నపుడే మెహర్ బాబా 'బాబా పిలుపు', 'అంతిమ ప్రకటన' అనే రెండు ప్రాముఖ్య ప్రకటనలు వెలువడినై. ఆయా కాలాలలో వెలసిన అవతార పురుషులు వారిచెంత ఉచితంగా లభించే పారమార్థిక పునరుజ్జీవనాన్ని పొందవలసిందిగా ప్రజల్ని ఆహ్వానించారని, అందువల్ల ఆ ఆహ్వానాన్ని సద్వినియోగం చేసికొని, తరించడం ప్రజల బాధ్యత అని సూచించాడు. తన సేవకాళి కృషిని, మనోనిశ్చయతను అభినందిస్తూ, తన అంతిమ ప్రకటనను బాబా ప్రారంభించాడు ముగింపులో అనేక సంఘటనలు సంభవింపనై యున్నవని, ఒక అనిర్వచనీయమైన వ్యాధి తన శరీరానికి సోకనై వున్నదని, ఆ కారణంగా తాను శ్రమ పడక తప్పదని, ప్రపంచం మూడు వంతులు నాశనమైన పిదపే తాను తనువును చాలించే వీలున్నదని ప్రవచించాడు. 1956 జూలైలో ఐరోపా, అమెరికా, ఆస్ట్రేలియా ఖండాలను దర్శించాడు. అదే సంవత్సరం డిశంబరు నెలలో రెండో సారి కారు ప్రమాదానికి లోనుకావలసివచ్చింది విస్తృత ప్రయాణం కొనసాగించి, 1958 ఫిబ్రవరిలో మెహర్‌బాద్‌లో భారతీయులకు, మిర్టల్ బీచ్‌లో ఐరోపా, అమెరికా అనుచరులకు సహవాస్‌లు ఏర్పాటుచేసి, వచ్చిన వారిని సమూహాలుగా ఏర్పరచి, ప్రతి సమూహానికి ప్రేమ, దేవుడు, విధేయత మొదలైన అంశాలపై ఉపన్యసించాడు బాబా.

మిర్టల్ బీచిలో జరిగిన సహవాస్‌కు కేవలం 225 మంది ఇంగ్లాండ్, ఫ్రాన్స్, స్విట్జర్లాండు, ఇజ్రాయేల్, మెక్సికో, అమెరికా నుండి హాజరైనారు. రెండు వారాలు కూడ ఈ సహవాస్ కూటాలలో బాబా అనుచర వర్గం పరస్పరం సన్నిహితంగా మెలగడమే గాక, సంపూర్ణ అవగాహన ఏర్పడటానికి వీలు కలిగింది. ప్రేమికుల మధ్య అభివృద్ధి కావలసిన అతీంద్రియ ప్రేమానురాగాలు, అహంకారంవల్ల కలిగే అనర్థకాలు, జనన మరణ సమస్య, విధేయత మొదలైన ముఖ్యాంశాలను గూర్చిన బాబా ప్రసంగ వ్యాసాలను ఆయన అనుచరుల్లో ఎవరో ఒకరు సహవాస్ కూటాలలో చదివి వినిపించేవారు 'నేనే తండ్రియైన దేవుని కుమారుడ'నని బాబా ప్రకటించుకొన్నాడు. అంతేకాదు, 'తల్లియైన దేవుడు కూడ తానే'నని బాబా తన భక్తులకు తెలియపరిచాడు. ఇక్కడ దైవత్వంలో తల్లి తండ్రి వేర్వేరు దశలు కావని, రెండూ ఒకే దశను సూచిస్తాయని బాబా ఉద్బోధ. తన భక్తులను సందర్శించి పరామర్శించాలనే తలంపుతో చేసిన విస్తృత ప్రయాణాలలో రెండు తీవ్ర ప్రమాదాలకు లోనైనందువల్ల తన భక్తులకోసం తాను

శ్రమపడినానని బాబా సూచించాడు. ఈ అవతార సమయంలో దేవుడు తల్లిగా, తండ్రిగా ఉభయ పాత్రల నిర్వహించే అవకాశం కలిగిందని బాబా తెలియ చెప్పాడు.[12]

మిర్టల్ బీచినుండి బాబా, ఆయనతో ప్రయాణం కొనసాగిస్తున్న ముఖ్య శిష్యవర్గం బయలుదేరి జూన్‌లో ఆస్ట్రేలియా చేరి, అక్కడ బ్రిస్‌బన్ సమీపంలో జరిగిన సహవాస్ కూటాలలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల నుండి సుమారు యాభై మంది ఈ కూటానికి హాజరైనారు. ఆయన ప్రసంగ వ్యాసాలు చదివి వినిపింపబడినై. కాని బాబా అప్పుడప్పుడు తన వ్యాఖ్యానాన్ని జోడించి, ఆ వ్యాస పఠనాన్ని మరింత అభిలాషనీయం కావించాడు. తనకు విధేయతను ప్రకటించవల సిందిగా బాబా భక్తులను కోరినప్పుడు ముగ్గురు మినహా మిగిలినవారందరు ఏక కంఠంతో విధేయతను ప్రకటించారు.

1962లో బొంబాయిలో జరిగిన సహవాస్ కూటానికి ప్రాక్పశ్చిమాలనుండి ఆయన అనుచరులు హాజరైనారు. ప్రపంచవ్యాప్తమైన కూటమైనందువల్ల విస్తృత మైన ఏర్పాట్లు కావించబడినై. కేవలం శిష్యవర్గానికే పరిమితమైన సభలేగాక, బహిరంగ సభలు కూడ ఏర్పాటు చేయబడినై. ఇష్టమున్నవారెవరైనా హాజరు కావడానికి వీలు కల్పించబడింది.[13]

మెహర్ బాబా జీవితంలోని తుది ఘడియలు తీవ్రమైన ఏకాంతంలో గడి చాయి. ఆయన స్వంత కార్యదర్శి ఆది ఇరానీ కూడ ఆయన్ని దర్శించడంకోసం అనుమతికై వేచివుండవలసివచ్చేది. దినానికొక్కసారి మాత్రమే ఆయన సేవ కుడు గదిలోనికి భోజన పదార్థాలతో వెళ్ళడం తటస్థించేది. ఆ భోజనం కూడ నామకభోజనమే! అయినా 1969లో 'ప్రాక్పశ్చిమ సహవాస్' కూటానికి ఏర్పాట్లు చేసి, భక్తులను ఆహ్వానించవలసిందిగా బాబా తన అనుచర వర్గాన్ని ఆదేశించాడు. అయితే, ఈ కూటం జరుగనేలేదు. 1969 సంవత్సరం జనవరి 31 వ తేదీన మెహర్‌బాబా పరమపదించాడు

12. **Charles B. Purdom, op cit. p. 314.**

13. **Refer to Francis Brabajon,** *The East West Gathering,* **Queensland Australia, n d.**

బోధల సారాంశం:

మెహర్‌బాబా బోధలను సమీక్షించడం క్లిష్టమైన విషయం. 1925 తరువాత బాబా విస్తరించి ప్రసంగించకపోయినా, వ్యాసరూపంలో వ్రాయకపోయినా, అయిదు సంపుటాలలో ఆయన ప్రసంగాలు క్రోడీకరింపబడివున్నాయి.[14] అంతేగాక, ఆయన అనుచరవర్గం కూడ ఆయన బోధలను సంకలించి, సంపుటాలుగా వెలువరించారు అయితే ఆయన చేసిన ప్రసంగాలని వెలువడిన గ్రంథపరిమాణాఅనుబట్టి ఆయన ప్రసంగ సమీక్ష అసాధ్యమైందని ఈ గ్రంథకర్త ఉద్దేశంకాదు. కాని ఆయన ప్రసంగాలు నానా విషయ సమ్మిశ్రణాత్మకాలై, విశ్లేషించ ప్రయత్నించే సమీక్షకులను ఇరకాటంలో పెడుతున్నాయి అంతేకాదు, ఆయన చేసిన సంజ్ఞలను ఆయన శిష్యులు గ్రహించినట్లుగా వ్యాఖ్యానించినందువల్ల ఆయన ఆలోచనలు, ప్రసంగ సారాంశం క్రమబద్ధమేనని ఒప్పుకొన్నప్పటికీ, వాటిని వ్యాఖ్యానించే వారికి ఆయన సంజ్ఞల గ్రహించే శక్తి ఏ మేరకున్నదో ఆ మేరకే వారు వానిని వ్యాఖ్యానించే అవకాశం వుంది మరియు వారు అపార్థం చేసికొంటే మొత్తం ప్రసంగమే అపార్థమై భక్తుల్లో గందరగోళాన్ని కలిగిస్తుంది. ఇట్టి షరతులకు లోనైనందువల్ల ఆయన ఉపన్యాస సారాంశాన్ని విశ్లేషించి అంశాలవారిగా సమీక్షించడం కొంత అసాధ్యమే అయినా, ఈ దిగువ సూచించిన విధంగా విభజించి పరిశీలించవచ్చు.

1. సద్గురు- అవతారమూర్తి:- స్వయంసిద్ధులై అంతిమసత్యమైన పరమాత్మ లేదా బ్రహ్మతో ఐక్యాన్ని సాధించగలవారు సద్గురువులు. అన్ని షరతులు, పరిమితులకు, అతీతంగా అతడు స్వేచ్ఛను అనుభవింపగలడు ఇట్టి బ్రహ్మైక్యాన్ని సాధించిన వారిలో కొందరు వెంటనే తనువును చాలించి శాశ్వతంగా ఆ స్థితిలోనే నిలిచిపోగా మరి కొందరు ఈ తనువుతోనే జీవిస్తూ వున్నారు అయితే వారి మానసిక చేతనస్థితి దైవత్వంలోని అవ్యక్తాంశంతో లీనమై వుంటుంది కాన, శరీర స్పర్శ కేవలం వారికి మృగ్యం లేదా నామమాత్రం. దేవుని శక్తిని, జ్ఞానాన్ని ఆనందాన్ని వారు నిరంతరం అనుభవిస్తూనే వుంటారు. కాని ఆ అనుభవం ఇతరులను విమోచించడానికి పనికివచ్చేదికాదు. ఆ విధంగా నిత్య పరిణామక్రమ

14. **Mehar Baba**, *Discourses*, **Ahmadnagar : Mehar Publications** 1938–1954.

జానికి లోనైన దైవాంశలో వారు కూడ భాగమనే ఎరుకతోనే జీవిస్తూ వుంటారు. ఈ ఎరుకే దైవసిద్ధస్థితిని ఇతరులు కూడ పొందడానికి సహాయ పడుతుంది. ఇట్టి సద్గురు స్థితిని చేరిన వ్యక్తియే అవతార పురుషుడు. అయినా సద్గురువుకు అవతారానికి సుంత భేదమున్నది. అనంత చేతన స్థితిని సాధించిన వ్యక్తి సద్గురువు దేవుడు మానవుడైనపుడు అవతారిగా పరిగణింపబడుతున్నాడు. సద్గురుగాని అవతారిగానీ విశ్వంలో భాగమై వున్న అనంత ఆత్మను సాధించిన వ్యక్తులు అవతారం అంటే దైవ ప్రత్యక్షత అనేకాదు, ప్రత్యక్షమైన దేవుడు అని వ్యాఖ్యానించాడు. సద్గురు అవతారాల గూర్చి వ్రాస్తూ బాబా, 'ఉభయులు కూడ ఉన్నత దశలోని అధఃస్థానంలో వున్నవారే; సద్గురు ఆ స్థాయిలో కార్యాచరణాన్ని కొన సాగిస్తే అవతారి ఆ స్థాయికి దిగివస్తున్నాడు. సద్గురు ఈ దశలో ఒక జీవిగా ప్రవర్తిల్లితే అవతారి ఆ దశలో జీవిగా పరిణామం చెందు తున్నాడు' అన్నాడు.[15]

2. దేవుని మూలస్థితి పరబ్రహ్మం లేదా పరాత్పర అది అపరిమితం అనంతం; అది నిర్గుణం కాదు. నిరాకారి కాదు. అలాగని సగుణకాదు. స్వరూపికాదు. దేవుడు సర్వ సారాంశం, మూలం, నిత్యం, అంతిమసత్యం. ఆయన ప్రపంచాగమనానికి వెలుపల వుండి తమాషా చూచే లక్షణం కలవాడు కాడు. ఆయన లోకగమనంలో భాగస్వామి, జగన్నాటకంలో ప్రముఖ పాత్రధారి.

3. సృష్టి : ప్రపంచం సృష్టియొక్క అవాస్తవిక లక్షణాన్ని వివరిస్తూ మెహర్‌బాబా సర్వం బ్రహ్మమయం, ఆ శక్తికి వెలుపల ఉన్నదల్లా శూన్యమని వెల్లడించాడు. ఆయన ప్రసంగాలలో సృష్టియొక్క ప్రారంభం ముగింపులగూర్చి ముచ్చటించాడు. ప్రారంభంలో సర్వం వాస్తవం, కాని పరిణామ దశలు ప్రారంభం కావాలని నిర్దేశింపబడిన మీదట నిశ్చలమైన సముద్రంపై తరంగం కదులుతూ అనేకమైన నీటి బుడగలను సృష్టించి

15. Stevens and Duce Eds *Discourses by Mehar Baba*, Tokyo: Komiyama Press 1968, pp 141-142.

నట్లే నీటి బుడగల వంటి జీవరాశి మానవ సృష్టితో సహా ప్రారంభమైంది. దీని ప్రారంభం ఎలా తటస్థించిందో ముగింపు కూడ అంతే. నీటి బుడగ జీవితం బుద్బుదప్రాయం. సృష్టి జీవితమూ అంతే

4. పరమాత్మ ప్రసాదించే ప్రేరణను బట్టి జీవాత్మ పరిణామానికి లోనౌతున్నది పరమాత్మ అనంతం, అచేతనం. అట్టి లక్షణాలతో సమైక్యం కావడానికి జీవాత్మకున్న సమస్త వ్యతిరేకత లేదా అవలక్షణాలను విసర్జించవలసి వున్నది రెండు భిన్న పదార్థాల మధ్య ఏకత్వం అసంభవం. అందువల్ల పరమాత్మ బ్రహ్మలక్షణాలలో జీవాత్మ (మానవుడు) ఎదిగిన నాడే ఈ బ్రహ్మైక్యం సాధ్యం. ఇదే సిద్ధస్థితి లేదా విమోచన దశ. అయితే ఈ దశను చేరడం సులభసాధ్యం కాదు. దానిని సులభసాధ్యం గావించుకొని ఆ స్థితిని చేరడమే జీవిత కర్తవ్యం. అందుకే ఈ సర్వ ప్రయత్నాలు.

5. మానవుడు మూలంలో పాప స్వభావికాడు అతడు దైవాంశ సంభూతుడు, మానవుడంటే ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానంగా అతడు జగన్నాటకంలో ఒక పాత్రధారి. సృష్టిలోని ప్రతి అంశం దైవీకరించబడాలి. ఈ దైవీకరణ క్రియలో మానవుడు ప్రముఖ పాత్ర వహించవలసి వుంది. ఎందుకంటే అతడు దేవుని పోలిక. అతడు పాత్రధారి లేదా నటుడైనంత మాత్రాన, కేవలం జేబు బొమ్మగాదు, అతనిలో అంతర్లీనంగా వున్న దైవాంశ అతనికి స్వేచ్ఛను ప్రసాదిస్తున్నది అందువల్ల మానవుడు దేవునిలో ఏకాత్మ్యాన్ని సాధించే నాటక క్రియయే జీవితం.[16] మానవుడు దేవుడుగా పరిణామం చెందడానికే ఎక్కువ అవకాశాలున్నాయి.

6. అంతిమసత్యమే దేవుడుగా గుర్తింపబడుతున్నది. అయితే అచేతన స్థితి నుండి చేతన స్థితికి చేరేవరకు అంతిమ సత్యమే దేవుడనే అనుభవ నీయమైన వాస్తవం గ్రాహ్యం కాదు. చేతన స్థితి, అచేతనాన్ని జయించినపుడు మానవ అవగాహనలో పూర్ణసిద్ధి సంభవిస్తుంది. ఈ పరిణామాన్ని వివ

16. Charles B Purdom, op cit. 428.

రిస్తూ మెహర్ బాబా చేతన స్థితిని విడుదలచేసే సప్త దశలను గూర్చి ముచ్చటించాడు. ఈ సప్త దశల గుణలక్షణాలు, దైవ చేతనస్థితి యొక్క ఇతరదశలు, దేవునియొక్క అపూర్వ ఉత్కృష్ట దశ, దేవునియొక్క దశ విధదశలు, క్రొత్త మానవత మొదలైన అంశాల వివరణ ఆయన బోధల్లో తరుచు కనిపించే ప్రముఖాంశాలు.

7. దివ్యప్రేమ : ఆయన అనుచర వర్గానికి పైన ఉదాహరించిన తాత్విక ధోరణితో కూడిన ప్రసంగాలకన్న సామాన్య పరిభాషలో వివరింపబడిన ప్రేమ సందేశాలే ప్రీతికరమైనవి, ప్రేమద్వారా ప్రపంచ శాంతి అనే అంశంపై బాబా ప్రసంగిస్తూ-

> 'ప్రపంచ శాంతి నేడు మానవ జీవితంలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించుకొని వుంది. యుద్ధమే ప్రారంభమైతే, సంపూర్ణ నాశనమే సంభవిస్తుంది. అయితే ఇట్టి ప్రపంచ శాంతి కేవలం సూత్రాలు, సిద్ధాంతాలపై ఆధారపడి స్థాపింపబడేది కాదు. విభజన, భయాందోళనలకు అతీతమైన అచంచల ప్రేమ ద్వారానే సాధ్యం. అణు శక్తి, లేదా తదితర భౌతిక శక్తిచేత, ప్రపంచం రక్షింపబడదు. జరుగుతున్న చరిత్ర పరిణామంలో దైవ ప్రమేయంవల్లనే అది సాధ్యం. ఈనాడు మానవజాతికి కావలసింది మతాలు, మత శాఖలుకావు కాని ప్రేమ. దివ్యమైన ప్రేమ ద్వేషాన్ని, భయాన్ని జయిస్తుంది. ఈ దైవ ప్రేమను మానవునిలో రగిలించడానికే నేను అవతరించాను.[17]

మానవుని ప్రేమ పరిమితులకు, షరతులకు లోనైందికావడంవల్ల ఇట్టి నిష్కామ కార్యాలనది సాధించలేదు, 'ఆతనిలో అయత్నకృతమైన ప్రేమ జనించే వీలులేదు ఎవరిలోనైన అట్లు జనించితే, అది దేవుని వరం' అంటాడు బాబా.

17. K.K. Ramakrishna, ed. *Mehar Baba on Love*, **Poona : Mehar Era Publications**, 1968 p. 9.

నిష్కళంకమైన ప్రేమ భక్తులలో దైవ వరానికి ప్రతిఫలితంగా మాత్రమే ఆవిర్భవిస్తుంది శిష్యుడు సిద్ధంగా వున్నపుడు, సద్గురు తన ప్రేమ సముద్రం నుండి ఒకానొక బిందువును ప్రసాదిస్తాడు. ఆలా సద్గురు ప్రసాదమైన ప్రేమవల్ల శిష్యునిలో సత్ ప్రేమ జనిస్తుంది. [18]

8. ప్రపంచం వాస్తవం గాదు. అయినా దానిని త్యజించి, దానినుండి దూరంగా పారిపోనక్కరలేదు. ఆధ్యాత్మికం, నిందారహితం, నిర్మలమైన జీవితాన్ని గోరినా, ప్రపంచం నుండి దూరంగా పోనక్కరలేదు. దేవునిపై గల ప్రేమతో కార్యాచరణకు పూనుకొనే ప్రతి వ్యక్తి బాబాకు చెందినవాడే. అయితే, ఏ భక్తుడైనా బాబాకు కృతజ్ఞత చూపాలి అంటే అతడు ప్రేమ జీవితాన్ని జీవించాలి. ఆ ప్రేమ సాత్వికంగా, నిజాయితీగా, నిస్వార్థంగా సేవాత్మకంగా వుండాలి. నటన, వేషధారణ అందు ప్రవేశింపరాదు.

9. ఆయన ఆచరణీయమైన దృక్పథంలో బైబిలు నుండి, ఖురాన్ నుండి అనేక వాక్య భాగాలను చదివి, ప్రార్థన, సహవాస కూటాలలో ప్రకటించడం బాబాకు పరిపాటి. అలానే జొరదుష్ట్రి మత గ్రంథమైన 'అవెస్త', హిందూ మతానికి నూతన నిబంధనగా పేరు మోసిన 'భగవద్గీత' కూడ ఆయన ఉపయోగించాడు. ఆయనే స్వయంగా సార్వత్రిక ప్రార్థనను, ప్రాయశ్చిత్తార్థ ప్రార్థనను సిద్ధం చేశాడు.

బాబా పారశీక కుటుంబంలో జన్మించినా, ఆనాడే కళాశాల విద్యను రుచి చూచినా, అటు పూర్తి నిరాడంబరాన్ని కాని, ఇటు భోగలాలసతను గాని ఆయన వాంఛింపలేదు మధ్యే మార్గాన్ని అవలంబించి తన జీవిత గమనాన్ని ముగించాడు. మనుష్యులు ప్రేమమయులై, రాగ ద్వేషాలకు, భయభ్రాంతులకు, అతీతులై, శాంతియుతమైన సహజీవనం జీవించాలనేది ఆయన జీవిత ధ్యేయం. అందుకే ఆయన జీవించాడు ఆయన మౌన వ్రతాన్ని కోరి ఆచరించి ఉండకపోతే, అమూల్యమైన సందేశాలు, శాంతి జీవనానికి నాందీ వచనం పలకగల ఉపదేశాలు మరెన్నో వెలువడి వుండేవి.

18. *ibid* p. 17.

బాబా బోధల్లో సర్వ మత సిద్ధాంత సమన్వయం ప్రస్ఫుటమౌతున్నది. హిందూ వేదాంతానికి దగ్గరగా వచ్చి, అనేక మూలాభిప్రాయాలను తన సొంతం చేసికొని ప్రకటించినప్పటికీ, క్రైస్తవ మత సిద్ధాంత పదజాలాన్ని ఉపయోగించి నప్పటికీ అన్ని మతాల వారు అభినందించగల జీవిత సరళిని, ఉపదేశాలను ఆయన లోకానికి ప్రసాదించాడు అనేకులను ఆకర్షించడానికి వీలున్నందువల్ల మెహర్‌బాబా ఈ పద్ధతిని అవలంబించాడని ఎవరైనా అంటే అనవచ్చు, కాని ప్రస్తుత గ్రంథకర్త వారితో ఏకీభవించలేడు మెహర్‌బాబా ప్రయత్నాలలో, ప్రయాణాలలో, ప్రార్థనాంశాలలో సార్వత్రిక గుణం, రెండు ప్రపంచ మహా సంగ్రామాలను స్వయంగా చూచి, వాని నష్టాలను గ్రహించిన మీదట, విశ్వశాంతి మినహా వేరే గత్యంతరం లేదనే ఆయన దృఢదీక్ష స్పష్టం. అట్టి విశ్వశాంతిని సాధించి కాంక్షించే వారెవరైన మత, వర్ణ, దేశహద్దుల్ని అధిగమించి, విశ్వజనీనమైన సందేశాల నందించక తప్పదు. అపుడే వారి గమ్యాన్ని చేరగలరు. ఆ ప్రయత్నం, ఆ సత్సంకల్పం మెహర్ బాబాలో కన్పిస్తున్నది.

ఆయనలో ఈ విధమైన మతస్పర్శ, చైతన్యం కలగడానికి కారణభూతులైన నల్గురు మహనీయుల్లో ఇద్దరు హజ్రత్ బాబజన, తాజుద్దీన్ ముస్లింలు కావడం విశేషం. ఉపాసని బాబా నైష్ఠిక హిందూ ధోరణికి, షిర్డి సాయిబాబా సహన దృక్పథానికి ప్రతీకలు. వీరి నుండి మెహర్ బాబా గ్రహించిన అంశాలను అవలోకించి, తనదైన ఒక ప్రత్యేకతను ఆయన స్థాపించుకొన్నాడని చెప్పాలి. ఉపాసని బాబానుండి కఠిన క్రమశిక్షణ, షిర్డి సాయిబాబానుండి సహన దృక్పథం, హజ్రత్ బాబజన, తాజుద్దీన్ నుండి మర్మయోగ లక్షణాలను, సూఫీ జీవితసరళిని గ్రహించాడు మెహర్ బాబా. అట్టి సమ్మేళనం అతుకుల బొంతగాకాక, సమంజసమైన కలయికగా పరిణమించినందువల్లనే, భారతదేశంలో దాదాపు అన్ని మతస్థులు, యూరప్, అమెరికా, ఆస్ట్రేలియా ఖండాలలో పెక్కుమంది క్రైస్తవులు ఆయన సహవాస కూటాలకు హాజరైనారు.

కాగా, భారతీయ క్రైస్తవులే సహవాస కూటాలకు దూరంగా వుండిపోయారు. అదే విశేషం.

## 4. పుట్టపర్తి సత్యసాయిబాబా (1926-)[1] :

షిర్డి సాయిబాబా పారంపర్యంలో దేశదేశాలలో పేరు ప్రఖ్యాతులతో పాటు బహుజనాన్ని, అంతకంటె అధికంగా ధనాన్ని ఆర్జించి, తనదైన ఒక ప్రత్యేక జీవిత విధానాన్ని స్థాయిని అలవర్చుకొని, మహత్క్రియలను సాధిస్తూ అపూర్వ యోగశక్తిని, దూరదృష్టిని, దార్శనిక శక్తిని ప్రదర్శిస్తూ వున్న ఆత్యాధునిక బాబా శ్రీ పుట్టపర్తి సత్యనారాయణ భారతదేశంలోగాని, విదేశాలలోగాని మరే గురు మహారాజుకు లేనంత గొప్ప అనుచరవర్గం ఈ బాబాకున్నది. శ్రీ కుష్వంత్ సింగ్ అంచనా ప్రకారం మాజీ భారత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి తరువాత అంత జనాకర్షణతో ప్రజల్ని కూడదీయగల వ్యక్తి శ్రీ సత్య సాయిబాబా మాత్రమే![2] ఆయన ఎక్కడకు వెళ్లితే అక్కడ తండోపతండాలుగ స్త్రీ పురుషులు- వృద్ధులు యువ్వనులు- బాలబాలికలు- ఆయన దర్శనార్థం నిరీక్షిస్తూ పై పై బడుతూ వుండడం సహజం తాను జన్మించిన అనంతపురం జిల్లా పుట్టపర్తిలో ఒకటి, బెంగుళూరు సమీపంలోని వైట్‌ఫీల్డులో మరొకటి అత్యంత ఆధునికమైన ఆశ్రమాలను స్థాపించాడు. వానిని ఆశ్రమాలు అనడంకన్న సమస్త సౌకర్యవంతమైన సుఖ విలాసాలని పిలవడమే సబబు పూర్వకాలపు ఆశ్రమ వాస లక్షణాలైన కఠోర శరీరక్రమశిక్షణగాని, మానసిక ఆధ్యాత్మిక సాధన, ధ్యానాత్మక యోగాభ్యాసాలు గాని కాక, విశ్రాంతి పేర నేటి జీవన విధానానికి అనుగుణంగా రూపొందింపబడినవి అలాగని ఇక్కడ మత విశేష కార్యక్రమాలు

1. See **Tal. Brooke**, *Sai Baba, Lord of the Air*, **New Delhi Vikasa Publishing House**, 1979. **b. V.K Gokak**, *op.cit*, c. **N. Kasturi**, *Satyam Sivam Sundaram, The Life of Bhagavan Sri Satya Sai Baba*, **Prasanthi Nilayam**: 1968, **d Howard Murphet**, *op.cit* **and** e. **A. V. Suryanarayana**, *Paradise Regained, The Divine Life of Sri Satya Sai Baba*, **Guntur n d.**
2. **Khuswant Singh**, *Godman and Their Disciples, The Illustrated Weekly of India*, **Vol. XCIV. No.** 11, **March** 18, 1973. **p.** 8.

కొనసాగడం లేదని కాదు ఆ కార్యక్రమాలకు ఆశ్రమాలలో వుండవలసిన స్థానం ఇక్కడ లేదని మాత్రమే! ఆయన దర్శనాలు, భజనలు, సంకీర్తనలు, ఉపదేశాలు ఆయా సమయాల్లో సాగుతూనే వుంటవి. ఆయన దర్శనార్థమై పడిగాపులు కాచే వారిలో రాజకీయ నాయకులు, ఉన్నతోద్యోగులు, విద్యావంతులు మొదలు గ్రామీణ ప్రజలుంటారు. ఎంత శ్రమైనా, ఎంత వ్యయమైనా, ఎంతసేపు వేచి వుండవలసి వచ్చినా ఫరవాలేదు, ఆయన దర్శన భాగ్యం లభిస్తే చాలు వారికి.

సత్య సాయిబాబా జన్మించిన కుటుంబ పూర్వ చరిత్ర పవిత్రమైందని, మతసంప్రదాయాలను పాటించడంలో పేరెన్నికగన్నవారని, ఇటు తండ్రి అటు తల్లి తరఫున పూర్వీకులు దేవాలయ నిర్మాణం, సంతర్పణలలో ఎవరికీ తీసిపోనివారని ఆయన జీవిత చరిత్రతోబాటు కుటుంబ గాథా లహరిని తవ్వినవారు ఉద్ఘాటిస్తున్నారు. ఆయన తల్లిగారి మాతామహుడు శివాలయాన్ని నిర్మించి, సంతర్పణ గావించినమీదట సత్యసాయిబాబా తల్లి పుట్టినందున ఆమెకు 'ఈశ్వరాంబ' అని నామకరణం గావించారని ఆయన జీవిత చరిత్రకారులందరు ముఖ్యంగా రతన్‌లాల్ సూచించారు.[3] ఆయన పితామహుడైన కొండమరాజు సంపూర్ణంగా రామాయణాన్ని కంఠోపాఠం చేసి, తన మనుమ సంతానాన్ని చుట్టూ కూర్చోపెట్టుకొని, రామాయణ గాథలతోపాటు ఇతర పౌరాణిక గాథలను బోధించేవాడట. కొండమరాజు పెద్దకుమారుడు వెంకప్పరాజు, సాయిబాబా తండ్రి. తల్లి ఈశ్వరమ్మ సత్యనారాయణ వ్రతాన్ని ఆచరిస్తున్న సమయంలో పురిటి నొప్పులు రావడం, ఆ వెనువెంటనే ఈయన పుట్టడం, అందువల్ల సత్యనారాయణ అనే నామకరణం చేయడం జరిగిందని ప్రతీతి. అందునా హిందువులకు అత్యంత శుభప్రదమైన కార్తీక సోమవారం నాడు ఆయన జన్మించాడు. ఆయన పుట్టింది అక్షయ నామ సంవత్సరం. అక్షయ అంటే క్షయం కానిది. ఇన్ని శుభసందర్భాలు ఆయన జీవిత విశేషంలో కలిసివచ్చాయి గనుకే ఆయన అంతటి వాడయ్యాడనేది ప్రజాభిప్రాయం.

---

3. **Ratan Lal,** *Sri Satya Sai Baba,* **in** *Gurus, Godmen and Good People,* **pp. 1-6. Ed. Khuswant Singh.**

బాల్యం నుండి సౌమ్యశీలంతో తోడివారిలో తనదైన ఒక ప్రత్యేకతను నిలుపుకొంటూ సత్యనారాయణ ప్రవర్థమానుడౌతూ వుండగా మొదట పుట్టపర్తిలో, ఆ పిదప బుక్కపట్నంలో విద్యాభ్యాసం కొనసాగింది. చదువు సంధ్యల కంటె భజనలు, భజనకు సంబంధించిన కీర్తనలమీద ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు పెద్దలు గ్రహించారు. అంతేగాక, ఆతనిలో సహజంగా పెరుగుతున్న నటనా కౌశలాన్ని ప్రదర్శిస్తూ నాటకాలు వేయడం, రచించడం ఆయనకు అబ్బిన లలిత కళలు. పన్నెండవ సంవత్సరంలోనే "చెప్పినట్లు చేస్తారా" అనే నాటికను తన ఉపాధ్యాయుని కోరికపై వ్రాశాడని, ఆ నాటకం 'తల్లిగ, తండ్రిగ, ఉపాధ్యాయునిగా చెప్పే నీతులు, చెప్పేవరకు వ్రాసేవరకు మాత్రమే అయితే- క్రియారూపం ధరించకపోతే- ఏదైనా నేనెందుకు నేర్చుకోవాలో నాకు తెలియదు' అనే మాటల్ని కథానాయకుడు చెప్పడంతో ముగుస్తుందట.[4]

1940 మార్చి నెల 8 వ తేదీ శ్రీ సత్యనారాయణను పెద్ద మండ్రగబ్బ కుట్టింది. అయినా మంచి నిద్రపోయాడు. తెల్లవారేసరికి అపస్మారక స్థితిలో ఉచ్ఛ్వాస, నిశ్వాసక్రియ క్లిష్టంగా తయారైంది. తిరిగి స్మృతి వచ్చేసరికి, అతని ప్రవర్తనలో మార్పు కనిపించినందువల్ల అతనికి దయ్యం పట్టిందనే పుకారు వూరంతా వ్యాపించింది. భూతవైద్యులు వచ్చి, బాలునికి శ్రమకలిగే కార్యాలు చేశారు. కాని వానివల్ల ప్రయోజనం లేకపోయింది. 1940 వ సంవత్సరం మే నెల 23 వ తేదీ, అంటే పై సంఘటన జరిగిన సుమారు డెబ్బయి ఐదు దినాలకు, తోడి బాలబాలికలకు బంధువర్గానికి ఫలహారాలను పంచిపెట్టాడు. కాని ఎప్పటికీ ఆ ఫలహార పదార్థం తరుగలేదు -సరిగదా ఎక్కడనుండి వస్తున్నాయో కూడ ఎవరికి తెలియలేదు. అదే సమయంలో శ్రీ సత్యనారాయణ తాను సాయిబాబానని, ఆపస్తంబ సూత్రానికి, భరద్వాజ గోత్రానికి చెందినవాడనని, సకల ప్రజల బాధానివారణయే తన తక్షణ కర్తవ్యమని ప్రకటించుకొన్నాడు. ప్రతి లక్ష్మివారం తప్పక తనను ఆరాధించవలసిందని తోడివారిని హెచ్చరించాడు. 1940 అక్టోబరు 20 వ తేదీ మామూలుకంటే ముందే ఇంటికి వచ్చి 'అదేమి' అని అడిగిన వదినగారికి, 'నన్నెవరేమీ అడుగవద్దు. నేను మీకెవరికీ చెందినవాడను కాను. నా భక్తులు నా రాకకోసం వేచివుండి నన్నాహ్వానిస్తు

4. N Kasturi, *Satyam Sivam Sundaram*, Vol. I. p. 40.

న్నారు. నేను వెళ్ళవలసి వుంది' అనే చెప్పి, ఇల్లువదలి సమీపంలోనేవున్న తోటలో చెట్టుక్రింద మకాంచేశారు. ఈ వార్త ఆ నోట ఆ నోటపడి ఊరంతా పొక్కింది. నెమ్మదిగా జనం గుమికూడారు వచ్చిన వారిని కూర్చుండవలసిందిగా సూచించి, భజన కీర్తన ప్రారంభించారు చేరిన జనం గొంతు కలిపింది. తొలి విభజన ప్రారంభమైంది. ఇక్కడ 1944 లో మొట్టమొదట ఆయన భక్తులు దేవాలయాన్ని నిర్మించారు. ఆ తరువాత 1950 లో ఈనాడున్న సర్వాంగ సుందరం, సర్వశోభితమైన ప్రశాంతి నిలయం వెలసింది.

చుట్టూ పర్వత శ్రేణి అలంకరింప, మధ్యగా చిత్రావతినది ప్రవహిస్తూ వుంటుంది. అక్కడ యాత్రిక సౌకర్యార్థం అనేక వసతులు కల్పింపబడినై. పోస్టాఫీసు, పోలీస్‌స్టేషన్, వైద్యశాల పాఠశాల వగైరా సదుపాయాలతోపాటు యాత్రికులు మకాంచేయడానికి వీలైన సదుపాయాలున్నాయి అన్నింటిలో ప్రజల దృష్టిని ఆకర్షించేవి రెండే రెండు భవనాలు ఒకటి రెండతస్తుల సత్యసాయి భవనం. రెండోది సుమారు అయిదువేలమందికి సరిపోగల ఆడిటోరియం.

ప్రశాంతి నిలయంలో ప్రవేశించగానే బాబా సూక్తులు దర్శకుల దృష్టి నాకర్షిస్తాయి మానవుని లోపలే వున్న అరిషడ్వర్గాలు- కామ, క్రోధ, లోభ, మద, మోహ, మాత్సర్యాలును జయించినమీదట సాధకుడు అభివృద్ధి సూచకమైన పచ్చని తోరణాన్ని ప్రవేశిస్తాడు. అది ప్రేమ. ఆ దశ దాటితే ప్రశాంత వాతావరణం. ఇక్కడ మానవునిపట్టి బాధించే సమస్త శోధనలు, ఆధివ్యాధులు, మానసిక ఆందోళనలు సమసిపోయి ప్రశాంతంగా కాలం గడపగల స్థలప్రవేశం, విశ్వశక్తితో సంబంధాన్ని కల్పించగల యోగసాధనం సాధ్యమౌతుంది. హృదయ పద్మం విప్పారుతుంది కళలు విచ్చుకొంటాయి.పరిమళం విశ్వమంతావ్యాపిస్తుందనిని నిర్మాతల సూచన.

సత్యసాయి మకాం చేసే భవనం రెండంతస్తులతో చూడముచ్చటగా వుంటుంది. భవనాని కిరువైపుల విశాలమైన వరండాలున్నాయి. పై అంతస్తు

5. N. Kasturi, *At the Lotus Feet of Bhagavan Satya Sai Baba*, **Prasanthi Nilayam**, 1968 p. 65.

వరండాలో నిలబడి సత్యసాయిబాబా ప్రజలకు దర్శనమిస్తాడు. క్రిందున్న పెద్ద హాలు ప్రార్థనా గది. దానికి పడమర దిక్కున వేదిక మీద పూజాస్థలం అమర్చ బడినై. పూజా మందిరాని కిరువైపుల నిలువెత్తున షిర్డి సాయిబాబా, సత్యసాయి బాబాల విగ్రహాలు ప్రతిష్టింపబడ్డాయి. ఈ రెంటి మధ్య వెండితో చేయబడిన సత్య సాయిబాబా విగ్రహం చోటు చేసికొన్నది. ఇవి ఆరాధన కవసరమైనవి కావని, భక్తులు ఏకాగ్రతను నిల్పి వారి ధ్యాన విధానానికి తోడ్పడే సోపానాలు మాత్రమేనని అక్కడ వున్నవారి వ్యాఖ్యానం. ప్రార్థనా మందిరం గోడపై ఆయా గురు మహా రాజుల, ఇతర మత దేవుళ్ల పటాలు, అలంకరింపబడి వున్నాయి. స్థూలంగా ఇదీ ప్రశాంతి నిలయ పరిస్థితి.

ప్రశాంతి నిలయంలో దైనందిన కార్యక్రమం ఆయన భక్తులకు, దర్శకులకు ఉత్తేజకరంగావుంటుంది. అరుణోదయాన్నే 4:45 గంటలకు'ఓం' మంత్రోచ్చారణ, సంస్మరణ, 6 గంటలకు రెండో అంతస్తు ముందర భాగంలోని వరండాలో సత్య సాయిబాబా దర్శనం జరుగుతుంది. ఆ వెనువెంటనే రెండు భజనగాన సమావేశాలు, ఆ తరువాత సాయిబాబా పటానికి 11 గంటలకు హారతి నర్పిస్తారు. మధ్యాహ్నా నంతరం ప్రత్యేకంగా కోరినవారితో గోష్టి, ఆ తరువాత సాయంత్రం 7 గంటల నుండి బాబాగాని లేదా ప్రత్యేకాహ్వానితులుగాని ప్రేక్షకుల నుద్దేశించి ఉపదేశాల నిస్తారు.

సత్య సాయిబాబా కింత పేరు ప్రతిష్టలు రావడానికి ప్రధాన కారణం ఆయన చేస్తున్నాడని చెప్పబడుతున్న అద్భుత క్రియలే ననడం అతిశయోక్తి కాదు. ఆయన చేసిన, చేయగల మహత్క్రియల జాబితా ఆయన జీవిత చరిత్రల్లో వివరంగా కూర్చబడింది. అయినా ఈ దిగువ సమాచారం పాఠకులకొక అభిప్రా యాన్ని కలిగించగలదు.[6]

1. వ్యాధిగ్రస్తులకు స్వస్థత, అంధులకు కనుదృష్టి ప్రసాదించి, దురాత్మలను దయ్యాలను వెడలగొట్టడం.
2. అనుచర వర్గానికి దేదీప్యమానమైన దర్శనాలు తన మహిమ వలన కలిగించడం.

6. *ibid.* p. .00. Also see Howard Murphet op.cit. p. 12 ff.

3. అత్యల్పంగా వున్న ఆహార పదార్థాలు ఇబ్బడి ముబ్బడి అగునట్లు దీవించడం.
4. ఏకకాలంలో అనేక తావుల్లో భౌతిక కాయంతో ప్రత్యక్షం కావడం.
5. భవిష్య ద్విషయాలను సూచించి, దూర తీరాలలో వున్న వస్తువులను చూడడం.
6. చేతిని ఊపి గాలిలో స్ఫురింపి విభూతిని సృష్టించడం. భక్తు లడిగిన కానుకలను పంచిపెట్టడం.
7. అపుడపుడు చనిపోయిన వారికి ప్రాణదానం చేయడం.

కొంతకాలం క్రితం మరణించినవాడు భూతమై తల్లిని వెంటాడి పీడిస్తూ వుంటే ఎన్ని భూతవైద్యాలకు లొంగక, తుట్టతుదకు, సిద్ధహస్తుడైన వ్యక్తి భాగవత పురాణాన్ని వల్లె వేయగలిగితే తాను తల్లిని వీడిపోగలనని, ఆ రూపంలో తనకు శాపవిమోచన కలుగుతుందని ప్రకటించిందట భూతం. తుదకు సత్యసాయి బాబా భాగవత పురాణంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను వల్లె వేయడం, ప్రేతాత్మ తన శాప విమోచనను ప్రకటించి బాధిస్తున్న తల్లిని వీడిపోవడం జరిగిందట.

ప్రశాంతి నిలయం నిర్మాణదశలో వున్నప్పుడు ఇనుప కమ్మీలను చేరవేయ డాని కుపయోగించవలసిన క్రేన్ చెడిపోయి పని కుంటుబడినపుడు బాబా విభూతిని తన భక్తులకిచ్చి క్రేన్‌పై చల్లించగా అది మామూలుగా పని చేసిందని ఒక గాథ ప్రజా వినికిడిలో వుంది.[7]

శ్రీ భగవంతం, బాబా ఇరువురు చంద్రావతి నది ఇసుకతిన్నెలపై నడుస్తూ, ఏదో ఒకచోట అది కూడ శ్రీ భగవంతం సూచించిన స్థలంలో కూర్చుండి మాట్లాడుతున్న సమయంలో, దోసెడు ఇసుకను తీసికొని అందునుండి భగవద్గీతను సృష్టించి ఆయనకిచ్చి, ఆయన్ని ఆశ్చర్యచకితుని కావించాడని మరోగాథ. ఇట్టివే, ఎన్నో, ఇంకెన్నో. దసరా వుత్సవాలు జరిగే పది రోజుల్లో ఒక ప్రత్యేక క్షణాన సత్య సాయిబాబా తన నోటినుండి రెండు బంగారు శివ లింగాలను సృష్టించి భక్తులకు ప్రదర్శిస్తాడని మరొక ప్రచారం వున్నది. ఆయన చేసే మహత్క్రియలు

7. A. V. Suryanarayana *op.cit.* p. 35.

భౌతిక, రసాయనిక శాస్త్రాల సూత్రాల నధిగమించినవని, అదొక దైవిక శక్తి సంకల్పమని ప్రఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రజ్ఞుడు శ్రీ యస్. భగవంతం ప్రకటించాడు.[8]

1968 జూన్, జూలై మాసాలలో బాబాకు తీవ్రంగా పక్షపాతం వచ్చి, ఎడమ పక్షం పూర్తిగా చచ్చుబడిపోయింది. ఆ స్థితిలోనే నాలుగు సార్లు గుండె పోటు కూడ తటస్థించింది. ఇక ఎవరిని దర్శించేది లేదని ప్రకటన కూడ అత్యావసరంగా వెలువడింది. మందులు నిరాకరించాడు బాబా. అకస్మికంగా ఒక రోజు దర్శనాన్ని ప్రసాదించి, దర్శన సమయంలో మంచినీటిని రెండు గుక్కలు త్రాగి కుడిచేయి చిటికెన వ్రేలును నీటిలో ముంచి, ఆ పిదప ఆ నీటిని ఎడమ చేతిపై చల్లుకొని, నెమ్మదిగా చచ్చుబడిన చేతి నెత్తగలిగినాడని, ఆ విధంగానే వామ పక్షం శక్తిని పుంజుకొన్నదని మరొక మహత్క్రియ ప్రచారంలో వున్నది.

సత్య సాయిబాబా మహత్కార్యాల గురించి విస్తారమైన ప్రచారం జరిగింది. ఆయన ప్రసాదించే విభూతి సకల రోగ నివారిణి అని నమ్మిక ప్రజల్లో కుదిరి పోయింది. అయితే ఇట్టి అద్భుత శక్తిని శంకిస్తూ కూడ ప్రచారం విస్తృతంగానే జరిగింది. నెల్లూరుకు చెందిన ఒక యువక ఇంజనీరు కామెర్ల వ్యాధితో బాధపడుతూ, సత్య సాయిబాబా విభూతి మహిమను నమ్ముకొని, నిష్కారణంగా ప్రాణాలు కోల్పోయిన వుదంతాన్ని పేర్కొని, కొందరు విమర్శకులు బాబా మహిమను శంకిస్తున్నారు.[9] శ్రీలంక హేతువాద ఉద్యమ నాయకుడు కీ॥శే॥ డాక్టర్ కోవూర్, మైసూర్ యూనివర్సిటీ మాజీ వైస్‌ఛాన్స్‌లర్ శ్రీ నరసింహయ్య సత్యసాయిబాబా మహిమల సార్థకత్వాన్ని సవాల్ చేశారు.[10] కాని వారి సవాళ్ళకు, పరీక్షలకు శ్రీ సత్యసాయిబాబా సంసిద్ధం

8. *News Week*, **November** 17. 1969 **p.** 118 **and also Bhavan's Journal November**, 28, 1971.
9. పరకాల పట్టాభి రామారావు, *భక్తి విశ్వాసాల ముసుగులో*.... ....... ... విజయవాద; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 1983, పుట. 20
10. **Kovvor Abraham,** *Begone Godmen*, **Bombay : Jaico Publishing House**, 1984.

కాలేదు. ఒకవేళ ఆయన సిద్ధంగావున్నా, ఆయన సిబ్బంది ఆయన సవాళ్ళ నెదుర్కొనకుండా అంతరాయం కల్పించారేమో! బెంగాల్ ఇంద్రజాలికుడు సర్కార్, సత్యసాయి బాబా ఎదుట అరచేతిలోంచి అమాంతంగా రసగుల్లాలు తీసి చూపించి, అటువంటి "మహిమలు" ఎన్నైనా తాను చేయగలనని, హస్తలాఘ వానికి వీలుకాని, అరచేతిలో ఇమడని 'పెద్ద గుమ్మడిగాయను' తీసి తన మహి మను నిరూపించుకోవాలని సవాల్ చేశాడు ఆ ఫలితంగా సత్యసాయిబాబా భక్తులు సర్కార్‌ను బైటికి గెంటివేశారు. ప్రఖ్యాత జర్నలిస్టు, శ్రీ ఖ్వాజా అహమ్మద్ అబ్బాస్ రాయలసీమ వాసి అయిన సత్యసాయిబాబా నిత్యం కరవు కాటకాలకు గురౌతున్న రాయలసీమ వాసులకు కనీసం ప్రతిపూళ్ళో గుక్కెడు మంచినీళ్ళు పుట్టించి ఇమ్మని సవాల్ చేశాడు. 'అరచేతిలోంచి స్వర్ణమంగళ సూత్రాలు తెప్పించే శక్తిగలవాడు, మంచినీళ్ళు పుట్టించలేడా' అన్న ఈ ప్రశ్న రాయలసీమ అంతా ప్రతిధ్వనించింది, దైవశక్తి సమన్వితుడని ఎవరినైనా ప్రజలు నమ్మితే, ఆ నమ్మిక అలా వుండిపోవలసిందే కాని,వారిని పరీక్షకు నిలుపకపోవడం ఆరోగ్యవంతమైన సంప్రదాయం కాదు. పరీక్ష సత్యాన్ని తేల్చుకోడానికిగాని, ఆయా వ్యక్తులను, వారి నమ్మికలను కించపరచడానికి కాదు. రతన్‌లాల్ తన వ్యాసంలో సాయిబాబా భక్తులు, ఆయన చేసే మహత్క్రియలకు గోరంతలు కొండంతలు చేసి ప్రచారం చేస్తున్నారని, ఇట్టి ప్రచారం సాక్షాత్తు దైవ అవతారంగా చెప్పుకొంటున్న బాబా స్థాయిని కించపరచేదిగా వుందని హెచ్చరించాడు.

1968 లో బొంబాయిలో జరిగిన శ్రీ సత్యసాయి ప్రపంచ మహాసభలో బాబా తను భూమిపై జన్మించడానికి గల కారణాలను ప్రకటించాడు. భారత దేశంలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనాన్ని తీసికొనిరావడమే తన ప్రథమ కర్తవ్యమని ఆయన ప్రకటనా సారాంశం. అంతేగాక, తన వుద్యమం సఫలీకృతమగు పర్యంతం తన కార్యక్రమాన్ని కొనసాగిస్తానని వెల్లడించాడు.

1975 లో స్వామి ముక్తానంద పరమహంస, సత్యసాయిబాబాల మధ్య గణనీయమైన సమావేశం జరిగింది. వారు చర్చించిన అంశం ప్రాపంచిక రాజ కీయాలు. ఈ సిద్ధయోగుల మధ్య ఈ సభను ఏర్పాటు చేసింది 'రామదాస్'. అమెరికా దేశీయుడైన ఈ 'రామదాస్' తనకై తాను సిద్ధయోగి. అంతకుముం దతడొక విశ్వవిద్యాలయ ఆచార్యుడు. సత్యసాయి మాటల్లో, క్రియల్లో కనిపించే

పరమ రహస్యం 'కుండలిని' సిద్ధాంత ఆదర్శాలపై ఆధారపడిన తాంత్రిక యోగ మనే విషయం ఇపుడిపుడు ఆయన సన్నిహితులు, పరిశోధకులు గ్రహించగలుగు తున్నారు.

**సత్యసాయిబాబా బోధలు :** ఆయనతోనే ఆశ్రమంలో వుండేవారు, దర్శకులు, ఆయన బోధల సారాంశాన్ని సంపుటాలకొలది ప్రచురించారు. ఇది గాక 'సనాతన సారథి' అనబడే మాసపత్రిక భారతీయ ముఖ్యభాషల్లో ప్రచురింప బడి ఆధ్యాత్మికోపదేశాలకు పేరుగాంచింది. ఆయన ఉపన్యాసశైలి సామాన్యమైన సంవాద రీతిగా వుండి ప్రేక్షకులకు ఆహ్లాదాన్ని కొలుపుతుంది. ఆయన సందేశా లలో అనేకానేక విషయాలు బౌద్ధ, హిందూ, క్రైస్తవ మతసూక్తులు సమ్మిళితమై విషయ విశదీకరణలు ఉదాహరణతో కరతలామలకంగా, వినోదం, విజ్ఞానం, పారలౌకికం ముప్పిరిగొని వుంటాయని ఆయన భక్తుల ప్రశంస

ఎవరైన దైవసిద్ధులు కావాలంటే గురుమహారాజుకు లోబడి ఆయన ఆజ్ఞల శిరసావహించక గత్యంతరం లేదని, గురువులేక ముక్తి లేదని బాబా ప్రకటిస్తాడు ఆయన బోధల సారాంశాన్ని ఈ దిగువరీతిగా క్రోడీకరించవచ్చు.

1. అనేకంగా వున్న లోకంలో ఏకత్వాన్ని సాధించడానికి లోకానికి వెరచి పలాయనం చిత్తగించే వ్యక్తులకు లోకాన్ని జయించడానికి కావలసిన చిత్తబలాన్ని, మనో ధైర్యాన్ని ప్రసాదించడానికి తానవతరించాడని బాబా ప్రకటించాడు. 'ఎవరైనా దేవుడెక్కడున్నాడని అడిగితే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి సంశయించవద్దు. పుట్టపర్తికి రమ్మని ఆహ్వా నించి, వారితో మీ ఆనందాన్ని పంచుకొను'డని భక్తులకు సూచించాడు. [11] తద్వారా తన విశ్రాంతి నిలయమే దేవాలయమనే ధ్వని నిమిడ్చినాడు
2. దేవుడు సర్వాతీతుడు. మనుష్యులు పరిగణించే వర్ణ, కుల, ధన మొదలైన లక్షణాలకు, కొలమానాలకు అందనివాడు. ఆయనకేదీ కొదువలేదు. ఎవర్నేమీ అడగడు, ఆ అవసరం ఆయనకులేదు, ఆయన కివ్వకపోతే శిక్షిస్తాడేమోనని మనుష్యులు భీతిచెంద నవసరం లేదు.

11. N. Kasturi, *Satya Sai Speaks*, Vol. II Prasanthi Nilayam, 1965–68 p 269.

3. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, పునరుజ్జీవనాన్ని కలిగించడమే సాయి బాబా కర్తవ్యం. అందుకు సహాయాన్ని అపేక్షించి ఎవరైనా ఒక అడుగు ముందుకువేస్తే ఆయన మూడడుగులు వేసి వారిని ఆదుకోడానికి అవకాశం వుంది.

4. దేవుని కృప అందరి కుద్దేశింపబడింది గాని, ఏ కొందరి హక్కు భుక్తం కాదు. అది సార్వత్రికం

5 మనోవాక్కర్మల శుద్ధీకరించుకొని భక్తులు తమ జీవితగమనాన్ని కడతేర్చు కోవలసి వుంది. సత్యం, శివం, సుందరమైన జీవితాన్ని కోరుకోవలసింది గాని సుఖభోగాలకు గాదు.

6. లోకంలోని సంసార బంధకాల్లో చిక్కుకొని వున్నారని గుర్తెరిగి మానవులు అట్టి సంసార లంపటంనుండి విముక్తులు కావడానికి కృషి చేయవలసింది.

7. ప్రతివ్యక్తి మతాసక్తి కలవాడైనందువల్ల ఎవరిని నాస్తికులని, నిర్దేవులని దూషించరాదు. ప్రతివ్యక్తి దైవకృపకు నిలయం. ప్రతి హృదయంలో ప్రేమనిధి వుంది. ప్రతి హృదయం సార్వత్రిక సత్యానికి నిలయం. ఆ ప్రేమ, ఆ సత్యమే దేవుడు. ప్రతివ్యక్తి అంతర్యం యొక్క లోలోపల మినుకు మినుకు మంటూ దైవాంశ వున్నది. దానిని గుర్తించి పరి పోషించుటే ప్రతివ్యక్తి యొక్క జీవితధ్యేయం కావాలి.

8. శ్రమ బయటనుండి లోపల ప్రవేశించేదికాదు. అది హృదయంలో జనించి ప్రవహించేది.

9. విద్యార్జనలో రెండేరెండు సూత్రాలు స్థానం పొందాలి విద్య బహు విషయ పరిజ్ఞానాన్ని కలిగించాలి ఆ పరిజ్ఞానం వ్యక్తిలో పరిణామాన్ని తీసికొని రావాలి. ఇవి పరస్పర ఆధారాలేగాక, అవినాభావ్యాలు. ఏ ఒక్కటి లేక పోయినా రెండోదానికి అస్తిత్వం లేదు.

10. అహాన్ని చంపుకోడానికి రెండు మార్గాలున్నవి. ఒకటి అహంకారాన్ని అనంతంగా పెంచుకోడం. దాని పరిణామాన్ని పరమాణువంతంగా తగ్గించడం మరొకటి. మొదటి పద్ధతి జ్ఞానార్జనతో సరిపడుతుంది. మహా జ్ఞానార్జన తరువాత తానే సమస్తం, సమస్తం తానే అనే భావన ఏర్పడిన మీదట, నేను నాది అనే అహం, దానికై అదే నిష్క్రమిస్తుంది. నేనేమికాను మిధ్యను అనే భావం ద్వారా రెండో మార్గం సాధ్యమౌతుంది

11. దైవదర్శనం పొందగోరే వ్యక్తికి ఆంతరంగిక శుద్ధీకరణ తప్పనిసరి షరతు చలనం కలిగి కల్మషంగా వున్న నీటిలో చంద్రబింబాన్ని ఎవరైనా ఎలా దర్శించలేరో, మలినమై, అస్పష్ట ఆలోచనల మయంగా వున్న మానవ హృదయంతో వ్యక్తులు సత్యస్వరూపి అకళంక మూర్తియైన అనంతుని దర్శింపలేరు.

12. దేవుడు నిర్గుణబ్రహ్మ. అయినా భక్తులు గుణభేదరహితుని ఆరాధించడం కష్టం గనుక వారి సహాయం కోసం సగుణబ్రహ్మను సాధనంగా వాడుకోవచ్చు. నిర్గుణబ్రహ్మ నారాధించే స్థాయికి చేరేవరకు ఈ సాధనాన్ని వాడుకోడంలో పొరపాటు లేదు నిర్గుణ బ్రహ్మవలె ఆ సద్గుణబ్రహ్మ కూడ అద్వితీయుడు, అనంతుడు, సత్యం, ప్రేమ ఆయన సచ్చిదానంద, పరబ్రహ్మ. త్రాడును చూచి పామని భ్రమించినట్లు, లోకాన్ని చూచి, అల్పజ్ఞానులు, నిజమని భ్రమిస్తున్నారు. జగత్తు అనేది అవస్తు, అభౌతికం, అవిద్య, మాయ.

13. మానవ దేహం అతనిది కాదు. అతడు పరబ్రహ్మ స్వరూపి 'తత్త్వమేఅసి'. తత్త్వమ్ అసియై ఉన్న వ్యక్తి దైవాంశలో భాగమే కాని, పాపస్వాభావి కానేరడు. ఎవరు కూడ తామే పాపులమనుకొని వారిని వారే కించపరచుకోనక్కరలేదు. శారీరకంగా, మానసికంగా కృంగదీస్తున్న విచారం, ఆశబోతుతనం, అనవసర జీవిత పోరాటం, ఆతురత మొదలైనవి అవలక్షణాలను పారద్రోలగల శక్తి ప్రార్థన కున్నది.

14. మానవుడు పాపకార్యాలు చేయడానికి కారణం తాను తత్త్వమ్ అసి అని గుర్తించక పోవడమే.

15. బ్రహ్మ సాయుజ్యం పొందుటే ముక్తి, రక్షణ నది మిట్టపల్లాలపై ప్రవహించి తుదకు తన నాథుడైన సముద్రుని చేరి సంలీనం కావడంతోనే దాని జీవిత గమనం పరిసమాప్తమౌతుంది. మనసు ప్రశాంత స్థితిని పొంది పరమాత్మలో విలీనమగుటే ముక్తి. మనసు ప్రశాంతతను, హృదయం నిష్కళంకాన్ని సంతరించుకొని, శరీరం పరమాణువుగా పరిణామం చెంది శూన్యతను సాధించుట ద్వారా సంసార చక్రం నుండి విమోచనను పొందుతుంది.

తనను గూర్చి సాయిబాబా గొప్ప గొప్ప విషయాలే ముచ్చటించాడు తాను కాలానికి అతీతమైన వ్యక్తియని, కురుక్షేత్రంలో తానే అర్జునునికి రథసారథిగా వుండి విజయాన్ని చేకూర్చినాడని, ఈనాడు ప్రపంచ రథసారథియై సమస్త మానవకోటికి ఉపదేశిస్తున్నాడని ప్రకటించాడు తన కృప దర్శన శక్తి ద్వారా తన భక్తశ్రేణినే గాక సర్వజనాంగాలను తృప్తి పరుస్తున్నాడని ఆయన భక్తులు ప్రకటిస్తున్నారు.

ఇంతగా జనాన్ని మంత్రముగ్ధులను చేసి దేశీయులతో పాటు విదేశీయులను కూడ తన శిష్యవర్గంలో చేర్చుకొని ఇంత ఉద్యమాన్ని నిర్వహిస్తున్న సత్య సాయిబాబా ఎవరు? ఆయన్నెవరూ ఇలా నిలదీసి ప్రశ్నించలేదు. ఆయన అనుచర వర్గం ఆయన చేస్తున్న క్రియలు, ప్రసంగాలనుబట్టి ఆయన్ని గూర్చి కొన్ని స్థిరాభిప్రాయాలను వెలిబుచ్చారు. ఆయన జీవిత చరిత్రతో పాటు బోధలను కొన్ని సంపుటాలుగ సంకలించిన ఎన్. కస్తూరి. 'సత్యం, శివం, సుందరం' యొక్క శరీర రూపమే సత్య సాయిబాబా అని నిర్ధారింప, మానవుణ్ణి తానున్న అధమ స్థాయినుండి అత్యున్నత స్థానానికి లేవనెత్త మానవరూపంలో అవతరించిన దేవుడు అని శ్లాఘించారు కొందరు.[12] అనేక మంది సత్పురుషుల సాధువుల ప్రార్థనా ఫలితంగా వెలసిన యుగ అవతారమే సత్య సాయిబాబా అనగా, మరికొందరు సాక్షాత్తు భగవానుడేనని స్తోత్రగీతాల నాలపించారు.

కాని తనను గూర్చి తానేమని ప్రకటిస్తున్నాడు? ఈ ప్రశ్నకు సమాధానంగా నేనే శివశక్తిని- ఇక్కడ శక్తి అంటె శివుని సతి అని భావం- భరద్వాజుడు శివ శక్తిని ఆరాధించి మెప్పించి సంపాదించిన వరఫలితంగా ఆ గోత్రంలో నేను జన్మించాను. ఇంతకుముందు శక్తి తనకై తానే షిర్డీ సాయిబాబాగా అవతరించింది. ప్రస్తుతం నా వ్యక్తిత్వంలో శివుడు, శక్తి ఇద్దరూ ఏకమై అవతరించారు. కాన నేను శివశక్తి సమన్వితుడను. మరికొంత కాలానికి శివుడొక్కడే నాలో కర్ణాటక రాష్ట్రంలోని మాండ్య జిల్లాలో ప్రేమ సాయిగా అవతరిస్తాడు. ఆ అవతారం యొక్క ముఖ్యోద్దేశం ఇహాన్ని ఆముష్మికంతో సంబంధపరచే సోపానాలను

12 **A.V. Surya Narayan**, *op cit.* **p. III.**

అమర్చుతే[13] అని ప్రవచించాడు. ఈ వాంగ్మూలంలో రెండు విషయాలను పరిశీలింపవలసి వుంది. అందొకటి తానే శివ, శక్తి అవతారమని ప్రకటించడం; రెండోది షిర్డీసాయిబాబా అవతారాన్నని చెప్పడం.

భారత దేశంలో ఇప్పటివరకు తెలియవచ్చిన దశావతారాలు కేవలం 'విష్ణువు', త్రిమూర్తులలో రెండవ వ్యక్తికి చెందినవి. ఆర్య సంస్కృతికి ముందు పశుపతి శివయోగిని పోలిన విగ్రహారాధన ఉన్నట్లు మొహెంజొదారో హరప్ప పట్టణాలలో లభించిన చారిత్రిక అవశేషాలు సూచించినా, ఆ పూర్వకాలంలో గాని, ఆర్య సంస్కృతి వ్యాపించడం ప్రారంభించిన (సుమారు క్రీ. పూ 1500) కాలం నుండి ఈనాటి వరకు 'శివ' అవతారాలుగ పరిగణింపబడిన వారుగాని, లేదా తామే శివావతారమని ప్రకటించుకొన్న వారుగాని, భారతీయ మత సంస్కృతిలో అతి స్వల్పం. ఆ విధంగా అంతకు మున్ను అంతగా సంభవింపని సంఘటన తనతోనే ప్రారంభమైనట్లు, సత్యసాయి బాబా భావించినాడా అని ఆలోచించవలసివుంది. ఈ విషయంపై కొంత పరిశోధన చేసిన విశాల్ మంగల్వాడి అను గ్రంథకర్త:

> "హిందూ మతం సంప్రదాయ సిద్ధంగా విష్ణు దశావతారుడై భూమిపై వెలిశాడని ప్రకటించడమే గక విశ్వసిస్తున్నది. ఈ దశావతారాలలో తొమ్మిది సంభవించాయి, కలికి అవతారం సంభవింపునై వుంది. కలియుగాంతంలో కలికి అవతారం సంభవిస్తుందని ఇరవై రెండు అవతారాలను గూర్చి ముచ్చటించిన భాగవత పురాణం కూడ సూచిస్తున్నది.......అందువల్ల తాను శివ శక్తి యొక్క అవతారాన్నని సత్యసాయిబాబా ప్రకటించుకొనడానికి ఇటు హిందూమతంలో గాని, అటు సంప్రదాయసిద్ధ విశ్వాసంలో గాని ఆధారాలు లేవు. అందువల్ల సాయిబాబాను శివ, శక్తి అవతారమని నమ్మడం అంటే హిందూ మత అవతార సిద్ధాంతాన్ని ప్రత్యక్షంగా వ్యతిరేకించడమే ఔతుంది" అని వ్రాశాడు [14]

13 N Kasturi, *Satyam Sivam Sundaram*, p. 84. Also see Gokak *op cit.* p. 67.

14. Vishal Mangalwadi, *Op. cit.* p 162.

ఇంతకు మించి సాయిబాబా శివ, శక్తి అవతారాన్నని ప్రకటించడంపై వ్యాఖ్యానించడం అవసరం లేదు. కాగా, తను జన్మించడానికి ఎనిమిది సంవత్సరాలు ముందు మరణించిన షిర్డీ సాయిబాబా అవతారాన్నని ప్రకటించుకొనడం, ఆ విషయాన్ని సమర్థిస్తూ ఆయన అనుచరవర్గం గ్రంథ రచన కొనసాగించడం కూడ జరిగింది. షిర్డీ సాయిబాబా, సత్య సాయిబాబా ఇద్దరు ఒకటే అని రుజువు చేసే ప్రయత్నంలో ఆయా రచయితలు, వారి జీవిత సంఘటనలను సరిపోల్చారు. షిర్డీ సాయిబాబా జీవితంలో జరిగిన సంఘటనలను సత్యసాయిబాబా గుర్తించి, వారితో సంబంధం గల వ్యక్తులతో ఆ విషయాలను ముచ్చటించి ఆశ్చర్యపరచాడని నొక్కి చెప్పారు. సత్యసాయిబాబా భక్తులకు కలిగిన దర్శనాలలో ఉభయ సాయిబాబాలు అవినాభాజ్యంగా, సంయుక్త కార్యనిర్వాహకులైనట్లు కనిపించారట. ఆ భక్తుల అనుభవాలను తన అనుభవాలను జోడించి అత్యున్నత విద్యావేత్త, బహుళ గ్రంథకర్త, సత్యసాయిబాబా కతి ప్రీతిపాత్రుడు, భక్తుడైన శ్రీ గోకాక్ 'వీరుభయులు ఒకటి కాక ఇద్దరెలా కాగల'రని ప్రశ్నిస్తున్నాడు.[15] సత్యసాయిబాబా షిర్డీ సాయిబాబా యొక్క అవతారమే గాక, గత అవతారంలో తాను చేసిన కార్యాలకు సంబంధం వుండి, ఇంకా జీవించి వున్న వ్యక్తులతో గల సంబంధాన్ని జోడించి, సాక్ష్యాలను తీసికొని అపూర్వంగా ప్రచార సాహిత్యాన్ని సృష్టించారు. ఇట్టి ప్రచార సాహిత్యంలో ప్రప్రథమంగా ఆస్ట్రేలియా నుండి ప్రాచ్యయోగ శాస్త్రాన్ని, తత్వ శాస్త్రాన్ని అధ్యయనం చేసి, అభ్యసించాలని 1964 లో తన యాభై ఎనిమిదవ ఏట భారతదేశానికి వచ్చిన హొవార్డ్ మర్ఫెట్ వ్రాసిన గ్రంథం మొదట పేర్కొనవలసి వున్నది.[16] ఆయన వ్రాసిన అనేక గాథలు, సాక్ష్యాధారాలను ఒక్కొక్కటి పరిశీలించి పరీక్షించి, నిగ్గు తేల్చడం ఈ గ్రంథకర్త చేయనెంచిన కార్యం కాదు. పాఠకులే ఆ గ్రంథాలను లేదా గ్రంథాలలో భాగాలను చదివి తమదైన ఒక అభిప్రాయాన్ని ఏర్పాటు చేసికోవడం మంచిదని తలంచి వానిని విడిచిపుచ్చడం జరిగింది. వీరుభయుల ఏకత్వాన్ని చర్చిస్తూ షిర్డీ సాయిబాబా నిత్యం అగ్నిని మండిస్తూ వుండే వాడైనందువల్ల సత్య సాయిబాబా కూడ నిత్యం విభూతిని సృష్టించి పంచిపెడుతున్నాడని, ఆ విభూతి గత జన్మలో వెలిగించిన నిప్పులనుండి నిరంతరం లభిస్తుందని నమ్మేవారు మరికొందరు.

15. Gokak *op cit.* p. 61-70.

16. Howard Murphet, *op cit.* pp. 58-66.

సత్యసాయి బాబా తాను షిర్డీ సాయిబాబా అవతారాన్ని ప్రకటించినాడని విన్నాక అనేక ప్రశ్నలు పరిశీలనాత్మకమైన మనసును వేధిస్తాయి. షిర్డీ సాయి బాబా నిరాడంబరుడు, భిక్షాటనం వల్ల జీవితాన్ని వెలార్చినవాడు. ఇతరులకింత పెట్టి మిగిలితే తిని, లేకుంటే పస్తులున్నవాడు. ఆయన భారతీయ సంస్కృతిలో వెల్లివిరిసి, మూడు పూవు లారుకాయలుగ ఫలించిన గురువ్యవస్థకు వారసుడు. ఆయనలో కుదురుకొన్న ప్రజలకొరకైన తహతహ, మితభాషత్వం సమస్తజన దృష్టిని ఆకర్షిస్తాయి. కాగా సుఖభాగ్యాలతో తులతూగుతూ, సమశీతల వాతావర ణాన్ని సృష్టించుకొన్న దివ్యమైనభవనంలో రాజభోగాలననుభవిస్తూ, ఆధునిక విదేశీ సౌకర్యాలతో విహరించే సత్యసాయి బాబా షిర్డీ సాయిబాబా అంతటి నిరాడంబర, నిరుపేద మహాపురుషుని అవతారం అంటే, వీరుభయుల జీవిత సరళుల పరిశో ధించిన వారు ఆశ్చర్యపడక తప్పదు. చినిగిన వలువలుతో సిగ్గు దాచుకోడం ఎక్కడ? ఖరీదైన సాటిన్ పీతాంబరాలెక్కడ? ఇవి పరిశోధకులు పరిశీలకులు ఆలోచించపలసిన విషయాలు.

ఇక్కడ ఇంకొక విషయాన్ని గమనించాలి షిర్డీ సాయిబాబా అవతారమే సత్యసాయి బాబా అని అంగీకరించినా, రెండు అవతారాలు కేవలం ఒక దశాబ్ద కాలవ్యవధిలో జరగడం మరో విచిత్ర సంఘటనగా గుర్తించవలసివుంది. హిందూ మతం నమ్మి ప్రకటించిన అవతారాల్లో ఒక అవతారానికి మరో అవతారానికి విస్తృతమైన కాలవ్యవధి వున్నట్లు పాఠకులు గమనింపగలరు. అయినపుడు ఒక అవతారం ముగిసిన కేవలం ఎనిమిదేళ్లకే ఆ వ్యక్తి అవతరించాడని చెప్పడంగాని, దాన్ని నమ్మడం గాని హేతుబద్ధం, వివేచనాసక్తమైన మనసునకు అందని విషయం.

అద్భుత క్రియలు చేయగలవారందరిని దైవ అవతారాలుగా భావించడం అవసరమా? లేదా అట్టి శక్తి కలదని ప్రకటించుకొన్నవారు తమకై తామే దైవ అవతారాలుగా ప్రజలకు చాటుకోవచ్చునా? అనేవి తీవ్రమైన ప్రశ్నలు. భారత భూమి ప్రారంభంనుండి అచంచల దృఢ దీక్షా దక్షుల, అపూర్వ శక్తి సమన్వితు లైన యోగిపుంగవుల పాదధూళిచే పునీతమైన జీవగడ్డ. వారు మానవాతీత శక్తిని ప్రదర్శించారు. అతీంద్రియ కార్యసాధనను రుజువు చేశారు. మాంత్రి కంగా గాని, యుక్తివల్లగాని ఎన్నో అసాధ్యాలను సాధ్యం చేసి చూపించారు.

వారెవరు తాము దైవ అవతారులమని ఇంతకు ముందు ప్రకటించుకోలేదు. ఇప్పటికింకా స్వయంసిద్ధులు, బ్రహ్మజ్ఞాన చింతనాపరులెందరో తమలో నిగూఢంగా వున్న ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. నీలకంఠ తాతాజి మహత్క్రియలు చేసి చూపిస్తున్నారు. బెంగాలునుండి దాదాజీగా భారతీయులకు పరిచయమైన అమియ రాయ్ చౌధరి మహత్క్రియలుచేయ శక్తిగలవాడు. ఆగ్నేయవాదినని తనకై తానే ప్రకటించుకొన్న కుష్వంత్‌సింగ్ దాదాజి దర్శనార్థం వెళ్ళి ఆయనతో సంభాషించి, ఒక ఖాళీ ఫలకంపై బొటనవ్రేలితో రుద్ది కుష్వంత్‌సింగ్ పేరును, కుష్వంత్‌సింగ్ చూస్తుండగనే సృష్టించి, ఆయనకే బహూకరించాడు [17] దత్తాబాల్ దేశాయ్ ఉన్న వారందరిలో యువకుడు. అయినా, ఆయన చేసే అద్భుతక్రియలు భారతీయుల దృష్టిని ఆకర్షించాయి అంతేకాదు, క్రైస్తవమత పక్షంగా చెప్పవలసివస్తే రాజమ్మ దేవానందన్ మొన్న మొన్నటివరకు ఇట్టి అద్భుత క్రియల్ని చేస్తూ దేశమంతా పయనించింది. ఆమె గృహిణి భర్త, సంతానప్రాప్తి పొంది ఉపాధ్యాయినిగ పనిచేస్తూ, పని విరమించుకొని ఈ సేవ కుపక్రమించింది. ప్రస్తుతం హైదరాబాదు నివాసి. అందువల్ల మహత్క్రియ సాధనయే దైవావతార ప్రధాన సాధనం అయితే, వీరందరిని అవతారులుగ గుర్తించవలసివుంది. అందువల్ల అద్భుతక్రియలు చేయగలగడం అవతారానికి అర్హత అనే విషయం వాదానికి నిలువని అంశం.

దైవత్వ నిరూపణకు ఫలానా క్రియలు చేసిచూపుమని సవాలు చేయడం కూడ సబబైన విషయంకాదు. ఒక వ్యక్తి దైవశక్తి సమన్వితుడని, దైవమేనని ప్రజలు గుర్తించాలంటే ఆతడొక ప్రత్యేక జీవన విధానంలో సామాన్య మానవ ప్రేకాలకు, అనుబంధాలకు అతీతుడై, ప్రజాజీవనంచే ప్రభావితుడై, వారి జీవిత ప్రగతినే తన ధ్యేయంగా ఎంచుకొని, వారి పరిస్థితులకు ప్రతిస్పందించి, మాట ద్వారా, చూపు ద్వారా, క్రియ ద్వారా, నడవడిక ద్వారా, తనలో నిగూఢంగా వున్న దైవ లక్షణాలను ప్రత్యక్షపరచడమే గాక, దోష రహితుడై ఎంత చిన్నదైనా సరే, నిందకు నిష్ఠూరానికి దూరంగా, రాగద్వేషా

17. Kushwant Singh, *Gurus Godmen and Goodpeople*, pp. XII-XII.

తీతుడై నిర్మల పవిత్ర జీవితంతో ప్రజలను ప్రభావితులను చేయాలి. అట్టి నిందా రహిత జీవితాన్ని కూడ సవాలు చేస్తారు. అడుగడుగున ఆటంకాలను అంతరాయాలను కలిగిస్తారు. అది మానవ లక్షణం. అయినా "నా యందు పాపమున్నదని మీలో ఎవడు స్థాపించు"[18] నని ప్రశ్నించగల గుండె దిటవు, మనోస్థైర్యం ఉండాలి. కాని సత్య సాయిబాబా అలా అనింద్య జీవితాన్ని గడుపుతున్నాడా? అయితే, కోర్టు కేసులెందుకు? లైంగిక సంబంధమైన అపవాదు లెందుకు? స్వలింగ సంపర్కుడనే నింద ఎందుకు?[19] ఇన్ని ఉన్నపుడు భగవాను డనని ప్రకటించు కొనడం ఎందుకు? అట్టి ప్రకటనలవల్ల అదనంగా చేకూరిన ప్రయోజనం లేకపోగా అపార్థాలకు గురి కావలసిన పరిస్థితు లేర్పడే ప్రమాదం వుంది.

కోకొల్లలుగ వెలువడుతున్న ప్రచార సాహిత్యాన్ని జల్లెడబట్టి, నిగ్గు తేల్చకుండానే నమ్మడం ఎంత ప్రమాదమో విమర్శనా గ్రంథాలను పూర్వాపరాలు ఆలోచింపక నమ్మడం కూడ అంతే ప్రమాదం. వ్యక్తులపై అభిమానం, భక్తి సత్యాలను మరుగు చేయరాదు. దురదృష్టవశాత్తు అట్టి అంధాభిమానమే ఈనాటి భారతీయ సమాజానికి పట్టిన చీడవలె కనిపిస్తున్నది.

ప్రాముఖ్యంగా సామాజిక శ్రేయోభిలాషుల దృష్టిని ఆకర్షించే కార్యక్రమాలను బాబాజీ సంస్థ చేపట్టడం అభినందనీయమైన అంశం, 'శ్రీ సత్యసాయి ఎడ్యుకేషన్ ఫౌండేషన్' అనే సంస్థ ఏర్పాటైన ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో అనేక తావుల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రశాంతి నిలయంలోనే రెండు మహా సంస్థలు స్థాపింపబడినై. ఒకటి వేద శాస్త్ర పాఠశాల. ఇక్కడ బాలురకు వేదాధ్యయనం, పఠనం బోధింపబడుతుంది. రెండోది అఖిల భారతీయ విద్వాన్ మహాసభ. 1966లో సత్యసాయిబాబా ఇచ్చిన పిలుపునందుకుని, సుమారు రెండు వందల మంది వేద పండితులు సమావేశమై, గొప్ప వేదాంతసభను నిర్వహిం

18. **Holy Bible St. John's Gospel, 8 th. Ch. 46 V.**
19 **For court cases and other sex encounters refer to Vishal Mangalwadi,** *Op cit.* **pp. 158-164, Vandana,** *Gurus, Ashramas and Christians,* **Madras : C.L.S. 1970 and** పరకాల పట్టాభిరామారావు, *op.cit.*

చారు. ఆది మొదలు ఈ సభ చిలువలు పలువలై, శాఖోపశాఖలై, భారతదేశంలోని అనేక నగరాలలో వ్యాపించి, తన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది. ఇవిగాక, పాఠశాలలు, వైద్యాలయాలు, సత్యసాయి సమితులు ఏర్పడి, ఆయన కార్యక్రమాన్ని ప్రచారం చేస్తున్నాయి. ఆ విధంగానే అమెరికాలో సుమారు నూరు సమితులు కృషిచేస్తున్నాయి. ప్రతి లక్ష్మివారం సమావేశమై, బాబా పటానికి పూజలు చేయడంతోపాటు నెలకొకసారి తమ నగరాలలో నగర సంకీర్తనా కార్యక్రమాన్ని నిర్వహించాలని, సత్యసాయి సేవాదళ్, సత్యసాయి మహిళామండలి వగైరాలు స్థాపించి, సమాజ సేవా కార్యక్రమాలను చేపట్టారు. వీరి ధ్యేయం బాబాను గూర్చిన ప్రచారం, దీన జనోద్ధరణ కార్యక్రమాలు చేపట్టడం.

ఈయనొక ప్రత్యేక భజన సంకీర్తనా గాయకుడు, భక్తి గీత రచయిత, నాటక కర్త, నటుడు, తన విశ్వాసాన్ని జనరంజకంగా ప్రకటించగల వక్త. సాంఘిక కార్యక్రమ పోషకుడు ఆధ్యాత్మిక ప్రచారకుడు. ఈయనతో సమావేశం ముగిశాక, తన ఆధ్వర్యంలో నడుస్తున్న భవాన్స్ జర్నల్‌లో ఒకనాటి భారతదేశ ఆహారశాఖా మంత్రి కే. యం. మున్షీ వెలువరించిన అభిప్రాయం పరిగణింప తగినది. "దైవ సిద్ధుడనని ప్రకటించుకొనే వారికి, ఒకటే పరీక్ష. పెరిగి పెద్దై పుష్పించి, ప్రజల్ని ఆశ, ద్వేషం, చిలిపితనం మొదలైన అవలక్షణాలనుంచి విమోచింపగల విశ్వాస బీజాన్ని ప్రజల్లో నాటగల శక్తి దైవసిద్ధులకున్నదా అనేది పరీక్షాంశం. ఈ శక్తి ఆయనకున్నది."[20] సత్యసాయిబాబాను వర్ణించేపుడు, ఆయన్ని మహామాంత్రికుడని, దైవిక మాంత్రికుడని అనేక పదాలను ఆయా రచయితలు ప్రయోగించారు. ఆయన స్వీయ అనుచరులకు ఆయనొక అవతార పురుషుడు, సాక్షాత్తు భగవానుడు. కాని ప్రస్తుత గ్రంథకర్త ఆయన జీవిత విశేషాలను, బోధల సరళిని పరీక్షించిన మీదట షిర్డి సాయిబాబా పారంపర్యానికి చెందిన ఒక సామాన్య బాబాగ పరిగణిస్తున్నాడు. షిర్డి సాయిబాబా బోధలకు, ఈయన బోధలకు సామ్యమున్నందువల్లనే ఈ వర్గీకరణ సాధ్యమైంది.

20. Bhavan's Journal. Vol XV. No. III September 8. 1968 p. 18.

## 5. ఆచార్య రజనీష్ : భూతలంలో స్వర్గం[1]

(షిర్డీ సాయిబాబా సంప్రదాయానికి చెందని బాబా)

రజనీష్ ఆశ్రమం పేర పూనేలోని కోరగాన్ పార్కు సమీపంలో ఆరు ఎకరాలలో వ్యాపించి వున్న మూడు విశాల భవనాలతో పాటు ఆధునిక వసతులు గల నివాస గృహాలు, వ్యాయామ, ధ్యాన శిక్షణాలయాలు చూపరులను దిగ్భ్రాంతి పరుస్తాయి దేశ దేశాల ప్రజల ఆచార వ్యవహారాలు, ఆయా పాశ్చాత్య సమాజాలలో స్వేచ్ఛగా లభించే లైంగికానుభవాలు, మాదక ద్రవ్య సేవనం, దిగంబర దర్శనాలతో పాటు, సామూహిక కామక్రీడా విలాసాలతో ఈ ఆశ్రమం రద్దీగా వుంటుందని, లోపల ఏం జరుగుతుందో చూడాలి అనే తపన ఆ ప్రాంతాలలో సంచరించేవారి కెవరికైనా కలుగుతుందని ప్రవేశానుమతి పొంది ఆశ్రమం లోనికి వెళ్ళవచ్చినవారి కథనం ప్రకారం తెలుస్తున్నది. అలౌకిక అనుభవాన్ని చేకూర్చే జ్ఞానబోధ, మానసిక చేతన స్థితిలో కలిగే పరిణామాల పరిశీలన, శారీరక సుఖం కోసం నాడీమండల బిగింపును సడలించే శారీరక మసాజ్, తాంత్రికవాదం, సామూహిక సహజీవనం మొదలైన అంశాలలో ఆశ్రమ వాసులకు శిక్షణ, అలా శిక్షణలో వుత్తీర్ణులైన వారికి యోగ్యతా పత్రాల బహూకరణ, ఈ తతంగం క్రమబద్ధంగా జరగడానికి ఒక విశ్వవిద్యాలయం- ఒకటి రెండు కావు అక్కడ జరుగుతున్న కార్యక్రమాలు. వెర్రితలలు వేస్తున్న ఆధునిక యువతను- ముఖ్యంగా పాశ్చాత్య యువతను, ధనికవర్గాన్ని - ఆకర్షించడానికి ఎన్ని పద్ధతుల నవలంబింప వీలున్నదో, అన్ని పద్ధతులతో ఒకప్పుడు విలసిల్లింది పూనేలోని

1. For full detailed information refer to : Ramachandra Prasad, *The Mystic of feeling*, New Delhi : Motilal Banarsidas, 1970

   *Acharya Rajneesh, Beyond and Beyond*, Bombay : Jeevan Jagruti Kendra, 1970.

   Rajneesh *Path to Self Realization*, Bombay : Jeevan Jagruti Kendra, 1971.

   Rajneesh *From Sex to Super Consciousness*, Bombay : Jeevan Jagruti Kendra, 1971.

ఆచార్య రజనీష్ ఆశ్రమం. స్వర్గాన్ని భూతలంలోనే అనుభవించమని ఆహ్వానిస్తున్న ఆధునికభూతలంలో వెలసిన "అపూర్వ భగవానుడు" శ్రీ రజనీష్

పూనేలో భగవానుని దర్శనం ప్రాప్తించకపోతే 'సంగం' రండి అనే ఆహ్వానంతో ఒక కార్యక్రమ వివరణా పట్టిని చూచే అవకాశం ఈ గ్రంథకర్తకు కలిగింది. ఆహ్వానం వెనుక 'సంగం'లో తయారించిన శ్రేష్టమైన వైన్ నింపిన సీసా, ఆ సీసాపైవున్న లేబిల్‌పై ఆహ్వానిస్తూన్న రజనీష్‌బొమ్మ చూడముచ్చటగనే కాదు, శోధన కలిగిస్తూనే దర్శనం ఇచ్చింది. ఈ 'సంగం' దక్షిణ ఫ్రాన్సులో 'కోరేజ్'లో స్థాపితమైన రజనీష్ సామూహిక సహజీవన కేంద్రం. ఇట్టిదే మరొకటి ఆయన పేరుమీద కేంబ్రిడ్జి సమీపంలోగల 'మెదీనా' భవనంలో వుంది. ఇట సుమారు రెండువందలమంది భగవాన్ రజనీష్ 'సన్యాసులు' సహజీవనం చేస్తున్నారు. ప్రతి 'సన్యాసి' ఈ సహజీవన కేంద్రంలో పనిచేస్తాడు. ప్రతిగా ఆ సన్యాసికి చెందిన కుటుంబాన్ని కేంద్రం పోషిస్తుంది వీరిలో కొందరు సాంకేతిక నిపుణులు కూడ వున్నందువల్ల ఆయా సమయాల్లో కేంద్రానికి వెలుపల తమ శిక్షణకు సంబంధించిన వృత్తివనులు కొనసాగిస్తారు కాని వారు డబ్బు తీసుకోరు. అంటే ఉచితంగా చేస్తారని కాదు కేంద్రం వారిని పోషిస్తున్నందువల్ల వారి పనికి వచ్చిన రాబడి కేంద్రానికి చెందుతుంది గనుక కేంద్రమే ఆ పని వేతనాన్ని వసూలు చేసుకొంటుంది. ఇక 'మెదీనా' అను పేరు ఎలా వచ్చిందో, అది ఈ కేంద్రానికి ఎలా సార్థకమైందో ఎవరికి తెలియదు. ఆచార్య సూచన ప్రకారం ఈ కేంద్రానికి ఆ పేరు పెట్టబడిందట.

ఇట్టి రజనీష్ క్రమానికి చెందిన సన్యాస సహ జీవన కేంద్రాలు ఇటలీలో మూడున్నవి. ఒకటి విల్లబెల్లలో, మరోటి సమో సమీపంలోని ఫ్రోజిలో, మూడవది వెన్ట్‌లో స్థాపితమై కొనసాగుతున్నాయి. స్వీడన్‌లో కేంపర్ వెగ్, జర్మనీలో మరో రెండు వెలిశాయి. జపాను, కెన్యా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా మొదలగు దేశాలలో ఈ 'సన్యాస' సహజీవన కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుత అంచనా ప్రకారం, ప్రపంచంలో గల ప్రతి దేశంలో ఒక సన్యాస సహ జీవన కేంద్రం వున్నట్లు తెలుస్తున్నది. ఇట్టి సమాచారాన్ని భారత దేశంలోని రజనీష్ సన్యాస సహజీవన కేంద్రం కూడ రాజాగా సరఫరా చేయలేకపోతున్నది. అయితే పై పేర్కొన్నవి గాక, భారత దేశంలోనే నాలుగు సన్యాస సహజీవన

కేంద్రాలున్నట్లు పూనే కేంద్ర అధినాయకురాలు 'మా ముక్త' తెలియచేస్తున్నది. గుజరాతుకో రెండు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూరులో ఒకటి, చండీఘర్‌లో మరొకటి వున్నాయి మరికొన్ని తావుల్లో నిర్మితమౌతున్నాయి.

ఈ 'సన్యాస' సహజీవన కేంద్రాలు నడవడానికి ఆధారమైన ఆస్తిపాస్తులు కొన్ని చోట్ల ఆయా సన్యాసుల పేర, మరికొన్ని తావుల్లో శ్రీ రజనీష్ మూల సంస్థ పేర నమోదు చేయబడినై ప్రపంచ వ్యాప్తంగా ఈ వుద్యమం ప్రసిద్ధి చెందినందువల్ల, ఈ సహజీవన కేంద్రాలు ఆధునిక పాశ్చాత్య యువతకు, ధనవంతులకు ఏవి కావాలో, ఆ అవసరాలను తీరుస్తున్నందువల్ల 'సహజీవనం' కోసం ప్రాకులాడుతున్న వారి సంఖ్య దిన దినం పెరుగుతున్నదే కాని, తరగడం లేదు. అది కూడా సర్వాస్తులను ఆచార్య రజనీష్ పాదార్పితం చేసి, తరించాలనే వారి సంఖ్య అధికంగానే వుంది. అంతేగాక, ఈ సంస్థ యొక్క ఆర్థిక సామ్రాజ్యంలో అంగోపాంగాలు అనేకం వున్నాయి. ఆకర్షణీయమైన పదజాలంతో నిర్వహించే కోర్సులకు వసూలు చేసే రుసుము మాత్రమేగాక, స్వచ్ఛంద విరాళాలు, ప్రతి కేంద్రం సమీపంలో వెలసిన ఖరీదైన కార్యాలయాలు , ఆధునిక వస్తు విక్రయ శాలలు, ప్రయాణ సౌకర్యాలను చూచే 'కల్పతరు' అనబడే వ్యాపార సంస్థ మొదలైనవి ఈ ఉద్యమ ఆర్థిక సామ్రాజ్యంలో కొన్ని విభాగాలు మాత్రమే. ప్రపంచమంతా తాను బ్రతికివుండగనే, తన పేరు ప్రతిష్ఠలు వ్యాపించాలనే రజనీష్ కోరిక తీరిందనే చెప్పాలి. తుదకు కమ్యూనిష్టు దేశాలలో సైతం ఈ సన్యాస సహజీవన కేంద్రాలు తెరవెనుక భాగోతంగా నడిపింపబడుతున్నాయని 'మా ముక్త' తెలియచేసింది.

'భూతలంలో స్వర్గం' అనే నినాదాన్ని ప్రపంచ వ్యాప్తంచేసి, దాన్నొక ఉద్యమంగా రూపొందించి, జవజీవాలు చేకూర్చి పోషించడం మాత్రమేగాక తనపై వచ్చిన, వస్తూవున్న తీవ్రారోపణలను సైతం లెక్కించక, ఆయా దేశాల్లో ప్రభుత్వ పత్రికలను కూడ ఎదుర్కొని ఇంతటి ఆధ్యాత్మిక అలజడిని కలిగిస్తున్న ఆచార్య రజనీష్ వయసు మొన్న డిశంబరు 11వ తేదీకి యాభైఅయిదు సంవత్సరాలు. ఆయన జననం 1931 డిశంబరు 11. మొత్తం పదముగ్గురు సంతానంలో ఆయన జ్యేష్ఠుడు. ఈయనకు అయిదుగురు సోదరీలు, ఏడుగురు సోదరులున్నారు. జన్మస్థలం మధ్యప్రదేశ్‌లోని జబల్పూరు సమీపంలో ఒకానొక కుగ్రామం. 1984లో

ఆర్థిక ఇబ్బందులవల్ల తన తండ్రి బాబూలాల్ మొత్తం కుటుంబాన్ని గర్దార్వారకు తరలించాడు. రజనీష్ విద్యాభ్యాసం ఇక్కడే కొనసాగింది 1944-51 మధ్య కాలంలో కళాశాల విద్య ముగిసినప్పటికీ అనేక కారణాలవల్ల ఆ పైచదువు ఆలస్యమైంది అయినా 1959లో జబల్పూరు విశ్వవిద్యాలయంలో భారతీయ తత్వశాస్త్రాన్ని అభిమానాంశంగా ఎమ్ ఏ. పట్టాన్ని తన తరగతి అంతటిలో ప్రథమ శ్రేణిలో స్వీకరించాడు ఆ పిదప ఎనిమిది సంవత్సరాలు అనుబంధ కళాశాలల్లో తత్వశాస్త్రాచార్యులుగ ఉద్యోగించి, 1966లో వృద్యోగంనుండి శాశ్వతంగా విరమించుకొన్నాడు ఇందుకు కారణం తన శేషజీవితాన్ని ఆధ్యాత్మికరంగంలోనే గడపాలనే బలీయమైన కోరిక.

తన ఏడవ ఏటనే తనకు విశ్వచైతన్యానుభవం కలిగిందని శ్రీ రజనీష్ ఆ తరువాత వెల్లడించాడు అంత చిన్నవయసులో కలిగిన అనుభవాన్ని ఆ పిదప బహుకాలానికి తు. చ తప్పక వివరించగలగడం కూడ అల్పవిషయం కాదుమరి! మరొక అనుభవం సరిగా ఇరవై ఒకటవ సంవత్సరంలో కలిగిందట. జబల్పూర్ లోని భాన్వర్తాల్ ఉద్యానవనంలో పగలు రాత్రి తులనాత్మకంగా వుండే మార్చి 21వ తేది సంభవించింది. ఆది శుభదినమైనందున ఆనాటి అనుభవాన్ని, జ్ఞానాన్ని ప్రజానీకానికి పంచడంలో ఆయన కృతకృత్యుడౌతున్నాడని ఆయన శిష్యవర్గం యొక్క ప్రగాఢ విశ్వాసం ఈ అనుభవాన్ని వర్ణిస్తూ ఆచార్య రజనీష్ 'నా పాదాల క్రింద భూమి గిర్రున తిరిగిపోయింది. నా ఆధారానికి సహాయకరంగా వున్న సాధనాలు కూలిపోయాయి దైవ మందిరం నన్ను సమీపించినట్లు అనుభూతి కలిగింది. అది ఆదిమధ్యాంతాలు లేని ఒక అపూర్వస్థితి' అని పేర్కొన్నాడు. ఆ తరువాత తానొక చెట్టుమీద కూర్చుండి ధ్యానిస్తూవుండే తన ఆత్మ అక్కడ వుండగనే శరీరం నేలమీద పడిపోయినట్లు గమనించాడు. ఈ సంఘటనను పై రెండు అనుభవాలతో పోల్చిచూచాడు ఆచార్య రజనీష్. ఆ అనుభవాలు ఆయనలో అనేక నిర్ణయాలకు దారి తీయడంతో తనదైన వేరొక గమ్యాన్ని చేరుకోవాలనే తపన ఆయనలో అధికమైంది. అనిర్వచనీయమైన గందరగోళపరిస్థితి హృదయాన్ని ఆక్రమించింది. కాగా ఆధ్యాత్మిక పునరుజ్జీవనాభివృద్ధిని-అందునా సక్రియ క్రొత్త ధ్యాన ప్రక్రియద్వారా-సాధించడానికి కృతనిశ్చయుడైనాడు. తాను జైనమత సంప్రదాయానికి చెందినవాడైనందువల్ల మొదట జైనమత వ్యాఖ్యాన ప్రబోధకునిగ ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రారంభించాడు ఆచార్య రజనీష్.

హిందీ మాతృభాష కావడంవల్ల, ఆంగ్లంలో విద్యాభ్యాసం కొనసాగడంవల్ల రెండు భాషలపై అధికృత, అజమాయిషీని పొంది, జైన మత ప్రసంగికునిగా వున్నపుడే, గొప్ప ఆశు ప్రసంగిగా, విషయసేకరణ, వర్గీకరణ, విశదీకరణలో అందెవేసిన చేయిగా పేరుప్రఖ్యాతల నార్జించినపిదప దేశాటనంచేస్తూ, ఆశ్రమాన్ని నిర్మించి తద్వారా తన స్వీయానుభవ ప్రచారం కొనసాగించాలని నిశ్చయంచేసి కొన్నాడు. ఆ ఫలితంగానే ఆయన పూనే నగరాన్ని ఎన్నిక చేసుకొని, ఆశ్రమాన్ని నిర్మించాడు

ఆయనపై వెలువడిన రచనల సంఖ్య లెక్కకుమించివుంది ఆయన వ్రాసి ప్రచురించినవిగాని, ఆయన జీవిత చరిత్రలుగాని, బోధలు గ్రంథాలుగాగాని, విడియో కేసెట్ల రూపంలోగాని, అసంఖ్యాకంగా ప్రజానీకం ఉపయోగిస్తున్నారు. వీనిని పరిశీలించిన వారికి మొదట ఆశ్చర్యాన్ని కొలిపే విషయం, ఆయన గత జన్మలను గూర్చిన పూర్వజ్ఞాన పరిచయం. తనకు అంతకు ముందు సంభవించిన జన్మల సంగతి అలా వుంచండి. ప్రస్తుత జన్మకంటె ముందుజన్మ 700 సంవత్సరాల క్రితం, అంటే దాదాపు 13 వ శతాబ్దపు తుది భాగంలో జరిగిందని రమారమి 106 సంవత్సరాలు జీవించాడని, అపుడు కూడ తాను అధ్యాత్మిక విషయ పరిజ్ఞాన ప్రచారకుడేనని ఆయన భావం. అపూర్వంగా కొనసాగిన ఆయన గత జీవితంలో తన దీక్ష ఫలించి, బ్రహ్మైక్యం పొందడానికి మూడే మూడు దినాలుండగా ఆయన హఠాత్తుగా హత్యగావింపబడినందువల్ల బ్రహ్మైక్యం పొందలేకపోయాడని, ఆ ఫలితంగా ఈ జన్మ ప్రారంభమైందని రజనీష్ విశ్వాసం. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన మా ఆనందమయి గతజన్మలో తనకు తల్లిగా పరిచర్యలు చేసిందని రజనీష్ సూచన. ఈ విషయాన్ని గూర్చి మా ఆనందమయి 700 సంవత్సరాలనాటి జన్మలో కూడ రజనీష్ ఆదర్శప్రాయమైన ఆధ్యాత్మిక జీవితాన్ని జీవించిన మహా మనిషి అని ధృవపరుస్తూ వివరించింది. 'మా' అసలు పేరు మదన కున్వార్ పరేఖ్.[2]

రజనీష్ చెప్పే సిద్ధాంతాన్ని, వివరణ ననుసరించి మానవునిలో చేతనస్థితికి ఏడు పొరలుంటవి అందు అయిదవ పొర లేక స్థితి ప్రారంభమైన మీదట

2 **Ma Ananda Prem**, *Bhagavan Sri Rajnish in Gurus Godmen and Good People*. **Kushwant Singh p** 7.

స్వయంసిద్ధ కార్యక్రమం ఆరంభమౌతుంది ఆ విధంగా పంచమస్థాయిని చేరితే, ఆ తరువాత రైకొనబోయే జన్మను గూర్చి జాగ్రత్త వహించవచ్చు. ఆధ్యాత్మిక ప్రబోధకుడు (గురువు) అనేక జన్మలలో, తన అనుచర వర్గాన్ని నడిపించడానికి అవసరమైన సిద్ధపాటును పొందుతాడని ఆయన ప్రకటించాడు అజ్ఞానంలో మునిగి తేలుతున్న అమాయక ప్రజలను కడతేర్చి, పునరుద్ధరించుటకే ఆయన జన్మించాడు. కాని జన్మరాహిత్యపరంపరలో భాగంగా కాదని శిష్యవర్గానికి ప్రబోధించాడు. అలానే అవిద్యతో, అజ్ఞానంతో జీవిస్తున్న కోటానుకోట్ల ప్రజలకోసం యింకా తాను జన్మల నెత్తవలసిన అవసరం వున్నదేమో ఆలోచించి. అట్టి అవసరంవుంటే ఆ దీనజనోద్ధరణకోసం తాను ఎన్ని జన్మల నెత్తుటకైనా సంసిద్ధమేనని, 'సంభవామి యుగే యుగే' అనే శ్రీకృష్ణ సూక్తికి అర్థమదేనని ఆయన దృఢనమ్మకం. ఇలా జన్మలను స్వీకరించడం లేదా వదులుకోవడం అనే శక్తి అందరికీగాక ఏ కోటి కొక్కరికి వుంటే వుండవచ్చునని సూచించాడు తాను పొందిన అట్టి సర్వోత్కృష్ట మైన అనుభవాన్ని అందరికీ పంచడంకన్న తనకు పరమావధి లేదని ఆయన గట్టి నమ్మిక.

ఆయన ప్రసంగాలు, వ్రాతలను బట్టి, గత జన్మలో ఆయన వేర్వేరు ఆధ్యాత్మిక అనుభవైక వేద్యుడని తెలుస్తున్నది అనేక యోగమార్గాలను నేర్చి, అభ్యసించినవాడు. అందు హిందూ యోగశాస్త్రాన్ని, బౌద్ధ ధ్యాన తాంత్రిక శాస్త్రాల ప్రబోధాలను, సూఫీ, టోయిస్టు, జైన మొదలైన వేర్వేరు మతానుభవా లను జీర్ణించుకున్న మూర్తి గాలిలో మిళితమైవున్న ఆయా మత వ్యవస్థాపకుల యొక్క సూక్తిముక్తావళిని గ్రహించి అనుభవించుట ద్వారా ఈ అపూర్వ జ్ఞాన సంపత్తిని, అనుభవసిద్ధిని పొందినాడని ప్రకటిస్తూ, అట్టి సదభ్యాసాలను పునరుద్ధ రించి అజ్ఞానులను ఆధ్యాత్మిక విజ్ఞానులుగా చేయుటే తన ప్రస్తుత జన్మకు ముగింపు, ధ్యేయం అని రజనీష్ ఖండితంగా ప్రకటించాడు.

నేడున్న మతాలన్నీ కూడ మత సారాంశాన్ని మరచి మానవకోటిని తిక మక పెడుతున్నందువల్ల, 'మతం' అంటే ఏమిటి అని ప్రశ్నించాడు. మానవ మానసిక చేతన స్థితిని అది ఏ స్థానం నుండి పతనమైందో ఆ జీవాధారస్థితికి ధ్యానం ద్వారా తీసికొనివచ్చి దైవాత్మగా, దైవ ప్రతిరూపంగా మానవుని పునః

నిర్మించుచే మతం యొక్క పని- అని మతానికి సరిక్రొత్త నిర్వచనాన్ని సూచించాడు రజనీష్.[3] ప్రతివ్యక్తిలో నిద్రాణంగా వున్న ఇట్టి కార్యసాధనాశక్తిని మేల్కొల్పుచే గురువు యొక్క కర్తవ్యమని ఆయన నమ్మిక. అందువల్ల బోధించడానికి గాక, ప్రజల్లో జాగృదావస్థను కలిగించడానికే తన ప్రస్తుత అవతారోద్దేశ్యం. 'మిమ్మును మీరు నాకు లొంగర్చుకొని సమర్పించుకొనుడి. నేను మీలో నిద్రావస్థలో వున్న యీ ఆధ్యాత్మికాంశను మేలుకొలిపి పునః చైతన్యమూర్తులనుగా తీర్చిదిద్దుతా' ననునది ఆయన ప్రబోధం, హెచ్చరిక, ఆహ్వానం కూడ.

ఆయన ప్రబోధించే ధ్యానయోగం సనాతన అధునాతన ప్రక్రియల సమ్మేళనం. ఆధునిక యాంత్రిక ప్రపంచ నడకవల్ల ఈనాటి వ్యక్తి మానసిక వత్తిడులకు లోనై నిరాశా నిస్పృహపూరితమైన జీవితాన్ని కొనసాగిస్తున్నందువల్ల సనాతన యోగ ప్రక్రియలు అట్టివారికి సౌకర్యాన్ని కలిగించలేవుగనుక, తాను అనేక ఆధునికప్రక్రియలను ప్రబోధిస్తున్నానని సూచించాడు. అందొకటిఅరిస్టాటిల్ క్రీస్తుకు పూర్వమే సూచించిన రససమపార్జన, ప్రక్షాళన ప్రక్రియ- కేథార్సిస్. మనసు నిండా అలుముకొన్న అనేక విషయాలను బయటకు నెట్టివేసి మనసును సంపూర్ణంగా శూన్యస్థితికి నడిపించడం. అలా మనసును సర్వసంపూర్ణంగా శూన్యస్థితికి చేర్చలేకపోతే, ఏ ధ్యానంకూడా పనిచేయడం సులభ సాధ్యంకాదు. ఆ విధంగా మనసు శూన్యమైన స్థితిలో ధ్యానానికి అవసరమైన పునాది ఏర్పడుటే గాక, అది శక్తివంతమౌతుంది. ఈ క్రియనే కొందరు 'కుండలీని' అని పిలవడం కద్దు. ఒకసారి ఈ కుండలీనిని మేల్కొలిపిన మీదట అది మానవ దేహంలోని సర్వాంగోపాంగాలను చైతన్యవంతం చేస్తుంది. శరీరంలోని అణువులు, మనోద్రేకాలు, హృదయ వ్యధలు, లైంగిక కార్య ప్రేరణ కేంద్రాలు, మానసిక పొరలు మొదలైన భాగాలన్నీ శక్తిసమన్వితాలుగా రూపొందగలవు ఆ విధంగా నరాల వత్తిడిని తగ్గించి, మానసికోద్రేకాలను సడలించి, శారీరకంగా సమస్త అవయవాలను సంయమ, సమన్వయ స్థితికి చేర్చి మొత్తం దేహాన్ని సర్వావయవ సంఘటిత శక్తిగా రూపొందిస్తుందని, ఇట్టి ఆనందదాయకమైన పరిణామం మొత్తం మానవ జీవితంలోనే అత్యున్నతమైన సంభవమని, ఆ స్థితిని చేరితేనే ఏ వ్యక్తి అయినా

3. *Ibid*. p 9

మరో వ్యక్తిని లేదా మరో జీవిని ప్రేమించడం సాధ్యపడుతుందని, ఆధునిక జీవిత విషమ పరిస్థితికి మూలకారణం ప్రేమలేనితనమని రజనీష్ తన అనుచరులకు, వారి ద్వారా సమస్త మానవకోటికి సందేశాన్ని అందిస్తున్నాడు అంధకార తలంపులవల్ల, నిరాశా నిస్పృహల వల్ల భారభరితమైన జీవితాలకు తరణోపాయం తన ధ్యానయోగమని, పరిణామాలకు అలవాటుపడిన మీదట వ్యక్తి తేలికపడిన- అనిర్వచనీయమైన, అనుభవంలోనికి మరింత ధ్యానయోగ జ్ఞానార్జనకు పరుగులు తీస్తాడని, అట్టి ఆత్మల ఆకలి తీర్చి, తృప్తిపరచి పంపడమే తన ప్రస్తుత కర్తవ్యమని ఆయన తన కర్తవ్యాన్ని నిర్వచించాడు.

ఆయన తన అనుచరులకు ప్రబోధించి, ఆచరింపచేసే ప్రక్రియ 'రజనీష్ ధ్యానయోగ'గా తెలియబడింది. ఇందు నాల్గు దశలున్నవి. ఒక్కొక్క దశలో అభ్యాసి, కనీసం పది నిమిషాలు గడపవలసి వుంటుంది. మొదటి దశ నిలుచుండి త్వరితంగా దీర్ఘశ్వాస తీసికోడం. అన్వేషిలో నిద్రావస్థలోవున్న ఆధ్యాత్మిక శక్తిని ఈ దీర్ఘ శ్వాస మేలుకొల్పుతుంది దీనినిబట్టి రజనీష్ ధ్యానయోగలో కుండలిని విధానాన్ని జోడించాడని చెప్పవలసి వస్తుంది. రెండవ దశలో ఇంతకు ముందు వర్ణించిన మలిన ప్రక్షాళనంతో అవాంఛిత విషయ విసర్జనంవల్ల మనసు శూన్య స్థితికి చేరుతుంది. ఈ స్థితిలో అన్వేషిలేదా అభ్యాసి తనకు నచ్చిన ఇష్టమైన పద్ధతిలో తనను తాను వ్యక్తం చేసికొంటాడు. ఈ వ్యక్తీకరణ సాధనాలు గావు కేక, రోదనం, అనిర్వచనీయ నృత్యం, లేదా వేర్వేరు దేహ కదలికలు. ఈ చర్యలు అభ్యాసిలోని నాడీమండల సడలింపుకు దోహదం చేస్తాయి. మూడవ దశలో అభ్యాసి 'హూ, హూ, హూ' అని మంత్రాన్ని వల్లె వేస్తాడు. అది నిశ్శబ్దంగా జరుగుతుంది, కాని అభ్యాసి తన శక్తినంతా కూడదీసికొని, మంత్రోచ్చారణ చేయవలసి వుంటుంది. అలా 'హూ' అని నిశ్శబ్దంగా శక్తివంతంగా ఊదేపుడు అభ్యాసి శ్వాసకోసం, నాడీమండలం తేలికపడి, అంతర్య శక్తిని మరింత దృఢంగా ప్రేరేపిస్తాయి. ఆ పిదప సంభవించేది నాల్గవ దశ. ఈ దశలో సంపూర్ణ ఆనందాన్ని పొందుతాడు. ఈ స్థితిని చేరడానికి దగ్గర దారులు గాని, మంత్ర తంత్రాలు గాని లేవు ఈ స్థితిలో సాధకునిలోని అహం కరిగిపోయి ప్రతి అన్వేషి ప్రేమమయునిగా రూపొందుతాడు. దీనినే ఆచార్యుని ధ్యానయోగమర్మమని అనుచరులు విశ్వసిస్తున్నారు.

అయితే, ఇది ఒకేసారి జరిగే కార్యం కాదు. ఆయా వ్యక్తులు ప్రదర్శించే నేర్పునుబట్టి. ఉత్సాహాన్నిబట్టి క్రమంగా కొనసాగే ప్రక్రియ. వ్యక్తి సంపూర్ణ సిద్ధపాటుతో సమగ్రంగా ధ్యానాన్ని అభ్యసించినపుడే విశ్వచైతన్య స్థితి ప్రాప్తిస్తుంది. అయితే కొందరు సాధకులు తాము సమగ్ర అనుభవ స్థితికి చేరే ప్రయత్నంలోనే కొన్ని శారీరక, అంతరంగిక మార్పులను, వారికై వారే గమనించి గుర్తించగలరు ఈ మార్పులకు ఆచార్యుడు ఆకస్మిక సంఘటనలని నామకరణం చేశాడు. ఈ విధమైన ఆంతర్య జాగృతికి సన్యాసం తొలి మెట్టు. కాషాయ రంగు వస్త్రాలను ధరించడం ద్వారా అన్వేషి తనలో క్రమక్రమంగా ఎదుగుతున్న ఆధ్యాత్మిక సమగ్రతాభివృద్ధిని లోకానికి చాటిచెప్పుతున్నాడని వారి ఊహ. ఇట సన్యాసం అంటే కేవలం భార్యబిడ్డలకు, సంసారలంపటంకు దూరంగా వుండి పోవడం కాదు. స్వయం పరిణామ దశలో ధ్యాన నిమగ్నమైన జీవితం అని స్వీయ అర్థం. జ్ఞానోజ్జీవనమే సన్యాసం ఈ ఉజ్జీవనం లోకాన్ని గాక, లోకంతో సంబంధంవున్న వానిని విసర్జించడానికి ప్రేరేపిస్తుంది. ప్రపంచం ఎక్కడ వుందో అక్కడే వుంటుంది. కాని దానిని గూర్చిన అవగాహన సాధకులలో మారి పోతుంది.[4] ఇదే సన్యాసం అని రజనీషు యొక్క వివరణ.

ఆయన వ్రాతల్లో, బోధల్లో కనిపించే మరో ప్రధానాంశం సాధకులు సంపూర్ణంగా గురువులకు లోబడుటకు చెందినది. గురుశిష్యుల మధ్య పరస్పర ప్రేమ విశ్వాసాలు లేకపోతే సన్నిహితోపదేశం సాధ్యంకాదు గనుక వీరుభయులు పరస్పరం ఆకర్షితులు కావాలని, అట్టి ఆకర్షణకు మూలకారణమైన ప్రేమ ప్రగాఢమై వుండాలని ఆయన సూచన ప్రేమరహితమైన గురుశిష్య సంబంధాలు నిష్ప్రయోజనం. ఎందుకంటే గురుశిష్య సంవాదం హృదయం మరో హృదయంతో గల అనుబంధంవల్ల కొనసాగే వ్యాపారం. ప్రేమనుగూర్చి రజనీషు విస్తారంగా వివరించినట్లు తెలుస్తున్నది. ప్రేమలో ఇద్దరు వ్యక్తులు ఏకమౌతారు. అది దైవలక్షణం. ప్రేమవల్ల సహజంగా కలిగే ప్రేరణ లైంగిక సంభోగానికి దారితీస్తుంది ఈ విధమైన అంతరంగిక ప్రేరణవల్ల ఇద్దరు ఎంత సన్నిహితంగా వెళ్ళగలిగితే వారంతగా ప్రేమికులు. ప్రేమ ఒకరిలో మరొకరిని ఏకంచేసే ఔషధం "నీవు

4. *Ibid.* p. 11.

ఎవరినైనా అమితంగా ప్రేమిస్తే, ఆ ప్రేమకు కారణమైన వ్యక్తి ద్వారా నీవు నిరాకారియైన దేవునిలో ప్రవేశిస్తావు. ఎక్కడ ప్రేమలేదో అక్కడ రాతిగుండె వుంటుంది" అని ఆచార్యుని ప్రబోధం.[5]

ప్రేమనుగూర్చి రజనీష్ గావించిన ఇట్టి వ్యాఖ్యానాలే అనేక అపార్థాలకు తావిచ్చినట్లు గ్రహించవచ్చు. పశ్చిమ జర్మనీకి చెందిన ఒక యువతి పూనాలోని రజనీష్ ఆశ్రమంలో చేరినపుడు తన కయిష్టంగా, బలవంతంగా సామూహిక రతిక్రీడ జరిగి మూర్ఛపోతే, ఆ స్థితినే సర్వోత్కృష్ట ఆధ్యాత్మిక అనుభవమైన సమాధిస్థితిగా అభివర్ణించి, ఎవరు ఆమెను చెరిచారో వారే గంతులువేస్తూ, కేరింతలుకొట్టి సంతోషించిన సంఘటన ఆంగ్ల పత్రికల్లో ప్రధాన ప్రచారం పొందడం పాఠకులకు గుర్తుండేవుంటుంది. దీనినే నిర్వాణస్థితిగా అభివర్ణించి ఆనందించే లైంగిక పైశాచిక ప్రవృత్తి ఈ ఆశ్రమంలో ప్రవేశించడం అత్యంత శోచనీయమేగాదు, అవశ్య గర్హనీయం కూడ ఇట్టి రాక్షసకృత్యాన్ని గూర్చి 'అపరభగవానుల'కు నివేదింప మందస్మితం చిందించి మిన్నకుండడం ఆధ్యాత్మిక జిజ్ఞాసువుల ఆలోచనలకందని విషయం.[6]

ఈయన బోధించే ఇతర విశేషాంశాలలో సహజయోగ ఒకటి స్వాభావికం, అయత్నకృత ఫలితమైన ఈ యోగం ప్రకారం అభ్యాసి అప్రయత్నంగా నిశ్చలంగా అలా వుండిపోతే, తను నమ్మిన గురువునుండి బయల్వెడలే శక్తి ఆ శిష్యుని ఆధ్యాత్మిక అవసరాలను తీరుస్తుంది. చేయవలసిందల్లా ఎవరికి వారు తమను తాము తమ గురువుకు సంపూర్ణంగా లోబరచుకొని, ఆయన ఆజ్ఞలను శిరసావహించడమే! ఇలా జరిగినపుడు అభ్యాసి యొక్క శక్తి పునరుజ్జీవం పొంది, ఊటనుండి చిమ్మివచ్చే నీటివలె అతనిలో జాగృతీకరణం సంభవిస్తుంది ఇట్టి సజీవశక్తి ఆచార్యునినుండి తరుచు బయల్వెడలి సిద్ధంగావున్న శిష్యవర్గాన్ని ఆవరిస్తుందని వారి దృఢమైన నమ్మిక సాధకుడు ధ్యాననిమగ్నుడై వుండేందుకు అవసరమైన శక్తి నిరంతరం గురువు నుండి ఎపుడు విడుదలౌతూవుంది. ఈ కృపా కార్యాన్ని అనుభవించడానికి శిష్యవర్గం ఎల్లప్పుడు సంసిద్ధమై వుండాలి ఇలా

5. *Ibid* p 12.
6. See *Sunday* 1980 **February** 24.

గురువునుండి దైవికశక్తి శిష్యునికి ప్రాప్తించే ప్రక్రియను 'శక్తి పథ్'గా రజనీష్ అనుచరులు అభివర్ణించడం గమనించవలసిన విషయం ఎందుకంటే 'శక్తి పథ్' తాంత్రిక విభాగానికి చెందిన ప్రయోగం. ఈ శక్తిని విడుదలచేయడానికి గురువు తనకై తానుచేసే ప్రయత్నంకూడ లేదు. ఒకసారి వ్యక్తి గురుత్వ స్థాయికి ఆధ్యాత్మికంగా ఎదిగిన మీదట–సిద్ధుడైన పిమ్మట–ఈ శక్తి విడుదల కార్యక్రమం అప్రయత్నంగా, అయత్నకృతంగా దానికై అదే కొనసాగుతూ వుంటుంది దీనినే తాంత్రికయోగలో 'దైవసిద్ధ స్థితి' అని సంబోధిస్తారు.

అయితే ఇట్టి శక్తిని ఎరగా చూపి ధనార్జనచేసే వారిని శ్రీ రజనీష్ విమర్శించినట్లు, ఆ విధానానికి తాను వ్యతిరేకి అయినట్లు శిష్యవర్గం యొక్క అభిప్రాయం. దేవుడు ఎవరియెడల పక్షపాతికాడు. అలానే గురువు కూడా కొందరి ఎడల పక్షపాత వైఖరిని అవలంబించడానికి వీలులేదు. ఆశించిన ప్రతి వ్యక్తికి తరతమ విచక్షణలేకుండ ఈ దైవాంశ లభించాలనేది ఆయన లక్ష్యమట. ఇట్టి మర్మ గర్భితమైన శక్తి ఆయన నుండి సమృద్ధిగా వెలువడుతున్నందు వల్లనే, దానిని అనుభవిస్తూ, అసంఖ్యాక శిష్యవర్గం ఆయన గురూత్వాన్ని కోరి, దేశ దేశాలలో ఆరాధిస్తున్నారని ఆయన అనుచరుల దృఢ విశ్వాసం ఆయన శిష్యుల్లో చేరినవారు అత్యున్నతమైన విద్యా విషయక యోగ్యతలను సంపాదించిన అనుభవనీయులే మరి.

అమెరికాలోని బర్క్లీలో స్థాపితమైన కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీని పొందిన స్వామి ప్రేమ అమితాబ్ 'రజనీష్ అసాధారణ మైన అపూర్వ ఉపాధ్యాయుడు, నేను నిర్వచింపలేని శక్తి సమన్వితుడ'ని నివాళు లర్పింప, ప్రకృతి వైద్య నిపుణుడుగా లండన్‌లో స్థిరపడిన భారతీయుడు స్వామి శ్యామ్ బోధిసత్వ 'నేను పొందిన అనుభవం వర్ణనాతీతం, ప్రస్తుతం క్రొత్తగా లోకం లోనికి అవతరించిన శిశువువలె ఉన్నాను. ఇది రజనీష్ మహత్తు' అని శ్లాఘించాడు. అయితే ఈ వుద్యమం నేడు ప్రపంచంలో తన పూర్వాపు స్థానాన్ని కోల్పోతున్నట్లు కనిపిస్తున్నది. పూనా ఆశ్రమంలో ఆనాడు చేరిన వారిలో అనేకులు అటు విదేశాలలోను, ఇటు స్వదేశంలోను ధనిక వర్గానికి చెందిన వారే గాక, ఆయా అంతర్జాతీయ నేరాలవల్ల అంతర్జాతీయ పోలీసుల బారి నుండి తప్పించు కొనగోరి ఇందు చేరిన వారుకూడా వున్నారని ప్రతీతి. ధనాన్ని వెచ్చించి సుఖ భోగాలను కొనుగోలు చేయగల కోటీశ్వరులే ఈయన శిష్యవర్గంలో అధిక

సంఖ్యలో వున్నందుచేత వారి అభిరుచులకు తగినట్లు ఆశ్రమాలు రూపొందించడం జరిగిందని, ఈ అవినీతి కార్యక్రమం అంతటికి రజనీష్ ఆశ్రమం ఒక క్షేమ కరమైన ముసుగనే ఒక తీవ్ర ఆరోపణ వున్నది. ఆధ్యాత్మిక పునరుజ్జీవనం, సహజ ధ్యాన యోగం వంటి ఆకర్షణీయ పదజాలాన్ని ప్రయోగిస్తూనే, మరోవైపు 'రక్తి ద్వారా ముక్తి', 'కామం ద్వారా రామం' వంటి నినాదాలతో అనేకులను ఆకర్షిస్తున్నారనే పుకారు కూడ ఈ ఆశ్రమ నిర్వాహకులపై వుంది. సామూహిక కామ క్రీడ వల్ల స్త్రీ పొందే అత్యధిక శ్రమ ఫలితమైన మూర్ఛ స్థితిని నిర్వాణ స్థితిగా, నిశ్చల సమాధి స్థితిగా అభివర్ణించే ఆధునిక ఆశ్రమం రజనీశ్ ఆశ్రమమే[7] ననే విమర్శ ఎంత తీవ్రమైందో పాఠకులు గుర్తించగలరు.

ఆయన బోధల సారం ఈ రూపంలో బయల్పడడంతో, ఆయనపై హత్యా ప్రయత్నం, ఆశ్రమాన్ని ఎత్తివేయాలనే నిరసన ప్రదర్శనలు పూనేలో జరిగాయి. స్వేచ్ఛా కాముకత్వాన్ని వేదాంతంగాను, విచ్చలవిడి విహార, విలాస జీవితాలను ఆధ్యాత్మికానుభవ ఫలితాలుగ, విషయ లంపటత్వాన్ని అత్యున్నత చైతన్య స్థాయిగ వర్ణించే రజనీష్ ఆశ్రమ బోధల వల్ల ఏర్పడిన వ్యతిరేకతను తట్టుకోలేక 1981 జూన్ 1 వ తేదీన పూనే విడిచి, అమెరికాకు పలాయనం చిత్తగించవలసి వచ్చింది. అక్కడ మొదట జెర్సీ సిటీలో కొంత కాలం మకాం చేసినప్పటికి తన అనుచర వర్గం అత్యంత ఆడంబరంగా, స్థానిక ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా దాదాపు నూరు చదరపు మైళ్ల విస్తీర్ణం గల 'భూతలంలోని స్వర్గం' నాలుగున్నర సంవత్సరాల పాటు ఆయన నివాసమైంది. ఇదే అత్యంత ఆధునికంగా సకల వైభోగ సమేతంగా నిర్మింపబడిన 'రజనీష్ పురం'. నాటకీయంగా పూనే నుండి పరారైన రజనీష్ ఆశ్రమం కొనసాగించే అవాంఛిత కార్యకలాపాలకు భరత వాక్యం పలికినట్లైంది, అవనిక శాశ్వతంగా పడిపోయిందని భావించిన అనేకుల ఆలోచనలు వమ్మై, క్రొత్త ఆశ్రమం అంతకంటె తీవ్ర స్థాయిలో రూపొందింది. ఆయన సంస్థ ఆరితేరిన ఆర్థిక సంస్థ. ఆయన పూనేలోని ఆశ్రమానికి తరలిన పిదప (1975-1980) ఆయన బోధలు దాదాపు 220 సంపుటాలుగా ముద్రణ పొందాయి. అమెరికా, యూరప్‌లోని ప్రచురణ సంస్థలు ఈ సంపుటాలవల్ల

7. See Parakala Pattabhi Ramarao, *op cit.*

అత్యధికంగా ధనార్జన చేయగలిగాయి. కేవలం 1980 సంవత్సరం అధికారికంగా పూనే ఆశ్రమం తన సాంవత్సరికరాబడి 15,00,000 రూపాయలని ఆయన గ్రంథాలపై నికరాదాయంగ విరాళాల ద్వారా అదే సంవత్సరం రు. 47,47,000/- ముట్టినట్లు ప్రకటించింది. ఈనాడీ ఆశ్రమం కొత్త సన్యాస సహకార జీవన సమాజంగా స్థిరపడివుంది.[8]

ఆయన 1981 జూన్ 1 వ తేదీ వరకు పూనేలో ఉన్నంత కాలం ప్రపంచంలో ఇదొక్కటే ఆశ్రమంగా తెలియ వచ్చింది. ఆయన సాన్నిధ్యంలో ఉండి, ఆయన ప్రసన్నత ననుభవించి, బోధల నాలకించి, "ఆధ్యాత్మిక చైతన్యం" పొందడానికి ఈ ఆశ్రమం ఏకైక స్థలంగా ప్రసిద్ధి చెందింది. కాని 1979లో ఆయన ''నవ మానవ సమాజ ప్రారంభం" అనే నినాదాన్నిచ్చిన పిదప శాఖోపశాఖలై, మొదట వర్ణించినట్లు ప్రపంచమంతా ఎగబ్రాకింది. ఆరోగ్యకారణాలమిషగా అమెరికా ప్రవేశించడం వెనుక శ్రీ రజనీష్ అనుచరులు రహస్యంగా పన్నిన పథకం వుందని, ఆ పథకం మేరకే ఆయన 'పరారి', ఆ పిదప ప్రపంచవ్యాప్త సన్యాస సహజీవ సమాజ నిర్మాణం జరిగిందనే అభిప్రాయం ఒకటి జన వినికిడిలో వుంది.[9] కాగా పూనే ఆశ్రమం, భారతదేశంలోని ఆయన కార్యక్రమాలకు కేంద్రంగా కొనసాగుతూనే వుంది. 1981 వ సంవత్సరంలోనే దాదాపు 250 'సన్యాస సహజీవన కేంద్రాలు' ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడినవని మరొక అంచనా. అయితే పూనే ఆశ్రమం అంతర్జాతీయ ఆశ్రమంగా ప్రసిద్ధిచెంది, దేశదేశవాసులకు ఆశ్రయ దుర్గమైంది కాని అమెరికాలోని 'అరగాన్' రాష్ట్రంలో ఏర్పడిన రజనీష్ పురాశ్రమం నూటికి తొంబది తొమ్మిది మంది అమెరికా శిష్యవర్గానికే పరిమితంగా వుండిపోయింది. ఇంతగా ఈ ఆశ్రమాలు వ్యాపించడానికి, అనేకుల నాకర్షించడానికి కారణాలు కొంతవరకు ముందే సూచించడం జరిగింది. మరికొన్ని కారణాలీ దిగువ ఉదహరింపబడుతున్నాయి.

8. **Rajnie Bakshi**, *Rajneesh Worldwide Incorporation* **The article Published in Sunday Vol. 10. Issue 20,** 21–27. **November** 1982, **p.** 41.

9. *Ibid.*

1. ఆధ్యాత్మిక పునరుజ్జీవనం ముసుగులో జరిగే అవాంఛిత స్వేచ్ఛాకామ క్రీడ.
2. 'కామం తరువాత రామం' వంటి ఆకర్షణీయమైన ఆధునిక నినాదాల ప్రచారం.
3. ఆశ్రమ జీవిత విధానాన్ని నవీన నాగరికతకు, యువతకు, ధనికవర్గానికి సరిపడే విధంగా తీర్చిదిద్ది రూపొందించడం
4. జీవితం అనుభవించడానికేగాని, త్యాగం చేయడానికి కాదు అనే అత్యంత ఆకర్షణీయమైన నినాదం
5. అత్యంత ఆధునిక ప్రచార సాధనాలు.
6. రజనీష్ ఆశ్రమవాసులకు ప్రసాదించే స్వేచ్ఛాజీవన విధానం
7. ఆంగ్లంలో ఆయన చేసే ధారావాహిక ఉపన్యాస ప్రవంతి.

రజనీష్ బోధల సార్థకత ఆ బోధలకు ఆధార గ్రంథాల ప్రమాణం, ఆయన సూత్రీకరించి, ప్రచారం చేస్తున్న సైద్ధాంతిక, వేదాంతతత్వాంశాలపరిశీలన, పరిశోధన, తీవ్రంగా జరుగవలసి వుంది. ఆ విషయం అలావుంచండి, ఈయన ఆశ్రమ జీవిత విధానం కొన్ని నినాదాల సారాంశం భారతదేశంలో తరతరాలుగ ప్రసిద్ధి చెందిన గురు వ్యవస్థకే తలవంపులు కలిగించే విధంగా రూపొందాయనడం అతిశయోక్తిగాదు.

రజనీష్ రచనలకు ఆ రచనల, సారాంశాన్ని ఆచరణీయం చేయడానికి మధ్య అగాధాలున్నట్లు ఆయన రచనలను, అనుసరిస్తున్న కార్యక్రమ సరళిని గమనిస్తున్న వారికి బోధపడుతుంది. ప్రపంచం అంతటిలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనం అవసరం. ఆధ్యాత్మిక పరవశత్వంతో ఒక క్రొత్త మానవుడు జన్మింపనై యున్నాడు. ప్రస్తుతం ఆ క్రొత్త మానవ జన్మకు సంబంధించి పురిటి నొప్పుల ననుభవిస్తున్నా మనే[10] ఆయన ప్రకటన వాంఛనీయమే. కాని ఈ పునరుజ్జీవనం అవసరాన్ని ఇంత ఖండితంగా ప్రకటించిన ఆచార్య రజనీష్ ఆ క్రొత్త మానవ జన్మకై భూమితల్లి పడుతున్న పురిటినొప్పుల నడ్డగించాడా అనిపిస్తున్నది. ఒక లోపాన్ని కనిపెట్టినపుడు దాని నివారణోపాయాన్ని కూడా కనుగొనాలే గాని

10. **Acharya Rajneesh**, *Path to Self Realization*, **p. 1.**

తప్పుదారి పట్టించరాదు, ఆధ్యాత్మిక నవ మానవ జన్మం కోసం పడుతున్న పురుటి నొప్పులను స్వేచ్ఛా లైంగిక సంభోగ ప్రవృత్తికి అంకితం చేసినందువల్ల తాను నిర్దేశించుకొన్న గమ్యాన్ని జేరడానికి తానే తప్పిపోయినాడనవలసి వున్నది. ఆచరణీయమైన ఆధ్యాత్మిక స్థితిని సామాన్య మానవస్థాయికి తీసుకొని రాగోరిన ఈ ఆచార్యుడు తన ఆశ్రమంలో ఉన్న వారికే స్థానం కల్పించడం, ఆశ్రమ ప్రవేశాన్ని సామాన్యుల కసాధ్యం చేయడం నిష్పాక్షిక విమర్శకులకు గూడ వెగటు పుట్టించింది. ఇందుకు ఆయనచూపే కారణాలను సాదృశ్యాలను గమనించవచ్చు. ఆయన వెలిబుచ్చిన అభిప్రాయలకును, దివ్యజ్ఞాన సమాజ వ్యాపకానికి కంకణం కట్టుకుని, ఆ పిదప తనదైన స్వతంత్ర మార్గాన్ని ఎన్నుకొని, ఆ విషయాన్ని ప్రకటించి, దివ్యజ్ఞాన సమాజ చరిత్రలోనే ఉప్పెన తెచ్చిన జిడ్డు కృష్ణమూర్తి బోధలకును సాదృశ్యాలున్నవి. ఆర్థికమైన దారిద్ర్యానికి లోనై బాధపడేవారు ఆధ్యాత్మిక తృష్ణ గలవారు కాలేరని వీరుభయులు సిద్ధాంతీకరించారు[11]

ఈయన రచనల్లో బోధల్లో, కనిపించే మరోవిషయం సంప్రదాయసిద్ధమైన మతాల ఎడ అసహనం. అసహనమేకాదు, ద్వేషంకూడ. తాను పుట్టి పెరిగిన జైన మతాన్ని కూడ ఈయన పెద్దగా పరిగణించలేదు. 'సర్వం ఏకం ఏవ' అనే ద్వైత సిద్ధాంతాన్ని నమ్మి 'భిన్నత్వం' మాయా ప్రభావమని ప్రకటించాడే గాని, అంతకు మించి జీవాత్మ పరమాత్మల సంబంధాలు కాని, పారమార్థిక వ్యవహారిక స్థాయిలో వానికుండవలసిన సంబంధ బాంధవ్యాల చర్చగాని లేదు. సనాతన సిద్ధాంత సరళిని ఈయన స్పృశించడం కేవలం సనాతనధోరణి గలవారిని ఆకర్షించడానికే! అయినప్పటికి ఆ పద్ధతికూడ భారతదేశంలో జనరంజకం కాలేదు. ఈయన ఆశ్రమ ప్రవేశం పొందినవారందరూ అత్యంత ఆధునిక సుఖ భోగ విలాసాలకు అలవాటు పడినవారే.

కాగా, లైంగిక క్రియవల్ల పొందే ఆనందానికి, ఆధ్యాత్మిక పరవశత్వానికి ముడిపెట్టి ఆచార్యుడు వెలువరించే వుద్దేశాలు తాంత్రికవాదాన్ని ఆధునిక మనస్తత్వ శాస్త్రంతో జోడించడానికి చేసిన ప్రయత్నమనిపిస్తున్నది. అందుకే విశాల్ మంగల్ వాడి రజనీష్ ప్రకటించి ఆచరించే తాత్త్వికధోరణిని, వైజ్ఞానిక వాదానికి విరోధి

11. See Ramachandra Prasad, *op.cit.* p. 7.

అయినందువల్ల అది తత్త్వ శాస్త్రానికి విజ్ఞోదు కాదని అభిప్రాయపడుతున్నాడు.[12] 'కంటికి కనిపించే బహుళత్వం వెనుక, ఏకత్వం వున్నది. ఆ ఏకత్వాన్ని చేరడానికి అంతరంగికంగా శూన్యతను సృష్టించుకోవాలి' అని ప్రకటిస్తూనే 'మనలో వుండే సుఖేచ్ఛను సిచ్చెనగా వాడుకొని, ఉన్నతమైన ప్రేమాలయాన్ని చేరాలి ఆ ప్రేమాలయాన్ని చేరడమే సర్వోత్కృష్ట చైతన్యస్థితి లేదా సమాధి' అని ప్రబోధించాడు ఆచార్య రజనీష్.[13]

బ్రహ్మచర్యమే దైవావతారానికి మూలమని ప్రకటిస్తూ, ఆ బ్రహ్మచర్యం నుండి క్రొత్త సంతతి రావలసివుంది. వారే సర్వోత్కృష్ట చైతన్యస్థితిలో జన్మించే క్రొత్త సంతతి అనడంవల్ల ఒకవైపు బ్రహ్మచర్యాన్ని ప్రబోధిస్తూనే, మరోవైపు స్వేచ్ఛాసంభోగాన్ని మాత్రమేగాక ఏతత్ ఫలితమైన దుర్బీజ సంతానాన్ని క్రొత్త మానవజాతిగా ప్రకటించడం మతాత్మక ధోరణి కలవారికి సహింపుకాని విషయం.

ఆయా మతాలు లైంగిక సంభోగాన్ని ఖండించాయి. అందువల్ల నిషేధించిన దానినే అనుసరించాలనే మానవ ప్రవృత్తి అట్టి నిషేధ కార్యాలను కొనిసాగించడానికే ప్రోత్సహిస్తున్నందువల్ల మానవులు మరింత సంభోగ ప్రవృత్తికి దాసులౌతున్నారని, ఇట్టి దాసోహం మనో ప్రవృత్తియొక్క ప్రకంపనలవల్ల కలిగిన కామ వాంఛను తీర్చుకొనే ప్రయత్నంలో పుట్టిన బిడ్డలు బలహీనులు, నిరాశాపరులు, రోగిష్టులుగా పెరిగి దేశానికి భారమౌతున్నారని వాదిస్తాడు ఆచార్య. అందువల్ల ఆధ్యాత్మికతను సాధించడానికి లైంగిక సంభోగక్రియనే సాధనంగా వుపయోగించాలనే ధ్వని ఈ ప్రబోధంలో ఇమిడి వున్నట్లు కన్పిస్తున్నది.

మానవుడు యాంత్రికమైన జీవనానికి అలవాటు పడినందువల్ల ఆతని సమస్యలు, శ్రమలు ఇబ్బడి ముబ్బడి ఔతున్నాయని ఆయన వాదన. ఈ యాంత్రిక జీవనం వ్యక్తియొక్క ఆధ్యాత్మిక నేత్రాలను మూసిపెడుతున్నదని,

12. Vishal Mangalwade, *op.cit.* p. 129.

13. Acharya Rajneesh, *From Sex to Super consciousness*, p. 180.

ఆతని స్వేచ్ఛను హరిస్తున్నదని, అందువల్ల అట్టి యాంత్రిక జీవనాన్ని వీడి, తన స్థితిని తాను గ్రహించి నేటి మానవుడు కావాలనే రజనీష్ బోధను అర్థం చేసికో వచ్చు కాని, వేలాది సంవత్సరాలు ఆయా మతాలు, మతాచార్యులు ఇతర మానవ కోటియెడ క్రూరంగా ప్రవర్తించారనే ఆయన వాదనను మాత్రం గ్రహించడం కష్టం మతం తప్పక నీతి విధులను, నియమ నిబంధనలను విధిస్తుంది అలా విధించలేనపుడు అది మతం గాదు. అట్టి విధులే బాధాకరం అని భావించడంవల్ల అలా వాదించే వారి స్వేచ్ఛా ప్రవృత్తి, మతంయెడ వారికున్న ద్వేషం ప్రస్ఫుట మౌతుందే తప్ప ఆయా మతాల విలువకేమీ లోటు కలుగదు.

ప్రపంచాన్ని మంచి చెడులుగా విభజించడం అధర్మమని, అవి మనం కట్టే విలువలేనని చెప్తూ, అసలు మనుష్యుడే ప్రపంచంలో లేకపోతే మంచిచెడుల ప్రమేయమే లేదని వాదిస్తాడు రజనీష్. సమస్త సృష్టి వుంటుంది. కాని దాన్ని విలువ గట్టి, ఇది మంచి ఇది చెడు అని చెప్పే వ్యక్తి మాత్రం వుండడు అందువల్ల విలువ కట్టడం మానవ లక్షణం[14] సరిగా ఈ వాదానికి సరిపడే విధంగానే ఆయన ఆశ్రమం కొనసాగుతుందనవచ్చు. లోపల ఏం జరిగినా ఆధ్యాత్మికతానుభూతిగా చెలామణి ఔతున్నది. ఆ ముద్ర పొందిన వ్యభిచార క్రియ, మద్యపాన సేవనం, శరీర మసాజు, జుగుప్సాకరమైన వేషధారణ సమస్తం మంచిగనే వీరికి కనిపిస్తున్నది.

లైంగిక సంభోగాన్ని వాంఛింపని వ్యక్తి సత్యాన్వేషి కాలేడని, అతడొక తాత్వికుడైతే కావచ్చునని ఆచార్యుని దృఢాభిప్రాయం.[15] తత్వశాస్త్రం లోకంతో సంబంధంలేని, పారలౌకిక విషయాల యొక్క సార్థకతను ప్రశ్నించి, నిగ్గు దేల్చేదైనందువల్ల, అట్టి శాస్త్రం నిరుపయోగం నిష్ప్రయోజనమైనదనే దృఢ నమ్మకాన్ని ఆచార్య ఆయన రచనల్లో పలుమార్లు వ్యక్తం చేశాడు. అందువల్ల దేవుడున్నాడా? వుంటే ఎలా వుంటాడు? దాన్ని రుజువు చేసే పద్ధతులేమిటి? మొదలైన తాత్విక ప్రశ్నలు నిజ జీవితానికి భేదాలేగాని, సాదృశ్యాలు కావని ఆయన నమ్మకం. తాంత్రిక ధోరణి, అట్టి నిరుపయోగ తాత్విక ప్రశ్నా

14. **Acharya Rajneesh,** *Beyond and Beyond*, p 12. ff.
15. **Quoted in Vishal Mangalwade,** *op.cit.* p. 139.

పరంపరలతో గాక, కేవలం జీవిత సంబంధ విషయాలనే చర్చిస్తుంది గాన, తాను తాంత్రిక శక్తికే ప్రాధాన్య మిస్తున్నానని ఆచార్య ప్రకటన తాను నమ్మి అభ్యసిస్తున్న తాంత్రిక జీవన విధానంలో స్వేచ్ఛా సంభోగాన్ని, వివాహానికి ముందే యువతీయువకులు కలసి జీవించడాన్ని ఆయన నిరోధించడు. తాంత్రిక విధానంలో లైంగిక సంభోగం ద్వారా అతీంద్రియ చేతన స్థితిని చేరగలమనే నమ్మకమున్నందువల్ల, ఈ స్త్రీ పురుష సంభోగం స్వర్గానికి మార్గం అనే రజనీష ప్రబోధం వల్లనే, ఆయన ఆశ్రమాల్లో అట్టి అవినీతి జీవితలంపటకు అలవాటు పడిన వ్యక్తులు ధనాన్ని వెచ్చించి, ప్రవేశాన్ని పొందగలుగుతున్నారని ప్రతీతి. అందుకే ఈయన ఏ సమాజానికి, సంస్కృతికి అతకని గురువులా తుదకు పతి జామం చెందాడు.

ఆచార్య రజనీష్ ధోరణి ఆధ్యాత్మిక జీవనానికి తోడ్పడుతున్నదా లేక తాత్కా లిక భావోద్రేకాలకు లోనైన యువతీ యువకులను, ధనికవర్గాన్ని, వేలం వెర్రిగా ఆకర్షించి, వారి జీవితధ్యేయాలు వక్రించడానికి తోడ్పడుతున్నదా అనే విషయాన్ని విజ్ఞులు ఆలోచించవలసి వుంది ఆచార్యుల విపరీత ధోరణివల్ల, పూనేలో రేకెత్తిన వ్యతిరేకత 'డెర్ స్టైర్' అనే జర్మన్ పత్రికలో మొదట, ఆ తరువాత భారత దేశంలోని 'సండే' అనబడే వార పత్రికలో ప్రచురణైన విషయాలు, మత గురువులనబడే వారికి తలవంపులు కలిగించేవిగా మాత్రమే గాక, పూజనీయమైన సనాతన భారతీయ గురువ్యవస్థ పరువుప్రతిష్టలకే మచ్చగా నిలిచిపోయేవి. వీరు పూనే నుండి వెళ్ళి అమెరికాలో ఆరగన్‌లో స్థాపించిన ఆశ్రమం, అక్కడ కార్య కలాపాలు, ఆ ప్రజలు ప్రభుత్వం తెచ్చిన వత్తిడి, తుదకు ఆయనకు అన్ని విషయాలలోను, కుడి భుజంగా వున్న మా ఆనందశీల యొక్క పలాయనం, ఆవిడ ఆ పిదప ప్రకటించిన విషయాలు అనేకులకు కనువిప్పు కలిగించాయి.

తమకున్న సర్వస్వాన్ని ఆచార్య పాదాంకితం చేసి ఎందరో ఈ తాంత్రిక సంభోగం చేత లభిస్తుందని చెప్పబడే అత్యున్నత పారమార్థిక స్థితిని చేరడానికి త్యాగంచేసి వచ్చిన వారిలో కొందరు అక్కడ జరిగే జుగుప్సాకరమైన క్రియలచే ఆకర్షితులైతే మరికొందరు భీతిల్లి, భగవాన్ సందర్శనం అంటే ఇదా అని పలాయనం చిత్తగించారు. ఆకర్షితులైన వారికే మా ఆనందశీల ప్రబోధం కను విప్పు కలిగించింది. మా ఆనందశీల ప్రస్తుతం ఈ గ్రంథరచనా సమయంలో ఈ

రచయితవున్న పశ్చిమ జర్మనీలోనే అజ్ఞాత స్థలంలో వున్నది. ఈయన వ్యవహారాన్ని సంపూర్ణంగా పరీక్షిస్తున్న మరొక పత్రికా రచయిత ఈతని వుదంతంపై వెలువరించిన విషయాలు అత్యంత గమనీయమైనవి.[16]

> మతం అనేది ఒక వ్యాపార క్రియగా పరిణామం చెందింది. బుద్ధ, జీసస్ క్రీస్తు, మహమ్మద్ మొదలైన మతవ్యవస్థాపకులవలె మత సమాజ నిర్మాణానికి గాక నేటి బాబాజీలు భగవానులు తమకున్న ఆధ్యాత్మిక నైపుణ్యాన్ని వెలకు పెట్టి అమ్మి వ్యాపార సమాజాన్ని నిర్మించి, ధనం కూడబెడుతున్నారు. ఇట్టి వ్యాపారం ఒక దేశానికి పరిమితంగాక అంతర్జాతీయ ప్రసిద్ధి చెందుతున్నది. అందుకు ఆశపోతులైన వార్తాపత్రికలు, విమాన యానాలు, ప్రజల్లో పాతపై రోత క్రొత్తపై గల ఆకర్షణ ప్రధానంగా తోడ్పడుతున్నాయి.

వీరిలో కొందరు మతసంతలో సొమ్ము చేసికొనే చిల్లర వ్యాపారులే గాని ఆధ్యాత్మిక సిద్ధులుకారని, ఈ భగవానులు, బాబాజీలు, తమ ధోరణివల్ల ప్రజానీకానికి ఆధ్యాత్మిక తృష్ణ తీర్చ్చడం లేదు అని గమనించవలసి వుంది. అట్టి స్వీయ పరిశీలన ప్రారంభం కాకాపోతే, ఈ ఉద్యమాల ప్రభావం వల్ల మంచికన్న చెడే అధికం జరిగే ప్రమాదం వుంది.

రజనీష్ వక్రించిన మేధతో నవనవోన్మేషులైన ప్రపంచయువతను తనను ఆశ్రయించిన ధనికవర్గాన్ని పెడత్రోవ పట్టించడమేగాక తానొక పెద్ద బూర్జువాగా తన వుపన్యాసాలలో ప్రత్యక్ష మౌతున్నాడు. ఈయనకు ప్రజాస్వామ్యం, సామ్యవాదం సాంఘికవాదం గిట్టుబాటు కాదు. ఈయనొక సుఖభోగి, స్వేచ్ఛావ్యాపారి అయినందువల్ల ప్రజాస్వామ్యంలో ప్రజల నిర్ణయంగాక, నియంతల నిర్ణయాలనే ఆహ్వానిస్తాడు. అందుకే ప్రజాస్వామ్యంవల్ల స్వాతంత్ర్యం లభిస్తుంది. ఆ స్వాతంత్ర్యం ఆయా వ్యక్తులను పెడదారికి మళ్లిస్తుంది. అందువల్ల నియంతల

16. *The German Tribune.* **No.** 1200 **October,** 1985 **p.** 12.

పాలన పెట్టుబడి విధానమే మంచిదని వాదిస్తాడు రజనీష్, 17 ఇట్టి ప్రజా వ్యతిరేక మైన అభిప్రాయాలను వెలువరించే వ్యక్తి ప్రజలను కడతేర్చడానికి వేంచేసిన భగవానుడనని ప్రకటించుకోవడం విడ్డూరంగాక మరేమి ఔతుంది?

ఈ ఆచార్య రజనీష్ ధోరణి 'విప్లవాత్మకం' అని కొందరి భావం. ఈ విప్లవం సనాతన సిద్ధాంతాలకు, ఆచరణలకు వక్రభాష్యం చెప్పి, తన కిష్టమైన ధోరణిలో మలచడంలోనా చెడును మంచిగా భ్రమింపచేసి అమాయకులను ఆకర్షించడంలోనా? అయితే అది విధ్వంసాత్మకమైన విప్లవం అట్టి విప్లవాలు అవాంఛితాలు.

ఆచార్యుకు ఆంగ్లేయంపై, హిందీభాషపైగల ఆధిక్యతవల్ల భారత తత్త్వ శాస్త్ర పరిచయంవల్ల ఏ విషయాన్నైనా, జనాకర్షణగా వివరించి చెప్పగల వక్తగా గుర్తింపబడినాడు రజనీష్ కన్న సున్నితమైన ప్రతిభ వివేచన గల హిందూమత గురువులు ఆధునికుల్లో లేరని కొందరు వాదింపవచ్చు. కాని అట్టి మంచిలక్షణాలు సమాజ నిర్మాణానికి తోడ్పడినపుడే వాటి విలువ పెరుగుతుంది, బంగారుకు తావి అబ్బినట్లౌతుంది. ఈతని వుద్యమ భవిష్యత్తు ఎలా వుంటుందో వేచి చూడవలసి వుంది.

17. Acharya Rajneesh, *Beware of Socialism*, New Delhi : Orient Paper back 1978.

# స్వామిజీలు

## 1. స్వామి శివానంద : దివ్య జీవన సమాజం[1]

స్వామిజీ అసలు పేరు కుప్పుస్వామి అయ్యరు. జననం 1887 వ సంవత్సరం, సెప్టెంబరు 8. జన్మస్థలం తమిళనాడులోని పట్టమడై, తండ్రి వేంగు అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. వీరిరువురు భక్తిగల శైవ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. ప్రభుత్వోద్యోగంలో తండ్రి పేదసాదలను ప్రత్యేకంగా కనిపెట్టి దయాదాక్షిణ్యాలతో చూచేవాడని ప్రతీతి. సరిగా ఆ జాలి గుణమే ఆయన కుమారుడైన కుప్పుస్వామికి అబ్బింది. విద్యా బుద్ధుల్లో ప్రవర్ధమానుడై క్రమంగా సొసైటీ ఫర్ ప్రాపగేషన్ ఆఫ్ గాస్పెల్‌వారు స్థాపించిన కళాశాల నుండి పట్టభద్రుడైన మీదట తంజావూరులో వున్న వైద్య కళాశాలలో చేరి డాక్టరుగా శిక్షణ పొంది తిరుచినాపల్లిలో స్వంత వైద్యశాలను నిర్వహించాడు.

1913 లో తండ్రి మరణానంతరం ఆనాటి 'మలయా' నుండి వచ్చిన ఆహ్వానాన్ని పురస్కరించుకొని రబ్బరు తోటలో పనిచేసే కార్మికులకు వైద్యాన్ని చేస్తూ, పది సంవత్సరాలు గడిపాడు. విద్యార్థి దశనుండి సూక్ష్మదృష్టి, పరిశీలనా స్వభావం వేదాంతాధ్యయ నాభిలాషగల కుప్పుస్వామి జీవితంలో ఈ పది సంవత్సరాలు కీలకమైన కాలమని చెప్పవచ్చు. తన వృత్తిలో నైపుణ్యం, రోగుల ఎడ అనుకంప ఒకదానితో మరొకటి పోటీపడి, ఆ పిదప మేళవించినందువల్ల అల్పకాలంలోనే ఆయనొక ప్రజా వైద్యుడుగా పేరొందాడు. సింగపూర్ నగరంలో పేదలకు ఉచితంగా వైద్యం చేసినా, ధనార్జనా కాంక్ష లేకపోయినా, త్వరలోనే ధనవంతుల్లో ఒకనిగా పరిగణింపబడినాడు. పది వ్రేళ్ళకు పది ఉంగరాలే గాదు; ఖరీదైన వజ్రాలు తాపిన చెవి కమ్మలను కూడ మార్చి మార్చి ధరించేవాడు.[2] ఒకానొక సందర్భంలో దేశాటనం చేస్తూవున్న 'యోగి' ఒక గ్రంథాన్ని తనకిచ్చి చదువవలసిందని కోరాడట. ఈ గ్రంథంతోపాటు భగవద్గీతను "ఇమిటేషన్ ఆఫ్

1. See the *Divine Life Society* **Hand Book of Information Sivanandanagar : Yogi Vedanta Forest Academy** 1964
2. **Hand Book of Information p** 8.

క్రైస్ట్" అనబడే థామస్ ఎకంపెసీస్ యొక్క గ్రంథాన్ని చదివి సారాంశాన్ని వంటపట్టించుకొన్నాడు. ఈ ప్రకారం మత గ్రంథాలపై ఆయన దృష్టిని మరల్చిన ఫలితంగా అందుబాటులో వున్న అనేక హిందూమత గ్రంథాలను చదివి తానొక సన్యాసి కావాలని నిశ్చయించుకొని 1923 లో వైద్యవృత్తికి తిలోదకాలిచ్చి, తిరిగి భారతదేశానికి చేరాడు కుప్పుస్వామి.

తానార్జించిన యావదాస్తిని దానధర్మాలకు వెచ్చించి ఏడాదిపాటు హిందూ పుణ్యక్షేత్రాలను దర్శించాడు ఇష్టం వచ్చిన ఆభరణాలను, వస్త్రాలను ధరించిన డాక్టర్ కుప్పుస్వామి ఈ పుణ్యక్షేత్ర సందర్శనంలో చినిగి కుట్టుబడిన రెండే రెండు జీర్ణవలువలతో జీవనయాత్ర కొనసాగించాడు. సకల సౌకర్యవంతమైన భవన నివాసాన్ని విడిచిపెట్టి చెట్టుక్రింద పుట్టపక్క కటికనేలమీద పండుకోవ దానికి అలవాటుపడినాడు ఈ సంవత్సరాంతంలో ఒకానొక గ్రామ తపాలాధికారి యొక్క సలహాపొంది ఋషికేష్‌ను దర్శింప పయనించాడు. సలహా ఇచ్చిన వ్యక్తి అందించిన చిన్న ఆర్థిక సహాయంతో ఋషికేష్ సమీపంలో వున్న హరిద్వార్ రైలుస్టేషనుకు టికెట్టు కొన్నాడు. మిగిలిన దూరాన్ని నడచి ఋషికేష్ చేరాడు కుప్పుస్వామి.

ఈ సందర్భంలో ఋషికేష్‌ను గూర్చి ఒకమాట చెప్పడం అవసరం. ఋషికేష్ అంటే ఋషులుండే స్థలం అనేకమంది హిందూ మహర్షులు, స్వామిజీలు ఈ తావులో వుంటూ వారి పవిత్ర విధానంచే ఈ స్థలాన్ని పునీతం చేయడంవల్ల ఈ ప్రదేశానికి పేరువచ్చిందని ప్రజల నమ్మిక. అంతేగాక, పాతాళంనుండి వచ్చే రెండు నదీ ప్రవాహాలు ఈ స్థలంలోనే గంగను చేరిపోతాయనే పౌరాణిక విశ్వాసం కూడ వుంది ఆ దృష్టితో ఇది త్రిసంగమం త్రిసంగమమైన ఏ స్థలంకూడ పవిత్రమైందని హిందువుల నమ్మిక. అట్టి పునీత భూతలం గనుకే, యోగులు, త్యాగులు ఇక్కడచేరి నిస్వార్థ తపోసాధనం ద్వారా జ్ఞానసిద్ధులు, దైవసిద్ధులు కావడానికి ప్రయత్నిస్తారు. అట్టి పౌరాణిక మతప్రసిద్ధి చెందిన ఋషికేష్‌ను దర్శించాడు కుప్పుస్వామి

ఋషికేష్‌లో స్థాపితమై వున్న ధర్మశాలలో మకాం ఏర్పరుచుకొన్నాడు ఇక్కడ మకాం చేస్తున్నపుడే అప్పటికే ప్రసిద్ధి చెందిన స్వామి విశ్వానంద సరస్వతి ఆ స్థలానికి రావడం, కుప్పుస్వామి మూర్తిమత్వాన్ని, జీవన విధానాన్ని

చూచి ఆకర్షితుడు కావడం జరిగింది. కొంత ఉపదేశానంతరం స్వామి విశ్వానంద కుప్పుస్వామిని సన్యాస క్రమంలోనికి ప్రవేశపెట్టి, స్వామి శివానంద సరస్వతి అనే నామాంతరాన్ని ప్రసాదించాడు ఆనాటి నుండి కుప్పుస్వామి స్వామి శివానంద సరస్వతిగా ప్రసిద్ధి చెందాడు.

ఈ దీక్షానంతరం తీవ్రమైన ఆధ్యాత్మిక క్రమశిక్షణను పాటిస్తూ కఠోరోప వాసంతో పాటు దినానికి పన్నెండు గంటలు మౌన ధ్యానంలో గడిపాడు స్వామి శివానంద. కఠినమైన సన్యాస నియమ నిబంధనలను పాటిస్తూ కూడ మిగిలిన సన్యాసులకు, ఋషికేష్‌లో నివసిస్తున్న తదితర దరిద్రనారాయణులకు వైద్య సహాయం కొనసాగించాడు, తాను "మలయా"లో వున్నపుడు చేసిన జీవితభీమా తాలూకు రావలసిన ధనం చేతికందిన మీదట ఋషికేష్‌లో 1927 లోనే వుచిత వైద్య కేంద్రాన్ని ప్రారంభించాడు. ఈ చికిత్సా కేంద్రం సరిగా కొండల మీద వున్న బదరీనాథ్ పుణ్యక్షేత్రానికి వెళ్ళే రహదారి మీద నిర్మింపబడినందువల్ల బదరీనాథ్ వెళ్ళే యాత్రికులకు అవసరమైన మందులు, ఔషధాలు ముందుగనే చిన్న చిన్న పొట్లాలలో అమర్చి వారికి ఉచితంగా పంచి ఇవ్వడం ఆయన నిత్య కృత్యమైంది మానవ సేవయే మాధవ సేవ అనే సూత్రాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి ఆచరించిన ఆధ్యాత్మిక జీవి స్వామి శివానంద సరస్వతి. నిర్విరామంగా సంవత్సరాల తరబడి చేసిన కఠోర సాధనవల్ల స్వామీజీ నిర్వికల్ప సమాధి స్థితిని పొంది దైవ సిద్ధిని స్వయం కృషి ద్వారా సాధించాడు.

ఆయన వున్న "స్వర్గాశ్రమం" రానురాను ఆయన సలహాకోసం నడిపింపు కోసం వచ్చిపోయే జనంతో క్రిక్కిరిసి పోతున్నది. తనను వ్యక్తిగతంగా దర్శించలేని వారి ఉపయోగార్థం చిన్న చిన్న కర పత్రాలను ప్రచురింప ప్రారం భించాడు స్వామీజీ.

ఆయన రచనా వ్యాసంగం ఇలా ఆరంభమైందే! వ్రాయగల శక్తి వున్నా ఉన్న ఆస్తినంతా పంచిపెట్టినందువల్ల ప్రచురించే శక్తిలేక, ఎదురు చూస్తున్న సమయంలో ఆయన దర్శనార్థం వచ్చిన ఆగంతుకుడిచ్చిన అయిదు రూపాయల విరాళంతో మొదటి కరపత్రం వెలువడింది. ఆ కరపత్రం పేరు 'బ్రహ్మవిద్య.' ఈ కరపత్ర పఠనం ద్వారా, ప్రేరేపితులైన అనేకులు విరాళాలను పంపడంతో స్వామిజీ సాహిత్యం విరివిగ ప్రచురింపబడి అనేకులకు మేలుకరమైంది.

ఆయా తావులనుండి వచ్చిన ఆహ్వానాన్ని పురస్కరించుకొని భారత దేశంలో విస్తారంగా సంచరించి అనేకులకు తన ఆధ్యాత్మికానుభవాన్ని పంచి 1932 లో తిరిగి స్వర్గాశ్రమం చేరాడు. ఆయన సంచార కార్యక్రమాల్లో ప్రసంగాలతోపాటు చోటు చేసికొన్న మరో ముఖ్యాంశం సామూహిక సంకీర్తనం లేదా బృందగానం. గంగానది ఒడ్డున శిథిలావస్థలో వుండి, నిరుపయోగస్థితిలో వున్నందు వల్ల విడిచిపెట్టబడిన గోశాలవంటి పూరింటిని చూశాడు స్వామిజీ. అందు నాలుగు గదులున్నాయి దీన్ని శుభ్రం చేసికొని తానాక్రమించుకొని దానికి 'ఆనందకుటీర్' అని నామకరణం చేశాడు. శిష్యవర్గం చేరడం ప్రారంభం కావడంతో అలానే విడువబడి నిరుపయోగంగా శిథిలావస్థలో వున్న పెక్కు గోశాలలను ఆక్రమించుకొని వానిని నివాసయోగ్యాలుగా తయారుచేసికొన్నాడు. ఈ కుటీరంలోనే ప్రథమంగా 1936 లో దివ్యజీవన సమాజం స్థాపింపబడింది. ప్రారంభం నుండి ఈ సమాజం విస్తరించి నేడు ప్రపంచమంతటా మూడు వందల సమాజ శాఖల నేర్పరచి తద్వారా మానవకోటిని సేవిస్తున్నది. 1938 లో "ది డివైన్ లైఫ్" అనే పత్రికా ప్రచురణ ప్రారంభమైంది. 1943 లో సభ్యుల ప్రార్థనావసరాలకుగాను విశ్వనాథమందిరం నిర్మింపబడింది. నిర్విఘ్నంగా తన ఉచిత వైద్య సలహాలనిస్తూ, రోగులకు సదుపాయాలను కలిగిస్తూనే వున్నాడు స్వామిజీ. దినం దినం పెరుగుతున్న వైద్య అవసరాలను తీర్చడానికి 1945 లో శివానంద ఆయుర్వేద ఫార్మశీ ఏర్పాటైంది. హిమాలయ పర్వత సానువుల్లో అపూర్వంగా లభించే మూలకందాలతో మందుల తయారీ ప్రారంభమై ఒక పరిశ్రమగా రూపొందింది.

సామాజిక సేవతోబాటు ఆధ్యాత్మిక శిక్షణను కొనసాగిస్తూనే స్వామీజీ 1945 లో సర్వ ప్రపంచ మత సమాఖ్యను ఏర్పరచి ఆయా మతాల మధ్య సమన్వయాన్ని సహకారాన్ని సాధించడానికి కృషి చేశాడు. ఆయా మతాలొకే వేదికపై చేరి పరస్పరం సంభాషించుకొనవలసిన అవసరాన్ని నొక్కి వక్కాణించాడు స్వామీజీ. తన షష్టిపూర్తి ఉత్సవం ఘనంగా జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని అనేక కొత్త భవనాల నిర్మాణం కొనసాగడంతో మానవ జీవితంలోని అన్ని రంగాలకు సేవా కార్యక్రమాలు విస్తృతం చేయబడ్డాయి. 1948 లో "ది యోగ వేదాంత ఫారెస్టు ఎకాడమీ" ఏర్పాటైంది. ఆశ్రమంలో చేరిన శిష్యవర్గానికి, వచ్చిపోయే దర్శకులకీ ఎకాడమీ తగిన విద్యాబోధనలు గావిస్తూంది. 1950 లో తిరిగి భారత దేశాన్ని, శ్రీలంకను దర్శించినపుడు

సాహిత్యాన్ని, ఆశ్రమాన్ని అభివృద్ధి చేయవలసిన అవసరం గుర్తింపబడింది. ఆ కారణంగా 1951 లో "ది యోగ వేదాంత ఫారెస్టు ఎకాడమీ ప్రెస్" వెలిసింది. అంతకుముందు నుండి ప్రజాసేవ కొనసాగిస్తున్న వైద్యశాలకు అను బంధంగా 'శివానంద కంటి హాస్పిటల్' 1957 లో స్థాపింపబడింది. 1961 లో దివ్య జీవనసమాజం స్థాపనయొక్క రజతోత్సవం జరుపబడింది. ఈ రజతోత్స వానికిభారతదేశం నలుమూలలనుండేగాక శ్రీలంక నుండికూడ ప్రతినిధులు హాజరై నారు. ఇన్ని కార్యక్రమాలను కొనసాగిస్తూ సుదీర్ఘమైన జీవితాన్ని ప్రశాంతంగా గడిపి 1963 జూలై 14వ తేదీ స్వామి శివానంద సరస్వతి పరమపదించాడు.

అప్పటికే ఆయన శిష్యవర్గంలో పేరెన్నికగన్న స్వామి చిదానంద. అసలు పేరు శ్రీధరరావు. జననం 1916 సెప్టెంబరు 24 వ తేది. తల్లిదండ్రులు కేరళలో భూస్వాములు మద్రాసు లయోలా కాలేజీలో కొంతకాలం విద్యాభ్యాసాన్ని కొనసాగించి, పత్రికా విలేఖరిగా జీవితాన్ని ప్రారంభించి శివనంద స్వామీజీ శిష్యుడై శేషజీవితాన్ని దివ్యజీవన సమాజాభివృద్ధికి సమర్పించిన ధన్యజీవి. ఈ స్వామీజీని అమెరికా తదితర దేశాలకు పంపి దివ్య జీవన సమాజప్రచారాన్ని కొనసాగించిన ఫలితంగా విదేశాలలో ఇరవైఏడు శాఖలు స్థాపించబడినాయి. ఆశ్ర మాభివృద్ధికి చిదానంద చేస్తున్న సేవలు గణనీయమైనవి.

శివానందస్వామి చిన్న చిన్న పుస్తకాల ప్రచురణతో ప్రారంభించి ఆధ్యాత్మిక మార్గదర్శక సూత్రాలను ప్రచురిస్తూ దూరతీరాల్లో వున్నవారిని సైతం ఆకర్షింపగలిగాడు. ఈ సాహిత్యం ఆయనలో నిండివున్న రెండు ప్రధాన సహ జాతాల ప్రేరేపణా ఫలితంగా ప్రారంభమైందని చెప్పవచ్చు. మొదటిది ప్రజలను ఆధ్యాత్మిక చైతన్యవంతుల్ని చేయాలనే తృష్ణ. ఏ దేశంలో వున్న వారైన ఏ జీవిత విధానానికి అలవాటుపడిన వారైనా తన మతోద్దేశాలను చదవాలనే వాంఛ రెండవది.తన భావాలను వ్యక్తం చేయడానికి ఆయన ఆంగ్లభాషనే ఎన్నుకొన్నాడు. ఎందుకంటే ఇటు ఇంట, అటు బయటతెలిసిన అప్పటి రాజ భాష కావడంవల్ల. ఆయన స్పృశించిన అనేకాంశాలలో అధిభౌతికం, పాశ్చాత్య తాత్వికశాస్త్రం, యోగ, మనస్తత్వం, నీతి శాస్త్రం, విద్య, ఆరోగ్యం, కళ మొదలైనవి ముఖ్య మైనవి.

ఆయన రెండో ముఖ్య కర్తవ్యం శిష్యవర్గానికి సలహాలిచ్చి సాధకులనుగా తయారుచేయడం. ఆయన సాధకులనెంతో సానుభూతితో అర్థం చేసికొని, వారు పాటించవలసిన నియమ నిబంధనలకు అభ్యాసాలను కొంతవరకు సడలించారు. అయితే ఈ సడలింపు మౌలిక సూత్రాలు, సిద్ధాంతులకు వర్తించేదికాదు. ముఖ్యంగా అహింస, సత్యవర్తనం, బ్రహ్మచర్యం ఈ మూడింటికి ఏ విధమైన సడలింపు లేదు. వానిని ప్రతి సాధకుడు తప్పక పాటించి తీరవలసినదే. ఏ సాధకుడైనా త్రికరణ శుద్ధిగా, నిస్వార్థ జీవితాన్ని గడుపుతూ సత్యాహింసలను బ్రహ్మచర్యను పాటించినపుడు దైనందిన జీవితంనుండి విరమించుకో నక్కరలేదని ఆయన హితోపదేశం బ్రహ్మచారి ఆధ్యాత్మిక సాధనలో త్వరితపురోగతిని సాధించే వీలున్నప్పటికి స్వామి శివానంద గృహస్థులు కూడ ఆధ్యాత్మిక సాధకులు కావడానికి ఏ విధమైన అభ్యంతరాన్ని సూచించలేదు ఇది ఆ నాటికి ఈ స్వామిజీ యొక్క ప్రత్యేకతగా పరిగణించవచ్చు.

స్వామిజీ బోధలు :

ఆయన సందేశం సర్వసామాన్యమైంది. 'సేవించుడి, ప్రేమించుడి, ధ్యానించుడి, సిద్ధులుకండి!' ఇది ఆయన నినాదం, ఉపదేశ సారాంశం. నిస్వార్థ సేవా నిరతిని అవసరాన్ని సూచిస్తూ, నిష్కామకర్మ యోగాన్ని స్వామిజీ ప్రేరేపించాడు. సర్వ జీవరాశిని నిస్వార్థంగా ప్రతిఫలరహితంగా సేవించడమే భూమిమీద గొప్ప శుద్ధీకరణ శక్తి.ఆ విధమైన నిరపేక్షమైన సేవద్వారా స్వీయ పవిత్రీకరణకు వ్యక్తి సిద్ధపడవచ్చు. ఈ సేవయే దేవునికర్పణ అని భావించి కొనసాగించినవాడు తన జీవితధ్యేయం నెరవేరినట్లు ఏ వ్యక్తి అయినా భావించవచ్చు నని స్వామిజీ వివరణ [3]

దైవాంశ మనుష్యుల్లో స్వాభావిక వారసత్వంగా నెలకొనివుంది ఆతని జీవితధ్యేయం (బ్రహ్మ) ఆనందం దీన్ని సాధించడానికి ఒకే ఒక మార్గం వుంది, అదేమంటే, వ్యక్తి తన మనోవాక్కర్మలను లోకేచ్ఛలవల్ల కలిగే బంధకాలకు అతీతంగా భద్రపరచుకొని జీవితాన్ని కొనసాగించడమే! అపుడే అతడు బ్రహ్మ

3. Swami Chidananda, *Light Fountain*, Sivanandanagar, Yoga Vedanta Forest Academy, 1967 pp. 188-189.

నందం పొందగలడు. బ్రహ్మానందాన్ని పొందడానికి మనుష్యుడు అతనిలో వున్న పాశవిక సహజాతాలను జయించాలి పాశవిక సహజాతాలను జయించే సాధనం ప్రేమ ప్రేమ పెంపొందే విధానం భక్తి అందువల్ల ప్రతి వ్యక్తి భక్తి యోగాన్ని అనుసరించవలసివుంది.

భక్తికి వ్యతిరేకమైన పదం క్రోధం. క్రోధాన్ని జయించే మార్గం అహింస. అందువల్ల భక్తి, అహింస రెండు ప్రతి సాధకుడు, సామాన్య వ్యక్తి కూడ అలవరచుకోవలసిన గుణాలు. అహింసావ్రతుడైన వ్యక్తి నిగ్రహాన్ని కోల్పోవడానికి వీలులేదు. అతడు దూషణ భూషణాలను సమానంగా భరిస్తాడు అపుడే భక్తి, అహింసలు మేళవింపు జీవితంలో సార్థకం ఔతుంది. ఇది సార్థకమైనప్పుడు స్వార్థానికి తావుండదు.

కోపం వ్యక్తికి శత్రువు కొన్ని సెకెండు లొకవ్యక్తి ఆగ్రహాన్ని ప్రదర్శిస్తే, ఆ స్థితి అతని ఆరోగ్యాన్ని కొన్ని దినాలవరకు కుదుట పడనీయదు. అందువల్ల అహింస కేవలం ఆధ్యాత్మిక సాధనం మాత్రమే కాదు. అది ఆరోగ్యదాయని కూడ.[4]

మొత్తం ఉనికి యొక్క సర్వ సంపూర్ణత్వమే దేవుడు ఆయన సర్వజ్ఞాని, సర్వవ్యాప్తి, సర్వ శక్తిమంతుడు, ఆయన వ్యక్తిత్వానికి అవధులు, ఆయన కార్యనిర్వాహణా శక్తికి హద్దులు లేవు. దేవుడు ప్రేమ, ఆనందం, సర్వసంపూర్ణం, శాంతి, స్వాతంత్ర్యం, అమృతం. ఈ గుణాలను వేర్వేరుగా ఉదహరించినప్పటికి అవి అన్నీ ఒకటే! మాయామేయమైన ఈ ప్రపంచంలో దేవుడొక్కడే సత్యం, వాస్తవికం. వ్యక్తి తనను గూర్చిన కోరికలను, చింతలను విడిచిపెట్టుట ద్వారా దైవసిద్ధుడు కావచ్చు. దేవుడు తన భక్తుని యొక్క సంపూర్ణ జీవితాన్ని, హృదయాన్ని కోరుతున్నాడు.

4 Swami Sivananda, *Bliss Divine* sivananda Nagar,.... 1965, 1-16.

"నేను, నాది, నా కోరికలు నా స్వంతాలు అనే విషయాలు మరచి పోయినపుడు సర్వోన్నతమైన దేవుని ఆనందాన్ని సాధించగలవు. దేవునితో సమైక్యాన్ని కోరితే నీలోని పాశవిక తత్వాన్ని, సహజాతాలను ఐలిచేయి. నీ అహంకారాన్ని విడిచి శూన్యుడవైనపుడు దైవాంశతో నింపబడగలవు. నీ వ్యక్తిత్వాన్ని విడిచిపెడితేనేగాని దివ్య జీవనం నీకు లభింపదు. అది లభించినపుడే నీవు దైవసిద్ధుడవు కాగలవు "5

ఎంత స్పష్టంగా ఈ బోధ వున్నదో పాఠకులు గమనింపగలరు. దీనికి వేరే వ్యాఖ్యానం అక్కరలేదు.

ఆయన బోధలో ప్రధానంగా కనిపించే విషయం ధ్యానాంశం. విమోచనకు ధ్యానమే రాజమార్గమని ఆయన విశ్వాసం. భూమి నుంచి ఆకాశానికి, అబద్ధం నుండి నిజానికి, చీకటి నుండి వెలుగులోనికి, అజ్ఞానం నుండి జ్ఞానానికి, మరణం నుండి అమరత్వంలోనికి నడిపే ఒక రహస్యనిచ్చెనే ధ్యానం. దైవ చైతన్య ప్రవంతి ధ్యానం ద్వారా సాధకునికి ఎడతెరపిలేకుండ చేరుతుంది. అయితే ఈ ధ్యానాభ్యాసం తేలికగా, సులభంగా లభించేది కాదు. బ్రహ్మ ముహూర్తంలో ధ్యాన నిమగ్నులైన వారికే ఇది సాధ్యం. అట్టి ధ్యాననిమగ్నులైనవారిలో అంతర్లీనంగా వున్న నాదం వారిని ఆధ్యాత్మికంగా నడిపి, దైవసిద్ధులను చేస్తుంది.

దైవసిద్ధి పొందిన తదనంతర స్థితి 'సమాధి.' ఇది అనిర్వచనీయం. ఆధ్యాత్మికానుభవంలో అత్యున్నతమైన స్థాయి. ఈ స్థాయిని చేరిన వ్యక్తికి మానసిక, శారీరక స్పర్శ వుండడానికి వీలులేదు. తటాకంలో నీరింకిపోయినపుడు నీటి మీద వుండే సూర్యప్రభావం కూడ మృగ్యమైపోయినట్టే, మానవ మనసు బ్రహ్మైకాన్ని పొందినపుడు మానవ మనోసరోవరం ఇంకిపోతుంది. దానిని ప్రతిస్పందింప చేసే స్పర్శ కూడ దానితోపాటే అదృశ్యమౌతుంది. ఇక మిగిలేది సత్ లేదా ఉనికి మాత్రమే 6 ఆరాధితుడు, ఆరాధకుడు పరస్పరం లీనమైనప్పుడు దైవ

5. *Ibid* pp. 150–181.

6. *Ibid* p. 415-416.

చైతన్య స్రవంతిలో ధ్యానసాధకుడు లీనమైపోతాడు అయితే ఇట్టి సమాధి స్థితిని- బ్రహ్మైక్యస్థితిని- సాధించడానికి ఏకాంతవాసం, ఆశ్రమజీవితం అవసరం లేదని, ఏ వ్యక్తి అయినా తాను పని చేస్తున్న తావులోనే తన పనిలో లీనమైవున్నపుడే ఈ స్థితిని చేరవచ్చునని స్వామిజీ ప్రబోధం. సమాధిస్థితిలో శరీరం, మనసు తుల నాత్మకంగా వుంటవి గనుక అట్టి తులనాత్మక స్థితిలో మానవ సేవను, తద్వారా మాధవ సేవను కొనసాగించడంలో పొరపాటు లేదని ఆయన ఉద్బోధ.[7]

స్వామి శివానంద సమగ్రయోగ సూత్రాన్ని కూడ సిద్ధంచేసి లోకానికి ప్రకటించాడు. యోగవిధానమే రక్షణమార్గమని ఆయన విశ్వాసం. ఆయనొక కర్మయోగి గనుక- యోగాభ్యాసంవల్ల చేకూరే ప్రయోజనాలను స్వయంగా గుర్తించి, తన శిష్యవర్గానికి, ఆశ్రమవాసులకిచ్చే శిక్షణలో ఈ యోగాభ్యాసాన్ని తప్పనిసరి అంశంగా ప్రవేశపెట్టాడు స్వామిజీ. ఈ సాధకులకు నియమనిబంధన లలో కొంత సడలింపు స్వామిజీ ఇచ్చాడనే విషయం ముందే ఉదహరింపబడింది. ఆ ఫలితంగా సర్వసంగ పరిత్యాగులు, గృహస్థాశ్రమంలో వున్నవారు కూడ ఈ అభ్యాసాలకు హాజరై శిక్షణ పొందే అవకాశం కలిగింది. అట్టి సాధకులకు స్వామీజీ చెప్పే మొదటిమాట, జీవితాన్ని ఆధ్యాత్మీ కరించే ప్రక్రియ యోగాభ్యాసం అని అదొక జీవన విధానంలో భాగమేగాని జీవితానికి వెలుపల జరిగేదికాదు. 'యోగ' అంటే క్రియారాహిత్యం గాదు. క్రియను సమర్థనీయంగా సంపూర్ణంగా నిర్వహించడం' అని స్వామీజీ వివరణ. స్వదేశ విదేశాలలోని అనుచర వర్గాని కుపయోగపడునట్లు యోగాభ్యాసాలను వ్యాఖ్యానిస్తూ స్వామీజీ ఒక గ్రంథాన్ని ప్రచురించాడు. అందు సత్యాహింసలను బ్రహ్మచర్యాన్ని సాధకుడు అవలంబించి, అభ్యసించి, అధిరోహించవలసిన ప్రథమ సోపానాలుగా వుదహరించుటే గాక, భోజన పదార్థం యొక్క ప్రభావం సాధకునిపై తప్పనిసరిగావుండే అవకాశమున్నందువల్ల ధ్యానాభ్యాసాన్ని కొన సాగించేపుడు సాత్విక గుణాన్ని ప్రేరేపించి పోషించే తేలిక శాఖాహార పదార్థాలనే సాధకుడు భుజించవలసి వుంటుందని, మద్యపాన సేవనం, మాంస భక్షణం నిషిద్ధాలని ప్రకటించాడు. ఇట్టి షరతులతోపాటు ప్రతి ఆసనాన్ని తన గ్రంథంలో క్లుప్తంగా వివరించాడు స్వామీజీ. అలానే ప్రాణాయామ నియమ నిబంధనలు

7. *Ibid* p. 420-425.

కూడ క్రోడీకరించబడి వున్నవి[8]. తాను వివరించిన సమగ్రయోగలో పారం పర్యంగా వస్తూన్న కర్మ, జ్ఞాన, భక్తి, రాజయోగాల సమన్వయాన్ని, సంలీనాన్ని చర్చించిన విధం విజ్ఞుల దృష్టిని ఆకర్షిస్తుంది.

'కర్మయోగ అంటే పద్మాసనం వేసికొని, ఆరుగంటలు నిశ్చేతనంగా కూర్చుండి, నాడీమండలాన్ని స్తంభింప చేయడంగాని, లేదా సజీవ సమాధిలోనికి వెళ్ళిపోయి దినాల తరబడి వుండిపోవడం కాని కాదు. ఇవి కేవలం శారీరక క్రియలు. చైతన్యవంతమైన దైవ సహవాసం ద్వారా ఉన్నతమైన దైవజ్ఞానాన్ని సంపాదించడం, జీవాత్మ పరమాత్మలో లీనం కాగల విధానాలను బోధించే శాస్త్రం యోగ[9] అని స్వామీజీ అభిప్రాయం. నాలుగు వేర్వేరు మార్గాలద్వారా ఎవరైనా ఆధ్యాత్మిక జీవిత లక్ష్యాన్ని సాధించవచ్చు. ఎవరెవరి మానసిక ధోరణి, నిగ్రహ శక్తినిబట్టి వారిష్టమైన మార్గాన్ని వారు ఎన్నుకోవచ్చు. కర్మయోగసాధకుడు సంపూర్ణంగా నిష్కామకర్మతో తన కార్యాలన్ని దేవునికి సమర్పితం చేసి సేవించ వచ్చు, నిస్వార్థంగా, నిష్కామంగా ఇతరులకు సేవ చేయడం, ప్రతి సేవాకార్యం దేవునికి సమర్పణగా ఆరాధనలో భాగంగా కొనసాగించడమే కర్మయోగం.

ధ్యానాభ్యాసానికి అలవాటుపడిన జిజ్ఞాసువులు అవలంబించే మార్గం జ్ఞాన యోగం. ఈ యోగ నభ్యసింపగోరేవారు నాలుగు రక్షణాధారాలను సాధించవలసి వుంది. వాస్తవికానికి అవాస్తవికానికి గల వ్యత్యాసాన్ని గుర్తించడం మొదటిది. జ్ఞానేంద్రియాలు గుర్తించే అంశాలను పట్టించుకొనకుండడం రెండవది. మానసి కోద్రేకాలను జయించి నెమ్మదిని, సహనాన్ని, కేంద్రీకరణ శక్తిని సాధించి దేవునిలో విశ్వాసాన్ని పెంచుకోవడం మూడవది. విమోచనను నిరీక్షిస్తూ వుండడం నాల్గవది. ఈ పరిస్థితిని చేరినవారు గురువు కొరకు అన్వేషిస్తారు.

> వివరాల కోసం నిరీక్షింపక, వ్యక్తిగత భావాలను నిర్మూలించి,
> పరమాత్మలో సంలీనమై మనగలగడమే శ్రేష్ఠమైన జ్ఞానం.నిత్యత్వం

8. *Swami Sivananda, Practical Lessons in Yoga,* **Sivanandanagar-1967.**
9. *Ibid* p. 57.

యొక్క ఎరుకలో సమస్త ఆలోచనలను రద్దుచేసికొని ఆలోచింపకనే
గ్రహించి అనంతంలో లీనంకావడానికి నడిపించేది జ్ఞానయోగం.[10]

భక్తియోగ అంటే ఇతరులను ప్రేమించి సేవించడం. సేవాదృక్పథం అధికంగా గలవారికి ప్రక్రియ సమంజసమైన అభ్యాసం. వ్యక్తి బేషరతుగా తనను తాను దేవునికి లోబరచుకొనడాన్ని ఈ యోగం సూచించడమే గాక ప్రేరేపిస్తుంది. నిజమైన మతం పుణ్యక్షేత్ర సందర్శనలోగాని, పుణ్యతీర్థ స్నానాభ్యాసాలలోగాని లేదు. దేవుడు ప్రతి జీవి యొక్క హృదయంలో నిక్షిప్తమై వున్నందువల్ల అట్టి జీవరాశిని నిష్కల్మషంగా, నిస్వార్థంగా ప్రేమించి సేవించడం ద్వారానే, దేవున్ని సేవించునట్లు. ఇదే భక్తియోగ ప్రధానోద్దేశం. ఇందిమిడి వున్న కొన్ని విధానాలను స్వామీజీ పేర్కొన్నాడు.[11]

1. సిద్ధుల మయమైన పవిత్ర సమాజాన్ని అన్వేషించడం
2. దేవుని మహిమలను స్మరించడం.
3. భక్తితో దేవుని సేవించడం.
4. దైవ లక్షణాలను భయభక్తులతో ప్రస్తుతిస్తూ గాన ప్రతిగానాలు చేయడం.
5. అచంచల విశ్వాసంతో మంత్రాలను జపించడం.
6. ప్రపంచ కార్యకలాపాలనుండి, లంపటనుండిమనసును దూరం చేసికొనడం.
7. ప్రపంచమే దైవమని పరిశీలించి చూడడం.
8. ఇతరుల విమర్శకు గురికాకుండ తనకేది లభిస్తే దానినే దైవార్పితమని స్వీకరించి తృప్తిపొందడం.
9. ఏ వ్యక్తిని మోసగింపక తనవలె చూడగలగడం.

నిగ్రహాన్ని క్రమపరచుకొనగలవారు మాత్రమే ఆచరించదగింది రాజయోగం. ఈ యోగ నభ్యసించే సాధకుడు మెట్టు తరువాత మెట్టును అధిరోహించవలసి వుంది. మానసిక కార్యాలను నియంత్రించే సాధనంగా పతంజలి తన గ్రంథంలో రాజయోగను గూర్చి పేర్కొన్నాడు. ఈ యోగసాధకులు అష్టసోపానాల నధిరోహించవలసివుంది. అవేవన-

10. *Ibid* p. 106.
11. *Ibid* p. 78

1. గాయపరచడం, అబద్ధం పలకడం, దొంగిలించడం, భోగలాలసత - ఆశ పోతుతనం నుండి తనను పరిరక్షించుకొనుట. ఇది యమ.
2. పరిశుభ్రతాన్ని, తృప్తిని, శరీరవ్యాయామాన్ని, స్వీయాధ్యయనాన్ని, గురుకు దనాన్ని, మానసిక పవిత్రతను పరిపోషించుకొనడం. ఇది నియమ.
3. శరీర భంగిమల నలవర్చుకొనుట - ఆసనాభ్యాసం.
4. ప్రాణాయామ.
5. ప్రత్యాహారం - దృష్టిని వక్రింపచేసే ఆయా వస్తు సముదాయంనుండి మనసును తిరోగమింపచేయుట.
6. మనోధారణ.
7. ధ్యానం.
8. సమాధి ద్వారా అతీంద్రియ చైతన్యాన్ని పొందడం.

> "ఈ సమాధి దశలో ఆధ్యాత్మిక సాధనలు ముగిసి యోగి అమృతుడైన దేవునిలో లీనం అవుతాడు ...ఆయన సమస్తంలో వున్నవాడు. సమస్తానికి అతీతుడు. రాజయోగానికి యమ, నియమ బీజాలు కాగా, ధారణ మూలాధారం. తద్వారా తనను తాను సంపూర్ణంగా స్వాధీనపరచుకొని, అంతిమ ఫలమైన సమాధి స్థితిని లేదా అతీంద్రియ చైతన్యాన్ని పొందుతాడు."[12]

పై నాలుగు సంప్రదాయ సిద్ధమైన యోగాభ్యాసాలకు స్వామీజీ అయిదవ అభ్యాసాన్ని జోడించాడు. అది జపయోగం. జపయోగానికి మించిన యోగం లేదని ఆయన ప్రకటించాడు. జపం- నామసంస్మరణం- ధ్యానం రెండు కూడ దేవుని నామానికి, మూర్తిమత్వానికి చెందినవైనందువల్ల యోగికి అత్యంత ప్రయోజనకరమైనవని స్వామీజీ అభిప్రాయం. నామ స్మరణ ఆరాధనలో భాగం. దేవుని మూర్తిమత్వాన్ని ధ్యానాత్మకంగా దర్శించాలి, మానసికంగా పరిశీలించాలి. సంపూర్ణ దృష్టిని కేంద్రీకరించాలి. 'ఓం! నమశ్శివాయా' అంటూ జపిస్తున్నపుడు శివుని ధ్యానించకుండ సాధకుడు మిన్నకుండలేడు. ధ్యానంలో జపం, జపంలో

12. *Ibid* p. 95.

ధ్యానం కలిసి వున్నందువల్ల ఒకదాని నుండి మరొకదానిని విడదీయడం కష్టమే కాదు, అస్వాభావికం కూడ. జపయోగ ప్రాముఖ్యాన్ని గుర్తించి స్వామీజీ ఆ యోగాన్ని ప్రత్యేక గ్రంథంలో వివరించడం జరిగింది.[13] అందు ముఖ్యంగా మానవజాతి రుగ్మతలన్నిటికి దైవ నామ జపమే పరమౌషధమని సూచించాడు

శివానందాశ్రమంలో నిర్మితమైన విశ్వనాథమందిర్‌లో ఉదయం, మధ్యాహ్నం ఆరాధనలు, సాయంత్రం సామూహిక సంకీర్తనలు, బృందగానాలు నిర్వహింపబడుతూ వుంటాయి. ప్రతి లక్ష్మీవారం స్వామీజీ సమాధి దగ్గర ప్రత్యేక సంస్మరణారాధన జరిపి హారతి పట్టడం మామూలుగా జరిగే కార్యక్రమం. ఈ పాలరాయి మందిరం విశాలమైందే కాదు, సుందరమైందికూడ. లోపల ఎత్తైన పాలరాయి ఆల్టరుతోపాటు 'లింగ' 'యోని' ప్రతిష్టితమై వున్నాయి. ఆల్టర్‌వెనుక స్వామీజీ నిలువెత్తు పటం వుంది. ఈ విధంగా గురువే దైవం అనే నానుడిని సార్థకంచేస్తూ ఆరాధకులు గురువుని దేవుణ్ణి ఏకంగా సమకాలంలో ఆరాధిస్తున్నారు.

దివ్య జీవన సమాజం యొక్క లక్ష్యాలు:

1. దినం దినం లోకాన్ని ఆవరిస్తూవున్న లోకానురాగవాదం, భౌతిక వాదానికి వ్యతిరేకంగా అధ్యాత్మికాసక్తిని ప్రతి వ్యక్తిలో పెంపొందింప చేయడం.
2. సర్వమత సమన్వయాన్ని సాధించి, ప్రతి మతం మరోమతంతో సహకరించి, సహవసించి, సహజీవనం కొనసాగించగల పరిస్థితులను ప్రోత్సహించడం. ఆయా మతాలు చూపే వైషమ్యాలను, వైరుధ్యాలను రూపుమాప ప్రయత్నించడం.
3. సర్వమానవ సహోదర భావాన్ని పెంపొందించి, సర్వప్రజల సంక్షేమం కోసం కృషి చేయడం.
4. మానవ జీవితంలోని అన్ని రంగాలలో వాస్తవికం, అనుసరణీయమైన దృక్పథాన్ని పెంపొందింపచేయడం.
5. దివ్య జీవన సమాజస్థాపకుడైన స్వామి శివానంద సరస్వతి యొక్క సందేశాన్ని ప్రపంచం అంతా వ్యాపింపచేయడం.

13. **Swami Sivananda,** *Japayoga*, **Sivananda nagar** 1967 **Also see in his** *Bliss Divine* **pp.** 232-240.

శ్రేష్ఠమైన పై 'పంచశీలా'త్మకమైన లక్ష్యంతో ఈ సమాజం గత నలభై అయిదు సంవత్సరాలలో తీవ్రకృషి కావించి ప్రపంచ నలుమూలలో అనేకమందిని సత్కార్యోన్ముఖులను చేసిందని చెప్పాలి. విస్తారమైన సాహిత్య ప్రచురణతోపాటు, వైద్య విద్యారంగాలలో, జీవకారుణ్య కార్యక్రమాలలో సమాజం ఎంతో ముందంజ వేసింది. ప్రపంచ నలుమూలల నుండి, దాదాపు అన్ని దేశాల నుండి సాధువులను చేర్చుకొన్నారు. వీరిలో బహుకాలం నుండి ఆశ్రమవాసులైనవారు కూడ వున్నారు.[14]

దివ్యజీవన సమాజ మూల స్థాపకుడైన స్వామి శివానంద సరస్వతి బోధలను ఉటంకిస్తూ విశాల మంగల్ వాడి,స్వామిజీ బోధల్లో ప్రతిబింబించే ఒకానొక రకమైన నిరాశా నిస్పృహలకు, ఆయన జీవించిన జీవిత విధానమే కారణమైనట్లు తన గ్రంథంలో ధ్వనింప చేసాడు.[15] ఈ ఆరోపణ సమంజసమైందిగా తోచడం లేదు. శివానంద స్వామి జీవన గమనాన్ని పరిశీలించిన మేరకు నిరాశానిస్పృహల వల్ల జీవితాన్ని రోసిన వ్యక్తిగాకాక, జీవిత ధోరణులను కొంత వరకు రుచి చూచి, ఒకానొక సందర్భంలో తనలో కలిగిన పరిణామ ఫలితంగా అట్టి విలాస జీవితానికి స్వస్తి వాక్యం పలికి విరాగిగా మారిన వ్యక్తిగా స్వామిజీ కనిపిస్తాడు.

ఈ విధానాన్ని జీవితంపై నిరాశ అనడం కన్న జీవిత గమనంపై కలిగిన తూష్ణీభావం అనడం ధర్మం. ఆ అనుభవంలో జీవితం అంటే ఇంతేగదా అనే విరక్తి భావం వ్యక్తమైంది. జీవితంపై విరక్తి వేరు, జీవితం నిరాశామయం కావడం వేరు. పైగా మంగల్‌వాడి తన అభిప్రాయాన్ని బలపరచడం కోసం స్వామీజీ గ్రంథం నుండి ఉదాహరించిన వాక్యం కూడ స్వామిజీని నిరాశావాది అనడంకంటె జీవితంపై విరక్తి పొందిన వ్యక్తిగానే బలపరుస్తుంది. 'చిన్న ఆవ గింజంత సుఖం పెద్ద కొండంత బాధను కలిగిస్తుం'దన్నపుడు, అది నిరాశను గాక విరక్తిని సూచిస్తుందని విజ్ఞులు గ్రహించక పోరు. ఆయన గ్రంథాల్లో జీవిత బాధ్యతల నుండి తప్పుకు పోవాలనే ధోరణిగాక, ప్రజల్ని లోకానురాగం వల్ల కలిగే సంసార బంధాల నుండి కడతేర్చాలనే దృఢ దీక్ష కనిపిస్తుంది.

14. B.D. Tripati *op cit.* p. 175 also p. 208.

15. Vishal Mangalwadi *op.cit.* p. 61 ff.

స్వామిజీ బహుముఖ ప్రజ్ఞాశాలి. వైద్య శాస్త్రంలో పట్టభద్రుడై ముగించి, రెండు చేతులా ధనార్జన చేస్తున్నప్పటికి, లోకంపై విరక్తి చెంది తన పరిధిలో తానేదో చేసి, మానవ జాతి కింత దారి చూపించాలనే తహ తహతో సమస్తాన్ని త్యాగం చేసి, కఠోర ఆధ్యాత్మిక క్రమ శిక్షణను కోరి వరించిన కార్యదీక్షా దురంధరుడు. ప్రారంభం నుండి తన అవధుల నెరిగి, కార్యక్రమాలను ప్రవేశపెట్టిన వాస్తవిక వాది, సూక్ష్మగ్రాహి వైద్య పరిజ్ఞానంతో భౌతిక కార్యాన్ని అవలంబించి లౌకిక ధనాన్ని ఆర్జించక, సమస్తాన్ని త్యాగం చేసిన శ్రమైక త్యాగజీవి.

స్వామిజీ జీవితం బోధల ద్వారా భారతీయ ఆధ్యాత్మిక జీవనానికి, తద్వారా విశ్వమానవ సంక్షేమానికి గావించిన సేవలు :

1. భౌతికాంశాలలో, విషయాలలో కూడ ఆధ్యాత్మిక విలువలను చూచి, పదార్థంలో జీవిలో అంతర్లీనంగావున్న దేవుణ్ణి ప్రబోధించి నిర్వికల్ప సమాధిలో జీవి బ్రహ్మైక్యం చెందుననే నమ్మకను వ్యాపింప చేయడం.

2. తాను తాంత్రిక యోగకు చెందిన వాడైనందువల్ల వ్యక్తిలో నిద్రాణంగా వున్న కుండలినిని మేల్కొల్పి, కార్యోన్ముఖం చేయడానికి తోడ్పడే ఆసన, బంధ, ముద్ర, ప్రాణయామ మొదలైన తాంత్రిక పదజాలాన్ని వివరిస్తూ, శిష్యవర్గానికి, అశేష పాఠకులకు తెలియపరచడం. ఈ సందర్భంలోనే కుండలిని యోగను చేసి చూపి వ్యాఖ్యానించడం.

3. తన అనుచర వర్గానికి అవసరమైన శిక్షణను ప్రసాదించడం. ఈ శిక్షణ ఫలితంగా ఆయన శిష్యవర్గంలో అనేకులు స్వామీజీలుగ స్థిరపడిపోయారు- వారిలో చిదానంద, కృష్ణానందలు ముఖ్యులు. జపాన్‌లో స్థిరపడిన ప్రేమానంద్, అమెరికాలో స్థిరపడిన విష్ణుదేవానంద్, కెనడాలో కృషి చేస్తున్న దయానంద ముఖ్యులు.

స్వామిజీ దార్శనిక శక్తి సమన్వితుడు. వివేకానందుడు రామకృష్ణమిషన్ ద్వారా ప్రారంభించిన జీవకారుణ్య కార్యక్రమాన్ని తానొంటరియే అయినప్పటికి, వివేకానందునికున్నంత అంగబలం అప్పట్లో లేకపోయినప్పటికి, ఇనుమడించిన ఆత్మబలంతో దివ్యజీవన సమాజాన్ని ఆరోగ్యవంతం, అభిలషనీయమైన సూత్రాలపై స్థాపించి వ్యాపింప చేసినవాడు, ఆధునిక స్వామిజీ లీ స్వామిజీని చూచి నేర్చుకోవలసిన అనేక సద్గుణాలలో ఒకటి ధనార్జనలోగాక, త్యాగంలో మానసిక సంతృప్తి వున్నది అనే పరమ సత్యం.

## 2. స్వామి భక్తి వేదాంత ప్రభుపాద : అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘం[1]

నేడు అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగా స్థిరపడి దేశదేశాలలో శాఖోపశాఖలై తామర తంపరై విస్తరించిన ఉద్యమం 'అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘోద్యమం' భారతదేశంలో పుట్టి, అమెరికాలో అవతరించి, ప్రతి దేశంలో అలజడి రేపుతున్న ఈ సంఘ వ్యవస్థాపకుడు స్వామి ఏ. సి. భక్తి వేదాంత ప్రభుపాద జననం 1896 సెప్టెంబరు 1. జన్మస్థలం కలకత్తా నగరం. తండ్రి గౌర్ మోహన్ దే. తల్లిదండ్రులు పెట్టినపేరు అభయ చరణ్ దే తండ్రి కృష్ణభక్తుడు ఆ కారణంగా కృష్ణ, రాధాకృష్ణ వగైరా పటాలను విగ్రహాలనిచ్చి కుమారుని విగ్రహారాధనకు ప్రేరేపించినందువల్ల ఆయనలో వెల్లివిరిసిన కృష్ణ భక్తి ఉగ్గుబాలతోనే ప్రారంభమైందని చెప్పవచ్చు.

బాల్యంనుండి పిన్నలకు అభిమానపాత్రుడుగా పెద్దలకు తలలోని నాల్కగా మెలగిన అభయచరణ్ 1920 లో కలకత్తా విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడైనాడు. ఆయన కభిమాన పాత్రమైన అంశాలు భారతీయ తత్త్వశాస్త్రం, ఆంగ్లేయ భాష, ఆర్థికశాస్త్రం ఆ పిదప కలకత్తాలోని రసాయనిక కర్మాగారంలో మేనేజర్ పదవిని చేపట్టినప్పటికి ఆయన ఆలోచన, అభిరుచి నిర్వాహక వృత్తిలో గాక, ఆధ్యాత్మిక విషయాలపైనే కేంద్రీకృతమై వున్నందువల్ల మిత్రులతో చర్చ, సభాసమావేశాల్లో ప్రసంగాలు, పౌరాణిక కాలక్షేపం వంటి ఆముష్మిక విషయాలతోనే తన స్వేచ్ఛాకాలం గడిపింది. ఆయన ఉపన్యాస ధోరణిని, ఆయా ప్రసంగాంశాలపై ఆయన ప్రదర్శిస్తున్న విషయ పరిజ్ఞాన పరిధినిబట్టి, ఆనాడు

---

1. See a) F.J Damer, *The American Children of Krishna*, New York : Doubleday 1976. b) Kushwant Singh *Gurus Godmen and Good people*, and c) J S Judah. *Hare Krishna and the Counter culture*, New York : John Weley & sons, 1974.

ఆయనలో గూడుకట్టుకొనివున్న ఆధ్యాత్మిక తృష్ణను, జ్ఞాన విస్తృతను గమనించిన ప్రజ లేనాటికైనా అభయ చరణ్ మంచి ఆధ్యాత్మిక నేతగా రూపొందగలడని భావించారు.

శ్రీమద్ భక్తి సిద్ధాంత సరస్వతి గోస్వామి మహరాజ్ సందర్శనం చేసికొని ఆయనలోని భక్తిభావానికి ముగ్ధులైన అనేకమంది మిత్రులు, ఉభయ చరణ్‌ను కూడ సరస్వతి గోస్వామి మహరాజ్ దర్శనం చేసుకోవలసిందిగా వత్తిడి చేశారు. బహుకాలం ఆ వత్తిడికి తట్టుకొని నిలబడగలిగినా, తుదకు మిత్రుల సలహాను శిరసావహించి, కొంత అయిష్టంగానే గోస్వామి దర్శనం చేసుకొన్నాడు అభయ చరణ్. వీరుభయులమధ్య చర్చ సంవాదం జరిగింది. 'విద్యావంతులైన యువకులు భారతదేశం వెలుపల చైతన్యస్వామి సందేశాన్ని వినిపించవలసి వుంద'ని సరస్వతి గోస్వాములవారి సూచన. 'విదేశీపాలనలోవున్న భారతీయులు అందించే సందేశాన్ని వినడానికి స్వేచ్ఛా ప్రవృత్తిగల ఏ పాశ్చాత్య సమాజం సిద్ధంగా వుంటుంది?' అని అభయచరణ్ సందేహం. 'మనం మానవజాతి యొక్క చిరజీవితాన్ని ప్రకటించే వారమైనందువల్ల ఈ బాధ్యత తప్పదు' అని గురుదేవుని ఆజ్ఞ తుదకి వత్తిడికి లొంగిపోక తప్పలేదు అభయచరణ్‌దేకి.[2]

ఆ తరువాత కలకత్తానుండి అలహాబాద్ వెళ్ళి తన స్వంత రసాయనిక కర్మాగారాన్ని స్థాపించుకొని, మంచి నైపుణ్యం, ధనార్జనా విధానం గల వ్యాపార వేత్తగా పేరు పొందాడు. కాని 1933 లో తన గురుదేవుడైన సరస్వతీ గోస్వామి ద్వారా దీక్ష పొందడం, ఆ తరువాత మూడు సంవత్సరాలకే (1936) గోస్వామి మహారాజ్ తనువు చాలించడం జరిగింది. ఈ దీక్షతోపాటు భక్తివేదాంత ప్రభుపాద అనే నామాంతరాన్ని ధరించాడు. అప్పటికి ఆయన వివాహితుడు. భార్య, అయిదుగురు సంతానం. అంతకుముందే తన గురుదేవుడు లేఖాముఖంగా ఆదేశించినట్లు భక్తి వేదాంత ప్రభుపాద సర్వ సంగ పరిత్యాగియై సన్యాసాన్ని

2. **Kushwant singh**, *Gurus Godmen and Goodpeople*, **p 74 and Reinhert Hummel** *Indische Mission and new frommigkeet in Western*, **Stuttgart: verlog**. 1980 p p. 49-59.

స్వీకరించవలసి వుంది. ఆ తరువాత ఇరవై సంవత్సరాలకు గాని స్వామి భక్తి వేదాంత గురువు నాజ్ఞను శిరసావహించ నిశ్చయించలేదు ఆ సన్యాసం 1959 లో ప్రకటించాడు. అప్పటికి ఆయన ఉద్యోగ విరమణ గూడ చేశాడు. ఆనాటికి తన వయస్సు అరవై మూడేళ్లు.

అలహాబాదును వీడి పశ్చిమ బెంగాల్‌లోని బృందావన్‌కు వచ్చి పశ్చిమ దేశ యాత్రకు సిద్ధపాటు ప్రారంభించాడు. 1950 లోనే భక్త వేదాంత ప్రభు పాద కృష్ణ చైతన్య సంఘాన్ని స్థాపించాడు ఆనాడా వుద్యమానికి భారతదేశంలో స్థానం లభింపలేదు. ఆ పిదప దేశ విదేశాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వ హించాడు. ఈ సంఘ లక్ష్యాల ప్రచారం కోసమే ఆయన తన పాశ్చాత్య యాత్రా ప్రయత్నాలను తీవ్రం చేశాడు. ఆ సిద్ధ పాటులో భాగంగా భక్తి సిద్ధాం తానికి ఆచరణకు పట్టుగొమ్మగా ప్రసిద్ధి చెందిన భాగవత పురాణాన్ని ఇంగ్లీషు లోనికి అనువదించాడు ఆ విధంగా బహుకాల కృషి ఫలితంగా సిద్ధమైన భాగవత అనువాద ప్రతులతో, కరతాళాలు, పదిహేడు రూపాయలతో 1965 లో అమెరికా ప్రయాణం కట్టి, 'సింధియా' షిప్ కంపెనీ యజమానియైన శ్రీమతి సుమతి మొరార్జీని సమీపించి, ఉచిత ప్రయాణ సౌకర్యానికై అర్థించాడు. అప్పటికి ఆయన వయసు అరవై తొమ్మిది సంవత్సరాలు. ఆ వృద్ధాప్యంలో ఆయన అమెరికా పోవడం ఇష్టంలేని శ్రీమతి సుమతి మొరార్జీ వారించ ప్రయత్నించింది. కాని ఆయన దృఢ సంకల్పం ముందు ఇవేవి పని చేయలేదు. తుదకామె తన ఓడలో ఆయనకు ఉచిత ప్రయాణ వసతి కల్పించింది. 'జలదూత'లో పయనిస్తున్నపుడే తీవ్ర అస్వస్థతకు గురైనాడు. కాని కోలుకొని మొదట బోస్టన్‌లో దిగి, ఆ పిదప న్యూయార్క్ మహానగరానికి చేరాడు భక్తి వేదాంత.

1966 లో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ISKCON) స్థాపించ బడింది. ఇది 1950 లో ఏర్పాటైన కృష్ణ చైతన్య సంఘ విస్తరణలో భాగం. మహాజన సాంద్రతగల న్యూయార్క్ మహానగరంలో 'టంప్‌కిన్స్ స్క్వేర్ పార్క్'లో పద్మాసనం వేసి, చిరుతలు ధరించి, ధ్యాననిమగ్నుడై 'హరేకృష్ణ' గీతాన్ని శ్రావ్యంగా మనోరంజకంగా లయబద్ధంగా గానం చేయడం ప్రారంభించాడు స్వామిజీ. ఈ గ్రంథ రచయిత అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ చదువుతున్న కాలంలో 1979 ఆగష్టులో న్యూయార్క్‌ను

మూడవసారి సందర్శించి, ఈయన మొదట హరేకృష్ణ సంకీర్తనాన్ని గానం చేసిన తావును దర్శించి, ఆ సమీపంలోనే హరేకృష్ణ మందిరంలో వున్న ఆయన శిష్య వర్గాన్ని కలుసుకొని ముచ్చటించడం జరిగింది. బక్కపలచని, పచ్చ బంగారం దేహచ్ఛాయతో, చలువ చేసిన తెల్లని వలువలు ధరించి, నొసట విష్ణుబొట్టు, గోష్పాదమంత పిలకతో కూర్చుండి సంకీర్తనా నిమగ్నుడైన భక్తి వేదాంత అట ప్రజలకు చిర పరిచితమైన సాధు విగ్రహమని ఈ గ్రంథకర్త స్వయంగా గ్రహించాడు.

తాను సంకీర్తనం గావించేపుడు ప్రజలున్నారా లేదా అనేది కాదు ఆయన ప్రమేయం- ఎంతగా లీనమై తన ఇష్టదైవాన్ని ప్రస్తుతిస్తున్నానన్నదే! చేరిన చిన్న చిన్న గుంపులను తన గదికి ఆహ్వానించి, అక్కడ కృష్ణ ప్రసాదంతో పాటు, గీతోపదేశాన్ని కావించి, వారిని ఆధ్యాత్మికంగా సిద్ధపరచడం ఆయన యొక్క నిత్యకృత్యం. ఆయన బోధలచే ప్రేరేపితులైనవారు ఆయన శిష్యులుగా వుండగోరి దీక్షనిమ్మని అడిగితే కొన్ని షరతులు విధించేవాడు అలా తనను గురువుగా అంగీకరించి దీక్ష పొందిన శిష్యులు తమ గురువును ఆధ్యాత్మిక మార్గదర్శిగా భావించి, దేవుని ఆరాధించినట్లే ఆరాధించాలి అనేది మొదటి షరతు. ఈ షరతు చాల మందికి విస్మయాన్ని కలిగించింది. అందే 'గురువుని దేవునిగా గుర్తించాలా మేము' అనేది వారి ప్రశ్న. ఎందుకంటే, ఏ వ్యక్తి అయినా తానే దేవుడనని ప్రకటించుకొంటే ఆ వ్యక్తి దేవుడు (God) కాదు డాగ్ అని బోధించడం భక్తి వేదాంత ప్రభుపాదకు అలవాటు. అలా ప్రకటించిన వ్యక్తి, తనను దేవుని ఆరాధించినట్లు ఆరాధించుమని కోరడం విడ్డూరంగా ధ్వనించింది వారికి వారి సంశయ నివృత్తికి ప్రభుపాద ఇచ్చే జవాబు- గురువు దేవుడు కాడు. కానేరడు ఆ విషయంపై అభిప్రాయ భేదం లేదు. కాని దేవున్ని చూపించేవాడు, దేవుని యొద్దకు నడిపించేవాడు. కనపడని దేవుని యొక్క కనిపించే ప్రతినిధి గురువు. అందువల్ల దేవునికిచ్చే గౌరవ మర్యాదలను గురువుకు చూపాలనేది

అట్టి కృతనిశ్చయంతో శిష్యుడు దీక్షపొంది కృష్ణ చైతన్య సంఘ లక్ష్యాలను, ప్రబోధాలను, సంకీర్తనా గానాన్ని నిర్భయంగా, నిజాయితీగా వీధుల్లో సంచరిస్తూ ప్రకటిస్తారు. ఇంత తీవ్రమైన కృషిద్వారా ఈ సంఘం అనతికాలంలోనే న్యూయార్కు, శాన్‌ఫ్రాన్సిస్కో, బోస్టన్ మొదలైన మహా నగరాలతోపాటు

మాంట్రియల్‌లో కూడ శాఖోపశాఖలై విస్తరించింది. సంకీర్తనా మందిర నిర్మాణం కొనసాగింది. శీఘ్రవ్యాప్తికి మూలకారణం నిర్విరామంగా ప్రభు పాద సేవ చేసిన కృషి, ఆయనలోని జనాకర్షణ శక్తి.

1966 వ సంవత్సరంలో ప్రభు పాద అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘం యొక్క లక్ష్యాలను నిర్దేశించి, వానిని జాతి, భాష, సంస్కృతి అనే తరతమ భేదం లేకుండా ప్రపంచమంతా వ్యాపింపచేయవలసిన అవసరాన్ని నొక్కి వక్కాణిస్తూ, ప్రపంచ ప్రసిద్ధికన్న వ్యక్తులకు లేఖలు పంపించాడు. ఆ లేఖాంశాలు:[3]

1. ప్రపంచ ప్రసిద్ధగన్న మత లేఖనాలైన బైబిల్, వేదాలు, కొరాన్, ధర్మ శాస్త్రం మొదలైన పరిశుద్ధ గ్రంథాలలో సంపూర్ణ సత్యం నిక్షిప్తమైవుంది. అయితే, వీటన్నిటిలో అతి పురాతనంగా బయల్పరచబడిన దేవోక్తులుగల లేఖనం వేదాలు. అందునా, దేవుని నోటవెంట వచ్చిన మాటల కూర్పు అయిన భగవద్గీత మరింత ప్రసిద్ధమైంది.
2. దేవుడు లేదా కృష్ణ నిత్యజీవి, సర్వజ్ఞాని, సర్వవ్యాప్తి, సర్వశక్తి, సర్వాకర్షణ. మానవునికి తదితర జీవరాశికి బీజ ప్రదానదాత. విశ్వ గమనానికి మూలపురుషుడు, సర్వ ప్రాణకోటిని పోషించి భరించువాడు.
3. మానవుడంటే శరీరం కాదు కాని, నిత్యజీవి, దేవునిలో భాగం అందువల్ల అనంతుడు.
4. దేవుడు సర్వమానవకోటికి పితరుడని గుర్తించినపుడే, తోడి మానవులను సోదరులుగా భావించి ప్రేమించడం సాధ్యమౌతుంది.
5. పరమాత్మకు లేదా సర్వోన్నత దేవునికి మన కార్యాలన్ని యజ్ఞాలని భావించి కార్యనిర్వహణ కుద్యమించాలి. ఈ సందర్భంగా మీరు చేసే యావత్తు, మీ భోజనం, మీ దానం, మీ త్యాగం, మీ సమస్తం నాకు కానుకలుగా నిర్వహించాలి అనే గీతోపదేశాన్ని[4] భక్తి ప్రభు పాద జ్ఞాపకం చేశాడు.

---

3. *Ibid* pp. 78-79.
4. **The** *Bhagavadgita* **ch.** 4. **v.** 27 **Radhakrishna translation.**

6 భోజన పదార్థాలు, సమస్తం ముందు దైవార్పితమైనపుడే వాసిని భుజించే వారి ఆరోగ్యం నిమిత్తం అవి ఆశీర్వాదింపబడుతవి.

7. నిజాయితీ నిష్టగల ఆధ్యాత్మిక శిక్షణ, క్రమశిక్షణ అభ్యసించడం ద్వారా పవిత్రతను, అనంతమైన దివ్యానందాన్ని, సమస్త ఆతురత, కాంక్షల నుండి విమోచనను, ఈ జీవితవ్యవధిలోనే పొందవచ్చు.

8. కలియుగంలో సంపూర్ణ దైవ ప్రేమను సాధించేదానికి అవలంబించ వలసిన ఏకైక మార్గం భగవన్నామ సంకీర్తనం దీనికి మరీ సులభ మార్గం-

హరేకృష్ణ, హరేకృష్ణ, కృష్ణకృష్ణ హరేహరే
హరేరామ హరేరామ రామరామ హరేహరే

అనే సంకీర్తనాన్ని ధ్యానాత్మకంగా స్మరించడం!

దైవ అవతారంగా వారు గుర్తించిన చైతన్య స్వామి అనుజ్ఞ, ఆదేశం మేరకు సంకీర్తనను, సంస్మరణను, ప్రపంచం అంతా వ్యాపింపజేయడమే అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం యొక్క ప్రధాన కర్తవ్యం. కలియుగ ప్రజ దైవ చైతన్యాన్ని గ్రహించడానికి అశక్తులైగాని, లేదా అయిష్టులైగాని వున్నందువల్ల వారిలో అభిలాషను కలిగించడం ద్వారా, మత పరంగా అప్రమత్తులను చేయాలని ఈ సంఘం యొక్క దీక్ష. నిజమైన కృష్ణ భక్తులుగా ఆయన్ని ఆరాధించి, సేవించే విధానం ఎట్టిదో ప్రజలకు ప్రబోధించడం కృష్ణచైతన్య సంఘం యొక్క మరో లక్ష్యం.

స్వామి భక్తి వేదాంత ప్రభుపాదను ఇంతగా ప్రభావితం చేసిన సంకీర్తనోద్యమ మూలపురుషుడైన చైతన్యస్వామి యొక్క వైష్ణవ పునర్జీవనాకృషిని క్లుప్తంగానైనా కొంత ఈ సందర్భంలో సమీక్షించవలసి వుంది. 'మహా ప్రభు'గా ఈ సంప్రదాయంలో స్థిరపడిన చైతన్యుడు (1486-1584) కేవలం నలుబది ఎనిమిదేండ్లు మాత్రమే జీవించినవ్యక్తి. ఆ స్వల్ప వ్యవధిలోనే కొడిగట్టిన కృష్ణ భక్తి-దీపాన్ని సవరించి, శుద్ధీకరించి, తైలంపోసి ఒక దివ్యమైన జ్యోతిగా వెలిగించిన వ్యక్తి ఇతడు. ఆతని భక్తి జీవితానికి, భక్త్యుద్యమానికి విజయకారణం

ఆతనిలో పెల్లుబికిన భక్తి వెల్లువ.[5] ఆయన ఆకస్మిక మరణానంతరం ఆయన శిష్యవర్గంలో కొందరు ఆయన సిద్ధాంతాలను క్రోడీకరించారు. కాని ఇవి గ్రంథాలకే పరిమితంగా వుండిపోయినందువల్ల ప్రజాజీవనంలో భాగం కాలేదు. తుదకు గత శతాబ్దపు తుదిపాదంలో భక్తివినోద్ ఠాకూరు గౌడీయ వైష్ణవ మిషన్‌ను స్థాపించి (1886) చైతన్య ఉద్యమాన్ని పురోగమింప ప్రయత్నింప, ఆయన కుమారుడు భక్తి సిద్ధాంత గోస్వామి గణిత శాస్త్ర ఆచార్య పదవిని తృణప్రాయంగా త్యజించి వైష్ణవశాఖను, కృష్ణభక్తిని పునరుజ్జీవింప కంకణం కట్టుకొని, కృషిచేశాడు. తాను ఆంగ్లభాషా నిష్ణాతుడైనందువల్ల తన సిద్ధాంతాలను ఆంగ్ల ప్రపంచానికి వ్యాపింపజేయ ప్రయత్నించాడు. ఈ వ్యాపకంలో భాగంగానే భక్తి వేదాంత ప్రభుపాదకు దీక్షనిచ్చి గౌడీయ సాంప్రదాయంలో ప్రవేశపెట్టాడు. ఆ గురుదేవుని అనుజ్ఞను శిరసావహించే స్వామిజీ అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘాన్ని స్థాపించాడు ఈ సంఘం గౌడీయ వైష్ణవ మిషన్‌తో సంబంధాన్ని నెలకొల్పుకొనకుండ సర్వతంత్ర స్వతంత్రమైన సంస్థగా వుండిపోయింది

ఈ సంస్థ హిందూమత గ్రంథాలను యధాతథంగా ఆమోదించింది. అయితే ఈ అంగీకారం కేవలం సిద్ధాంతాలలోనేగాని ఆచరణలో లేదని చెప్పాలి. వేదాలు, ఉపనిషత్తుల నుదహరించినా ముఖ్యంగా భక్తి, అందునా చైతన్య స్వామి ప్రబోధించిన మధుర తన్మయ భక్తి ధోరణుల నవలంబించి, ఆచరించినందువల్ల, భగవద్గీత భాగవత పురాణాలపై ఆధారపడినంత విస్తారంగా మిగిలిన హిందూమత లేఖనాలను పట్టించుకోలేదు. ఆ వైష్ణవ సిద్ధాంతాలలో కూడ నింబార్క వ్యాఖ్యానించిన భేదాభేద సూత్రాన్ని అంగీకరించాడు. జీవాత్మ, పరమాత్మల పరస్పర వైరుధ్యాన్ని ప్రకటించి, భేదస్థితిని వాని పరస్పర ఏకత్వాన్ని అంగీకరించి అభేద స్థితిని ప్రచారం చేశారు.

దేవుడు సగుణుడే. అంతమాత్రాన ఆయనలో ఏకమైవున్న (అభేద సూత్రం ప్రకారం) జీవాత్మ దేవుడు కాదు. కావడానికి వీలు లేదు. అందువల్ల ఏ వ్యక్తి అయినా తాను దేవుడనని భావిస్తే అతడు దేవుడుగాదు కుక్క (Not God but dog), అని చమత్కరించాడు వేదాంత ప్రభుపాద స్వామి

5. J.N. Forquhar, *Modern Religious movements in India*, New York: Macmillon, 1915 pp 293-294.

హిందూ సమాజ కుల వ్యవస్థనీ చైతన్యసంఘం విశ్వసిస్తుంది. అయితే బ్రాహ్మణులనే వారు ఇప్పటికి ఆ కులంలో పుట్టి గుర్తింపబడిన వారు కాదని, చైతన్య సంఘంలో సభ్యులై కృష్ణ సిద్ధాంతాలను ప్రచారం చేసేవారే నిజమైన బ్రాహ్మణులని వ్యాఖ్యానించాడు. మొత్తం మీద బ్రాహ్మణీకాన్ని వదల డానికి ఆయన సిద్ధంగా వున్నట్లు చెప్పలేము ఈ సంస్థ ప్రబోధించే అంశాలలో అధికభాగం భక్తి వేదాంత ప్రభు పాద యొక్క స్వీయాభిప్రాయాలే గాని హిందూమత గ్రంథస్థాలైన అగణిత సత్యాలు కావనే విశాల్ మంగల్‌వాడి అభిప్రాయం సరైనదే.[6]

అయితే ఈ సంఘ సభ్యుల్లో వెల్లివిరిసే ఉత్సాహం, గురుభక్తి, కార్యదీక్ష, తాము నమ్మిన సత్యాన్ని ప్రచారం చేయాలనే తహతహ చూపరుల అభిమానాన్ని, అభినందనలను చూరగొంటాయి.

ఈ చైతన్య సంఘ కార్యకలాపాలు కెనడా, మెక్సికో, స్పెయిన్, ఇటలీ, ఇరాన్, దక్షిణ అమెరికా, తూర్పు ఆఫ్రికా, దక్షిణాఫ్రికా, హాంగ్‌కాంగ్, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా మొదలైన దేశాలకు వ్యాపించిన ఫలితంగా నేడు ఈ సంఘానికి సుమారు 125 సంకీర్తనా మందిరాలు వెలిశాయి. ప్రతి మందిరానికి సుమారు ఇరవై నుండి మూడు వందల వరకు పూర్తికాల జీత భత్యాలపై పనిచేసే శిష్యులున్నారు. క్రైస్తవ మతానికి ఆశ్రయ దుర్గాలుగా పేరొందిన అమెరికా పశ్చిమ యూరప్ దేశాలలోనే గాక, మత పట్టుదలకు పేరొందిన ముస్లిం దేశాలు అందున ఇరాన్ వంటి మత పోరాట ప్రసిద్ధ దేశంలో జపాను వంటి బౌద్ధ మత దేశాలలో వ్యాపించడం ఈ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం యొక్క విశేషం. ఇంత తక్కువ వ్యవధిలో ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధమై ఆర్థిక సౌష్ఠవం, అంగబలం గల మత సంస్థ మరొకటి లేదని చెప్పడం అతిశయోక్తికాదు.

ఈ సంస్థ కొనసాగిస్తున్న కొన్ని కార్యక్రమాలు :

స్వామీజీ అమెరికాలోని పశ్చిమ వర్జీనియా రాష్ట్రంలో నవీన బృందావ నాన్ని నిర్మించాడు ఇది ఆయన నివసించే గ్రామీణ ఆశ్రమమని ప్రతీతి. పౌరాణిక

6. **Vishal mangalwadi** *op.cit.* p. 97

పురుషుడైన కృష్ణుడు ప్రకృతి, గోక్షీరంపై జీవించినట్లే అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సభ్యులు కూడ పండ్లు, ఫలహారాలు, పాలపై జీవించి, కృష్ణ చైతన్యాన్ని పెంపొందించుకోవాలనీ సంస్థాపకుని ముఖ్యోద్దేశం. ఇట్టి సామాన్య జీవనానికి కావలసినవి ప్రకృతి సౌందర్యాన్ని ఉపాసించగల సూక్ష్మ దృష్టి, పౌష్టికమైన శాకాహారం, బలవర్ధకమైన గోక్షీరమనీ ఆయన నమ్మిక. ఇట్టి జీవనానికి ఆధునిక యంత్రాలతో గాని ఆధునిక వసతులతో గాని పని లేదు పండించిన కూరగాయలను, ఫలహారాదులను వారి ఇతర కేంద్రాలకు కూడ సరఫరా చేయడం నిత్యకృత్యంగా జరుగుతున్నది. నేతితో తయారు చేసిన పదార్థాలను చపాతీలను ముందు కృష్ణ విగ్రహానికి అర్పించి, దానినే కృష్ణ ప్రసాదంగా భావించి, ఆరగించడం ఈ నవీన బృందావన వాసులకొక విధి. ఆయా తావుల్లో స్థాపితమయిన సంకీర్తనా మందిరాలలో కూడ వచ్చిన సభ్యులందరికి ఉచిత వసతి సౌకర్యం భోజన సదుపాయాలు సమకూర్చబడినై.

ఇట్టి నవీన బృందావనం వంటిదే లాస్ ఏంజల్స్ లో స్థాపితమయిన 'నవీన ద్వారక'. ఇదొక ఆదర్శవంతమైన సామాజిక జీవనం. ఈ చైతన్య సంఘ సభ్యుల్లోనే వివాహాలు కొనసాగడం, వారి సంతతికి సకల సౌకర్యాలతో పాఠశాలలు కొనసాగడం, అందు సంస్కృత భాషా బోధన ఈ సామాజిక జీవనం యొక్క లక్ష్యాలు. అక్కడ సమష్టి వ్యయం పోను మిగిలిన రాబడిని ఇతర చైతన్య సంఘాలకు పంపిస్తూ ఉంటారు.

ఆయా దేశాల్లో ఉన్న ఆయన శిష్యవర్గం పురాతన జమీందారులు, చిన్న రాజులు నిర్మించుకొని వున్న మహాప్రసాదాలను కొనుగోలు చేసి, వాటిని రమ్య హర్మ్యాలుగా, సంకీర్తనా మందిరాలుగా, సామాజిక జీవనానికి సరిపడే గృహాలుగా పునర్నిర్మించుకొని సౌకర్యవంతమైన జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ఈ విధంగా పౌరాణిక కృష్ణుని జ్ఞాపకం చేసే కార్యక్రమాలను చేపట్టడం ద్వారా, స్వయం ఉపాధి కల్పన ద్వారా ఆ కార్యక్రమాల్లో పాల్గొనే వారిలో జైనందిన జీవిత నిత్యావసరాలకు తాప్రతయ పడవలసిన అవసరం లేదు. ఆ విధంగా వారికి వారి సమయాన్ని సంకీర్తనా సంస్మరణలో గడపడానికి వీలు కలిగింది.

అయితే ఇంత త్వరితంగా ఇట్టి ఆధ్యాత్మిక పరిణామం వీరిలో కలగడం ఎలా సాధ్యమైందనే ప్రశ్న జిజ్ఞాసువుల్లో క్రొత్తపుంతలను రేకెత్తిస్తున్నది.

భారతదేశంలో కూడ ఈ సంస్థ విస్తృత ప్రాతిపదికపై అనేకమైన ప్రణాళికలను అమలు పరుస్తున్నది. అందు ముఖ్యమైనవి మూడు. పౌరాణిక కృష్ణ పాదధూళిచే పునీతమైన నగరమైన బృందావనంలోను, ప్రభుపాద నిత్యం పూజించే భక్తాగ్రేసరుడు చైతన్యస్వామికి నివాసమైన మాయాపూర్‌లోను రెండు చైతన్య కేంద్రాలను సంకీర్తనా మందిరాలతో సహా నిర్మించారు. ఇందు కూర్చబడిన అత్యాధునిక సౌకర్యాలు విదేశీ యాత్రికుల నాకర్షిస్తున్నందువల్ల ఇవి రెండు కూడ యాత్రాస్థలాలుగా ప్రసిద్ధి చెందాయి. మూడవది బొంబాయి తీరంలో నిర్మింపబడిన హరేకృష్ణ మైదానం.

ఇవిగాక 1978లో సమశీతల వాతావరణానికి ప్రసిద్ధిచెందిన బెంగుళూరు నగరంలోని గుర్రపు పందాలు నిర్వహింపబడే స్థలానికి ఎదురుగా యాభై మందికి ఆధునిక వసతి కల్పిస్తూ ఖరీదైన అందమైన నల్లరాతితో నిర్మితమైన మహా భవనాన్ని అత్యంత విలువపెట్టి ఈ సంఘం కొన్నది. ఈ భవనానికి 'పూర్ణప్రసాద్ భవనం' అని నామకరణం చేశారు. ఈ భవనాన్ని భక్తి ప్రభుపాద మరణించిన (1977) సంవత్సరానికి ఖరీదు చేయడం జరిగింది.

కేవలం భక్తి ప్రభుపాద అమెరికా చేరిన పన్నెండు సంవత్సరాలలో 125 సంకీర్తనా మందిరాలతో పాటు లక్షోపలక్షలు శిష్యవర్గం ప్రపంచవ్యాప్తంగా రూపొందడం, వేలకొలది మిలియన్లలో ఆస్తుల కొనుగోలు చేయడం చూస్తుంటే అమెరికాలోను, ఇతర దేశాలలోను ధనికులైన యువతీయువకులను ఈ కృష్ణ చైతన్య సంఘం ఎంతగా ఆకర్షించిందో బోధపడుతున్నది. ప్రపంచ ప్రధాన నగరాలలో కొన్ని ముఖ్య తావుల్లో గోష్పాదం వంటి పిలక, ఎగగట్టిన పంచె, మెడలో మృదంగం లేదా చేత చిటికెలు ధరించి సంకీర్తనా గానం చేసే శిష్య వర్గాన్ని ఈ గ్రంథకర్త పెక్కుసార్లు చూడడం జరిగింది. 1981 డిశంబరు 14వ తేదీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కనిపించిన సమాచారం గమనింపతగింది. "కృష్ణ భగవాన్ దర్శనంకోసం, మీరెక్కడకువెళ్ళనక్కరలేదు. ఆయన మీగుమ్మంముందు ప్రత్యక్షమౌతాడు లేచి చూడండి." అనేది ఆహ్వాన సారాంశం. సుమారు మూడు లక్షల రూపాయలకంటె ఎక్కువ ఖరీదైన కారుపై ఏర్పాటైన సంచార సంకీర్తనా మందిరంతో ఈ సంఘ ప్రచార సభ్యులు గ్రామ గ్రామాన్ని దర్శించి ప్రజల్లో కృష్ణ చైతన్యాన్ని జాగృతీకరించాలని ప్రయత్నించారు. అంతేగాదు, దక్షిణ

భారతంలో వీరి కేంద్రం 665 ఎకరాల విస్తీర్ణంగల విశాల జాగాలో నిర్మితమై ఉంది. ఇట ఒక ఆదర్శ పాఠశాల, పాడిపరిశ్రమ, గృహ, కుటీర పరిశ్రమలు అయిదున్నర లక్షల రూపాయల కిమ్మత్తుతో నిర్మితమై వున్నాయి. బెంగుళూరులో వీరు నిర్వహించిన రథ యాత్ర అపూర్వమైనదని దానిని తిలకించిన ప్రేక్షకుల అభిప్రాయం. సరిగా అదే రోజు శాన్ ఫ్రాన్సిస్కోలో కూడ రథోత్సవం జరిగిందనే విషయాన్ని పాఠకులు గమనించవలసి వుంది.

ఎవరైనా కృష్ణచైతన్య సంఘంలో సభ్యత్వం పొందడానికి రుసుము చెల్లించాలి. జీవిత సభ్యత్వం విలువ 2220 రూ. ఈ మూల్యాన్ని చెల్లించి సభ్యత్వం పొందిన భారతీయుల్లో వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలు, సినీ నటులు, రాయకీయ నాయకులు తదితర భారతీయ ప్రముఖులున్నారు. అనేక పర్యాయాలు ఈ సమాజ కార్యకలాపాలు, లక్ష్యాలు అనేకుల విమర్శలకు గురి కావడం జరిగింది. ఈ విదేశీయులింతగా పెద్ద మొత్తంలో ధనాన్ని వెచ్చించడం అందునా జనాభ్యుదయ కార్యక్రమాలకు గాక, మతసంబంధమైన వ్యవహారాలకు వెచ్చించడం - అనేకుల మనసుల్లో ప్రశ్నలు లేవనెత్తుతున్నది. దీనిని గూర్చిన నిజానిజాల పరిశోధన జరిగేవరకు ఇంతకు మించి ఈ సంస్థ ఉద్దేశాలను గూర్చి ముచ్చటించడం సబబుకాదు.

స్వామి భక్తి వేదాంత ప్రభుపాద సేవల మదింపు :

భక్తి వేదాంత ప్రభు పాద కేవలం వ్యక్తి కాదు, ఒక మహాసంస్థ అనే నానుడి వున్నది ఇందుకు కారణం ఆయన చేపట్టిన ఉద్యమం విజయవంత కావడం మాత్రమేకాదు, అంతటి ఉద్యమాన్ని దేశదేశాల్లో నిర్వహిస్తూనే, శిష్యవర్గాన్ని దర్శించి ఉద్రేకపరుస్తూనే కృష్ణచైతన్యం ఉప్పెనలా లోకంలో క్రమ్ముకొనడానికి మూలాధారాలను సృష్టిస్తూ చేసిన సంస్కృత గ్రంథానువాదాలు, వ్యాఖ్యానాలు కూడ కారణం అని చెప్పవలసి వుంది.

స్వామి భక్తి వేదాంత ప్రభు పాద ప్రచురించిన గ్రంథాల జాబితా :

1. భగవద్గీత యథాతథ అనువాదం, వ్యాఖ్యానం.
2. శ్రీమద్భాగవతాంగ్లానువాదం 60 సంపుటాలు.
3. కృష్ణునిలో పుంజీభవించిన సర్వోన్నత దేవుని మూర్తిమత్వం రెండు సంపుటాలు.

4. శ్రీ ఈశోపనిషత్.
5. శ్రీ చైతన్య చరితామృత-పది సంపుటాలు.
6. ఇతర గ్రహాల కొరకైన సులభ ప్రయాణసాధనం.
7. కృష్ణ చైతన్యం.
8. సర్వోత్కృష్టమైన యోగ విధానం.
9. ప్రహ్లాద మహారాజు యొక్క అద్వితీయగాథలు.
10. చైతన్య మహాప్రభు యొక్క అసాధారణ బోధలు.
11. సమస్త ఆనందానికి నిలయమైన కృష్ణుడు.
12. యోగియొక్క సర్వ సంపూర్ణత్వం.
13. జన్మకు మరణానికి ఆవలితీరం.
14. కృష్ణ స్థానానికి మార్గం.
15. రాజవిద్య
16. కృష్ణ చైతన్యం యొక్క ఉన్నతస్థాయి.
17. ఇవిగాక **Back to Godhead** అనే మాసపత్రిక, ఈ పత్రికతో పాటు పై గ్రంథాలన్నీ మొదట ఆంగ్లంలో ప్రచురింపబడి, ఆ పిదప వానిలో కొన్ని ఆయా స్థానిక భాషలలోనికి అనువదింపబడినవి.

ప్రభుపాద అమెరికాలో అడుగు మోపకముందే, భగవద్గీత యొక్క వేర్వేరు అనువాదాలు సుమారు ఏడువందల వరకున్నవని ఒక అంచనా.[7] అయినా భక్త ప్రభుపాద అనువాదితమైన భగవద్గీత విస్తారంగా చెల్లిపోయింది. ఇందుకు ప్రధానకారణం సరళమైన అనువాదమని కొందరి భావం. ఆ అనువాదాన్ని పోల్చి చూచిన ఈ గ్రంథకర్త దానిని అక్షరానువాదం అనడంకన్న వివరణాత్మక అనువాదం అనడం సబబని అభిప్రాయపడుతున్నాడు. అయినా లోకోభిన్నరుచిః.

తప్పుచేయడం, మాయకు లోనుకావడం, మోసగించడం, అసంపూర్ణ జ్ఞానంతో మిడిసిపడడం అనే నాలుగు నేటి మానవ జీవితానికి చీడపురుగులని వేదాంత ప్రభుపాద సిద్ధాంతం. ఈ పరిస్థితుల్లో షరతులకు లోబడిన మానవ మేధ, సంపూర్ణ జ్ఞానాన్ని సముపార్జించడం అసాధ్యం. అందువల్ల అట్టి సంపూర్ణ

7. **Kushwantsingh**, *Gurus, Godmen and Goodpeople*.

జ్ఞానార్జనకు పై నాలుగు అవలక్షణాలకు దూరంగా నివసించే పరిపూర్ణ వ్యక్తిని లేదా శక్తిని చేరవలసివుంది. ఆ పరిపూర్ణ వ్యక్తి దేవుడే. ఆ దేవుణ్ణే జగన్నేత బయల్పరుస్తున్నదని వేదాంత ప్రభుపాద ప్రబోధం. ఆ కృష్ణ చైతన్యాన్ని ప్రతి వ్యక్తి పొందాలని ప్రబోధించేది చైతన్యసంఘం. ఈ స్థితికి మానవజాతిని నడిపించడమే భక్తి ప్రభుపాద కర్తవ్యం. అందుకే ఆయన ఆధ్యాత్మిక మార్గదర్శి. ఆధ్యాత్మిక మార్గదర్శికి మరో పేరు గురువు.

గురువు దేవుని యొక్క సర్వోన్నత వ్యక్తిత్వానికి కనిపించే ప్రతినిధి. అతడు పొందే గౌరవ మర్యాదలు కాని, చీత్కార చీదరింపులు గాని ఒక వ్యక్తిగా, ఒక గురువుగా - దేవుని ప్రతినిధిగా పొందుతున్నాడు గనుక, అవి దేవునికే చెందుతవి. ఎగబడివచ్చిన ప్రతి వ్యక్తిని శిష్యుడుగా అంగీకరించే అలవాటు స్వామి భక్తి వేదాంత ప్రభుపాదకు లేదని ఆయన శిష్యుల అభిప్రాయం. అట్టి జిజ్ఞాసువులను కొన్ని షరతులకు లోనుచేసి, ప్రశ్నల వర్షం కురిపించి, వారిలో గురుశిష్య సంబంధానికి చెందిన సమగ్ర జ్ఞానం వున్నదని రుజువైన పిమ్మటే శిష్యులుగా అంగీకరించడం ఆయన అలవాటు. ఈ కృష్ణ చైతన్య సంఘం ఇంత త్వరితంగా ప్రపంచ ప్రసిద్ధి పొందడానికి ఇట్టి సమర్పిత, త్యాగశీలురైన శిష్యుల దృఢదీక్ష కూడ ఒక కారణమని చెప్పవచ్చు.

అంతేగాక, ఈ సంఘ సభ్యులైన వారిలో కొందరు అమెరికాలో ఒక రాజకీయ పక్షాన్ని నిర్మించి, ఆ పక్షానికి హరేకృష్ణ పార్టీ అని నామకరణం చేశారు. అట్టి వారిలో ముఖ్యుడు విల్లియం ఓగ్లే. నేటి సామాజిక వ్యవస్థలో మార్పు తీసికొని రావడానికి ముందు కృష్ణుని యొక్క చైతన్యాన్ని గూర్చి ప్రకటించి ప్రబోధించి, ప్రతివారిలో ఆ చైతన్య స్రవంతి ప్రవహింప చేయాలని, అందువల్ల సామాజిక రాజకీయ ఆర్థిక పారిశ్రామిక రంగాలలో కలిసి పనిచేస్తున్నవారు కృష్ణ చైతన్య వ్యాప్తికి కృషిచేయాలనే దృఢనిశ్చయంతో పై రాజకీయ పక్షాన్ని ఏర్పరిచారు. ఈ సంఘ సభ్యులైన వారి అనుభవ సాక్ష్యాలను బట్టి వీరేదో కాలక్షేపానికి గాని, ఆకాయ పోకాయగా గాని కృష్ణచైతన్య సంఘ సభ్యులు కాలేదని, దృఢ నిశ్చయం, కార్య దీక్షతోనే సభ్యత్వం సంపాదించి శ్రమిస్తున్నారని తెలుస్తున్నది. 1948లో కెన్యా దేశంలో పుట్టిన రాబర్ట్ సిరిల్‌లవాంగు, 1971 లోనే ఆ దేశ రాజధాని

నైరోబి రాజ వీధుల్లో సంకీర్తనం చేస్తూ వున్న కృష్ణ చైతన్య సంఘ సభ్యులచే ఆకర్షితుడై, ఆ పిదప పది దినాల తరబడి జరిగిన సంభాషణానంతరం సభ్యత్వాన్ని స్వీకరించాడు.[8] తాను సభ్యుడు కావడం, కృష్ణ భగవానుని సేవకుడై ఆయనలోని ప్రేమామృతాన్ని మానవ కోటికి పంచిపెట్టడానికేనని ప్రకటించాడు.

ఈ సంఘం యొక్క సిద్ధాంతాలను, ఆచరణలను సూక్ష్మంగా పరిశీలించిన వారికి భక్తి వేదాంత ప్రభుపాద ఆధునిక జీవితాన్ని పురాణ యుగంలోనికి నడిపిస్తున్నాడా అనిపిస్తుంది. 'ఆధునిక ద్వారక' లేదా 'బృందావన' నిర్మాణాల సరళి ఆయనలో గూడుకట్టుకొన్న పురాతన మనస్తత్వానికే ప్రతీకగా కనిపిస్తున్నది. హిందూ మత గ్రంథాలను అధికారిక లేఖనాలుగ అంగీకరించినందువల్ల ఎవరికి అభ్యంతరం లేదు. కాని వానిని నేడు మారుతున్న మానవ జీవన విధానానికి అన్వయిస్తూ ఎలా వ్యాఖ్యానించాలనేదే సమస్య. అలా వ్యాఖ్యానించ లేనపుడు, మత చింతనను ఆధునీకరించి, జీవన ప్రగతికి తోడ్పడడానికి బదులు, జీవన ప్రగతిని శోధించి, జీవన విధానాన్ని తిరోగమింప చేయడం ఔతుంది. భక్తి వేదాంత ప్రభుపాద సంస్థ ఈ తిరోగమనాన్ని ప్రేరేపిస్తున్నదని ఈ గ్రంథకర్త వుద్దేశం

కుల సూత్రం భారతదేశ సమాజానికి చీడ పురుగని, పుట్ట కురుపు వంటిదని పలువురు విమర్శిస్తూ వుంటే, కృష్ణ చైతన్య సంఘంలో సభ్యులైన వారే బ్రాహ్మణులు మిగిలినవారు కారు అని వేదాంత ప్రభుపాద నిర్ధారిస్తున్నాడు. హిందూ మత గ్రంథాలు - ముఖ్యంగ మను ధర్మ శాస్త్రం - పాశ్చాత్యులను 'మ్లేచ్ఛులు' అని ఈసడిస్తే వారిని సద్బ్రాహ్మణులుగా అభివర్ణిస్తున్నాడు. అలా చేసినందువల్ల ఎవరికైనా ఆకర్షించే అవకాశం ఆయనకుండ వచ్చు. కాని ఒక వైపు హిందూ లేఖనాలనే అధికారికంగా అంగీకరిస్తూ అట్టి లేఖనాలకే వ్యతిరేకమైన విధానాలను అమలు పరచడం వల్ల ఆయనలోని అనిశ్చిత స్థితి - ఇంకొక రకంగా వర్ణిస్తే - అవకాశవాదం, కుల మనస్తత్వం నుండి బయట పడలేని బలహీనత ప్రస్ఫుటమౌతున్నాయి.

వేదాలను పెద్దగా దినదినం వల్లించకపోయినప్పటికీ, చైతన్య సంఘం జీవితానికి సంబంధించిన సనాతన వేదోక్త ఆదర్శాలనే పునరుద్ధరింప ప్రయత్నిం

8. *Ibid.* p. 92.

బింది ఆయన ప్రచురించిన **'Back to Godhead'** అనే పత్రికలో వేద, మను ధర్మ సూత్రాల సమ్మేళనం కనిపిస్తున్నది. అందువల్ల ఇది ఆధునిక వైష్ణవ పునరుజ్జీవన సంస్థ అనడం కన్నా సనాతన ధర్మ ప్రవాహానికి భాగమని పిలవడమే సమంజసం కావచ్చు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం సంకీర్తన భక్తి ధోరణులలో ... ప్రసిద్ధి చెందినదనడం సత్యం దూరం కాదు, కాని అందు స్త్రీలకు సభ్యత్వం లేకపోవడం లేదా సభ్యులుగా చేరడానికి స్త్రీలు ముందుకు రాకపోవడంవల్ల కూడ ఈ సంస్థను సనాతన ధర్మం యొక్క సరికొత్త రూపం అనవలసి వస్తున్నది. కారణాలేవైనా కావచ్చు, నేటి గురుద్వారాలలో కనిపించినంత విస్తృతంగా స్త్రీ సభ్యత్వం ఈ చైతన్య సంఘంలో కనిపించదు.

అయితే కృష్ణ చైతన్య సంఘం తాంత్రిక ధోరణికి చెందినదా అనే ప్రశ్న ఈ నాడు క్రియా శీలురైన జిజ్ఞాసువులను వేధిస్తున్నది. ప్రస్తుత గ్రంథకర్త ఈ ఉద్యమంలో తాంత్రిక ధోరణులున్నవి కాని, అవి శివ లేదా శక్తి ధోరణిని గాక వైష్ణవ తాంత్రిక ధోరణికి చెందినవిగా భావిస్తున్నాడు. వైష్ణవ తాంత్రిక ధోరణి ఏమిటి అనే ప్రశ్న కొందరు లేవనెత్తవచ్చు. ఈ చైతన్య సంఘ సభ్యులు వారి గురువుతోసహా నారద పంచరాత్ర సూత్రాలను విశ్వసించేవారు. నారద పంచరాత్ర మూడు ముఖ్యమైన తాంత్రిక వైష్ణవ గ్రంథాలలో ప్రాముఖ్యమైనదనే విషయాన్ని మళ్లీ జ్ఞాపకం చేయనక్కరలేదు.[9] ఈ సంఘం సాధారణ తాంత్రిక లేదా వైష్ణవ తాంత్రిక ధోరణిని అనుసరించేదే గాని, శైవ తాంత్రిక ధోరణిని కాదు. నిజానికి శైవ తాంత్రిక ధోరణిని ఈ సంఘ సాహిత్యం తీవ్రంగా విమర్శిస్తుంది కూడ.[10] హఠ యోగాన్ని కూడ ఈ సంస్థ అంగీకరించదు.

అంతర్జాతీ కృష్ణ చైతన్య సంఘం నమ్మిక ప్రకారం, జీవాత్మకు విమోచన వ్యక్తి యొక్క శారీరక శ్రమకు విడుదల - ధ్యాన ముద్రలో గాక, భక్తి పార వశ్యంలో లభిస్తుంది. భావోద్రేకం, మనోద్రేకం, క్రమ క్రమంగా మతోన్మత్తతను

9. *Tantra, Can Sex be Yoga* **published in** *Back to Godhead*, Vol. XIII No. 7. 1975 p 25 ff
10. *Ibid* p 26.

దారి తీసి పరవశత్వం లోనికి సాధకులను నడిపిస్తాయి రాధా సామి సత్ సంగ్ శబ్దంలో, మహేష్ మహా యోగి అతీంద్రియ ధ్యానంలో, రజనీష్ ధ్యాన యోగలో విమోచనను చూడగలిగితే చైతన్య సంఘం తన్మయ భక్తిలో ఆ కార్యాన్ని సాధించాలని ప్రయత్నిస్తున్నది

అయితే, ప్రభు పాద మరణించిన పది సంవత్సరాలకు ఈ సంస్థ తీవ్ర విమర్శల నెదుర్కొంటున్నది. అనేకమంది సంస్థ యొక్క నిజాయితీని, ధన సముపార్జనా విధానాన్ని, వ్యయ విధానాన్ని సందేహిస్తున్నారు. భారత దేశ సంస్కృతి నుండి జన్మించిన ఈ వుద్యమం (1950) పదిహేనేళ్ళపాటు భక్తి ప్రభుపాద ఈ దేశంలో వున్నప్పటికి, ఎవరికి తెలియరాలేదు. 1965 లో ఆయన ఏకాకిగా అమెరికా వెళ్ళిన మీదటే, దీని ఉనికి, స్థాయి, వ్యాపకత్వం తెలియ వచ్చింది, పెరిగింది, జరిగింది. లక్షోప లక్షల డాలర్ల విరాళాల వెనుక ఉన్న మతోద్దేశమేమిటి? ఇంత డబ్బు వెచ్చించిన మీదట కూడ భారతదేశంలో, అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం, నగరాలకే పరిమితంగా వుండిపోయింది గాని గ్రామీణ ప్రాంతాలకు వ్యాపించని కారణా లేవిటి? మొదలైనవి కొందరు జిజ్ఞాసువులు లేవనెత్తే కీలక ప్రశ్నలు

ముగింపుగా స్వామి భక్తి వేదాంత ప్రభుపాద కృషిని గూర్చి ఒక మాట చెప్పవలసి వుంది. ఈనాడు గురూద్యమాల పేరిట అనేక మంది బాబాలు, స్వామీజీలు, గురు మహారాజులు, భగవానులు, మహర్షులు- ఏ పేరైనా పెట్టండి- దేశాల్లో అల జడిని రేకెత్తిస్తున్నారు యువతను ఆకర్షించడం కోసం, తమకు విశ్వాసాలంటూ వుంటే, వాటిని పణంగాపెట్టి, రాజీపడి ఎవరికనువైన పద్ధతిలో వారికి తగినట్లు బోధిస్తున్నారు ముఖ్యంగా యువతను తప్పుదారి పట్టిస్తున్నారు. మాదక ద్రవ్యాల వైపు, గంగవెర్రు లెత్తిస్తున్న ఈ ఉద్యమాలు ప్రపంచ యువతకు సవాలుగ పరిణమించాయి. అయితే, భక్తి వేదాంత ప్రభుపాద తాను నమ్మిన సిద్ధాంతాన్ని బలి చేయకుండ, పెడత్రోవలు పట్టిన యువతలో కొంత భాగాన్ని, కొంతవరకైనా వక్రమార్గాల నుండి మరల్చగలిగాడని చెప్పాలి. ఆ మేరకు ఆయన కృషి ఫలించినదే లెక్క..

# 3. స్వామి ముక్తానంద పరమహంస (1908- )[1]

## శక్తిపథం

భారతదేశం యొక్క ప్రస్తుతావస్థలో సజీవులై వున్న తాంత్రిక సిద్ధ యోగుల్లో స్వామి ముక్తానంద పరమహంస అగ్రగణ్యుడు. అందువల్ల ఆయన కష్టించి సాధించి వశపరచుకొన్న శక్తి పథాన్ని, ఈ శక్తి పథానికి రెండు నేత్రాలయిన "క్రియా యోగ"ను, "సిద్ధ యోగ"ను ముందుగా కొంత వివరించవలసి వుంది.

హిందూ తాంత్రిక సాహిత్యం ప్రకారం ఆద్యశక్తి ప్రతి వ్యక్తిలో ప్రకృతి శక్తిగా ప్రవేశించి, నిశ్చేతనంగానే గాక ప్రగాఢ సుషుప్తావస్థలో దీర్ఘ విశ్రాంతి ననుభవిస్తూ వుంటుంది. ఈ శక్తినే తాంత్రిక సాహిత్యం "కుండలిని"గా పేర్కొన్నది. ఈ "కుండలిని" వ్యక్తిని ఆధ్యాత్మికంగా చైతన్యవంతం చేసి దైవ సిద్ధంగా రూపొందిస్తుందని వారి విశ్వాసం. ఆ శక్తి నిద్రావస్థలో ఉన్నందువల్ల వ్యక్తిలో ఆధ్యాత్మిక చైతన్యం సన్నగిల్లి, ప్రకృతి శక్తులు ప్రకోపిస్తాయి. ఆ కారణంగా లోకానురక్తి పెరిగి వ్యక్తి భ్రష్టుడు అయ్యే ప్రమాదముంది. ఆద్యశక్తి అయిన కుండలిని, మానవుని బుద్ధి నైజాలు అనులోమ, విలోమ నివృత్తిలో

1. For detailed study refer to :
   a) Muktananda - *Amma Swami Muktananda Paramahamsa*, Ganeshpuri, 1971.
   b) Peter Brent *op.cit.* pp. 259 ff.
   c) Kushwant Singh, *Gurus, Godmen and Goodpeople.* pp. 96–103.
   d) Vishal Mangalwadi *op cit.* 169-179.
   e) Charles S.J. White, *Swami muktananda and the Enlightenment through Sakthipath*, History of Religions. University of Chicago, Vol. 23, No. 4.

కొనసాగుతూ పరస్పర వ్యతిరేక కార్యక్రమాలను నిర్వర్తిస్తూ ఉంటాయి. ఆద్యశక్తి మేల్కొన్నపుడు లోకశక్తులు శక్తులుడిగి నిశ్చేతనమైన కారణంగా, వ్యక్తి దైవోన్ముఖంగా పయనిస్తూ సిద్ధుడుగా రూపొందగలడు. అట్టి పరిణామాన్ని కలిగించే "కుండలిని" శక్తిని సుషుప్తావస్థ నుండి మేల్కొల్పి సహస్రదళ్ పద్మం దైవ సిద్ధ సాధ్యం వైపు క్రమ క్రమంగా అధిరోహింప చేయడానికి తోడ్పడేదే తాంత్రిక సాహిత్యం. ఆ మార్గం శక్తిపథం. దీని ఫలితం క్రియాయోగ లేదా సిద్ధయోగ స్థితి.

జాగృతీకరింపబడిన కుండలిని 'మూలాధార' నుండి బయలుదేరి మానవ దేహం యొక్క కేంద్రస్థానంలో అమర్చబడిన షట్చక్రాలు లేక తాంత్రిక కీలక స్థానాల నొకదానితరువాత నొకటిగా దాటుతూ సహస్రదళ్‌ను చేరవలసి వుంది. మూలాధారం నుండి కుండలిని పయనించవలసిన స్థానాలు :

1. స్వాధిష్ఠానం- శరీరంలోని దిగువ భాగాన్ని క్రమబద్ధం చేసే కడుపు లోని స్థానం.
2. నాభిపద్మ లేక మణిపుర - కడుపు నుండి పై భాగాన్ని క్రమబద్ధం చేసే చక్రస్థానం
3. హృదయపద్మ- ఈ చక్రం భావోద్రేకాలను అదుపులో పెట్టే స్థానం.
4. విశుద్ధ- ఇది గొంతులో వుండి భావవ్యక్తీకరణను, మానసిక బాహ్యీకరణను నియంత్రిస్తుంది
5. అజ్ఞాచక్ర - రెండు కనుబొమలమధ్య వుండి చరాత్మకమైన మనసును, చిత్తాన్ని, దృశ్యశక్తిని, మానసిక పరిణామాన్ని అజమాయిషీచేసే స్థానం
6. సహస్రదళ్ పద్మ- ఉన్నతమైన సదాలోచనలవైపు మొత్తం వ్యక్తిత్వాన్ని నడిపించి, మర్మాత్మక శక్తులను గ్రహించునట్లు బుద్ధి విశేషాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది సిద్ధస్థితి.

మూలాధారలో బయల్దేరిన కుండలిని పై ఆరు కీలకస్థానాలలో ప్రవేశిస్తూ, ఒక్కొక్క స్థానాన్ని తన స్వాధీనంలో వుంచుకొని సహస్రదళ్ చేరేటప్పటికి వ్యక్తి ఆలోచనను, శక్తిని మార్చి సిద్ధునిగా రూపొందిస్తుంది. అయితే, ఉన్న కీలకమంతా సుషుప్తావస్థలో వున్న కుండలిని మేల్కొల్పగల విధానంలోనే!

ఇందుకు కఠోర క్రమశిక్షణ, తపస్సు, శరీర శుష్కణ మొదలైన కఠిన విధానాలను అవలంబించవలసి వుంటుంది. ఇలా ఇన్నిటిని తట్టుకొని నెగ్గినవాడు కుండలిని శక్తి సమన్వితుడు అతని మార్గం శక్తి పథం.

ఈ తాంత్రిక పారంపర్యంలో క్రియాయోగులు, సిద్ధయోగులని ముఖ్యంగా రెండు విభాగాలున్న విషయం పాఠకులకు తెలిసే వుంటుంది. ఈ రెండు విభాగాలను ఖండితంగా గీత గీచి వేరుచేయడం సులభం కాకపోయినా, వానియొక్క విధానాలను, గమ్యాలను కొంతవరకు వివరించవలసిన అవసరం వుంది

'క్రియాయోగ' అనే పదాన్ని కూడ ఆయా గ్రంథకర్తలు రెండు విధాలుగ ప్రయోగిస్తున్నారు. అందొకటి తాంత్రిక పారంపర్యంలో అత్యంత కీలకమైన 'ముద్ర'కు క్రియను పర్యాయ పదంగా వాడడం 'క్రియ' 'శారీరక బాహ్యాభ్యాసం' హఠ యోగలోని 'బస్తి' 'నేతి' 'నౌళి' మొదలైన అభ్యాసాలను సూచిస్తుందని స్వామి శివానంద నిర్వచించారు.[2] ఈ నిర్వచనం ప్రకారం బాహ్యాభ్యాసం లేదా ఆరాధన ద్వారా స్వీయ పవిత్రీకరణను సాధించడమే క్రియాయోగం అనవచ్చు. 'క్రియ'ను 'తాంత్రిక' సాంప్రదాయం మొత్తానికే పర్యాయ పదంగా వాడడం రెండవ విధం. ఈ విధం ప్రకారం నిత్యం ధారావాహికంగా సంతోషం, ఆనందం, జ్ఞానం యొక్క సంపూర్ణ బాహ్యావ్యక్తీకరణంగా జీవితాన్ని మార్చడమే క్రియాయోగ వుద్దేశం.[3] తాంత్రిక పారంపర్యం యొక్క గమ్యం కూడ ఈ రెండవ భావమే అట్టి పరిణామాన్ని తమ జీవితాలలో సాధించినవారు క్రియా యోగులు. క్రియా యోగను మానసిక ఉచ్ఛ్వాస నిశ్వాసాల ప్రక్రియగా మరికొందరు నిర్వచించినారు ఈ క్రియాయోగను దగ్గర దారిగ, విమానయానంగ యోగానందస్వామి అభివర్ణించారు. ముఖ్యంగా క్రియాయోగులు తమ శక్తి ఊర్ధ్వంగా, అధోముఖంగా ప్రయుక్తం చేస్తారు. ఊర్ధ్వ ముఖంగా కుండలిని శక్తి పయనించేటపుడు వ్యక్తి దైవ సిద్ధుడుకాగా, అదే శక్తి అధోముఖంగా అవరోహిస్తు

2 Sivananda Swami, *Yoga Vedanta Dictionary*, Sivananda Nagar, 1973.

3. Bihar School of Yoga Publication, III 1975 January p. 9.

న్నపుడు మొత్తం ప్రకృతి అంతటిని పరిణామ సిద్ధం చేస్తుందని వారి విశ్వాసం. ఇలా క్రమక్రమంగా చేయడం ద్వారా మానవ శరీరం నూతన శక్తి సమన్వితం ఔతుంది. క్రియాయోగను సాధించిన వ్యక్తి శ్వాసక్రియను శాస్త్రీయంగా బంధించి జీవించగలడనే నమ్మిక కూడా వారిలో వుంది.

సిద్ధ యోగలో వేర్వేరు హఠ యోగ క్రియలనభ్యసించి తద్వారా స్వభావాతీతమైన అపూర్వ శక్తుల సాధించుట ముఖ్యోద్దేశంగా కనిపిస్తున్నది. అన్ని తాంత్రిక సంప్రదాయాలలోవలె ఈ రెండు విభాగాలలో కూడ గురువును దైవంగా గుర్తించడం సర్వసాధారణ లక్షణం. ఇందుకు ప్రధాన కారణం గురువు తన స్పర్శ ద్వారా, చూపు ద్వారా, తాను సాధించిన అపూర్వ శక్తులను, శిష్యునికి సంక్రమింప చేయగలడను విశ్వాసమే! దీనినే శక్తి పథం అనికూడ యోగ పారంపర్యంలో పిలవడం కద్దు. అట్టి శక్తి పథాన్ని సాధించడమే గాక అనేకులకు ప్రసాదించగల 'సిద్ధయోగి' ముక్తానంద పరమహంస. 'పరమహంస' అనే బిరుదు గురు లేక స్వామి యొక్క ఉత్కృష్ట దశలను సూచిస్తుంది.

పరమహంస అనగా :

1 పరిణామం చెందడానికి ఎవరైన దీక్ష తదనంతరం పుష్కర కాలం వేచి వున్న వ్యక్తి.
2 స్వయంసిద్ధుడు.
3. సమస్త భావోద్రేకాలకు, లోకేచ్ఛలకు, సహజాత ప్రభావానికి అతీతుడు.
4. సంస్కృత భాషా పండితుడు.
5 శాఖాంతర విభేదాలకు. సిద్ధాంత పట్టింపులకు అతీతుడు

బాబాలుగ, స్వామీజీలుగ, గురు మహారాజులుగ ఈ గ్రంథంలో పరిశీలింపబడిన అనేక మంది వ్యక్తుల జనన విధానం వలె స్వామి ముక్తానంద పరమహంస జనన విధానం కూడ అసామాన్యంగానే వుంది. కర్నాటకలోని ధర్మస్థల గ్రామంలో వెలసిన 'మంజునాథ' దేవాలయంలో పుత్ర సంతానం కోసం ఆయన తల్లి ప్రార్థిస్తూ వుండేదని, ఒకానొకనాడు సాధువు వచ్చి పంచాక్షరీ మంత్రమైన 'ఓమ్, నమశ్శివాః' పునశ్చరణం చేస్తూ వుంచే త్వరలోనే పుత్ర సంతానం ప్రాప్తిస్తుందని సూచించాడట. 1908 మే నెల 16వ తేదీన ఆ సాధువు మాట నెరవేరింది.

అరుణోదయాన్ని కొబ్బరి చెట్టు క్రింద ముఖ ప్రక్షాళనం చేస్తూ వున్న తల్లి గర్భాన్ని చీల్చుకొని, పురిటి నొప్పులు వగైరా తతంగం ఏమీ లేకుండనే ముక్తానందుడు, ఆమెకు ఎదురుగ క్రింద పెట్టి వున్న సిబి బేసిన్‌లో పడిపోయాడట. ఆ వెనువెంటనే జనం మూగడం, మిగిలిన కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగింది ఆనాడు తల్లిదండ్రులు పెట్టిన పేరు కృష్ణ.

దినదినం ప్రవర్ధమానుడౌతున్న బాలుడిలో తెలివితేటలు, యుక్తితోబాటు మిగిలిన బాల్యచాపల్య చేష్టలన్నీ పెరుగుతూ వచ్చాయి క్రియాత్మక శక్తులున్నా ఆయన మనసు విద్యావిషయక కార్యక్రమాలవైపు ఆకర్షితం కాలేదు. అసలే సంపన్న కుటుంబం. అందునా లేకలేక వరప్రసాదంగా దొరికిన కుమారుడు. అందువల్ల తల్లిదండ్రులు, ఇంట్లో పాటకజనుల గారాబం పెరిగింది చదువుసంధ్యం విషయంలో ఎవరు పట్టించుకోవడంలేదని చెప్పాలి.

తండ్రికూడ మతాసక్తి, ఆధ్యాత్మికానురక్తి కలవాడైనందువల్ల కుటుంబ సభ్యుల్ని ప్రతి సాయంత్రం చేరబిలచి, పురాణ పారాయణం చేస్తూ, నీతికథలు వల్లిస్తూండడమే గాక ప్రత్యేక సందర్భాలలో సంచార సాధువుల, పౌరాణికుల పిలిపించి తన ఇంటనే మకాముంచి వారిచేత సద్విషయ గోష్ఠుల నిర్వహిస్తూ వుండేవాడు ఒకవైపు పురాణ పారాయణం, గీతోపదేశాలతోపాటు రాత్రి సమయం ఆయా మత గాథలను దృశ్యీకరించి, చిన్నచిన్న నాటకాల ద్వారా, యక్షగానాల ద్వారా, వీధిభాగవతాల ద్వారా ప్రదర్శించేవారిని ఆహ్వానించి అట్టి ప్రదర్శనం నేర్పాటు చేయడం ఆయనకు పరిపాటి స్థితిమంతుడైనందువల్ల ఖర్చు విషయం తడుముకోవలసిన అవసరంలేదు. ఇట్టి పురాణగాథల్లో, యక్షగానంలో ప్రదర్శితమైన మునీశ్వరుల, సాధువుల జీవిత వృత్తాంతాలు, కృష్ణుని మనసును లోగొన్నవి. తానుకూడ ఒక నాయకుడు లేదా సాధువు కావాలనే దృఢాభిప్రాయం ఏర్పడింది. ఇది కేవలం శ్రవణ, దృశ్య ప్రభావంవల్ల ఏర్పడిన కోరికేగాని దీని, పూర్తిభావాన్ని గుర్తించి మాత్రంకాదు.

ఆయన జీవితకాలంలో తన పదిహేనవ సంవత్సరం కీలకమైంది. ఒక ముస్లిమ్ భక్తుని ఆహ్వానాన్ని పురస్కరించుకొని, అప్పటికే అవధూతగా, మర్మయోగిగా ప్రసిద్ధిచెందిన నిత్యానంద మంగుళూరు సమీపంలో ఒక గ్రామానికి రావడం, కృష్ణ ఆయన్ని ఆకస్మికంగా సందర్శించడం కాకతాళీయంగా జరిగింది.

తన కభిముఖంగా వస్తున్న బాలుని కౌగలించుకొని స్వామి నిత్యానంద, బుగ్గలమీద ముద్దుపెట్టుకొన్నాడు. ఈ హఠాత్సంఘటన కృష్ణలో విద్యుద్ఘాత ప్రభావాన్ని సృష్టించింది. ఏమి జరుగుతుందో తెలుసుకోలేని అయోమయ పరిస్థితులనుండి తేరు కొని, తనవైపే దీనంగా, తీక్షణంగా 'నీకోసమే నేను వచ్చా'నన్నట్లు చూస్తూ నిల్చున్న స్వామి నిత్యానంద విగ్రహాన్ని చూచి తన్మయత్వంలో తేలిపోయాడు కృష్ణ

ఈ సంఘటన తరువాత బాలునిలో అశాంతి, అసహనం పెరిగి, చదువు సంధ్యలపై ఉన్న ధ్యాస కొంచెం తరిగిపోయింది ఆ తరువాత ఆరు నెలలకే సాధువు కావాలని ఇల్లు వదిలి, చేత చిల్లి గవ్వ లేకుండ మొదట మైసూరు, ఆ పిదప హుబ్లీ చేరి, అక్కడే వున్న సిద్ధారూఢ స్వామిని ఆయన మఠంలో దర్శించి, సంస్కృతంతో పాటు, వేదాంతాన్ని, యోగశాస్త్రాన్ని అభ్యసించాడు. అక్కడే సిద్ధారూఢ సమక్షంలో సన్యాసాన్ని స్వీకరించి సన్యాసిగా మారిపోయాడు. ఈ సంఘటన 1923-25 మధ్య జరిగింది అప్పటికి ఆయనకు పద్దెనిమిదేండ్లు కూడ నిండని వయస్సు. అపుడే ముక్తానంద నామాంతరాన్ని ధరించాడు.

1929 లో స్వామి సిద్ధారూఢ పరమపదించడంతో హుబ్లీ మఠాన్ని వదలి, దేశాటనాన్ని ప్రారంభించాడు. ఈ సుదీర్ఘ ఒంటరి యాత్రల్లో అనేక మంది హిందూ సాధావుల, సిద్ధుల దర్శనం లభించింది ఆయా విషయాలను గూర్చి వారితో చర్చించాడు, ప్రశ్నించాడు. పారమార్థిక జ్ఞానార్జనలో ఎన్నెన్నో రహస్యా లను తెలుసుకొన్నాడు ఏదైనా సాధించాలంటే ఏమేమీ, ఏ మేరకు త్యాగం చేయాలో గ్రహించాడు స్వామి ముక్తానంద. ఈ ప్రయాణాల్లో వాజీరాబాద్ దిగంబర స్వామి జీప్రౌనాను సందర్శించాడు గుట్ట క్రింద కూర్చుండి లోకాన్ని మరచి, తపో మనస్కుడై వున్న జీప్రాన్ స్వామి స్వామి ముక్తానందను తన తొడపై కూర్చుండబెట్టుకొని తలనాకుతూ ముక్తానందకు బాల్యం నుండీవున్న తలనొప్పిని స్వస్థతపరచి 'నీ కీర్తి ఆకాశాన్నంటుతుంది' అని దీవించాడట స్వామి జీప్రాన్ పాదప్రక్షాళనం చేసి ఆ నీటితో క్షయవ్యాధితో మరణ దశలోనున్న రోగిని ముక్తానంద స్వస్థపరచాడని ప్రతీతి.[4]

4. **His life History was followed from Vishal Mangalwadi** *op.cit* **Who is first followed the History as narrated by Amma**. *op.cit*.

ఈ సమయంలోనే 'స్వామి' 'హరిగిరిబాబా'ను సందర్శించి, ఆయన దీవెనలను పొందాడు. ఈయనొక విలక్షణమైన వ్యక్తి. కొంతసేపు రాజభూషణాలు ధరించి శిష్యవర్గానికి ప్రత్యక్షమై, ఆ మరుక్షణంలోనే చింపిరి వలువలతో లేదా దిగంబరంగా కనిపించేవారు. "నీవు కేవలం స్వామివి కావు, మహారాజువు. నీవి పూరి గుడిసెలో సుందరక్కర లేదు. ఇక రాజభవనమే నీ నివాసం. చింపిరి వలువలు విడిచి, పీతాంబరాలు ధరించవలసింది. నీవు సన్యాసివి కావు. మహారాజువు నీవిక అడగవు, కాని పొందగలవు"[5] అని సమృద్ధిగా దీవించాడు. వారిరువురి మొదటి సమావేశం జరిగిన తరువాత ఇరవై నాలుగేండ్లకు పునః సంధానం జరిగింది.

1947 జూలైలో గణేశ్ పురిలో వున్న నిత్యానందను దర్శించి, కొన్ని దినాలుండి పోవాలని స్వామి ముక్తానంద రావడం జరిగింది. కాని స్వామి నిత్యానంద ఆయన్ని విశ్వమంతా వ్యాపించివున్న అంతిమ సత్య దర్శనార్థం నడిపించి దైవాంశలో భాగంగా మార్చినాడు అపుడే ఆయనకు శక్తిపథం దీక్ష లభించి, సిద్ధుడైనాడు. ఆ తరువాత ఆగష్టు 15 వ తేదీ - భారతదేశం దాస్యశృంఖలాలను బదా బదలు చేసికొని స్వాతంత్ర్యం పొందిన రోజు - స్వామి నిత్యానంద తన శిష్య ప్రముఖుడైన స్వామి ముక్తానందకు తాను ధరించిన చెక్క చెప్పులు చూపించి-వీనినే పావుకోళ్లు అనడం కద్దు-వీనిని ధరించ గలవా, అని ప్రశ్నించడం, వానిని నేను స్వీకరించి పూజిస్తాను కాని, ధరింపనని స్వామి ముక్తానంద బదులు చెప్పడం, ఆ సమాధానం ద్వారా ముక్తానందుడు ముముక్షు పథానికి సమీపంలోనే వున్నాడని నిత్యానంద గ్రహించి పావుకోళ్ళను బహూకరించడం, వానిని పరిగ్రహించి తన పైఅంగీ మాటున భద్రంగా దాచుకొనడం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నిత్యానంద పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశించి, నిత్యం పఠించవలసిందిగా ఆదేశించాడు ముక్తానందుని.

ఈ నూతనానందానుభూతుల్లో ముక్తానంద తేలిపోయి మర్మయోగానుభవంనుండి పూర్తిగా తేరుకోక పూర్వమే హరిగిరిబాబాను పరామర్శించి మరో

5. **Quoted by Mangalwadi** *op.cit.* p 172 **from Amma** *op.cit.* p 19-20.

తొమ్మిది సంవత్సరాలు కఠినమైన సాధన కొనసాగిస్తూ, ఆయా పుణ్య పురుషులను క్షేత్రాలను దర్శించాడు. 1956లో తిరిగి వచ్చి మూడవ మారు నిత్యానంద దర్శన భాగ్యం పొందేనాటికి ముక్తానందుడు సమగ్ర సన్యాసియేగాక, మనో వాక్కర్మల సంపూర్ణ పరిణతిని పొంది, నిత్యానందుని ఏకైక స్పర్శతోనే సిద్ధుడు కాగలిగినాడు. ఇది ఆయన సన్యాసాన్ని స్వీకరించిన (1924) ముప్పది రెండు సంవత్సరాలకు జరిగింది (1956) అప్పటికి ముక్తానందుని వయస్సు నలభై ఎనిమిది సంవత్సరాలు.

తాను గడిపిన ఈ ఎనిమిది సంవత్సరాలలో శక్తిపథాభ్యాసం తీవ్రతర మైంది. పొందిన అనుభవం సూక్ష్మము తీక్షణమైందని ముక్తానంద తరువాత అభివర్ణించాడు. తనలో నిద్రావస్థలో వున్న కుండలిని శక్తిని క్రమక్రమంగా మేలుకొల్పుతూ నిత్యానందుని మూడవ దర్శన భాగ్యంతో కుండలీని శక్తిని స్వాధీనం చేసికోగలిగాడు. అదే ఆయన్ని సిద్ధయోగిగా లోకానికి ప్రత్యక్షపరచింది. ముక్తానందుని ఈ కుండలిని సాధన అనుభవాలలో ఒకటి ఉదహరించడం పాఠకుల యొక్క అవగాహనకు సహాయకరంగా వుండవచ్చు. ముక్తానందుని మాటల్లోనే-

> "నేను ధ్యాన నిమగ్నుడై ఉన్నపుడు నా చుట్టు చలిస్తున్నట్లనిపించి, నా దేహం అంతా బాధామయమైంది. నేను వెంటనే పద్మాసనం వేసి కొన్నాను....మణిపూర్ చక్రలో (దేహంలో కుండలీని పయనించే ఆరు చక్రాలలో ఒకటి.) తీవ్రబాధ. పెద్దగా అరవాలని కోరిక. కాని అరవలేని స్థితి ఆ తరువాత అసహ్యాకరమైన రాక్షస రూపాలను చూచాను అవి దురాత్మలై వుంటవని భావించాను ... ఆ తరువాత మంటలు, వానిలోపడి కాలిపోతున్న అనుభూతి. ఆ తరువాత కొంచెం మెరుగైంది నా పరిస్థితి హఠాత్తుగ నాకు ఎదురుగా వస్తున్న బంతి వంటి కాంతిగోళాన్ని చూచాను. సమీపిస్తున్న కొద్ది మిక్కిలి కాంతివంతమైంది. తలుపులు మూసి వున్న నా కుటీరంలోనికి ముందు, ఆ తరువాత నా తలలోనికి ప్రవేశించినట్లైంది. ఆ కాంతిలో భయపడి పోయాను. మూర్ఛ పొందిన అనుభూతి కలిగింది. ఆ తరువాత నీలం రంగు దీపం

పెద్దదవుతూ ఆ తరువాత క్రమంగా చిన్న ముత్యం అంత పరిణామానికి తరిగిపోవడాన్ని చూచాను."[6]

ఇట్టి అనుభవాల అనంతరం ఆయనలో ఒక భీతి ప్రవేశించింది. ఈ భీతి ఆత్మ పరీక్షకు పురికొల్పింది. తనలో నిద్రాణంగా వున్న కుండలిని నాభి స్థానం నుండి షట్చక్రాలను దాటుతూ తలకు చేరిందని గ్రహించగలిగాడు. అతడు సిద్ధుడైనట్లు, ఈ సిద్ధత్వం సత్కార్యాల ఫలమైనట్లు నిశ్చయం ఏర్పడింది. ఈ ఆంతరంగిక చైతన్యం కుండలినీ శక్తి ఆయనలోని ఊర్ధ్వ స్థానాన్ని చేరినందువల్ల చేకూరిన మేలు. ఈ కుండలినీ మొత్తం విశ్వానికి దైవ మాత. గురు కృపవల్ల సాధకునిలో ఈ శక్తి పనిచేయడం ప్రారంభమయినపుడు ఆ సాధకునిలో ఆధ్యాత్మిక విప్లవాన్ని రేకెత్తించి, జీవితంలోని ప్రతి దశలో పవిత్రీకరించి, స్వస్థపరచి మారుస్తుందని కుండలిని సాధకుల యొక్క ప్రగాఢ విశ్వాసం ఈ విషయాన్ని ఇంతకుముందే పేర్కొనడం జరిగింది.

దీని ఫలితంగా ఏర్పడే మొదటి కార్యం అప్రయత్న ధ్యానం.[7] ఈ ధ్యాన నిమగ్నం కావడానికి సాధకుడు ప్రయత్నించ నక్కరలేదు. ఇది అతనిలో స్వేచ్ఛందంగా అయత్న కృతంగా జరిగే కార్యం. ఈ ధ్యానానికి నిర్దిష్టమైన విధాన ప్రక్రియలు కూడ లేవు. సాధకుడు ధ్యాన నిమగ్నమై వున్నపుడు, హఠయోగ శాస్త్రం ఆదేశించిన ముద్రలు, భంగిమలను దేహం ధరిస్తుంది. ఇలాటి క్రియ జరగడానికి పూర్వజ్ఞానం గాని. శక్తిగాని, ప్రయత్నం గాని అక్కరలేదు. ఇది కుండలిని సాధన ఫలసిద్ధి. ఆ స్థితిలో నృత్యం, గీతాలాపన చేయవచ్చు, ఏడ్వవచ్చు, నవ్వవచ్చు, ఇవన్నీ దేహ ప్రక్షాళన ప్రక్రియలు. శరీరంలోని రుగ్మతలు ఆది వ్యాధులు విసర్జితం కావడానికి తోడ్పడే విధానాలు. ఈ ధ్యానం సాధకుని అతీంద్రియ చేతన స్థితికి ఉద్దీపింపవచ్చు. ఇట్టి అనుభవాలు ముక్తా

6 Amma *op cit* pp. 32-43, from qouted-Vishal Mangal wadi *op.cit.* p 174.

7. For individual witness of this experience refer to Kushwant Singh, *Gurus, Godmen and Goodpeople* p. 96. ff.

నందుడు పొందదమేగాదు, సిద్ధంగా వున్న శిష్యులను చూచిన, స్పర్శించిన వారు కూడ సిద్ధులు కాగలరని ఆ శిష్యుల నమ్మకం. అంతేగాక, గురు కృప, ఒకసారి కుండలిని శక్తిని పొందిన మీదట అనేక విధాల సార్థకమై శిష్యవర్గంలో ఫలసిద్ధిని చేకూరుస్తుంది. విడిపోయిన కుటుంబాలనుసమైక్య పరచి, వారి తీవ్ర భేదాభిప్రాయాలను తొలగించవచ్చునని లేదా అలా నమ్మినవారినెట్టి ప్రమాదాల నుండైనా రక్షించవచ్చునని వారి విశ్వాసం.[8] ఇలా సిద్ధ యోగియైన ముక్తానంద తన గురువు స్వామి నిత్యానంద మరణానంతరం (1961) ఆ సంప్రదాయ వారసుడైనాడు. అప్పటికే బొంబాయి సమీపంలోని గణేష్ పురికి సుమారు 3 కిలో మీటర్ల దూరంలో స్వామి నిత్యానంద నిర్మించిన ఆశ్రమంలో స్థిరపడిపోయాడు, సిద్ధ యోగి స్వామి ముక్తానంద పరమహంస.

స్వామి నిత్యానందను తన పదిహేనవ ఏట (1923) మొదట కలుసుకొన్నాక స్వామి ముక్తానంద హుబ్లిలోని సిద్ధారూఢ స్వామిని, దిగంబరిస్వామియైన జిప్రౌన్నను, హరిగిరి బాబాను, తిరిగి నిత్యానందుని కలుసుకొనడంతో ముక్తానందుని ఆధ్యాత్మిక ప్రస్థానం పూర్ణసిద్ధిని పొందినదని చెప్పవచ్చు. అయితే ఆయన బాల్యంలోనే షిర్డీలోని సాయిబాబాను దర్శించి, ఆయన్ని దేవుడనే భావించినట్లు కూడ కొందరు గ్రంథకర్త లుదహరిస్తున్నారు.[9] స్వామి ముక్తానందకు శుశ్రూషచేసిన సంప్రదాయంలో ప్రసిద్ధిచెందిన బాబాల నిట ఉదహరించవలసివుంది. వారిలో ప్రప్రథమంగా పేర్కొన తగిన వ్యక్తులు, నీమ్‌కరోలి బాబా, బాబా రామ దాస్ మరియు హరిదాస్ బాబా. ఇందు రామదాస్‌బాబా అసలు పేరు రిచర్డ్ ఆల్బర్ట్, అమెరికన్ విశ్వవిద్యాలయంలో ఆచార్యపదవిని పరిత్యజించి, సర్వసంగ పరిత్యాగిగా ఇండియాకువచ్చి దీక్ష పొంది తిరిగి వెళ్ళినవ్యక్తి హరిదాస బాబా కాలిఫోర్నియా శాంతా క్రజ్‌కు చెందిన అమెరికా దేశీయుడు, వీరందరు ఈ పారంపర్య ప్రవేశకులే.

---

8. *Ibid*. p. 97 ff.

9. J. Aagaard *op.cit.* 22. He is quoting from Tal Brooke's never published proof texts. *The Amazing Advent*- a book about Satya Sai Baba. p. 110.

గణేశ్‌పురి సంప్రదాయంలో, పంచాక్షరీమంత్రం ప్రధాన భూమికను నిర్వహిస్తుంది. పంచాక్షరీ శైవ సంప్రదాయంలో సనాతన మంత్రం. గణేశపురికి సంబంధించి రెండవ ప్రధానమంత్రం తాంత్రిక సాంప్రదాయంలో గుర్తింపబడిన, ప్రాచీనమైన 'సోహమ్' మంత్రం. స్వామిజీ ఇతర మంత్రాలను తృణీకరించకపోయినప్పటికి వాటికంతస్థానాన్ని ఇవ్వలేదని తెలుస్తున్నది. కర్మ, జ్ఞాన, భక్తి యోగం అవసరాన్ని గుర్తించి నప్పటికి, ఇవన్నీకూడ కుండలిని శక్తిసాధన కుపకరించే సిద్ధయోగకు లోనికట్టు అని స్వామిజీ అభిప్రాయం. ఈ సిద్ధయోగలో శివునియొక్క ప్రత్యక్షవ్యక్తీకరణం గురువనే నమ్మిక బలీయమైంది. అందు గురువు యొక్క బాహ్యరూపమే ఆరాధనకు, ధ్యానానికి మూలకేంద్రం. గురువే దేవుండ్లకు దేవుడైనపుడు, ఇక మిగిలిన దేవుండ్ల నారాధించవలసిన పనిలేదు. ఆ విధంగా గురువే శివుడు, ఆయనే భర్త, భార్య, జీవనాధారం, జీవం గురువుకుమించి మరేమిలేనందు చేత శిష్యుడు తన ఉత్కృష్టమైన గౌరవ మర్యాదలను గురువుకే చెల్లించవలసి వుంటుంది. అందువల్ల ఈ సంప్రదాయ ప్రకారం, సిద్ధయోగి నిత్యానందుని వారసుడైన ముక్తానందుడే ప్రపంచ ఉనికికి కారణం ఆతడు జీవించి వున్నాడు గనుకే ప్రపంచం మనగలుగుతున్నది. ఈ గురుకృప వల్లనే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు విశ్వశక్తి సమన్వితులౌతున్నారు. ఇది ఈ సంప్రదాయ విశ్వాసం [10]

కఠోర హఠయోగ సాధనద్వారా స్వామి ముక్తానంద సిద్ధియోగియై కుండలిని శక్తిని సాధించి శిష్యవర్గాన్ని ఏర్పాటు చేసికొన్నాడు. ఆదర్శవంతం నిరాడంబరమైన ఆయన జీవితమే అనేకుల నాకర్షించింది. ఆయనలో నిగూఢంగా వున్న 'కుండలిని' ద్వారా మహత్క్రియల సాధిస్తున్నాడనే నమ్మిక ప్రాకిపోవడంతో ధనికులు, విద్యావేత్తలు ఆయన శిష్యులనిపించుకోవడానికి తహతహలాడి పోతున్నారు. అయినా ఆరంభంలో ఆయన బోధలు క్రమబద్ధంగాక అనేక విషయ సమ్మేళనంగా వుండటమే గాక భావవైరుధ్యాలతో నిండి వుండేవి. అధి భౌతిక విషయాలలోను, సిద్ధాంత సూత్రాలలోను ప్రారంభంనుండి

10 Muktananda Paramahamsa - *Siddha meditation*. Commentaries on Siva Sutras and other secred texts. Ganeshpuri, 1975 - pp. 100-102 & 109-111.

ముక్తానందకు అభిలాష లేని కారణంగా ఆయన బోధల్లో భావ వైరుధ్యాలు, విఘాతాలు ప్రవేశించాయి. ఒకవైపు ప్రపంచం దైవ చైతన్య సృష్టిఫలమేగాని మాయా జనితంకాదని చెప్తూనే, మరుక్షణంలో ప్రపంచం సృజింపబడలేదు, అది మాయ అని నిర్ద్వంద్వంగా ప్రకటించడాన్నిబట్టి ముక్తానందుడు క్రమబద్ధమైన తాత్విక, వేదాంత చింతనాపరుడు కాదని తెలుస్తున్నది.

స్వామి ముక్తానంద సిద్ధాంతం ప్రకారం ప్రపంచం దైవలీలయొక్క ప్రతిఫలం. ఈ సత్యాన్ని గ్రహించి దైవంలో సమస్తాన్ని, సమస్తంలో దైవాన్ని దర్శించగలవారు ప్రతిష్ఠాయిలో. ప్రతి విధానంలో జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించగలరు. ఇట్టి జీవితాన్ని అనుభవించడం ప్రతి వ్యక్తి యొక్క జన్మహక్కు. ఈ హక్కునుంచి ఏ వ్యక్తిని ఎవరు వేరు చేయలేరని స్వామీజీ ప్రబోధం.

ప్రపంచ పరిత్యాగం ఆధ్యాత్మిక జీవితానికి తప్పనిసరి షరతుగా స్వామీజీ విధింపడు. కాకుంటే, ప్రతి వ్యక్తి ప్రశాంతంగా ధ్యానంచేస్తూ వుంటే ఎవరెట్టి పరిస్థితుల్లో వున్నారో ఆ పరిస్థితుల్లోనే వారి ఆధ్యాత్మిక జీవితం ఎదుగ గలదు. నిద్రాణంగా వున్న కుండలీని శక్తిని చైతన్యవంతం, చరాత్మకం చేసినపుడు ఆయా వ్యక్తుల యొక్క జీవితాన్ని అనుభవనీయం, ఆనందమయం చేస్తుందని ఆయన ప్రబోధం. ధ్యానమయ జీవితం క్రమంగా లోకం నుండి దూరం చేస్తుందని కొందరు భావించడం, భయపడడం కద్దు కాని, స్వామి ముక్తానంద శిష్యవర్గంలో అన్ని విషయాలలో గృహస్థ ధర్మాన్ని నిర్వహిస్తూనే ధ్యాన నిమగ్నులైన వారనేకులున్నారు ఖుష్వంత్ సింగ్ గ్రంథంలో ఇట్టి ఉదాహరణ లనేకం వున్నాయి 11

సాధకులెవరేమి చేయనక్కర లేదు ఏ పద్ధతిని అవలంబింప నక్కరలేదు. సౌకర్యవంతంగా కూర్చుండి ధ్యాన నిమగ్నులైతే చాలు. గురుదేవుని శక్తి అట్టి ధ్యాన నిమగ్నుల నంటువ్యాధివలె ముట్టుకొంటుంది వారి ముఖాన్నిగాని, నేత్రాలను గాని స్పర్శించి, కొంత అసౌకర్యాన్ని కలిగించి, లేదా లోపలికి వెళ్ళి ధ్యానం చేయండని గాని హెచ్చరిస్తాడు. ఆ తరువాత వారు మరో లోకంలో దివ్య కాంతిలో కన్నులు మిరుమిట్లు గొలిపేరంగులో - తేలిపోతున్న అనుభూతిని

11. **Kushwant Singh**. *Gurus Godmen & Goodpeople* **p.99 ff.**

పొందుతారు. నీలం రంగు ముత్యాన్ని చూడగలరు. సాధకుడు విషయాలకు మౌన సాక్షిగా వుండిపోతాడు. సిద్ధయోగకు ఇంతకంటే తేలికమార్గం లేదని ముక్తానందుని ప్రబోధం.[12]

ముక్తానందుని నమ్మిక ప్రకారం విమోచనకు నడిపించగల అనేక యోగ సాధనామార్గాలున్నవి. అయితే తాను అనుసరించి ప్రబోధించే మార్గం సిద్ధయోగ. మిగిలిన యోగసాధనా మార్గాలన్నీ సిద్ధయోగలో సంయోగం చెందాయని ఆయన నమ్మిక.

ముక్తానందుని జీవితంలో పండిన ఆధ్యాత్మిక ఫల లక్షణాలు కొకొల్లలుగ కనిపిస్తవి. ఆయన సమక్షంలో వున్నప్పుడు శిష్యవర్గం పొందే అనుభూతికిగాని, తన్మయత్వానికిగాని తన మహిమగాని, తన గొప్పతనంగాని కారణం కాదని, ఆ శిష్యవర్గం అట్టి అనుభూతికి సిద్ధంగా వున్నందువల్లే ఆ క్రియ జరిగిందని స్వామీజీ తలంపు. ఈ సమకాలీన గురువ్యవస్థలో అనేకులు ఏది జరిగినా తమ మహిమవల్లనే అని నమ్మి ప్రకటించుకొంటూ వుండగా, ముక్తానందుడట్టి స్వీయ ప్రచారాన్ని తృణీకరించడమే గాక, ఆ ఘనతను శిష్యవర్గాని కాపాదించడం ఆయన నిరాడంబరత్వానికే సూచన. కాదు గూడదని ఎవరైన అది ఆయన గొప్పతనమన్నా ఆయనచేత ఒప్పించి ప్రయత్నిస్తే దానికి అది తన గురుదేవుడైన నిత్యానందుని ప్రతిభ అని ముక్తానందుని జవాబు.

శిష్యవర్గం ఆయన్ని సమీపించడం కూడ ఆశ్చర్యకరంగా జరుగుతుంది. గురువును అన్వేషిస్తూ వచ్చే శిష్యవర్గాన్ని చేర్చుకొనడమే గాక, అట్టి ప్రయత్నం చేయక, గురువంటే పట్టీపట్టక వుండేవారిలో కూడ శుశ్రూషాభిలాషను రేకెత్తించడం ముక్తానందుడు చేసే ముఖ్య కార్యం. ఈ విధంగా అనేకులను శిష్యవర్గంలోనికి ఆకర్షించిన సంఘటనలు కూడ ఆయనకు సంబంధించి అనేకం ప్రచారంలో వున్నాయి.[13]

12. Quoted by Vishal Mangalwadi *op-cit.* 171-172, also Refer to Gurudev Vani Vol. II p. 6 ff.
13. Kushwant Singh, *Gurus Godmen* and *Goodpeople* p. 102 ff.

ముక్తానందుని అనుభవాలను పురస్కరించుకొని, విశాల్ మంగల్ వాడి అతి ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తి ఈ అనుభవాలు దైవికానుభవాలా లేక దురాత్మకు చెందిన అనుభవాలా లేక అతిధ్యానం, కఠోరహఠయోగ సాధనం, సన్యాసత్వం, ప్రాయోపవేశాల ఫలితంగా కలిగిన అసాధారణ మానసిక అనుభవాలా అని ప్రశ్నిస్తున్నాడు.[14] ఇందుకు ప్రధాన కారణం ఏక దేవునిలో విశ్వాసాన్ని ప్రకటిస్తూనే దురాత్మలు, దయ్యాలు మొదలైన వానిలో ముక్తానందుడు విశ్వాసముంచడమే' ఇలా ముక్తానందుని వర్గీకరించింది విశాల్ మంగల్ వాడి ఒక్కడే గాదు- ఆయనకంటె ముందు చార్లెస్ యస్. జె. హ్వైట్ కూడ ఇట్టి ప్రశ్నలనే లేవనెత్తాడు [15] హ్వైట్ చూపిన కారణం ముక్తానందుడు తరుచుగ శారీరక అసౌకర్యాన్ని, అవిశ్రాంత స్థితిని పొంది, మతిభ్రమణ వ్యాధికతి సమీపంగా వుండడమేనని. పై విమర్శలకు సమాధానం చెప్పవచ్చు. కాని ఆ సమాధానం ఎపుడూ ఒకే రకంగా వుండడానికి వీలులేదు. ఆయా వ్యక్తులు లోక విధానాన్ని గూర్చి ఏర్పరచుకొనే తలంపులపై ఆధారపడి వుంటుంది.

ఏది మతానుభవం, ఏది కాదు, ఏది దైవిక ప్రేరణ, ఏది దయ్యపు ప్రేరణ అనే విషయాలను విడమర్చడానికి కూడ వీలులేదు దైవ మహిమ కార్యాలను, గారడిని విడదీయలేనట్లే దైవానుభవాలను, దురాత్మానుభవాలను విడదీసి గీత గీసి చూపించడం కష్టం. మతానుభవాలను శాస్త్రయుక్తమైన దృక్పథంతో పరిశీలించి, అధికారికమైన గ్రంథాన్ని వ్రాసిన విల్యం జేమ్స్ అంతటి రచయిత ఈ చిక్కుల గూర్చి మాట్లాడుతూ-

> "మర్మయోగానుభవంలో మతానుభవం సగం మాత్రమే. మిగిలిన సగాన్ని సూచించే సంప్రదాయాలు ప్రమాణాలులేవు. మతిభ్రమణ వ్యాధిని గూర్చి వివరించే ప్రమాణ గ్రంథాలపై ఆధారపడవలసిందే........అందువల్ల మర్మ యోగానుభావాలు, ఉద్రేకాలుగా పరిగణింపబడుతున్నాయి."

---

14 Vishal Mangalwadi *op.cit* p 177.

15. Gharles S. J. White *op.cit.* p. 319–329.

అని సూచించారు.[16] అందువల్ల ఏది దైవానుభవం, ఏది కాదనడం సులభ సాధ్యం కాని విషయం. అయినా అట్టి అనుమానాస్పదమైన అనుభవాలుగల వ్యక్తి యొక్క రచనలనుబట్టి, అధికసంఖ్యాకుల్లో ఆయనను గూర్చివున్న అభిప్రాయాలను, ఆయన ఏ సంప్రదాయానికి చెందినవాడో ఆ సంప్రదాయ లక్షణాలను బట్టి ఇదమిద్ధమని తేల్చవలసిందేగాని పైకి కనిపించే లక్షణాలనుబట్టి కాదు

'చిత్ శక్తి విలాస్' అని స్వామి ముక్తానంద రచించిన గ్రంథంలో వ్యక్తి యొక్క మనస్సాక్షి ఎలా పరిణామం చెందుతుందో, ఏ పరిణామంలో ఏ విధమైన తలంపులు వస్తవో మొదలైన యోగాంశాలు పరిశీలించి చర్చించబడినవి. ఈ గ్రంథాన్ని పఠించినవారికి ముక్తానందుని అనుభవాలు దైవ ప్రేరణలా కాదా అనే సందేహమేర్పడడానికి అవకాశముండదు. ఈ గ్రంథాన్ని గణేశ్‌పురిలోని ఆయన ఆశ్రమమే 1976 లో ప్రచురించింది. 1976 లో పై సంస్థ ప్రచురించిన 'సిద్ధ ధ్యానం' పై వ్యాఖ్యాన గ్రంథాలు కూడ ముక్తానందుని ఆంతరంగిక జీవిత విధానాన్ని పాఠకులకు కొంతవరకు ఆవిష్కరిస్తాయి తాను నమ్మి ప్రకటిస్తున్న సిద్ధాంతాన్ని వ్యాఖ్యానించడంలో, ముక్తానందుడు తన అంతరంగాన్నే అందు కుమ్మరించాడా అనిపిస్తుంది. 1975 లోనే ముద్రణ పొందిన "సంస్మరణా మతం" కూడ నామ సంస్మరణా ప్రభావాన్ని, దాని ఫలితాన్ని వివరించే గ్రంథం. ఆయన రచనలను బట్టి ఆయన అనుభవాలను అంచనా వేసి, గుణీకరించవలసివస్తే అవి మతిభ్రమణ వ్యాధి పీడితుని రచన లనడానికి అవకాశం లేదు.

ఆయనకున్న అనుచర వర్గం కూడ అధిక సంఖ్యలో వున్నారు. వారిలో కూడ విద్యాధికులు, సాంఘిక, ఆర్థిక రంగాలలో దిగ్గంతులైనవారు, రాజకీయ నాయకులున్నారు, సామాన్య ప్రజ కోకొల్లలు. ఇంత మంది అనుచర వర్గం ఉన్నందువల్ల ఆ స్వామి అనుభవాలు, బోధలు, నిందారాహిత్యాలని చెప్పడం ఈ గ్రంథకర్త అభిప్రాయం కాదు. ఇందరిలో ఎందరో వారి వారి అభిప్రాయాలను వెలువరించారు. చెప్పిన విషయాలను ప్రశ్నించేవారు, ప్రశ్నించి పరిశోధించేవారు కూడ వున్నారు. ఆయనకున్న విదేశీ అనుచర వర్గాన్ని గూర్చి ఇంతకు ముందే

16. **William James** *The Varieties of Religious experience* p. 410–411.

ఉదహరించబడింది. వీరి అభిప్రాయాలు ఆయన్ని కేవలం సిద్ధయోగిగానే కాదు, సిద్ధయోగి అయిన ప్రతి వ్యక్తి దేవునితో సమానమనే తాంత్రిక పారంపర్య సిద్ధాంత ప్రకారం ఆయన్ని దైవ సమానుడని వర్ణిస్తున్నారు, ఆరాధిస్తున్నారు. ఆయా ఇతర బాబాల, గురు మహారాజుల, స్వామీజీల జీవిత వర్తనం రచ్చకెక్కింది. గుట్టు రట్టయింది. కాని ముక్తానందుని బోధలు కాని, జీవన విధానం గాని ఇంత వరకు విమర్శలకు గురికాకపోవడం గమనార్హం. అలాగని ఆయన ఎవరికీ తెలియని వ్యక్తి కాదు. 1929 నుండి 1961 లో గణేశ్‌పురి ఆశ్రమంలో ప్రవేశించే వరకు ఆసేతు హిమాచల పర్యంతం పర్యటించి, అప్పటికి ప్రసిద్ధిగన్న బాబాలను, స్వామీజీలను. దర్శించిన వ్యక్తి. అనుచర వర్గ సాక్ష్యం ఆయన సిద్ధయోగ లక్షణాన్ని బలపరుస్తుంది.

క్రియా యోగుల్లోను, సిద్ధ యోగుల్లోను తరుచుగా గాని, అపుడపుడు గాని, "అతి ప్రవర్తన" కనిపించడం సహజమని ఆ సంప్రదాయంతో పరిచయమున్న వారికి అనుభవమైన విషయం. ఈ "అతి" శారీరక భంగిమల్లో, మానసిక పరివర్తనలో కూడ ద్యోతకమౌతూ వుంటుంది. వారి అనుభవ వ్యక్తీకరణలోని ఈ 'అతి' లక్షణానికి కారణాన్ని ఊహించడం కష్టం గాదు. మొదట కఠోర హఠ యోగ సాధన, హఠయోగ సాధనలో శారీరక భంగిమలు; మానసిక కేంద్రీకరణా విధానం, దృష్టి కేంద్రీకరణ మొదలైన అభ్యాసాలు ప్రముఖ పాత్ర వహిస్తవి. పై అభ్యాసాలు సాధకుని శారీరక స్థితిపై మాత్రమే కాదు, మానసిక ధోరణిపై, నాడీ మండలంపై వత్తిడిని కలిగించి అనేక పరిణామాలకు దారి తీస్తవి. అలానే అవిరామ తపోసాధన, శరీర శుష్కీణను కలిగించే కఠోర ప్రాయోపవేశం మొదలైన సాధనలన్ని సాధకుని వ్యక్తిత్వంపై ముద్ర వేయక తప్పదు. అట్టి ప్రభావానికి వ్యక్తి లోనైనపుడు, అందునా బహు దేశాటనం, నానావిధ పుణ్య క్షేత్ర సందర్శనానుభవం తోడైనపుడు, ఆ వ్యక్తి ధోరణిలో మార్పు రావడం కేవలం సహజం. అందువల్ల అది మతి భ్రమణ చర్యలని వర్గీకరించడం ఎంతవరకు సమంజసమో విజ్ఞులు యోచించవలసి వుంది.

అద్వైత సిద్ధాంతాన్ని విశ్వసించినప్పటికి ముక్తానందుని సిద్ధాంత వ్యక్తీకరణ ఖండితంగా ఒక విధంగా లేదని ఇంతకు ముందే ఉదహరించడం జరిగింది. అందుకు ప్రధాన కారణం సిద్ధయోగులకు బాహ్యాభ్యాసాల సాధనాలకు ప్రధాన

స్థానానిచ్చి సిద్ధాంత వ్యాఖ్యానానికి అంత ప్రాధాన్యం ఇవ్వక పోవడం అందువల్ల ఆయన అభిప్రాయాల్లో హెచ్చుతగ్గులు, వైరుధ్యాలు సహజంగానే ప్రవేశించాయి. కాగా తాంత్రిక పారంపర్యంలో ఆత్మలు, దురాత్మలు ప్రస్తావన నమ్మకం కూడ క్రొత్తది కాదు. కాశ్మీర శైవ శాఖయందే దక్షిణ ఇండియాలో అభివృద్ధి చెందిన శైవ సిద్ధాంతం వరకు 'తంత్ర' పారంపర్యాన్ని నమ్మి అభ్యసించిన 'క్రియ' యోగులు గాని, 'సిద్ధ' యోగులు గాని బీజ మంత్రాన్ని వాడి, దురాత్మల సాగనంపడం, ఆయా వ్యక్తులను భూత విముక్తులను చేయడం ఒక క్రమ ప్రకారం కాకపోయినా, చెల్లాచెదురుగా జరిగిన, జరుగుతున్న సంఘటనలు. భూత వైద్యాలనబడేవారు ఈ తాంత్రిక పారంపర్యంలో 'అనాగరిక' ఆచారాలకు ప్రతినిధులు. కాగా ఆత్మల, భూతాల ఉనికిని నమ్మనప్పుడు ఆత్మల సాగనంపడం అనే ప్రసక్తి లేదు. అందువల్ల అద్వైత విశ్వాసాన్ని వ్యక్తం చేసేవారైనా ఈ ఆచారాలకు తలొగ్గక తప్పని పరిస్థితులు ఈ పారంపర్యంలో వున్నవి.

ప్రధానంగా స్వామి ముక్తానంద తాంత్రిక పారంపర్యానికి చెందిన సిద్ధయోగి. ఆయన కాళిని, లేదా 'చిత్ శక్తి'ని దైవమాతగా ఆరాధిస్తాడు. ఆ చిత్ శక్తి లేదా 'కుండలిని' ఆయన ఆరాధించే దైవం. ఈ పారంపర్యంలోని మిగిలిన క్రియాయోగులు సిద్ధయోగులందరివలె ఆయన ఆరాధ్య పురుషదైవం శివుడు. "శివుని ఆరాధించవలెనంటే శివులంతాక తప్పదు. ఆ విషయాన్ని మరచిపోరాదు. అన్ని దేశాలకు, అన్ని సంస్కృతులకు, అన్ని సమాజాలకు ఒకేమతం వున్నది-అది శివమతం." ఇది ఆయన విశ్వాస సారాంశం, ప్రచారోద్దేశం. శివుడు భూతాధిపతిగదా! భూతాధిపతిని ఆరాధించేవారికి భూతాలలో నమ్మకముండడం సహజం. ఇక ఆ విషయాన్ని పట్టించుకోనవసరం లేదు

# 4. మహర్షి మహేష్ మహాయోగి (1917-        )

## అతీంద్రియధ్యానం

ఇప్పటికి తెలియవచ్చిన గురూద్యమాలలో అధిక సంఖ్యలో జనాన్ని ఆకర్షించి, దేశదేశాల్లో కేంద్రాలను స్థాపించి, క్రొత్త క్రొత్త నినాదాలను సృష్టించి, ప్రపంచ వ్యాప్తగా పలుకుబడిని, ధనాన్ని సముపార్జించిన ఉద్యమం మహర్షి మహాయోగి స్థాపించి, అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్న ట్రాన్సెండెంటల్ మెడిటేషన్. దాని సంక్షిప్తనామం టి. ఎమ్ తెలుగులో అతీంద్రియ ధ్యానం అన వచ్చు. 1958 లో ఆధ్యాత్మిక పునరుజ్జీవనోద్యమంగా ప్రారంభమైన ఈ ఉద్యమ లక్ష్యం తరతమ భేదం లేకుండ ప్రపంచ ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, ప్రశాంత చలన స్థితిని కలిగించి జీవితాలను సుఖమయం చేయడం .

మహేష్ మహాయోగిగా లోకంలో సుప్రసిద్ధుడైన ఈ ధ్యానం యొక్క మూల పరిశోధకుని పూర్తిపేరు మహేష్ శ్రీవాత్సవ. జననం 1917. జన్మస్థలం మధ్యపరగణాలలో ఏదో ఒక స్థలం. అంతకుమించి ఆయన తల్లిదండ్రులు గాని, బాల్య జీవనవిధానం గాని తెలియరావడం లేదు. 1940 లో అలహాబాద్ విశ్వ విద్యాలయం నుండి భౌతికశాస్త్రం అభిలాషనీయాంశంగా పట్టభద్రుడై, ఆ వెను వెంటనే హిమాలయ పర్వత సానువుల్లోని జ్యోతిర్‌మఠ్‌లో వెలసిన శంకరాచార్య పీఠాధిపతి స్వామి బ్రహ్మానంద సరస్వతి చెంత పదమూడు సంవత్సరాలు శుశ్రూష చేసినాడని, ఆ స్వామి మరణానికి కొంచెం ముందుగా (1958) అతి సామాన్యమైన పద్ధతిలో ఒక క్రొత్త ధ్యాన విధానాన్ని సర్వప్రజోపయోగార్థం పరిశోధించి, సిద్ధంచేసి, ప్రచారం చేయవలసిందనే గురు అనుజ్ఞను శిరసావహించి మహేష్ ఈ వుద్యమానికి పూనుకొన్నట్లు విశాల మంగలవాడి తన గ్రంథంలో ఉదాహరించాడు.[1]

---

1. **Vishal Mangalwadi** *op.cit.* **p. 102.**

కాని సాక్ష్యాధారాలు దీనికి భిన్నంగా వున్నాయి. జ్యోతిర్మఠ్ పీఠంలో
పదమూడు సంవత్సరాలున్న మాట వాస్తవమేగాని, అక్కడ శుశ్రూషలో గాక
కార్యాలయంలో ఉద్యోగిగా ఉన్నాడని బ్రహ్మచారిగా జీవించాడని, సన్యాసిగా
గాని, గురువుగాగాని ప్రత్యేకంగా దీక్షను పొందలేదని, అసలు అట్టి దీక్షను తాను
కోరడంగాని, లేదా గురువు సలహా ఇవ్వడంకాని జరగలేదని ఇతర గ్రంథకర్తలు
వ్రాస్తున్నారు.[2] ఈ సందర్భంలో ఆగార్డ్ అనే రచయిత ఇలా మహేష్ కంటె
ముందు, ఏగురుశుశ్రూషచేయక, ఎవరి దగ్గర దీక్షపొందక, హిందూమతంలోని
ఏ శాఖతో సంబంధం పెట్టుకోక, తమ కార్యక్రమాలను కొనసాగించిన మరో
ఇరువురు ఆధునిక గురువులను కూడ ఉదాహరించాడు. వారు ఒకరు సమగ్రయోగ
కార్య నిరూపకుడైన అరవింద్‌ఘోష్. మరొకరు తిరువన్నామలై ఆశ్రమంలో
సిద్ధి పొందిన రమణమహర్షి. ఇలా గురుదీక్ష పొందనివారు ప్రస్తుత గురుమహా
రాజుల్లో వున్నారని వ్రాయడంవల్ల మహేష్ మహాయోగికి ఇట్టి గురుదీక్ష లేక
పోయినా, ఆయన ప్రచారం చేసే బోధలకు, విధానాలకు అధికారికముద్ర లేకుండా
పోదనే భావాన్ని ఆగార్డే పరోక్షంగా తెలియపరచినట్లైంది. అయినా, గతంతో
నిమిత్తంలేని వర్తమాన జీవితవర్తన మీ మహాఋషి ధ్యేయం తానార్జించిన విద్యా
జ్ఞానం ద్వారా, మానవ శరీర ధర్మాన్ని, పదార్థ లక్షణాన్ని పరిశీలించి,
పరిశోధించి, లౌకిక జీవనోపాధిని సంపాదించుటకు బదులు, మానవకోటిలో
అతీంద్రియ ధ్యాన ప్రయోగాన్ని, ఫలితాన్ని వ్యాపింప జేయ కంకణం కట్టిన వ్యక్తి
మహాయోగి మహేష్. లౌకిక జీవన విధానంగాని, దాని భోగాలాలసత గాని
ప్రారంభంనుండి మహేష్‌యోగిని ఆకర్షించిన దాఖలాలు కూడ లేవు. కఠోర శారీరక
శిక్షణ, మానసిక క్రమశిక్షణ, అంతరంగిక హృదయ ధ్యానాలతో తనదైన ఒక
క్రొత్త విధానాన్ని అలవర్చుకొని, ఈ విధానం మానవకోటి కుపయుక్తం కాగలదనే
నిశ్చయం కలిగిననాడు దాని ప్రచారంకోసం ప్రయత్నం కొనసాగించాడు.

ఆధునిక యుగంలో ప్రతి వ్యక్తి యుగవేగాన్ని అందుకోలేక, అందుకొన్న
ప్పటికీ, ఆ వేగాన్ని అదేవిధంగా పరిపోషించలేక సతమతమౌతూ, అశాంతికి,
సంక్షోభానికి గురౌతున్నందువల్ల మానసిక, శారీరక అనారోగ్యం, నాడీమండలంపై
వత్తిడి మొదలైన అవాంఛిత పరిణామాలు సంభవిస్తున్నందువల్ల, మానవ ఆయు

2. J. Aagaard *op cit.* p. 96.

ర్ధాయం వ్యవధి తగ్గిపోతున్నదని తలచి, ఇట్టి వత్తిడులనుండి వ్యక్తికి స్వేచ్ఛను ప్రసాదించడానికి మహాయోగి స్వయంజీవిత పరిశోధనా శాలలో ప్రయోగపూర్వకంగా తయారు చేసిన "ఔషధం" లేదా "ఆధునిక సర్వరోగ నివారిణి" అతీంద్రియ ధ్యానమని ఆ అభ్యాసకుల విశ్వాసం. ఆ దృష్టితో ఆధునికంగా ప్రపంచ ప్రసిద్ధి పొందుతున్న స్వామీజీలలో ఈయన అగ్రగణ్యుడని చెప్పవచ్చు.

ఈ అతీంద్రియ ధ్యానం శాస్త్రయుక్తంగా తయారింపబడిన"సర్వ మానసిక సంక్షోభ నివారిణి" అని కొందరు, ఈ విధానం అంటే నచ్చక గాని, లేదా ధన సముపార్జనను విమర్శించేవారుగాని దీనిని "మిలయన్ డాలర్" పరమౌషధంగా విమర్శిస్తున్నారు. అనేకమైన ఆధునిక గురూద్యమాల వలె ఈ అతీంద్రియ ధ్యానోద్యమంకూడ భారతదేశంలో తగిన ప్రాపకాన్ని, ఆదరణను సంపాదించలేకపోయింది. 1958లోనే మహేష్ మహర్షి "ఆధ్యాత్మిక పునరుజ్జీవనోద్యమాన్ని" స్థాపించి భారతీయుల దృష్టిని ఆకర్షింప ప్రయత్నించినాడు. కాని భారతీయులీ నవ విధానాన్ని అప్పట్లో అంగీకరింపగల స్థితిలో లేనందువల్ల, అన్ని క్రొత్త విధానాలను వింతగా భావించి, ఆదరించే మనస్తత్వంగల అమెరికా యువత ముందు, ఆ పిదప కొందరు విద్యావేత్తలు, కొందరు మనస్తత్వ వేత్తలు, వైద్య శిఖామణులు ఈ అతీంద్రియ ధ్యానాన్ని అనుసరించి, ఆదరించి, ప్రోత్సహిస్తున్నట్లు కన్పిస్తున్నది.

పశ్చిమదేశాలలో కొన్ని విద్యా కేంద్రాలలో అతీంద్రియ జ్ఞానంపై జరిగినంత శాస్త్రీయపరిశోధన మరొక ఆధునిక ఆధ్యాత్మిక ప్రక్రియపై జరగలేదంటే అతిశయోక్తికాదు. 1970లో ప్రపంచ ప్రసిద్ధిగన్న హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా వున్న వైద్య విద్యాలయం అతీంద్రియ ధ్యానాన్ని ప్రయోగశాలలో పరిశోధించి, దానిని అనుసరించేవారు చెప్పే అనుభవాలు 'కేవలం కల్పితమైన కాకమ్మ కథలా' లేక 'పరిశోధనకు నిలువగల సత్యాలా' అని తేల్చ ప్రారంభించారు. ఆ పరిశోధన కుపక్రమించిన వ్యక్తికూడ, అతీంద్రియ ధ్యాన సాధకుడే! తరువాత 1972లో "సైంటిఫిక్ అమెరికన్" అనే పత్రికలో తన పరిశోధనా ఫలితాలను ప్రకటిస్తూ "అతీంద్రియ ధ్యాన అభ్యాసకుల అనుభవాలు పరిశోధనకు నిల్చిన"వని పేర్కొన్నాడు. అయినా, ఇంకా పూర్తి పరిశోధనలు జరుగవలసి వున్నదని, ధ్యానాన్ని అభ్యసిస్తూ మధ్యలో వదలినవారి మానసిక, శారీరక

పరిణామాలను కూడ పరిశోధించితేనేగాని, విషయాలు పూర్తిగా నిరూపణ కావనే అభిప్రాయాన్ని వెలువరించాడు.

మానవునిలో మానసిక స్థితికి మూడు ముఖ్య దశలున్నవని విజ్ఞు లెరిగిన విషయమే! ఒకటి జాగృదావస్థ, మేల్కొని తనచుట్టూ ఏమిజరుగుతుందో గమనించి, గ్రహించి వ్యక్తం చేయగల మానసిక స్థితి ఈ దశలో మనసు సంపూర్ణ చలన జ్ఞానం, చైతన్యం కలిగి ఏ చిన్న సవ్వడికైన ప్రతిస్పందించగల స్థితిలో వుంటుంది. రెండవది స్వప్నావస్థ, శరీరం విశ్రాంతి తీసుకొంటున్నప్పటికి, మనసు కలలు కంటుంది. ఈ కలలు రకరకాలు. జరిగిపోయిన సంఘటనలు, జరగబోయే సంఘటనలు, కలగాపులగంగా స్వప్నావస్థలో మనసులో పరిభ్రమిస్తూ వుంటవి. కొన్ని కలలు వెనువెంటనే కరిగిపోతాయి. కొన్ని కలలు నిలిచిపోయి కొంతకాలం వరకు ఆ వ్యక్తిని ఆవరించి, అయితే అతి చైతన్యవంతం లేదా అతి మందమతి తత్వాన్ని కలిగిస్తాయి భయానక కలలు కన్నపుడు ఏర్పడే సంక్షోభం వల్ల దినమంతా ఆ వ్యక్తి అనిర్వచనీయమైన భయాందోళన స్థితి ననుభవిస్తాడు. మానసిక జీవన స్థితిపై కలల ప్రభావం అధికంగానే వుంటుందనేది మనస్తత్వ శాస్త్రజ్ఞుల పరిశోధనా ఫలితం, కాగా మూడో మానసిక దశ నిద్రావస్థ, తీవ్రమైన సుషుప్తావస్థలో వ్యక్తి యొక్క సర్వావయవాలు- అదమరచి-విశ్రాంతి చేస్తాయి. ఒక రకంగా ఈ స్థితి శవస్థితి. మరణించిన వ్యక్తి, నిద్రపోయిన వ్యక్తి ఒకటేననే సామెత కూడ జనూడుకలో వుంది. నిద్రావస్థ ముగిసిన మీదట మేల్కొన్న వ్యక్తి నూతనోత్సాహం, ఉత్తేజంతో కనిపిస్తాడు. ఈ మూడు మనస్తత్వ శాస్త్రజ్ఞుల ఆమోద ముద్రపొందిన స్వాభావిక మానసిక దశలు.

అయితే రాబర్ట్ కీత్‌వాలేస్ ప్రయోగాలనుబట్టి అతీంద్రియధ్యానంవల్ల మనసు పొందే స్థితి, పై మూడు స్థితులకంటె భిన్నమైందని తెలుస్తున్నది. స్వాభావిక శారీరక పరిణామాలకు ఈ భిన్న స్థితి వల్ల అంతరాయం ఏర్పడదు. కనుక అతీంద్రియ ధ్యానం వల్ల మనసు పొందే స్థితిని, అతడు "రెస్ట్‌ఫుల్ అలర్ట్‌నెస్" అని నామకరణం చేశాడు. మనం ఈ స్థితిని "ప్రశాంత చైతన్య స్థితి" అనవచ్చు. అంటే దేహం ప్రగాఢమైనసుషుప్త స్థితిలో విశ్రాంతిని పొందుతూ వుంటే మనసు సవ్వడికి ప్రతిస్పందిస్తూ జాగృదీ అవస్థలో వుంటుంది. ఇట్టి క్రియ అతీంద్రియ ధ్యానం వల్లనే సాధ్యం అని ఆ పరిశోధకుని తీర్పు, ఇట్టి

ప్రగాఢ విశాంతి స్థితిలో దేహం వున్నపుడు మనసు చలన స్థితిలో వుండి ఇనుమడించిన తేజాన్ని పొందుతుంది. అందువల్ల ఇది యోగ నిద్రవంటిది కాదు. గారడి లేక మంత్రశక్తి వల్ల పొందే అపస్మారక స్థితి కాదు మాదక ద్రవ్యాల సేవనం వల్ల, దేహం మనసు పొందే ప్రమత్త స్థితిగాదని ఆయన అభిప్రాయం. మనస్తత్వ శాస్త్రజ్ఞులు అంగీకరించిన మూడు దశలు, అతీంద్రియ ధ్యాన ఫలితంగా సంభవించే నాల్గవ దశగాక మరో మూడు మానసిక దశలను గూర్చి కూడ మహేష్ మహా యోగి వివరించాడు. ఆ అదనపు మూడు దశలు :

ప్రపంచ స్పర్శ లేక చైతన్యం.
దైవ స్పర్శ లేక చైతన్యం.
సమైక్య స్పర్శ లేదా చైతన్యం

ఇందు ప్రపంచ స్పర్శలో భౌతిక ప్రపంచాన్ని తన నిర్మల ఆత్మను గూర్చిన ఎరుక వ్యక్తికి వుంటుంది. ఈ దశలను గూర్చి వివరించిన ఆంథోనీ కాంప్ బెల్ "ఇట్టి నూతనానుభవాలు కేవలం విశ్వాసంపై కాక, ఇంద్రియ జ్ఞానం పైన శరీర ధర్మం పైన ఆధారపడినట్టివి. నాకై నేనే ఈ దశను ఇంకా చేరలేకపోయినందువల్ల ఇంతకు మించి చెప్పడం సాధ్యం కాదు" అని వివరించాడు.[8]

"మనసు ఈ స్థితిని ఎలా పొందుతుంది ? దీని అవసరం ఏమిటి ?" అనే వారికి మహర్షి మహా యోగి, తన ఉపన్యాసాల్లో సమాధానం చెప్పాడు. దినం అంతా ప్రయాణం చేసిన కారు సాయం సమయానికి తనలో ఇంధనాన్ని కోల్పోతుంది ఇంధనం లేనపుడు కారు నడువదు. వెంటనే ఆ ఇంధనం ఇంకొంచెం వుంది అనగానే మరికొంత పోయాలి. ఇలా నింపుకోవడమే రీఫ్యూయెలింగ్. అందువల్ల అతీంద్రీయ ధ్యానాన్ని ఇంధనంగాను, అతీంద్రియాన కేంద్రాలను రీఫ్యూయె

8. **Anthony Cambhell**, *Seven states of conciousness*, **London; Gollanoz, 1973 p. 99. Also refer to Reinhart Hummel**, *op. cit pp*. **93–110.**

లింగ్ కేంద్రాలుగను అభివర్ణించాడు మహర్షి. ఎందుకు అనేది ప్రశ్న. దైనందిన జీవిత సమస్యల వల్ల యాంత్రికంగా దినమంతా కాయకష్టం చేయడం వల్ల, కార్యాలయాల్లో అవిశ్రాంతమైన మానసిక వత్తిడుల వల్ల మానవ జీవితం సాయంకాలానికి సంక్షోభ భరితం ఔతుంది. శక్తితో పాటు ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, మానసిక శక్తిని కోల్పోవడం కద్దు అలా కోల్పోయిన మానసిక దారుఢ్యం దృష్టి కేంద్రీకరణ శరీరక ఉత్తేజం, నైర్మల్యం తిరిగి పొందడానికి ఇంధనమైన అతీంద్రియ ధ్యానాన్ని అభ్యసించాలి అనేది మహర్షి యొక్క జవాబు

ఈ అతీంద్రియ ధ్యానాన్ని ఎక్కు పెట్టి వుంచిన బాణంగా కూడ మహర్షి వర్ణించాడు. ఎక్కు పెట్టి వుంచిన అంబు తన పనిచేయడానికి సిద్ధంగా వున్న సాధనం. అతీంద్రియ ధ్యానం అలా సంధించిన బాణం వంటిది. అతీంద్రియ ధ్యానం వల్ల శరీరం ప్రగాఢ విశ్రాంతిని, మనసు చేతన స్థితిని పొందిన మీదట కార్య సాధనం సులభమని, అందువల్ల ఇది కార్య సాధనా నైపుణ్యం అని మహర్షి వర్ణన. అలసి సొలసిన మనసు ధ్యానానంతరం చైతన్యం పొంది కార్యక్రమాన్ని పునః ప్రారంభింప గలగడమే అతీంద్రియ ధ్యాన ఫలం. దీనిని మరో ఉదాహరణతో పోల్చాడు మహేష్ కురుక్షేత్ర రణరంగంలో నిమగ్నమై ఒక దశలో అచేతన స్థితిలో వున్న అర్జునున్ని కృష్ణుడు కార్యోన్ముఖుని చేస్తూ కావించిన ఉపదేశమే గదా భగవద్గీత. ఆ వుద్దేశంతో కృష్ణుడు, అర్జునుని త్రిగుణాతీతుడవు కమ్మని. హెచ్చరిస్తాడు. సత్వ రజ స్తమో గుణాలకు అతీతంగా వుంచేనేగాని యుద్ధ కార్యం కొనసాగదు. అందువల్ల రెండు లేక మూడు నిమిషాలు త్రిగుణాతీత స్థితిని పొందితే కలగే ఫలితం కార్య నిర్వహణ లేదా విధి నిర్వహణ. అతీంద్రియ ధ్యానం అట్టి విధి నిర్వహణను ప్రేరేపిస్తుందని మహర్షి ప్రబోధం. అతీంద్రియ ధ్యానం కొనసాగుతున్నపుడు శరీర ధర్మంలో తప్పనిసరిగా జరిగే కొన్ని మార్పులు పరిశోధన శాలలో గుర్తింపబడినవి.

అందు ముఖ్యమైనవి :—

1. శరీరానికి అవసరమైన ప్రాణవాయువు వినియోగం తగ్గుదల.
2. శరీర ధర్మ నిర్వహణ కవసరమైన ఉచ్ఛ్వాస, నిశ్వాసల వరవడి తగ్గుదల. ఉచ్ఛ్వాస నిశ్వాసల ఫలితంగా పనిచేసే నాడీ మండలం బిగువు సడలుట.
3. భావావేశం, మనోద్రేకాల తీవ్రత తగ్గుదల.

4. గుండె కార్యభారం తగ్గి, పాక్షికంగా విశ్రాంతిని పొందుట.
5. రక్తపోటు, మానసిక వత్తిడి, ఆతురతవల్ల కలిగే తొందరపాటు గుర్తింప బడేంతగా తగ్గుట.
6. మానసిక అభివృద్ధి, జ్ఞాపకశక్తి పెరుగుదల.
7. మాదక ద్రవ్య సేవనంపై క్రమంగా ఆసక్తి సన్నగిల్లుట.

అట్టి ఫలితాలు ప్రయోగ శాలల్లో రుజువైనందువల్లనే అనేక మంది విద్యా వేత్తలు, శాస్త్రజ్ఞులు మతాచారాలతో నిమిత్తంలేకుండ అతీంద్రియ ధ్యానాన్ని అనుసరిస్తున్నారని, ఇతరులను ప్రోత్సహిస్తున్నారని వారి ప్రచారం. డా॥ బైరన్ రిగ్బి, హాలండ్‌లోని పరిశుద్ధ జార్జి హాస్పిటల్ యొక్క రిజిష్ట్రార్ ఈ ధ్యానాన్ని గూర్చి మాట్లాడుతూ, ఇంగ్లాండులోని ప్రజలందరికి ఈ ధ్యాన ప్రక్రియ నందు బాటులోనికి తేవడం అవసరమని హెచ్చరించాడు. అమెరికాలోని, ఇల్లినాయ్ రాష్ట్ర విధాన సభ ఒకానొక తీర్మానం ద్వారా, ఈ ధ్యాన ప్రక్రియను పరించి పరిశీలించి, మాదక ద్రవ్య సేవన నిరోధానికి ఉపయోగపడగల మార్గాలను అన్వేషించ తీర్మానించినది [4]

ఈ అతీంద్రియ ధ్యాన వ్యాప్తికి మహర్షి మహేష్ యోగి కొన్ని విభాగాలను స్థాపించి, వాని ద్వారా ప్రపంచ వ్యాప్తంగా తీవ్రకృషి కొనసాగిస్తున్నాడు. ఆయన స్థాపించిన కొన్ని విభాగాలు:

1. ఆధ్యాత్మిక పునరుజ్జీవోద్యమం. ఇది వుద్యమానికి నాంది. సంపూర్ణ ఆధ్యాత్మిక జీవిత ప్రగతిని ఆశించేవారికి అవసరమైన శిక్షణనిచ్చి, సమాచారం సరఫరా చేసి, ప్రోత్సహించడం ఈ వుద్యమంయొక్క ధ్యేయం
2. అంతర్జాతీయ విద్యార్థుల ధ్యానసమాజం ప్రపంచవ్యాప్తంగా విద్యార్థుల అభిరుచులను పసిగట్టి, వానికి తగిన పరిశోధనా పరిస్థితులను అంశాలను సూచిస్తుంది. వానిలో జ్ఞానార్జనా విధానాన్ని పెంపొందించుకొనడం, మాదక ద్రవ్యాల విసర్జన ముఖ్యమైనవి.

4. **Khushwant Sinh** *Gurus, Godmen and Good people*, pp. 28-35.

3. అంతర్జాతీయ ధ్యాన సమాజం గృహస్థులు, వ్యాపారస్థులు, పారిశ్రామిక వేత్తలు మొదలైన అవిశ్రాంతంగా కార్యనిమగ్నులైన వారికి, శరీర విశ్రాంతితో పాటు మానసిక పునఃశక్తి సంధాన స్థితిని ఎలా కలిగించాలో ఆలోచించి, తరుణోపాయాలను సూచించే సమాజం.

4. స్వయంరాత్మక జ్ఞానార్జనా సాధన సంస్థ. ఈ సంస్థ ప్రకృతి శాస్త్రం, జనన క్రమం, పరిణామం, అభివృద్ధి చెందిన శాస్త్రీయ పరిజ్ఞానంతోపాటు వీనిని గూర్చి మహర్షిగావించిన క్రమబద్ధోపన్యాసాలుగల ముప్పదిమూడు విడియో టేపులను అవసరమైన వారికి సరఫరా చేసే సంఘం.

5 మహర్షి అంతర్జాతీయ విశ్వవిద్యాలయం. ఎవరిని గూర్చిన జ్ఞానం తెలియ బడకపోతే మానవజ్ఞానం సంపూర్ణం కాదో, ఆ దేవునిగూర్చిన బోధను అధ్యయనం, తెలుసుకోవలసిన విధానంతోపాటు విద్యార్జన కుపకరించే ప్రత్యేక పఠనా విభాగాలను, పరస్పర సంబంధ పాఠ్యాంశాలను, పవిత్ర గ్రంథ పరిచయాన్ని, జ్ఞానార్జనా అధ్యయన విధానాన్ని, అసాధారణం, అపరిమితమైన క్రియాత్మక శక్తుల అన్వేషణకు, పరిపోషణకు అవసర మైన శిక్షణ ప్రసాదించే విద్యాసంస్థ దీని లక్ష్యం-మానవ అభివృద్ధిని ప్రోత్సహించుట, సాధించుట. ఈ విశ్వవిద్యాలయ విద్యార్థికి విజ్ఞానానికి అనుసంధానాన్ని కలిగించడం ఈ సంస్థ కార్యక్రమాల్లో ముఖ్యమైంది, ప్రస్తుతం దీని అనుబంధ సంస్థలు స్విట్జర్లాండు, జర్మనీ, ఇండియా, స్వీడన్ డెన్మార్కు, ఫ్రాన్సు, అమెరికాలలో స్థాపితమై, కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాయి.

అలాగే అతీంద్రియ ధ్యాన కేంద్రాలు అమెరికాలో ఆరు మహానగరాలలోనే గాక, ప్రపంచమంతటా వ్యాపించి వున్నాయి. ఆ కేంద్రాలు వెలసిన పట్టణ జాబితా విమానాశ్రయాల పట్టణ జాబితా కంటె తీసిపోదనే సామెత పాశ్చాత్య దేశాల్లో వాడుకలో వుంది. దీనినిబట్టి ఈ అతీంద్రియ ధ్యాన ప్రక్రియ ఎంతగా ఆ దేశాల్లో ఆదరణ పొందిందో బోధపడగలదు.

ఇంతగా ఈ ప్రక్రియ ప్రజాభిమానాన్ని చూరగొనడానికిగల కారణాలలో కొన్నింటి నిట ఉదాహరించవలసి వుంది.

1. విరామమెరుగక, అహోరాత్రులు మహర్షి మహేష్ గావించే అవిరళ కృషి ముఖ్యమైంది కాగా, వచ్చిపోయే దర్శకులను స్వయంగా పరామర్శించి, సావధానంగా మందస్మితం చిందించే ఆయన ప్రశాంతమైన వ్యక్తిత్వం ప్రధాన కారణం.
2. తాను వెళ్ళలేని స్థలాలకు, అభ్యాస విధానంతో పాటు, వివరణను కూడ విడియో టేపుల ద్వారా సరఫరా చేసి, తాను లేనిలోటును తీర్చగలగడం రెండవ కారణం.
3. ఈ ప్రక్రియకు లోనైన వ్యక్తులను ప్రయోగశాలలో పరిశోధించి, పరీక్షించి, వాని ఫలితాలను కొంతవరకు శాస్త్రయుక్తంగా నిర్ధారించి ప్రపంచ ప్రసిద్ధి గన్న ఆంగ్ల పత్రికల్లో శాస్త్రజ్ఞులు ప్రచురించడం. అందువల్ల ఇది కేవలం కల్పిత కథ కాదనే నిశ్చయం ప్రజల్లో స్థిరపడడం.
4. ఈ ధ్యానాన్ని ఆచరించడానికి అట్టే కాలవ్యవధి అవసరం లేకపోవడం. తన స్వాధీనంలో వున్న సమయం ఎంత తక్కువైనా సరే, ధ్యాన నిమగ్నులై మానసిక చేతనా శక్తి పునః సంధానులు కాగలమని ప్రజలు నమ్మడం.
5. దినమంతా యంత్రాగారాలలో, కార్యాలయాలలో, పాఠశాలల్లో జీవన భృతికి కాయకష్టం చేసినవారు శారీరకంగా, మానసికంగా విశ్రాంతిని మనోదారుఢ్యాన్ని పొందడానికి అవకాశం వున్నదని ఈ ధ్యాన నాయకులు ప్రకటించడం.
6. ప్రశాంతమైన మానసిక వాతావరణంలో సామాన్య సమస్యలు గ్రహించి, పరిష్కరించుకోడానికి అవసరమైన మానసిక స్థితి పొందే అవకాశమున్న దని అనేకులు భావించడం.
7. ఆరోగ్యపరంగా, వైద్య ప్రమేయం లేకుండా హృద్రోగం, రక్తపోటు మొదలైన తీవ్ర వ్యాధులను నిరోధించే శక్తి ఈ అతీంద్రియ ధ్యానం ప్రసాదించగలదనే ప్రచారం, అట్టి ప్రచారాలను వేలం వెర్రిగా ప్రజలు నమ్మడం.
8. ఈ అతీంద్రియ ధ్యానోద్యమాన్ని 'బీటిల్' అనబడే సంగీత పాఠకులు స్వీకరించి, కొంత ప్రాపకాన్ని సంపాదించి పెట్టారు. అయితే ఆ తరు

వాత కొద్దికాలానికి విడిచిపెట్టారు. కాని వారు ఈ ఉద్యమంలో వున్నంత కాలం మహర్షికి ఎక్కడలేని ప్రచారం లభించింది.

9. 1965లో ఆయన కాలిఫోర్నియా వెళ్ళినపుడు ఆ రాష్ట్రం ఇట్టి ఉద్యమాలకు పట్టుగొమ్మగ, జీవగడ్డగ వున్నది. ముఖ్యంగా యువకుల్లో సంప్రదాయాలపై రోత, క్రొత్త కొరకైన తహతహ జోడై "ఏ మత ప్రమేయం లేదు" అనే అతీంద్రియ ధ్యానం యొక్క ప్రచారం వారిని ఆకర్షించినందువల్ల వారిద్వారా ఇది అమెరికా అంతటా వ్యాపించే అవకాశమేర్పడింది.[5]

ఈ ప్రచారంలో సహజంగానే అతిశయోక్తులు ప్రవేశించాయి. హృద్రోగాల వరవడిని తగ్గించి, రక్తపోటును క్రమబద్ధం చేస్తుందనే ప్రచారాన్ని పురస్కరించుకొని డాక్టర్ జాన్‌లారఫ్ "విశ్రాంతిని తీసికొనడం, సోఫాలో కూర్చుండడం, పుస్తక పఠనాన్ని కొనసాగించడం వంటి శరీర బడలికోపశన పద్ధతుల కంటె అదనంగా ఈ అతీంద్రియ ధ్యానం రక్తపోటు రోగులకు సహాయపడగలదని నేను అనుకొనడం లేదు" అని నిర్ధారించి ప్రకటించినాడు.[6] రక్తపోటు వ్యాధుల్లో ప్రఖ్యాతి చెందిన ఈ వైద్యశిఖామణి వెలిబుచ్చిన అభిప్రాయం కొందరిలో అతీంద్రియ ధ్యానంపై వున్న భ్రమల్ని తొలగించింది.

అతీంద్రియ ధ్యానం ఏ మతానికి చెందని లౌకిక క్రియ అని మహర్షి చేసే ప్రచారం కేవలం బూటకమేనని అనవలసివస్తుంది. ఎందుకంటే, ఆయన 1969లో ప్రచురించిన భగవద్గీత వ్యాఖ్యాన గ్రంథంలో ఏ విధమైన అరమరలు లేకుండ అతీంద్రియ ధ్యానాన్ని నిర్వచించాడు. "మనసు అతీంద్రియ స్వరూపాత్మకం కావటానికి అనుసరించే విధానంలోని ప్రతిస్థాయికి అవసరమైన ఉత్సాహాన్ని ఈ ధ్యాన ప్రక్రియ సరఫరా చేస్తుంది. అట్టి అనుభవం సాధకులను మరింత ప్రోత్సహిస్తుం" దని పేర్కొని[7] ఆ వెనువెంటనే "ఎంత అల్ప విశ్వాసంతో నయినా ఈ ధ్యాన

5 Vishal Mangalwadi *op cit* p. 103.

6. *Time*, October 13, 1975, *The T. M. Craze, forty minutes to Bliss.*

7. Mahesh mahayogi, *Bhagavadgita*, middlesex : Penguin Books 1969. p. 317.

ప్రక్రియను ప్రారంభించవచ్చు. ఎందుకంటే, అవిశ్వాసుల్లో విశ్వాసాన్ని పుట్టించి, అంతిమ సత్యంతో ప్రత్యక్షానుభవాన్ని కలిగించడం ద్వారా, వారి సంశయాలను నివృత్తి చేస్తుందని[8] ఉద్ఘాటించాడు. ఏ మతంతోను ప్రమేయం లేనపుడు 'ఈ అంతిమ సత్యం' ఎవరు? హిందూ వేదాంతంలో 'అంతిమ సత్యం' అంటె దేవుడనే భావం స్థిరపడివుంది గదా! దానికి వేరే వ్యాఖ్యానం చేయనక్కరలేదు.

మహేష్ మహాయోగి తాంత్రిక సూత్రాలను ధ్యాన యోగ సూత్రాలను సమ్మేళింప ప్రయత్నించినట్లు ఆయన రచనలను, "కుండలిని'' శక్తి సమన్వితుడు స్వామి ముక్తానంద పరమహంసతో మహర్షి గావించిన సంభాషణలను పరిశీలించిన వారికి తప్పక అవగాహన కాగలదు. ముక్తానంద పరమహంస తాంత్రిక సిద్ధయోగి అనే విషయం జగద్విదితం. 1976 వ సంవత్సరం అక్టోబరు నెలలో మహర్షి గణేష్‌పురిలో వున్న స్వామి ముక్తానంద పరమహంసను కలుసుకొని బ్రహ్మచారికి, స్వామీజీకి తారతమ్యమున్నదని, బ్రహ్మచారి "కఠోర అవివాహిత జీవితాన్ని కొనసాగిస్తూ అతీంద్రియ ధ్యానాన్ని అభ్యసిస్తాడు స్వామి స్వాభావికంగా ఆధ్యాత్మికాభ్యాసిగా నిరూపణ చెందుతాడ''ని సూచించినపుడు పరమహంస మంద స్మితంతో "మహర్షి మన సంస్కృతిలో ఘనమైన వ్యక్తిత్వమని, విశ్వం సప్త మహర్షుల సృష్టి యని, ఈ వేళ అట్టి మహర్షి మరో క్రొత్త లోకాన్ని సృష్టించాడని'' శ్లాఘించాడట. ఈ మహర్షి, ఆ స్వామి కలయిక అంతరార్థం మహర్షి స్థాపింప నెంచిన ప్రపంచ పాలనా భారాన్ని స్వీకరించుమని స్వామీజీని అర్థించుట.[9] ఆ విధంగా తాంత్రిక సిద్ధయోగి యొక్క సలహా సహకారాలను పొందాలని ప్రయత్నించడం వెనుక ఒక ముఖ్యోద్దేశం ఉన్నదని ఈ గ్రంథకర్త అభిప్రాయం. తాంత్రిక యోగిగా ప్రసిద్ధి చెంది, పరమహంసగా వేనోళ్ల కొనియాడబడుతున్న ముక్తానందుని దీవెనలను పొంది, ఆ విధంగా ఆ తాంత్రిక సంప్రదాయంతో అతీంద్రియ ధ్యానాన్ని పరోక్షంగా సంబంధపరచి, గురువులేని కొరత తీర్చుకోవడం నిజానికి అతీంద్రియ ధ్యానం ఏ మత ప్రమేయం లేని కేవలం లౌకికోద్యమమే అయితే, మహర్షి ఇంతగా స్వామి ముక్తానంద పరమహంస సహకారం కోసం తాపత్రయ పడవలసిన అవసరం లేదు.

8. *Ibid*. p. 319.
9. **See Muktananda's magazine,** *Sidda path*, **no. 15, October - November 1976. p. 4. ff.**

ఈ అతీంద్రియ ధ్యానం "మతపరమైంది కాదు" అని ఋజువు చేయడానికి ఆయన ఎంత ప్రయత్నించినా ఆయన వ్రాతలు, ఆచారాలు ఇది మతపరమైందనే విషయాన్ని ఋజువు చేస్తూనే వున్నాయి. అతీంద్రియ ధ్యానం కోసం ముందుకు వచ్చిన అభ్యాసి మహేష్ మహాయోగి గురువు బ్రహ్మానంద సరస్వతి పటాన్ని ముందుగా పూజించాలి ఆ పూజ సమయంలో అతడు సంస్కృత భాషలో లిఖితమైన అనేక ప్రార్థనలతో పాటు, మహేష్ మహాయోగి భగవద్గీత వ్యాఖ్యా ననంతరం వ్రాసిన తుది ప్రార్థనను వల్లె వేయాలి అద్వైత వేదాంత సంప్ర దాయంలో అంతకు ముందున్న గురువులను ఈ ప్రార్థనలో స్మరించడం జరుగు తుంది ఈ ప్రార్థనలను పఠించే విధానం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. ఈ అతీంద్రియ ధ్యానం మత ప్రమేయం లేనిదైతే, ఈ సంస్కృత ప్రార్థన లెందుకు? ఈ వేదాంత పారంపర్య గురుపరంపర సంస్మరణ లెందుకని ఎవరైన ప్రశ్నించవలసి వుంది సాధారణంగా మహర్షి 'దేవుడు' అనే పదాన్ని అట్టే వాడినట్టు కనిపించదు. కాని 'సృజనాత్మక జ్ఞానం' **(creative Intelligene)** అనే పదాన్ని పదే పదే ప్రయోగించుటను బట్టి, ఆ సమయ సందర్భాలను బట్టి మహర్షి ఈ పదాన్ని దేవునికి పర్యాయపదంగా వాడినట్లు భావించవచ్చు.

మహర్షి మహాయోగిని అవకాశవాది అనవలసివుంది. పాశ్చాత్య సమాజంలో మతాభ్యాసం అంతగాలేని, లేదా ఇష్టపడనివారిని, విద్యా సంస్థలు మొదలైన వానిని ఆకర్షించి తన ఉద్యమానికి జనాన్ని, ధనాన్ని సమకూర్చుకొనడంకోసం తనది మత ప్రమేయం లేని ఉద్యమమని ప్రకటించుకొన్నప్పటికి, అరమరిక లేకుండ తన గ్రంథాలలో ఆయన నిశ్చితాభిప్రాయాలను నిర్ద్వంద్వంగా ప్రక టిస్తూనే వున్నాడు. ఈనాడు ప్రపంచ జనాభాలో నాలుగింట మూడువంతులు ఏదో ఒక మతానికి చెంది వున్నందువల్ల వారికి అభ్యంతర కారణం లేకుండా వుండాలని ఒకవైపు ముచ్చటిస్తూనే, అట్టి వారిని ఆకర్షించడానికి, ఈ అతీంద్రియ ధ్యానానికి మతంరంగు పూసి, అమ్మక తప్పదని ప్రకటించాడు. [10]

10. Mahesh Mahayogi *The science of being and the Art of living*, **London : international SRM Publications,** 1966 see specially pp. 308-310.

అలా అని వ్రాసినందువల్ల, ఆయన అపకాశవాదిగా రుజువైనాడు. భారతదేశం సంప్రదాయ సిద్ధమైన మతాత్మకదేశం గనుక అక్కడ అతీంద్రియధ్యాన వ్యాపకానికి, తాంత్రిక యోగి సహాయాన్ని అర్థించాడు ఇట్టి ద్వీమనస్తత్వమే ఆ తరువాత ఆయనపై కేసులు బనాయించడానికి దారితీసింది.[11]

కాగా మహేష్ మహాయోగి ఉపయోగించే బీజ మంత్రాలు అయితే తాంత్రిక దేవుళ్ళను, లేదా తాంత్రిక దేవతలను ఉదహరించడం గాని లేదా పరోక్షంగా సూచించడంగాని జరుగుతుంది. ఇది మత ప్రమేయంలేని సంస్థ అని ప్రకటించి అనేకమంది అమాయకులైన ప్రజల్ని, వారికేమి తెలియని పరిస్థితిలోకి నడిపించి, అనేక సమస్యలను సృష్టిస్తున్నది. మత పరమైంది కాదు అని మహేష్ మహాయోగి ఎంతగా ప్రగల్భించినా "తంత్ర మన సంప్రదాయం, ఏదో ఒక రోజు మనం అందులో ప్రవేశిస్తాం"[12] అని ప్రకటించాడు.

సామాన్య శిష్యవర్గానికి ధ్యానం కేవలం అనేక యోగ ప్రక్రియలకన్న వేరేమిగాదు. శిక్షణోపాధ్యాయులు తమ నియామకానికి ముందు హఠ యోగాభ్యాసాలను కూడ కొనసాగించడం కద్దు, ఇంకొక విధంగా వివరిస్తే లోతైన మూల విజ్ఞానం లేనివారిని సైతం క్రియలోనికి నడిపే ప్రక్రియ అతీంద్రియ ధ్యానం. దీనిని గూర్చిన వివరణ హిందూమత గ్రంథాలలో ఎక్కడా కనిపించదు. ఇది అభ్యాసకులకు కలిగించే ఆధ్యాత్మిక ప్రగతికూడ పెద్దగా లేదు. అది సాధించగలదని చెప్పబడిన అన్ని లక్ష్యాలను ఈనాడు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొంత దేహ అలసటను ఇది తగ్గించగలదని గుర్తించినా, ముందే చెప్పినట్లు ఏ ఇతర ఉపశమన క్రియకన్న అధికంగా మాత్రం ఇది సాధించలేదు.

మహర్షి సాధింపతలంచిన ప్రపంచ ప్రణాళిక వ్యవస్థను గూర్చి కూడ ఒకటి రెండు మాటలు చెప్పవలసివుంది.[13] ఈ పద్ధతి ప్రకారం ప్రతి వేయిమంది సాధకులకొక శిక్షకుడుండాలి ఇట్టి శిక్షకోపాధ్యాయులు ప్రపంచంలో ఏర్పడే

11. See Vishal Mangalwadi *op.cit.* p 123–124.
12. See J. Aagaard, *op.cit.* p. 88.
13. Vishal Mangalwadi *op cit.* p. 103. ff.

3,600 కేంద్రాలలో తర్ఫీదు ముందు పొందవలసివుంది. ప్రతి పదిలక్షలమంది ప్రజలకొక ప్రపంచ ప్రణాళికా కేంద్రం చొప్పున నూరు కేంద్రాలు ఒక్కొక్క సహకార కేంద్రం అజమాయిషీ చేస్తాయి. ఈ విధంగా మొత్తం ముప్పది ఆరు అంతర్జాతీయ సహకార కేంద్రాలు ప్రపంచంలో పనిచేస్తుంటాయి. ఈ ప్రణాళిక లక్ష్యాలు :-

1. ప్రతి వ్యక్తిలో సృజనాత్మక శక్తులను అభివృద్ధి పరచడం.
2. ప్రభుత్వ కార్యక్రమాలను ఫలింప చేయడం.
3 విద్యా బోధన, సాధనలో ఉన్నతాశయాలను సాధించడం.
4. తరతరాలుగ వున్న నేర మనస్తత్వాన్ని, దౌష్ట్య వర్తన మొదలైన గృహస్తుని చింతా క్రాంతుని చేసే అవలక్షణాలను సమాజం నుండి తొలగించడం.
5. పరిసరాలను అర్థవంతంగా ఉపయోగించు కొనునట్లు ప్రజల్ని ప్రోత్సహించడం.
6. వ్యక్తులకు ...తద్వారా సమాజానికి ఆర్థిక పరమైన సంతృప్తి కలుగునట్లు చూడడం.
7. ఈ తరంలోనే ప్రజల యొక్క ఆధ్యాత్మిక నిరీక్షణలు నెరవేరునట్లు కృషి చేయడం.

ఇట్టి గమ్యాలతో ప్రపంచ ప్రణాళికను సిద్ధం చేసి మహర్షి మొట్టమొదట న్యూఢిల్లీలోని విజ్ఞాన భవనంలో 1975 మార్చి 11 వ తేదీ ప్రారంభోత్సవం గావించాడు అయితే, ఈయన ప్రణాళిక ఎంత ఆశాజనకంగా వున్నా ఆయా ప్రభుత్వాల నుండి ప్రోత్సాహం ఆనాశించినంతలేదు. అట్టి కార్యక్రమాన్ని ప్రారంభించి కొనసాగించ వలసిందిగా మొదట ఆహ్వానం పంపిన దేశం ఒకటే- అది నేపాల్. ఈ ప్రపంచ ప్రగతి కేంద్రం హిమాలయాలలోని ఋషికేష్‌లో మహర్షి స్థాపించిన శంకరాచార్య నగర్‌లో వుంది. అయితే, ప్రస్తుతం దీని ఉపయోగం అంతగా లేదని చెప్పవచ్చు.

ఆధునిక వుద్యమాలపై వచ్చిన అనేకమైన ఆరోపణలకు ఈ ఉద్యమం కూడ అతీతంగా లేదని గమనింపవచ్చు. వీరు నిర్మించిన భవనాలు, విద్యాలయ కేంద్రాలు ప్రభుత్వ నిర్మాణాలను తలదన్ని, అత్యంత ఆధునిక సౌకర్యాలతో

విరాజిల్లుతున్నాయి. ఋషికేష్‌లో వీరు నిర్మించిన కేంద్రం యొక్క విలువను కట్టడానికి అరితేరిన అత్యాధునిక ఏ సివిల్ ఇంజనీరుకైనా అలవికాదు. వీరి కేంద్రాలు కూడ విశాలమైన భూవసతిలో నిర్మితమై వున్నవి. ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్ దగ్గర వేద విశ్వవిద్యాలయ స్థాపనకై పదకొండు వందల ఎకరాల భూమి ప్రస్తుత ప్రభుత్వం కేటాయించడంపై వచ్చిన ఆరోపణలు, వాని పరిశీలనా ఏర్పాట్లు పాఠకులకు గుర్తుండే వుంటుంది. వీనికి తగినట్లు ఆ యోగి అనేక కేంద్రాలను దర్శించవలసి వున్నందున తనకొక జెట్ విమానాన్ని కొనుగోలు చేసికొని సంచరిస్తూ జెట్ యోగిగాకూడ ప్రసిద్ధిచెందాడు. ఇంతగా దేశదేశాలలో ప్రసిద్ధిగన్న శాఖోపశాఖలై విస్తరిల్లిన అతీంద్రియ ధ్యానోద్యమం భారతదేశంలో రాణించలేక పోవడానికి గల కారణాలేమిటి? అనేది విజ్ఞులు ఆలోచించవలసివుంది. 1958 లోనే ఆధ్యాత్మిక పునరుజ్జీవనోద్యమం భారతదేశంలో ఈ ఋషి ప్రారంభించినా, ఇది అమెరికా వెళ్ళేంతవరకు, చాలమందికి ఇక్కడ తెలియబడనే లేదు. ఇందుకు ఇట్టి వుద్యమాల ఎడ భారతీయులు సాధారణంగా అవలంబించే పట్టీపట్టని తూష్ణీ విధానమా? అంతగా విదేశీయుల నాకర్షించిన ఈ ప్రక్రియ భారతీయుల దృష్టిని ఆకర్షించక పోవడానికి ప్రబల కారణాలనేకం ఉన్నవా? నిర్మొహమాటంగా ఒక కారణాన్ని ఇట ఉదహరించవలసి వుంది.

భారతదేశం సంప్రదాయ సిద్ధమైన మత బోధలకు, విగ్రహారాధనకు, మంత్ర తంత్ర శక్తులకు అలవాటుపడిన ప్రజల కాలవాలమైన దేశం. వేపచెట్టు క్రింద విభూతి రేఖలతో, చేత కమండలంతో ప్రత్యక్షమై, హూం, హ్రీం అని గావుకేకలుపెట్టి, కనుగ్రుడ్లు ఎర్రచేసి చూపరుల్లో ఏదో జరగబోతుందనే భావాన్ని భయాన్ని కలిగించి పొట్ట నింపుకొనేవారు ఆకర్షించినంతగా సున్నితమైన ధ్యాన ప్రక్రియ ఆకర్షిస్తుందా?

విగ్రహం ముందుండి, పద్మాసనం వేసి, మంత్రపఠనం శ్లోకగానం చేసి, తనాపని చేస్తున్నట్లు పదిమంది చూడాలని కోరి, చూచేవరకు కొనసాగించి, చూస్తే సంతోషించి, చూడకపోతే శాపనార్థాలు పెట్టే మనస్తత్వం గల భారతీయులు, గుట్టుగా ఇంటిలో కూర్చుండి చడీచప్పుడు లేకుండ, ఏ విగ్రహంతో ప్రమేయం లేకుండ మానసిక క్రమశిక్షణను పాటించి కొనసాగించే అతీంద్రియ ధ్యానం అనేకుల్ని ఆకర్షించక పోవడంలో ఆశ్చర్యం లేదు. అయినా కురుస్తున్న డాలరు వర్షంవల్ల స్వార్థపర శక్తులు ఇటీవల భారతదేశంలో ముందుకు వస్తున్నట్లు గమనిస్తున్నాం.

# గురు మహారాజులు

ఈ విభాగంలో అధికభాగం రాధాసామి సత్‌సింగ్ యొక్క వ్యవస్థాపకుల జీవిత సరళి, బోధలు చర్చించబడుతున్నాయి. వీరు సద్గురు మహారాజ్‌లుగా లోక ప్రసిద్ధులు.

### రాధాసామి సత్‌సంగ్: విమోచనా నాదం

'సత్సంగ్' సిఖ్ మతసాహిత్యం నుండి స్వీకరింపబడిన పదం. ఆ పదానికి అర్థం 'పవిత్ర సహవాసం' లేదా 'మంచి సహవాసం' అని. హిందూ భక్తితత్వం, ఇస్లాం సూఫీ ప్రబోధంవల్ల ప్రభావితులైన కబీరు, గురునానక్, జగ్‌జీవన్‌సాహెబ్ మొదలైన వారు సరిక్రొత్త మత సమ్మేళనాన్ని, సమన్వయాన్ని సాధించారు. ఈ గురుత్రయం సంప్రదాయం బోధలు, వ్రాతలవల్ల ఆధ్యాత్మిక వికాసాన్ని, మానసిక వివేకాన్ని పొంది గత శతాబ్ది మధ్యభాగంలో ఆనాటి అవసరాలకు సరిపోయే సమ్మిశ్రణాత్మక మత ధోరణితో ప్రారంభమై, రానురాను కాలాను గుణ్యంగా మార్పు పొందుతున్న మత సహవాస సమ్మేళనమే సత్సంగ్ శాఖ. ఏ మత లేఖనాన్నైనా తమకు అవసరమైన, నచ్చిన విధానంలో వ్యాఖ్యానించడం ఈ శాఖీయులు నాయకులు అనుసరించే పద్ధతి, ఈ వ్యాఖ్యాన విధానం హిందూ, ఇస్లాం, క్రైస్తవ మతగ్రంథాలకుకూడ తప్పలేదు.

'రాధాసామి' అనే పేరుకూడ రెండు పౌరాణిక నామధేయాల సంక్రమణం. కృష్ణుని మనోవాక్కర్మల ఆరాధించిన స్త్రీ మూర్తి రాధ కొందరి దృష్టిలో ఆమె వాస్తవిక గోపికాస్త్రీ, మరికొందరి దృష్టిలో కృష్ణ భక్తిలో శ్రేష్ఠం, శిఖాగ్రం అయిన మధుర భక్తిని సామాన్య వ్యక్తులకు కూడ సాదృశ్య పూర్వకంగా వివరించడానికి ఆయా పౌరాణిక రచయితలు సృష్టించిన ఊహామూర్తి అట్టి రాధా కృష్ణుల ప్రణయ ప్రేమాయణాన్ని ఆధారంగా తీసికొని, 'సామి'ని కృష్ణగా ఎంచి ఈ శాఖ 'రాధాస్వామి' సత్సంగ్‌గా రూపొందింది 'స్వామి' యొక్క భ్రష్టరూపం లేదా వికృత రూపం- సామి. ఈ రెంటి సమ్మేళనమే 'రాధాసామి.' రాధాసామి నారాధించే ప్రజల సాహవాసమే 'రాధాసామి సత్సంగ్.'

## 1. తులసీరామ్ మహరాజ్

ప్రథమ వ్యవస్థాపకుడు క్షత్రియకులానికి చెందిన ఆగ్రా ధనవంతుడు తులసీరామ్ ఈయన జననం 1818 సంవత్సరం. ఆ తరువాత పరమగురు శ్రీ శివదయాళ్ సింగ్ సాహెబ్‌గా ఆయన అనుచర వర్గం ఆయన్ని పిలిచింది. ఈ గురు మహారాజుకే మరోపేరు సామిజీ మహరాజ్. తలుపులు మూసిన గదిలో గంటలతరబడి బాల్యదశనుండి ధ్యాన నిమగ్నుడై పెద్దల కాశ్చర్యాన్ని కలిగించినట్లు ఈయన జీవిత చరిత్రకారులు ఉదహరిస్తున్నారు. ఇలా ధ్యానాభ్యాసంలో ఎదుగుతూనే, తన కుటుంబ సభ్యులకు తనకు తోచిన ఆయా మత విషయాలపై చిన్న చిన్న ఉపదేశాలనిస్తూ వుండడం శివదయాళ్‌సింగ్‌కు అలవాటు. ఆ వయసులోనే ఆయన ఉపదేశాలు ఆధ్యాత్మిక సత్యాలు, అపూర్వ జ్ఞాన ప్రదర్శనతో ప్రేక్షకుల నాశ్చర్య చకితులను చేసేవి తల్లిదండ్రుల వత్తిడివల్ల వివాహం చేసికోవలసి వచ్చింది. అయినా ఆయన భార్యనుగూర్చి గాని, వైవాహిక జీవిత విశేషాలను గూర్చిగాని పెద్దగా తెలియరావడంలేదు. కాకుంటే తాను పౌరాణిక కృష్ణుని వేషం ధరించి, భార్యను రాధగా తయారించి, చేరిన భక్త ప్రేక్షకులకు కృష్ణభక్తిని నృత్యరూపంలో ప్రదర్శించి, తృప్తిపరచేవారనిమాత్రం తెలుస్తున్నది 1858లో రాయ్ సలిగ్ రామ్ అనే పట్టభద్రుడు శిష్యుడుగా చేరి, ఈ పవిత్ర సహవాసాలకు హాజరౌతూవున్న ఇతరులను కూడ ప్రేరేపించి, సమష్టిగా తానొక శాఖను స్థాపించాలని వత్తిడి తెచ్చిన మీదట, తన అనుచరులను తృప్తిపరచడానికి, 1861లో శివదయాళ్ సింగ్ రాధాసామి సత్‌సంగ్‌ను స్థాపించాడు. ఆ సమయంలో ఆయన గావించిన ప్రకటన గమనార్హమైంది

> "ఇందుమూలంగా ప్రకటించునదేమనగా, మాయాభ్రమలవల్ల సంభవించే తీవ్ర శ్రమలకు లోనైన జీవాత్మల దుస్థితిని గమనించిన సర్వోన్నతుడు. సర్వశక్తిమంతుడైన రాధాసామి సద్గురు శరీరాన్ని ధరించాడు. తన కృప ద్వారా ఏతద్ శ్రమైక జీవులను విమోచింప, ఈ లోకంలో ప్రత్యక్షమైనాడు, సూరత్ శబ్దమార్గం ద్వారా మర్మమైన ఆయన మూల నివాసాన్ని వివరించుచున్నాడు. సమస్త జీవులు ఆయన పాదస్థలంలో (లభించే) ప్రేమ విశ్వాసాలతో తమను తాము నింపుకొని, వానిని తమ జీవిత

ధ్యేయాలుగ అవలంబించి ఆచరించాలని ప్రతిజీవికి ఆయన హెచ్చరించు చున్నాడు."[1]

శివదయాళ్ సింగ్ లేదా సామీజీ మహరాజ్ దయాస్వభావుడైన రాధాసామి యొక్క అవతారం అని సత్ సంగీల-సత్ సంగ్ సభ్యులను సంగీలనడం పరిపాటి-విశ్వాసం. ఈయన బోధలు సుమారు రెండు సంపుటాలలో-ఒకటి పద్య సంపుటి, మరొకటి వచన సంపుటి - 'సారా బచన్' అనే పేరుతో సంకలింపబడి వున్నాయి. 'సారా బచన్' అంటే ముఖ్య సూక్తులని అర్థం. ఆయన 1878 లో తన అరవై య్యవ ఏట మరణిస్తూ "బ్రహ్మచారైన, సాధువైన, గృహస్థుడైన సత్ సంగీ, ఎవరు కూడ దిక్కులేనివారమని నిరాధారంగా విడువబడినామని విచారించ నవసరంలేదు. నేను ప్రతి సంగీతో వుండి అనుమతించిన కృపతో వారిని దర్శిస్తూ వుంటా"నని సెలవిచ్చారని సత్ సంగీల దృఢ విశ్వాసం.[2]

అనుచర సంఖ్య పెరగడంతో ఆగ్రాలో ఆయన నివసిస్తున్న ఇల్లు ఇరుకై పోయింది. ఆ కారణంచేత ఆయన జీవించివున్నపుడే ఆగ్రాకు మూడు మైళ్ళ దూరంలో నగరం వెలుపల కొంత ప్రదేశాన్ని ఏర్పరుచుకొని, 'రాధాసామిబాగ్' నిర్మాణాని కుపక్రమించారు ఇపుడా ప్రదేశం 'సామిబాగ్' ప్రముఖనం-గా పిలువ బడుతున్నది. ముందు కొన్ని నివాసగృహాలు, ఆపై ఆరాధనా స్థలం నిర్మింప బడింది ఇక్కడ స్వామీజీ మహారాజ్ తన నివాసాన్ని ఏర్పరుచుకొన్నాడు. ఆయన నివసించిన గదుల ప్రక్కనే ఆయన అస్థికలను ప్రదర్శించి, ఆ పిదప అక్కడొక ప్రదర్శనశాలను నిర్మించారు. తరువాత ఈ వనం చుట్టూ ఒక స్త్రీ వాస స్థలం ఏర్పాటైంది ప్రథమ గురు మహారాజు అస్థికలను ప్రదర్శించిన తావులో నిర్మింపబడిన భవనాన్ని కలుపుతూ మహాభవన నిర్మాణాన్ని కొనసాగి స్తున్నారు ఇది పూర్తయిననాడు తాజమహల్ సౌందర్యాన్ని తలదన్నగలదని వారి నమ్మకం.

1. Souvenir in *Commemoration of the First Century of the Radhasoami* Satsang 1861–1961 Dayalbagh : Radhasoami Satsang Sabha 1962 p. 7.
2. *Ibid*. p. 28.

రాధాసామి సత్సంగ్ సిద్ధాంతాలలో గాని, బోధలలోగాని, మహత్రిక్రియ లకు వారు పెద్ద స్థానాన్ని కల్పించినట్లు కనిపించడం లేదు. అయినా సామిజీ మహరాజ్ ఆయన జీవిత కాలంలో కొన్ని అద్భుత క్రియలను చేసి చూపినట్లు ఒకటి రెండు గ్రంథాలలో ఉదాహరింపబడింది.[3] సామిబాగ్‌లో భవన నిర్మాణం కొనసాగుతున్నపుడు ఒక వేప చెట్టు పునాదుల్లో మొలచి నిర్మాణ కార్యక్రమానికి ఆటంకం కలిగించిందని, ఈ వార్త విన్న సామిజీ మహరాజ్ పూలమాలను తెచ్చి వేపచెట్టుకు వేసి పూజింప ఆ మరునాడే ఆ చెట్టు ఎండిపోయిందని, ఇది ఆయన మహత్రిక్రియలకు నిదర్శనమని సత్‌సంగ్ కథనం.[4] 1977 లో వర్షాభావం వల్ల తీవ్ర కరువు ఏర్పడినపుడు, చుట్టు ప్రక్కల గ్రామవాసులు సామిజీ మహరాజుకు దర్శించి, సహాయాన్ని అర్థింప, ఆయన అందరిని చేరబిలిచి రాధాసామి పవిత్ర నామాన్ని సంస్మరింప ఆజ్ఞాపించాడని, అలా వారు బృందగానం చేస్తుండగానే వర్షం కురిసిందని మరో ఉదాహరణ [5] ఇట్టివే మరెన్నో ఉదాహరింపడి వున్నాయి.

## 2. రాయ్ సాలిగ్ రామ్ మహరాజ్ :

సామిజీ మహరాజ్ మరణానంతరం 1878 లో రాయ్ సాలిగ్‌రామ్ సత్ సంగ్ నాయకత్వాన్ని చేపట్టాడు ఈయన పట్టభద్రుడని ముందే ఉదహరింప బడింది. 1828లో జన్మించి ఆనాటి సంయుక్త రాష్ట్రాలకు పోస్టుమాస్టర్ జనరల్‌గా పనిచేసి, 1856-57 లో సంభవించిన ప్రప్రథమ భారతదేశ స్వాతంత్ర్య పోరా టంలో తాను స్వయంగా చూచిన అకృత్యాలచే మానసికంగా కలతచెంది, ఆనాటి నుండి ఆధ్యాత్మిక విషయాలపై మనసును లీనంచేసి, సత్సంగీ అయిన వ్యక్తి. 'ప్రేమబాణి' అనబడే సిద్ధాంత గ్రంథం సాలిగ్‌రామ్ కృషి ఫలితం. సత్‌సంగ్ సిద్ధాంత నిర్మాత, వ్యాఖ్యాత. బాల్యంలోనే సాలిగ్రామ్ హస్తముద్రికలచూచి, ఒకానొక సాధువు, 'అటు మతపరంగా, ఇటు అర్థికంగా ఈ బాలుడు అనేకుల కుప యోగపడగల'దని సూచించాడట.[6] తన కుటుంబ సంప్రదాయ ప్రకారం ఎవర్నో

3. **Refer to** *A Brief Account of the progress of the Radhasoami* **Satsang Soami Bhag : 1961.**
4. **Souvenir** *op cit* **p. 21.**
5. *Ibid.* **p. 28 also see p. 24.**
6. **Ibid. p. 81.**

ఒకర్ని గురువుగా అంగీకరించవలసివుండగా, గురువుగా వుండవచ్చిన వ్యక్తిని ముందు తానే ప్రశ్నలడిగి, వారు సమాధానం చెప్పలేనపుడు తిరిగి పంపినట్లు, ఆయన చరిత్రకారుడు వివరిస్తున్నారు. ఆ విధంగా అటు ముస్లిమ్ మౌల్వీలను, ఇటు హిందూ ఆచార్యులను అనేకమందిని ఆయన తిరస్కరించాడు. ఆ పరిస్థితుల్లో అదృష్టవశాత్తు సామిజీ మహరాజ్ యొక్క కనిష్ఠసోదరుని ద్వారా సామిజీ మహరాజ్‌ను గూర్చి విని, ఆయన్ని సమీపించి, ప్రథమ దర్శనంలోనే తన గురుదేవునిగా అంగీకరించి చతుర్విధ సేవలను కొనసాగింప ప్రారంభించాడు రాయ్‌సాలిగ్‌రామ్. సత్సంగ్ సంప్రదాయం ప్రకారం ప్రతి సత్సంగి తన గురువును తను, మన, ధన, ఆత్మలతో సేవించడమే ఈ చతుర్విధ సేవ లక్ష్యం గురువున కవసరమైన శారీరక (తను) ఉపచర్యలు పరిచర్యలు చేయడం మొదటిదికాగా, సర్వోన్నతమైన రాధాసామియొక్క నామసంస్మరణాన్ని మనః పూర్వకంగా కొనసాగించడం రెండవది. అవసరమైన ఆర్థిక సేవలను నిర్దేశించేది మూడవది (ధన) కాగా, ధ్యాన నిమగ్నులై సద్గురు మహరాజునే ఆత్మలో ప్రతిష్ఠించుకొన ప్రేరేపించేది నాల్గవది (ఆత్మ). ఈ చతుర్విధ సేవలు ప్రతి సత్సంగి[7] యొక్క విద్యుక్త ధర్మమని పాఠకులు జ్ఞాపకముంచుకొనవలసివుంది.

ఆ విధంగా సామిజీ మహరాజ్ అభిమానాన్ని చూరగొని హుజూర్ మహరాజ్ అనే నామాంతరంతో, రెండవ సద్గురు మహారాజుగ బాధ్యతలను స్వీకరించాడు సాలిగ్‌రామ్ ఈయన నాయకత్వంలోనే సత్‌సంగ్ విస్తృతమైన ప్రచారాన్ని పొంది సత్యత్వాన్ని పెంపొందించుకోగలిగింది. 'ప్రేమపత్ర' అనే ప్రతికను స్థాపించి, తద్వారా తన బోధలను మొదట ప్రచురించి, ఆ పిదప వానినే 'ప్రేమ పత్ర' అనే పేరుతోనే ఆరు సంపుటాలుగ సంకలించాడు. 'ప్రేమబాణి' అనబడే నాలుగు సంపుటాలు కూడ ఆయన ప్రసంగ ప్రచురణలే. 'రాధాసామి మత్ ప్రకాశ్ అత్యంత ప్రాముఖ్యమైన సిద్ధాంత ప్రకటనా గ్రంథం కూడ హుజూర్ సద్గురు మహరాజ్ యొక్క రచనలే

ఈయన మహత్క్రియలు చేసినట్లు కూడ చెప్పబడింది. కుష్ఠు వ్యాధితో బాధపడుతున్న ఒక సత్‌సంగి భార్య హుజూర్ మహరాజ్‌ను సమీపించి తన

7 Ibid p 40.

భర్త వ్యాధిని స్వస్థత పరచవలసిందిగా మనవి చేసిందని, ఆ మీదట హుజూర్ మహరాజ్ రాబోయే ఆదివారం మహరాజ్ స్నానం చేసిన నీటిని తీసికొని వెళ్ళి తన భర్తకు స్నానం చేయించవలసిందిగా సూచించాడని, అలా చేసిన మీదట కుష్ఠు వ్యాధి మటుమాయమైందని ఒక కథనం వ్యాపించివుంది.[8] ఈ గురు మహరాజ్ 1898 లో పరమపదించిన మీదట, పండిత బ్రహ్మశంకరమిశ్ర 'పరమ గురు మహరాజ్ సాహెబ్'అనే పేరుతో మూడవ గురువుగా 1898లో బాధ్యతలను స్వీకరించాడు.

**3. పండిత బ్రహ్మ శంకర మిశ్ర మహరాజ్ :**

సత్సంగ్ కార్యకలాపాలు విస్తృతం కావడంతో, కార్యక్రమాలు, సభ్యత్వం పెరగడంతో కార్య నిర్వాహణ కవసరమైన సదుపాయాలు కలిగించే ప్రయత్నంలో భాగంగా, 1902 లో 'కేంద్ర కార్య నిర్వహణా సభ'ను పరమ గురు మహారాజ్ స్థాపించాడు ఆ తరువాత రెండు సంవత్సరాలకు రాధసామి ట్రస్ట్ ఏర్పాటై ఆస్తుల వ్యవహారాన్ని పర్యవేక్షింప ప్రారంభించింది. పాఠశాలను. చిన్న చిన్న కర్మాగారాలు స్థాపించాలని పరమగురు మహారాజు ఆశించాడు గాని, 1907 లోనే మరణించడంవల్ల ఆ కార్యక్రమాలు అలా కార్యక్రమాలుగానే మిగిలిపోయాయి. ఈయన హయాం-లోనే సత్సంగ్ కేంద్ర కార్యాలయం అలహాబాద్‌కు మారి, తిరిగి తన వుద్యోగ విరమణానంతరం ఆగ్రాకు చేరింది.[9] ఈయన మరణానంతరం శ్రీకాంతప్రసాద్ సిన్హా అనబడే న్యాయవాది 'పరమగురు సర్కార్ సాహెబ్' అనే పేరుతో నాల్గవ గురువుగా బాధ్యతల గైకొన్నాడు.

**4. శ్రీకాంత్ ప్రసాద్ సిన్హా మహరాజ్ :**

అయితే, ఈ 'పరమగురు సర్కార్ సాహెబ్' ఎన్నిక వివాదగ్రస్తంగా తయారై, మొత్తం నూట పదహారు శాఖల్లో, నూట పదకొండు శాఖలు ఆయన్ని సత్సంగ్ యొక్క నాల్గవ గురువుగా అంగీకరించినప్పటికీ, కార్య నిర్వహణా

8. Ibid p 63.

9. Khushwant Singh : Gurus Godman and good people p 47.

బాధ్యతలను పర్యవేక్షిస్తున్న కేంద్రసభలో అధిక సంఖ్యాకులు ఆయన్ని గురువుగా గుర్తింప నిరాకరించారు. ఆ కారణంగా మొదట ముగ్గురు గురుమహారాజులు సమాధులున్న పవిత్రస్థలంలో ప్రవేశంకాని, వాని దర్శనంకాని, 'పరమగురు సర్కార్ సాహెబ్'కు గాని, ఆయన్ని బలపరిచేవారికి గాని దుర్భరమైంది. ఎందు కంటే, వానిని అజమాయిషీ చేసే కేంద్ర కమిటీ ఈయనను వ్యతిరేకించింది గనుక, రాధాసామి సత్సంగ్ రెండుగ చీలిపోక తప్పని పరిస్థితి ఏర్పడింది. అందువల్ల తన పూర్వీకుల నివాస స్థలమైన ఘజపూర్, సర్కార్ సాహెబ్‌కు, ఆయన సద్గురుగా అంగీకరించిన వారికి కేంద్ర స్థానమైంది. ఈ ఉభయ పక్షాల్లో సమన్వయాన్ని సాధించడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కాగా 1910లో ఘజ పూర్ సత్‌సంగ్ శాఖ తమదైన ఒక చట్టాన్ని నిర్మించుకొని, రాధాసామి సత్‌సంగ్ సభగా రూపొందింది. చరిత్రలో ఈ శాఖ 'రాధాసామి సత్‌సంగ్ దయాల్‌బాగ్'గా రెండోది 'రాధాసామి సత్సంగ్ సామిబాగ్' గాను స్థిరపడిపోయాయి. ఇది మొదటి చీలిక. కాగా రాధాసామి సత్సంగ్ దయాల్‌బాగ్ విభాగాన్ని అలా వుంచి ప్రస్తుతం రాధాసామి సత్‌సంగ్ సామిబాగ్ చరిత్రను క్లుప్తంగా పరిశీలించడం అవసరం.

**రాధాసామి సత్‌సంగ్ సామిబాగ్ ఆగ్రా :**

సర్కార్ సాహెబ్ అనుచరులను, వారు బలపరుస్తున్న శాఖల యొక్క స్వాధికారాన్ని కాదని, కేంద్ర కార్యనిర్వాహక సభ మూడవ పరమ గురు మహరాజ్ సాహెబ్ సోదరిని వారసురాలిగ గుర్తించింది. ఆమె పేరు బౌజిమ మహరాజ్ అయితే ఆమె వృద్ధాప్యంచేత త్వరలోనే మరణించినందువల్ల రాధాసామి సత్సంగ్ సామిజి బాగ్ యొక్క గురుమహరాజ్‌గ ఎంతోకాలం కొనసాగలేక పోయింది. ఆ పిదప సత్‌సంగ్ రాయ్ సాహెబ్ మాధవ్ ప్రసాద్ సిన్హాను సామి బాగ్ యొక్క సద్గురు మహారాజుగ నియమించుకొన్నారు. ఈయన ప్రథమగురు మహరాజ్ 'సామిజి' యొక్క సోదరికి మనుమడు. ఈ అయిదవ సద్గురు పేరు బాబుజి మహరాజ్. 1919 వరకు ప్రభుత్వోద్యోగిగావుండి, ఉద్యోగ విరమణానంతరం తన పూర్తికాలాన్ని సామిబాగ్ సత్‌సంగ్ అభివృద్ధికై వెచ్చించాడు. ఈయన నాయకత్వంలో సామిబాగ్ సత్‌సంగ్ కొంత పురోగతిని సాధించింది. అధిక సంఖ్యలో అనేకులు ఈ సామిబాగ్ సత్‌సంగ్ సభ్యులు కావడానికి

ప్రేరేపించిన ఆయన ఉపన్యాస పరంపర అనేక సంపుటాలుగ సంకలించబడి వెలువరింపబడ్డాయి.[10]

బాబూజి మహరాజ్ ఆయన వారసుణ్ణి నియమించకుండగనే 1949 లో మరణించాడు. అయినా, సామిబాగ్ సత్సంగ్ తమను నడిపించే గురువు సజీవుడై వున్నాడని ఆయన ప్రత్యక్షత కోసం నిరీక్షించారు. సర్వోన్నతం, సర్వోత్కృష్టం, సర్వశక్తి సమన్వితమైన ఆదిశక్తి నుండి ప్రథమ గురువుకు సంక్రమించిన ఆత్మనాద శక్తితో ఆయన అదృశ్యంగావుండి కూడ నడిపిస్తూన్నాడని వారు విశ్వసించి, తాత్కాలికంగా, అంటే తమకు మరొక గురువు ప్రత్యక్షమయ్యే వరకు వారిలో ఆధ్యాత్మిక జీవితానుభవం గల కొందరికి ప్రత్యేక సదుపాయాన్ని కలిగించుట ద్వారా, సామిబాగ్ సత్సింగ్‌లో ప్రవేశపెట్టే సంస్కారాన్ని నిర్వహింప వీలుకలిగించారు.

సాంఘిక కార్యక్రమాలంటూ వీరికేమీ లేకపోయినప్పటికీ, మహాభవన నిర్మాణాన్ని ఈ భాగం చేపట్టింది. ప్రథమ సద్గురు సామిజీ మహరాజ్ అస్థికలున్న పవిత్రస్థలమే వీరి కేంద్రం. ఈ మహాభవన నిర్మాణానికి మూడవ సంగ్ సద్గురు మహారాజ్‌సాహెబ్ 1904 లో పునాదు లెత్తాడు ఆయన మరణానంతరం నిర్మాణ కార్యక్రమానికి అంతరాయం కలిగినప్పటికి 1923 నుండి బాబూజి మహరాజ్ అనుజ్ఞ ప్రకారం నిర్మాణం ప్రారంభమైంది. నిరాటంకంగా నెమ్మదిగా సాగుతున్న ఈ భవన నిర్మాణం ఇప్పటికొక అంతస్తు పనిని ముగించి, మిగిలిన పనిని కొనసాగిస్తున్నది. ముఖ్యంగా అరువది ఎనిమిది అడుగుల చచ్చౌకంతో నిర్మితమౌతున్న ముఖ్యభవనం, హాలునకు నలువైపులు పదునైదడుగుల వెడల్పు గల విశాల వరండాలున్నాయి దీనిని ఆనుకొని, యాబది అయిదడుగుల మేరకు విస్తరించిన పాలరాయి నిర్మాణంకల వేదిక ఉన్నది. పైభాగం అర్ధ గోళాకారంగా

10. See **S. D Maheswari** *Teachings of Radhsoami Faith Based on Babuji's Discourses* **Agra, Radhasoami Satsang Soamibagh** 1960, **and Myron H. Philips** *notes on Discourses by Babuji Maharaj on the Radhasoami Faith* **Agra, Radhasoami Satsang Soamibagh** 1947.

బంగారు (పూతతో) నిర్మితమౌతున్నది. మొత్తం సమాధి నూటతొంబై మూడు అడుగుల ఎత్తు ఉంటుంది, ఉపయోగింపబడుతున్న పాలరాయి విభిన్న రంగు లీనుతూ ప్రేక్షకుల దృష్టిని ఆకట్టుకొంటుంది. వేదికపైన వుండే ముఖ్యభవనంలో గ్యాలరీ లేర్పాటై బైటవారికి వరండాలుగా, లోపలివారికి బాల్కనీలుగా కనిపిస్తాయి.[11] ఈ మహాభవన నిర్మాణం పూర్తికావడానికి రెండువందల సంవత్సరాలు పడు తుందని అంచనా. అంతకాలం పట్టడానికి ఒక ముఖ్యకారణం నిధులకొరత. కేవలం సత్ సంగీలిచ్చే విరాళాలతోనే భవనం నిర్మింపబడవలసి వున్నందువల్ల కొంత విస్తృతం, వ్యయభరితమైన భవనం ఆ షరతుపై పూర్తికావడానికి అంత దీర్ఘ కాలం పట్టడంలో ఆశ్చర్య పడవలసిందేమీ లేదు. అంతేగాక, ఇతర అనగా రాధా సత్‌సంగ్ దయాళ్‌బాగ్, ఆ పిదప ఏర్పడిన దాని ఉపశాఖలు-సత్‌సంగ్ శాఖలవారి విరాళాలను వీరు అంగీకరించే ప్రశ్నలేదు. ఎందుకంటే, ఈ మహాభవనం ప్రథమ సద్గురు సమాధిమీద నిర్మింపబడుతున్నందువల్ల పై శాఖల విరాళాలను అంగీకరిస్తే ఆ శాఖలకు కూడ ఈ మహా సమాధి భవనంలో ఆరాధించుకొనే హక్కును అంగీకరించినట్లు ఔతుందని సామిబాగ్ సత్‌సంగ్ భావించింది. పూర్తయిన నాడు నేటి ప్రపంచ సప్తవింతలకు మరొక వింత తోడు కాగలదని, ఆ భవన సౌందర్యంముందు తాజమహల్ వెలవెల పోవలసిందేనని వారి విశ్వాసం.

### దయాళ్‌బాగ్ రాధాసామి సత్‌సంగ్ యొక్క చరిత్ర :

### ఆనంద సరూప్ మహరాజ్

ముందు వివరించిన విధంగా ఘజపూర్‌ను కేంద్రం చేసికొని, రాధాసామి సత్‌సంగ్ సభగా ఏర్పడి తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్న పరమగురు సర్కార్ సాహెబ్ 1913లో మరణించడంతో 'ఆనంద సరూప్' ఆయనస్థానే సద్గురు మహారాజుగా ఎన్నుకోబడినాడు. ఆయనపేరు పరమగురు సాహెబ్జీ మహా రాజ్. ఈయన నియామకం కూడ వివాద గ్రస్తం కావలసిందేగాని, ఒకానొక ఉదంతం అట్టి ప్రమాదంనుండి ఈ విభాగాన్ని కాపాడిందని చెప్పాలి. ఈ శాఖకు చెందిన సత్ సంగీలు అనేకమంది ప్రథమ, ద్వితీయ సద్గురు మహారాజులైన

11. S. D. Maheswari, A brief discription of the Radha-Soami Faith, Delhi; Amrit Electric Press, 1960 pp. 23–31 Passion.

సామిజి మహరాజ్, హుజూర్ మహరాజుల అనుమతి ఈ సాహెబ్జీ మహరాజు కున్నదో లేదో తెలుసుకోగోరి ఒకానొకచోట సమావేశమై వున్నపుడు సాహెబ్జీ మహారాజ్ ప్రవేశించగనే ఆయనతో సమావేశమైనవారు ప్రథమ, ద్వితీయ సద్గురు మహారాజుల రూపాలను చూడగలిగినారని, అవి పై సద్గురు మహారాజుల అంగీకారానికి సూచనగా పరిగణించి, సాహెబ్జీ మహరాజ్‌ను సద్గురు మహరాజ్‌గ అంగీకరించినారని ఒక కథనం ప్రజా వినికిడిలో వుంది.[12] ఆ వెనువెంటనే ఆయన "అధ్యాత్మిక వారసత్వం సంపూర్ణ మహిమ ఘనతలతో నిర్విరామంగా కొనసాగుతున్నది. మీరు మీమీ గౌరవ మర్యాదలను చెల్లింప ప్రోత్సహించు చున్న"దని సాహెబ్జీ మహరాజ్ ప్రకటించినపుడు చేరిన జనవాహిని, ఆయనకు సాగిలపడి తమ గౌరవ మర్యాదలు చెల్లించారట.[13]

సాహెబ్జీ మహరాజ్ ఈ సత్సంగ్ సభకు చరాత్మకమైన నాయకత్వాన్ని ప్రసాదించాడు 1914 లో ఈ సత్సంగ్ కేంద్ర కార్యాలయాలను తిరిగి ఆగ్రాకు బదిలీ చేయ ప్రయత్నాలు జరిగాయి అంతకు ముందే నగరం వెలుపల వెలసిన "సామిబాగ్"ను ఆనుకొని వున్న స్థలాన్ని సేకరించి 1915 లో దయాళ్‌బాగ్ కాలనీ నెలకొల్పబడింది ఆ తరువాత రాధాసామి విద్యాసంస్థ 1917 లో స్థాపింపబడింది ఇదే క్రమక్రమంగా డిగ్రీ కళాశాలగా రూపొందింది. అదే సంవత్సరం అనేక కర్మాగారాలు వెలసాయి వినియోగదారులకు ఉపయోగపడగల దైనందిన వస్తు సామాగ్రి ఇక్కడే తయారౌతున్నది. 1931 లో అత్యంత ఆధునిక వనరులతో వైద్యశాల ఏర్పాటు చేయబడింది. 1930 లో భారత దేశంలోనే శ్రేష్ఠమైందని పేరొందిన పాడిపరిశ్రమ ప్రారంభమైంది. ఆవిధంగానే కుప్పతెప్పలుగా సాహిత్యం వెల్లివిరిసింది. 1936 నాటికే ఈ విభాగం బ్రిటిష్ ప్రభుత్వ దృష్టిని ఆకర్షింపగలిగింది.

**మెహతాజి సాహెబ్ మహరాజ్ :**

1921 నాటికే సాహెబ్జీ మహరాజ్ తన వారసునిగా మెహతాజి సాహెబ్ కొనసాగాలని నిర్ణయించాడు. మెహతాజి సాహెబ్ ఇంజనీయరై వుండి, పంజాబు

12 Souvenir op.cit. p. 173

13. Ibid. p. 174.

ప్రభుత్వంలో అత్యంత ఉన్నతమైన పదవిని అధిష్టించిన వ్యక్తి. ఈ సంప్రదాయానికి ఆరవ సద్గురువుగా 1937 లో మెహతాజి సాహెబ్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. సమర్థనీయమైన ఆయన నాయకత్వంలో దయాళ్‌బాగ్ రాధాసామి సత్సంగ్ సభ మూడుపూవులారుకాయలై ఫలించింది. అంతకుముందు స్థాపింపబడిన అన్ని సేవావిభాగాలు మరింత విస్తరించాయి. ఇట్టి సాంఘిక కార్యకలాపాలే గాక, సత్సంగ్ సభ యొక్క మత కార్యక్రమాలు కూడ ఈయన నాయకత్వంలో విస్తరించాయి. మొత్తం 600 శాఖలు, జిల్లా శాఖలు, వీటిని అజమాయిషీ చేస్తూ వీరు రిజిష్టరు కాబడిన ప్రాదేశిక సత్సంగ్ కార్యనిర్వాహక సభలు ఏర్పడి, వాని వాని మత కార్యక్రమాలను తమ సొంత భవనాలలోనే నిర్వహించుకొంటున్నారు. ఢిల్లీలో ఒక సత్సంగ్ కాలనీ రూపొందింది. భారతదేశంలో మిగిలిన రాష్ట్రాల్లో కూడా కాలనీల స్థాపనకై ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. 1917 లో స్థాపింపబడిన కళాశాల సర్వసంపూర్ణ కళాశాలగా మాత్రమేగాక స్వయం ప్రతిపత్తిగల సంస్థగా రూపొందడం విశేషం. అంతేగాక, స్త్రీలకొరకై కళాశాల ఏర్పాటైంది. మరియు బహుళార్థక పాఠశాల కొనసాగుతున్నది. ఈ సంస్థల్లో ఆధునికమైన సామగ్రి అందుబాటులో వుంది.[14] దురదృష్టవశాత్తు ఈ దయాళ్‌బాగ్ రాధాసామి సత్‌సంగ్ మరొక చీలికకు గురికావలసి వచ్చింది. ఇలా చీలిన విభాగమే రాధాసామి సత్‌సంగ్ బియాస్‌గా స్థిరపడింది. ఈ విభాగం యొక్క పూర్వాపరాలను కూడ మనం గమనింపవలసి వున్నది.

**బియాస్ రాధాసామి సత్‌సంగ్ క్లుప్తచరిత్ర :**

**బాబా జైమాల్‌సింగ్ మహరాజ్ :**

ఈ చీలికకు మూలపురుషుడు 1839 లో పంజాబులో పుట్టిన బాబా జైమాల్‌సింగ్. ఆతని బాల్య వయస్సులో సిక్కుల మతగ్రంథమైన గ్రంథ సాహెబ్‌ను పఠిస్తూండగ మనుష్యునిలోనే అంతర్లీనంగా వుండే పంచ మహా మధుర నాదస్వరాన్ని సూక్ష్మ శిక్షణానంతరం వినవచ్చుననే విషయాన్ని

14. For more details refer to *A Brief Description of the Origin Early History and Development of the Colony and its Institutions.* **Dayalbagh Radhasoami Satsang** 1964.

సూచించే వచన భాగాలు జైమాల్‌సింగ్ దృష్టిని ఆకర్షించాయి. ఈ పంచ మహా మధుర నాదాలను గూర్చిన వివరణకోసం అతడు తన సమాజ సభ్యులను, నాయకులను అడిగి వానిని వివరింపలేనివారి అశక్తతకు విసిగి, నిరాశా నిస్పృహలతో కొంత కాలాన్ని గడిపి, ఆ పిదప వానిని వివరింపగల గురువుకోసం అన్వేషణ ప్రారంభించాడు. అయిదారు నెలల సంచారం తరువాత ఆకస్మికంగా తాను కలిసిన ఒక సాధువు ద్వారా, ఆగ్రాలో వున్న ఒక మహాత్ముడు ఈ పంచమహా మధుర నాదాలను వివరింప సమర్థుడని తెలుసుకొని, సామిజి మహరాజ్‌ను దర్శించాడు. సామిజి మహరాజ్ రాధాసామి సత్‌సంగ్ యొక్క మూలస్థాపకుడనే విషయం పాఠకులకు గుర్తుండే వుంటుంది. ఈ పంచ మహామధుర నాదాలను గూర్చిన బోధ రాధాసామి సత్‌సంగ్ యొక్క మూల బోధలో ఒకటైనందువల్ల సామిజి మహరాజ్ ఆ పంచ మహామధుర నాదాలైన నిరంజన, ఓమ్, ఆధారంగ్, సోహాంగ్, సత్-ల గూర్చి జైమాల్ సింగు కుపదేశించి, ఆధ్యాత్మిక పారంపర్యం లోనికి ప్రవేశపెట్టాడు. జైమాల్ సింగ్ ఇంకా యువకుడైనందువల్ల తన జీవన భృతి కోసం ఏదో ఒక ఉద్యోగం చేయడం అవసరమని సామిజి మహరాజ్ ఉద్బోధించినందువల్ల, జైమాల్ సింగ్ పటాలంలో చేరి దాదాపు ముప్పయి అయిదు సంవత్సరాలు కొలువుచేసాడు. చేసేది మిలటరీ కొలువైనప్పటికి జైమాల్ సింగ్ గురూపదేశమైన పంచ మహామధురనాద సంస్మరణను మాత్రం నిత్యం కొనసాగిస్తూ, తీరుబడి సమయాల్లో అతడు గావించే బోధలను విన్నవారిలో ఇష్టపడినవారిని సత్‌సంగ్‌లోనికి ప్రవేశపెడుతూ వున్నాడు. తన మిలటరీ ఉద్యోగ విరమణానంతరం, 1891 లో అమృతసర్‌కు సుమారు ఇరవై అయిదు మైళ్ళ దూరంలో వున్న బియాస్ నది యొక్క పశ్చిమ తీరంపై ఈయన రాధాసామి సత్‌సింగ్ యొక్క మరో శాఖను స్థాపించాడు.[15] ఇది రాధాసామి సత్‌సంగ్ బియాస్‌గా చరిత్రలో స్థిరపడింది.

అయితే జైమాల్‌సింగ్ ఆగ్రాలోని రాధాసామి సత్‌సింగ్ యొక్క అనుమతి లేకుండ సారాబచన్‌కు కొన్ని క్రొత్తసవరణలు చేయడంవల్ల ఆ సవరణలు సామిబాగ్ సత్‌సింగ్‌కు అంగీకారం కానందువల్ల వీరుభయుల మధ్య ఏర్పడిన

15. See Kather Wason *The Living Master*, Delhi: National Printing Works 1966 pp. 59–70.

అగాధం మరింత విస్తృతమైన కారణంగా రాధాసామి సత్సంగ్ బియాస్ మూడవ శాఖ స్థిరపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. అంటే, ఇప్పటికి మూడు శాఖలైనాయి. ఒకటి రాధాసామి సత్సంగ్ సామిబాగ్, రెండవది రాధాసామి సత్సంగ్ దయాళ్‌బాగ్, మూడవది రాధాసామి సత్సంగ్ బియాస్.

ఇలా వుండగా సర్దార్ సవాన్‌సింగ్‌ను తన వారసునిగా ఏర్పరచి 1908 లో జైమాల్‌సింగ్ మరణించాడు.

సర్దార్ సవాన్‌సింగ్ మహరాజ్ :

సవాన్‌సింగ్ మిలటరీలో గణనీయమైన సేవచేస్తూ తగిన గురువు కోసం అన్వేషిస్తూ వుండగ ఒకానొకనాడు, జైమాల్‌సింగ్ పర్యటనలో సవాన్‌సింగ్ మకాం చేస్తున్న గ్రామాన్ని దర్శించడం, ఆ సమయంలో యువకుడైన మిలటరీ ఉద్యోగిగా సవాన్‌సింగ్‌ను చూచి, "ఆ వ్యక్తిని మనం మన సత్సంగ్ లోనికి దీక్ష నీయ వచ్చినా"మని ప్రక్కనే వున్న అనుచరునితో చెప్పడం అంతా త్రుటి కాలంలో కాకతాళీయంగా జరిగిపోయింది. "ఆ ఉద్యోగి తీవిగా మీ వైపు కన్నెత్తి అయినా చూడకుండా వెళ్ళిపోతే అతనికి మన సత్సంగిగా దీక్ష నివ్వడం ఎలా జరుగుతుందని ప్రశ్నించిన అనుచరునితో, జైమాల్‌సింగ్ నాల్గవ రోజు అతడు మన దగ్గరకు వస్తాడని సూచించాడట. అలానే సవాన్‌సింగ్ నాల్గవ రోజు మిలటరీ దుస్తుల్లో జైమాల్‌సింగును దర్శించడం, ఆ పిదప ఆయన మరణం వరకు అవకాశం దొరికినపుడెల్లా గురుపాద సన్నిధిలో గడపడం జరిగింది. ఈ సవాన్‌సింగ్ ఆ తరువాత గ్రేట్ మాస్టర్‌గా రాధాసామి సత్సంగ్ బియాస్ యొక్క గౌరవ మర్యాదలను పొందగలిగినాడు.

సమర్థనీయమైన ఈయన నాయకత్వంలోనే రాధాసామి సత్సంగ్ బియాస్ గొప్ప అభివృద్ధిని సాధించింది. తన గురువు మరణానంతరం గురువులో అంతర్లీనంగా వున్న దైవాంశను సవాన్‌సింగ్ గుర్తించినట్లు తెలుస్తున్నది.[16] 1911 లో మిలటరీ ఉద్యోగ విరమణానంతరం రాధాసామి సత్సంగ్ బియాస్‌లోనే తన మకాము

16. **Ibid. p. 77.**

నేర్పరచుకొని, ఆ ప్రాంతం అంతటికి డేరాబాబా జైమాల్‌సింగ్ అనే నామకరణాన్ని ప్రతిష్ఠించాడు సవాన్‌సింగ్ సద్గురు మహరాజ్. గట్టు మీద చిన్న చిన్న గుడిసెలతో ప్రారంభమైన ఈ బియాస్, ఈయన నాయకత్వంలో దశల వారీగా అభివృద్ధి చెంది వికసిస్తున్న ఆధ్యాత్మిక సమాజంగా రూపొందింది ఒకవైపు ఈ సమాజాన్ని అభివృద్ధి పరుస్తూనే మరోవైపు ఉత్తర ఇండియా పయనించి అనేకమైన శాఖలను స్థాపింపగలిగాడు. విదేశాలనుంచి కూడ పెక్కుమంది శిష్యవర్గం ఏర్పడి, ఆయన మరణానికి ముందే ఈ విదేశీ శాఖలు ఆయన్నే తమ గురువుగా ప్రకటించు కొన్నారు[17] ఆయన అనుభవాలు, బోధలు ఆయనే వ్రాసిన గ్రంథంలో నిక్షిప్తమై వున్నాయి[18] మహత్క్రియలకు రాధాసామి సత్‌సంగ్ సంప్రదాయమంతగా విలువనీయక పోయినప్పటికి, ఈ శాఖకు చెందిన గురు మహారాలకు గూడ కొన్ని మహత్క్రియల నాపాదించడం జరిగింది.[19]

గ్రేట్ మాస్టరుగా ప్రసిద్ధి చెందిన సవాన్‌సింగ్‌జి మహరాజ్ తన వారసునిగ 1948 లో సర్దార్ బహదూర్ జగత్‌సింగ్‌జీని నియమించాడు. ఈయన శిష్యవర్గం అంతటిలో వయసులో పెద్దవాడై 1909 లోనే బియాస్ సంగ్ సభ్యత్వాన్ని స్వీకరించిన వ్యక్తి 1943 లో పదవీవిరమణ చేసి, బియాస్‌లో దేరాబాబా జైమాల్‌సింగ్‌కు తరలి వచ్చేంతవరకు ఈయన పంజాబ్‌లోని వ్యవసాయ కళాశాలలో ఆచార్యునిగా పని చేశాడు. ఆయన ఆధ్యాత్మిక జీవన విధానంచే ప్రభావితులైన ఆయన శిష్యులు అనేకమంది బియాస్ సంగ్ సభ్యత్వాన్ని స్వీకరించారు ఆయన సద్గురు మహారాజ్‌గా నియమింపబడడానికి అయిదు సంవత్సరాల ముందు నుండి తీవ్రమైన ధ్యానంలోనే జీవితాన్ని గడిపిన వ్యక్తి. కేవలం మూడున్నర సంవత్సరాలే ఆయన సత్‌గురు మహరాజుగా బాధ్యతల నిర్వహించి నప్పటికి, దాదాపు ఇరవై ఆరువేల మందిని సత్‌సంగ్ సహవాసంలోనికి నడిపించి నట్లు పేర్కొనబడింది.[20]

17. Ibid. p. 78.
18. See Maharaj Soami Singh, Spiritual Gems, **Beas: Radhasoami Satsang beas** 1948.
19. See Katherine Wason *op.cit.* pp. 250–268.
20. *Ibid.* p. 81 **for his speeches and experience refer to Sarder Jagat Singh**, *The Science of the Soul*, **Beas; the Radhasoami Satsang Beas** 1951.

ప్రస్తుతం ఈ విభాగానికి సద్గురు మహారాజుగా వున్న వ్యక్తి ఇంకా యువకుడుగా వున్నప్పుడే ఈ విభాగ మహారాజుగా కొనసాగగల అర్హతగల వ్యక్తిగా గుర్తింపబడినట్లు తెలుస్తున్నది. గ్రేట్ మాస్టర్ తన జీవితాస్తమయ సమయంలో ఆయన కత్యంత సన్నిహితులైన ఇద్దరు శిష్యులు 'తమ వారసునిగ ఎవరిని నియమిస్తా'రని ప్రశ్నించినపుడు, సంభాషణాంశాన్ని కొంతకాలంపాటు మార్చిన పిదప, అపుడే గదిలో ప్రవేశిస్తున్న తన మనుమడైన చరణ్‌సింగ్‌ను చూపి, 'అడుగో, ఆ పచ్చు వ్యక్తి' అని సూచించాడట అయితే ఈ విషయాన్ని తాను, బహుకాలం ఎవరికీ తెలియనీయలేదు. కాని, ఆ ఇరువురు శిష్యులు 'చరణ్‌సింగ్' వయసులో ఎదుగుతూవుంటే ఆయనలో నిగూఢంగా వున్న ఆధ్యాత్మిక తృష్ణను గమనించగలిగారని తెలుస్తున్నది.

చరణ్‌సింగ్ మహారాజ్ :

తన మరణానికి ముందు జగత్‌సింగు సద్గురు మహారాజ్ చరణ్‌సింగ్‌ను తన వారసునిగా నియమించాడు. ఇది 1951 లో జరిగింది. అప్పటికి చరణ్‌సింగ్ న్యాయశాస్త్రంలో పట్టభద్రుడై న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం ఈయన నాయకత్వంలోనే ఈ విభాగం విస్తారంగా ప్రజాదృష్టిని ఆకర్షిస్తున్నది. అనేక నూతన భవనాలు ఏర్పడినై. వానిలో 'ఆరాధనా మందిరం' ఎంతో ప్రాముఖ్యమైంది. ఈ భవనం ఒక పెద్ద ఇంగ్లీషు అక్షరమైన 'T' ఆకారంలో వుండి పాలరాతిమెట్లు, స్థంభాలతో అష్టముఖంగా అమర్చబడిన కిటికీలతో చూడ ముచ్చటగ ఆకర్షణీయంగా వుంటుంది. భవనానికి పైన బంగారు తాపడంతో ఏడు అర్ధగోళాకారపు గోపురాలు, మధ్యభాగాన్ని మకుటాయమానంగా ఆవరిస్తూవున్న పెద్ద గోపురం వున్నాయి.[21]

చరణ్‌సింగ్ మహారాజ్ జీ, స్వదేశ విదేశాలలో విస్తృతంగా ప్రయాణాలు కొనసాగించి అధిక సంఖ్యలో హాజరైన సభల్లో ఉపన్యసించి అనేకులను బియాస్ సత్‌సంగ్ సభ్యులుగా దీక్షను ప్రసాదించాడు. ఆయన సంచరించి, శిష్యవర్గాన్ని సంపాదించిన దేశాలు ఉత్తర, దక్షిణ అమెరికాలు, యూరప్, ఆఫ్రికా, మధ్య

21. **Katherine Wason** *op.cit.* **p.** 53.

ప్రాచ్యాలు, ఇంగ్లాండు ఉత్తర భారత భాషల్లో అనేక గ్రంథాలను ఈయన ప్రచురించాడు.[22]

చరణ్‌సింగ్ సద్గురు మహారాజ్ అమెరికా యాత్ర విస్తారంగా ఫలించింది. అధిక సంఖ్యలో ఆ సత్‌సంగ్ సభ్యులు కావటానికి అనేకులు ముందుకు వచ్చారు. ఇందుకు ప్రధాన సాధనం గ్రేట్ మాస్టర్‌తో సన్నిహిత సంబంధం గల కేర్‌సింగ్ సన్మన్. ముందు కెనడాలో, ఆ పిదప అమెరికాలో ఉద్యోగించినందువల్ల ఆయన అనేకులను ఈ విభాగానికి పరిచయం చేయడం, క్రమక్రమంగా ప్రజలు ఆకర్షితులు కావడం జరిగింది. రాధాసామి సత్‌సంగ్ నియమావళి ప్రకారం ఎవరైనా దీక్ష గోరు వారు దరఖాస్తు చేయడం, అది అంగీకరింపబడటం వంటి తతంగం వున్నందువల్ల ప్రవేశాన్ని కోరే దూరదేశీయులు అనేక ఇబ్బందుల్ని ఎదుర్కోవలసివస్తున్నది. ఆ కారణంగా చరణ్‌సింగ్ సద్గురు మహరాజ్ తన తాతగారైన సవాన్‌సింగ్ మహరాజ్‌వలె తన ప్రతినిధులను ఏర్పరచి, వారిద్వారా తనతో ముందు ప్రమేయం లేకుండగనే దీక్షను ప్రసాదించే ఏర్పాటు కొనసాగించారు.

తన తాతగారైన సవాన్‌సింగ్ మహరాజ్ అమెరికాలో తన ప్రతినిధులుగా బ్రాక్స్ దంపతులను ఏర్పరచగా వారు విస్తృతంగా పయనించి, కోరినవారికి 'నామ్' దీక్షను ప్రసాదించారు. ఆ పద్ధతినే చరణ్‌సింగ్ మహరాజ్ అవలంబించి ఈ దిగువ ఏర్పాటు చేశాడు.

| ప్రతినిధి | కేంద్రం | అజమాయిషీ చేయవలసిన ప్రదేశం |
|---|---|---|
| 1. జేమ్స్ రెఫ్లొగల్ | షికాగో | అమెరికాలోని తూర్పు రాష్ట్రాలు |
| 2. కల్నల్ ఇ.ఆర్. బెర్గ్ | మినియా పోలీస్ | మధ్య, దక్షిణ, పశ్చిమ అమెరికా రాష్ట్రాలు 1960 |
| 3. హార్వే మెయర్స్ | ఉత్తరమెరికా | అమెరికా సంగత్ పర్యవేక్షకుడు |
| 4. హెన్రీ వీక్లె | వాషింగ్‌టన్ డి. సి. | ఉత్తర, తూర్పు రాష్ట్రాలు 1964 |
| 5. క్లాడె డ్యూయెల్ | సెంట్ పీటర్స్ బర్గ్ (ఫ్లోరిడా) | దక్షిణ, తూర్పు రాష్ట్రాలు 1964 |

22. *Maharaj Charan Singh : Spiritual Discourse; Divine Light; The Path; Light on Sant Mat Master Answers; All published by Radhasvami Satsang Beas.*

పై సమాచారం ప్రకారం బియాస్‌లోని రాధాసామి సత్‌సంగ్ విభాగం ఇతర దేశాల సంగతి ఎలావున్నా ఉత్తర అమెరికా అంతట వ్యాపించి వున్నదనే విషయం స్పష్టమౌతున్నది. 1970 లో తన ప్రపంచ పర్యటనలో భాగంగా చరణ్‌సింగ్ సద్గురు మహరాజ్ అమెరికాను దర్శించి రెండు మాసాలు అయా పట్టణాలలో తన విభాగ సభ్యులతో ప్రసంగించి వారిని మరింత స్థిరపరచడం జరిగింది. అమెరికాలోని ప్రజలు లౌకికరీత్యా వారు సాధించిన అభివృద్ధి సంతోషాన్నిగాని,ఆధ్యాత్మిక సంతృప్తినిగాని ఇవ్వడంలేదని గ్రహించారు. వారు సంప్రదాయకంగా నమ్మిన క్రైస్తవ మతంలో కూడ స్థిర విశ్వాసం లేనందువల్ల అట్టి సంప్రదాయ మత విశ్వాసం నుండి బయటపడాలని ప్రయత్నిస్తున్నారట. "బైబిల్ నుపయోగించి బోధించి వారిని ఆకర్షించడం సులభం" అని తన ప్రయాణ విజయాన్ని గూర్చి మెచ్చుకొంటూ ప్రకటించాడు [28] చరణ్‌సింగ్ సద్గురు మహారాజ్ ఆధ్యాత్మిక సాధన సంపత్తి సముపార్జనకు, విశాల పాండిత్య ప్రకర్షకు, చరాత్మక ప్రేరేపణకు ప్రోత్సాహాత్మకమైన ఉపన్యాసాలకు పెట్టింది పేరు. తనకు తన కుటుంబపోషణకు స్వయంకృషిపై ఆధారపడుటేగాని, సత్‌సంగ్ విరాళాలనుగాని, కానుకలనుగాని అంగీకరింపలేదు 1957 లో రాధాసామి సత్‌సంగ్ బియాస్ సొసైటీ చట్టంక్రింద ప్రభుత్వ దస్తావేజుల్లో రిజిష్టరు అయ్యేపుడు తన పేరుమీదగా వున్న సమస్త ఆస్తి పాస్తులను సమాజానికి ధారాదత్తం చేసిన నిస్వార్థ సేవకుడు మహారాజ్.

అయితే, 1951 లో చరణ్‌సింగ్ సద్గురు మహారాజు రాధాసామి సత్‌సంగ్ బియాస్ యొక్క బాధ్యతలను స్వీకరిస్తున్నపుడు ఆ ఏర్పాటుకు సమ్మతింపక కృపాలసింగ్ రూహని సత్‌సంగ్‌ను ఏర్పాటు చేస్తూ, ఇది తన గురువైన సవాన్ సింగ్ సద్గురు మహరాజ్ ఆనజ్ఞ ప్రకారం జరిగిందని ప్రకటించాడు. సవాన్ సింగు సద్గురు మహరాజ్ ఒకవైపు తన మనుమని సూచిస్తూ, మరోవైపు కృపాల సింగ్‌కు ఇట్టి సలహానిచ్చి వుంటాడా అని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. అయినా ఈ చీలికతో ప్రస్తుతం రాధాసామి సత్‌సంగ్ నాలుగు ముక్కలైంది.

28. **Specially see the Seva Trust** *R.S. Greetings* **Waukegan, Illi Devy Press June 1970 p. 29.**

రాధాసామి సత్సంగ్
1861

1910

రాధాసామి సత్సంగ్
సామిజీబాగ్

రాధాసామి సత్సంగ్
దయాళ్‌బాగ్

1951

రాధాసామి సత్సంగ్
రూహని

రాధాసామి సత్సంగ్
బియాస్

కృపాలసింగ్ మహారాజ్ :

ఇంకా యువకుడిగా వున్నపుడే తనకొక మంచి గురుసాన్నిధ్యానికి నడపించవలసిందిగా ప్రార్థించాడట కృపాలసింగ్. 1924 లో మొట్టమొదట బియాస్‌లో దేరా బాబా జైమాల్ సింగ్‌ను దర్శించి, తనలోనికి అపుడపుడు జ్యోతిః రశ్మి ప్రవేశిస్తున్నది ఈ గురు మహరాజు నుండేనని గ్రహించి తన గురువుగా అంగీకరించాడు. ఆ తరువాత వీరుభయుల మధ్య గురు శిష్య సంబంధం ప్రవర్థమానమైంది. 1951 లో తాను రాధాసామి సత్సంగ్ రూహనిని స్థాపించి నాయకత్వం వహించిన సందర్భాన్ని పురస్కరించుకొని కృపాల్‌సింగ్ :

> 1947 అక్టోబరు 12 వ తేదీ ఉదయం ఏడు గంటలకు ఆయన (గురు సవాన్‌సింగ్ సద్గురు మహారాజ్) నన్ను పిలిచారు. ఘనమైన వారి సన్నిధిలో నేను ప్రవేశించినపుడు 'నా విధులన్నిటిని, రెండు మినహా-పంచివేసాను. కాని దీక్షనివ్వడం, ఆధ్యాత్మిక సందేశాలు కావించే బాధ్యతను మాత్రం ఎవరికివ్వలేదు. ఈ పవిత్రమైన ఉద్యమం విస్తారి వికసించునట్లు ఆ బాధ్యతను నీకు అప్పగిస్తున్నాను'

అని దీవించారని ప్రకటించాడు.[24]

24. Kirpal Singh, *Hajpur Baba Sawar Singh ji Maharaj*, Delhi Kirpal Printing Press 1968 p. 11.

ఈ ఆజ్ఞ నెరవేర్చుకోసమే తానీ బాధ్యతలను నెరవేరుస్తున్నానని చెప్పిన కృపాలసింగ్ సుమారు 80 వేల మందిని తన అజమాయిషీలో వున్న రూహాని సంగ్‌లోనికి ప్రవేశపెట్టినట్లు గ్రంథస్థ ప్రమాణాలున్నాయి.[25] ఈ శాఖ మిగిలిన అన్ని శాఖల కన్న అధికంగా సాహిత్య ప్రచురణను చేపట్టింది. కృపాలసింగ్ తనకై తానే సుమారు ఇరవై పైచిలుకు గ్రంథాలను వ్రాసి ప్రచురించారు. పేరెన్నికగన్న ఆయన ప్రముఖ గ్రంథం "సర్కట్ సిద్ధాంత"-గురు మహారాజుల మార్గం. ఇది రెండువేల పుటలుగల రెండు సంపుటాలుగ ప్రచురణమైంది, 1958 లో. 1968 లో రెండు ప్రపంచ యాత్రలను కృపాలసింగ్ నిర్వహించారు. ఈయన అనుచరులు ఆఫ్రికా, యూరప్, కెనడా, అమెరికాలలో వున్నట్లు ప్రతీతి.

## రాధాసామి సత్‌సంగ్ తరపున గురు మహారాజ్‌లు గావించిన బోధలు :-

1861 లో స్థాపితమైన రాధాసామి సత్‌సంగ్ కాలపరిణామాలకు లోనై నాల్గు శాఖలుగ విడిపోయినా, వారి మూల విశ్వాసం గాని, ధ్యాన, ఆరాధనా విధానం గాని, బోధలు గాని, సాంఘిక సేవా విధానం గాని మౌలికంగా మార్పులకు గురి కాకపోవడం విశేషం కాకుంటే ఆయా సద్గురు మహరాజులు 'సారాబచన్'ను వ్యాఖ్యానించేపుడు స్వల్పంగా ఒకరి వ్యాఖ్యానం నుండి మరొకరు భేదించారు కాని మూలం నుండి మాత్రం కాదు. సత్‌సంగ్ శాఖలు గురుబచన్‌ను వేర్వేరుగా ఇంగ్లీషు లోనికి అనువదించుకొని వారి వారి సభల్లో ఆరాధనా సమయాల్లో ధ్యానం చేస్తూ వుంటారు. ఆధునిక మతోద్యమాలన్నిటిలో పారమార్థిక జీవన విధానానికి నైతిక సూత్రాలకు ఈ ఉద్యమం ఇచ్చినంత విలువను మరే వుద్యమం ఇవ్వలేదని అనేకాంశాల పరిశీలన అనంతరం ఈ గ్రంథకర్త అభిప్రాయపడుతున్నాడు. అనేక సంపుటాలలో విస్తరించి, అనుభవనీయులైన సద్గురు మహారాజుల వ్యాఖ్యానానికి గురై, లక్షలాది సభ్యుల ఆధ్యాత్మిక తృష్ణను తీరుస్తూ వున్న ఉద్యమ బోధల్ని రెండు మూడు పుటల్లో క్రోడీకరింప ప్రయత్నించడం సాహస కార్యమే ఔతుంది. అయినా పాఠకులకి బోధను పరిచయం చేసి, వారినే మిగిలిన వివరాలను స్వీయాధ్యయనంవల్ల గ్రహించవలసిందిగా కోరడమే ఈ రచయిత కర్తవ్యం.

25. Kirpal Singh, *Ruhami Satsang*, Delhi : Kirpal Printing Press 1970 p. 27.

వీరు ప్రకటించే బోధలు - నమ్మె విశ్వాసాన్నిబట్టి విశ్వంలో మూడు ముఖ్య భాగాలు లేదా ప్రదేశాలున్నవి. ప్రతి ముఖ్యలోకం లేదా ప్రదేశంలో తిరిగి ఆరు లోకాలున్నవి అన్నిటిలో సర్వోన్నతమైన ప్రదేశం నిర్మల చేతన్. ఈ ప్రదేశం స్పష్టం పవిత్రం. భౌతికం ఉండడానికే వీలులేనిది. పవిత్రమైన పారమార్థిక ప్రదేశం ఇది. రెండవది నిర్మలమాయ లేదా బ్రహ్మానంద లోకం. దీనిని వీరు పారమార్థిక భౌతికం అని పిలుస్తారు ఇందు భౌతికం ప్రవేశిస్తుంది. కాని నిష్కళంకమైన భౌతికం. ఇక మూడవది అధోలోకం. మలినమాయ లేదా పిండ లోకం. ఇది భౌతిక పారమార్థికం. ఇదొక కళంక లోకం. ఇక్కడే మానవకోటి జీవిస్తుంది.

నిర్మలచేతన్‌లో తిరిగి ఆరు భాగాలున్నవి. మొదటిది సర్వోత్కృష్టమైంది; 'రాధా సామి ధమ్.' ఇది కరుణాతీతుడైన రాధా సామి నివాసం. మిగిలిన అయిదు లోకాలు ఆగమ-ప్రవేశింపరాని చోటు, అలోకలోక-అదృశ్యలోకం, అనామిలోక-సత్యలోక, భన్వర్-గుఫలోక. రాధాసామి పరమ ధర్మాన్ని సాధించాలంటే, ఒక్కొక్క లోకంలో ప్రవేశించే అర్హతను సంపాదిస్తూ 'రాధాసామిధమ్'లో తుదకు చేరగలగాలి.

'నిర్మల మాయ' లేదా బ్రహ్మానందలోకంలో కూడ ఆరు విభాగాలున్నవి శూన్య, లేక త్రికుటిలోక, సహస్రదల్, విష్ణులోక, బ్రహ్మలోక, శివలోక. కరుణాళువైన రాధాసామిచే సృజింపబడిన ఆధ్యాత్మిక పాలకుడు పై ఆరు లోకాలలో ఒక్కొక్కదాన్ని రాధాసామికి జవాబుదారుడై పరిపాలిస్తూ వుంటాడు. అవతారాలుగ గుర్తింపబడినవారుగాని, దేవతలుగాని, పరిశుద్ధులుగాని తమ తమ అనుచరులను ఈ లోకంవరకే నడిపించగలరు. ఎందుకంటే, వారు కూడ ఈ లోకం నుండి అధఃలోకమైన భౌతిక పారమార్థిక లోకాన్ని చేరినవారే గనుక. ఆ దశను దాటిపోవాలి అంటే రాధాసామిలో సంగీలు చూపే విశ్వాసం, సద్గురు మహారాజు బోధల ఆచరణవల్ల మాత్రమే ఆ స్థితి సాధ్యం ఔతుంది.

మూడవలోకం పిండ-అటు జీవిలోను,ఇటు వెలుపలను ఉనికి కలిగిఉంటుంది. బాహ్యంగా విశ్వంలోని ఆరు కేంద్రాలలో వుంటున్నది. ఈ విశ్వంలోని బాహ్య కేంద్రాలైన ఈ ఆరు జీవియొక్క ఆరు ఆత్మ కేంద్రాలతో సంబంధపడి వున్నవి.

మానవ దేహంలోని ఆరు కేంద్రాలలో మొదటిది రెండు కన్నులకు మధ్యగా వెనుకవున్న ప్రదేశం. ఇది సూరత్ (ఆత్మ) నివసించే స్థలం. ఈ కేంద్రంనుండి దేహం అంతటిలో వ్యాపించివున్న మిగిలిన అయిదు కేంద్రాలకు క్రమక్రమంగా వ్యాపిస్తుంది. రెండవ కేంద్రం గొంతులో వుంది. ఇది 'ప్రాణ' ప్రదేశం లేదా దేహం యొక్క శక్తిస్థానం మూడవది హృదయకుహరం. ఇది ఉద్రేకాలకు, వాంఛలకు కేంద్రం. నాల్గవది నాభిస్థానం కాగా, అయిదవది జననేంద్రియంలోను, ఆరవది మలినపదార్థ బహిర్గత కేంద్రంలోను వున్నవి.

ప్రారంభంలో కరుణామయుడైన, సర్వోన్నత పారమార్థిక జీవియైన రాధాసామి మాత్రమే ఉనికి కలిగియున్నాడు ఆయన పవిత్ర పాదాలనుండి ఆయన చిత్తం, ప్రేమలహరియై ప్రవహించింది. ఇదే విమోచనకు మూలమైన ఆత్మనాదం. ఆ లహరినుండి లోకాల సృష్టికూడ జరిగింది. ప్రవాహం క్రిందికి సాగినకొలది 'మాయ'తో సంబంధం ఏర్పడినందువల్ల పవిత్రమైన ఆత్మ భౌతికంతో కలసి కల్మషమైంది అదే నిర్మలమాయ లేక బ్రహ్మానందలోకం. ఇక మూడవలోకంలో భౌతికమే రాజ్యం చేస్తుంది.

'జీవ' యొక్క ఆత్మకూడ కరుణాళువైన రాధాసామి పవిత్ర పాదాల నుండే జనించింది. అది నిత్య సూర్యుని యొక్క కిరణం. 'రాధాసామి ధమ్' నుండి దిగివస్తున్నపుడు ఈ ఆత్మ అనేక దశల్లో ఆయా లోకంలోని పొరల్లో బంధీకృతమైంది. తుదకి 'మలినమాయ' లోకంలో శాశ్వతంగా బందీగా ఉండి పోయింది. ఈ చెరనుండి దానికై అదే విమోచించుకోవడం అసంభవం. బందీకృత మైన ఈ ఆత్మను తద్వారా జీవులను విమోచించుటకే 'రాధాసామి' ప్రప్రథమ గురువు 'సారాబచన్' కర్త అయిన సామిజి మహరాజ్ రూపంలో అవతరించి సూరత్‌నాద యోగాన్ని తమ భక్తులకు బయల్పరచవలసి వచ్చింది. ఈ ఆధ్యాత్మిక ఆచార కర్మకాండ పరమరహస్యంగా, దీక్షను పొందే వ్యక్తులకు మాత్రమే ఉపదేశింపబడుతుంది. అలా దీక్ష పొందినవారే ఉపదేశాన్ని పరమ రహస్యంగా తమ హృదయాలలోనే భద్రపరచుకోవాలి కాని ఎవరికి తెలియపరచ రాదు. ఈ ఆచార కర్మకాండ అభ్యాసాలలో రెండు ముఖ్య భాగా లున్నట్లు తెలుస్తున్నది. మొదటిది పరమ కరుణాళువైన రాధాసామి పవిత్ర నామసంస్మరణ, ఆ పవిత్ర మూర్తిమత్వంపై ధ్యానం. రెండవది 'నాదాభ్యాసం' ఇది అభ్యాసకుడు

తగిన విధంగా సిద్ధంగా వున్నాడని సద్గురు మహరాజుకు నమ్మిక కలిగినపుడే ఉపదేశింపబడుతుంది. చిన్నదీపం ఎంత విస్తారమైన చిమ్మచీకటిని పటా పంచలు గావించి వెలుగుమయం చేసి దారి చూపిస్తుందో అలానే ఈ నాదాభ్యాసం సాధకునిలోని ఆత్మను తన పూర్వస్థానమైన రాధాసామి పాదసన్నిధికి నడిపిస్తుందని వారి నమ్మిక. ఇంకొక రకంగా చెపితే విమానాశ్రయం నుండి బయల్వెడలే శబ్ద తరంగాన్ని అనుసరించి విమానం క్షేమంగా విమానాశ్రయాన్ని చేరినట్లే, శబ్దా భ్యాసాన్ని పాటిస్తున్న జీవాత్మ తన గమ్య స్థానాన్ని చేరగలదు. అయితే ఇట్టి జ్ఞానాన్ని, నడిపింపును ప్రసాదించగలవాడు సద్గురు మహరాజ్ మాత్రమే. ఈ సద్గురు మహరాజ్ తన ప్రతినిధులచేత కూడ ఈ కార్యాన్ని సాధింప సమర్థుడు. ఇలా క్రమ క్రమంగా ఆయా లోకాల యొక్క వేర్వేరు దశలను దాటి జీవాత్మ తన అస్తిత్వ ప్రదాతయైన పరమ కరుణాళువు రాధాసామి పాద పీఠాన్ని చేరుతున్నది.

ఈ శాఖా సభ్యుల విశ్వాసం ప్రకారం 'రాధాసామి' సర్వోన్నతుడు లేదా అంతిమ సత్యం మొత్తం సృష్టికి ఆయన ఆధారభూతుడు ఆ విధంగా ఆయనలో లీనం కావడం రాధాసామి భక్తుల అంతిమ లక్ష్యం, ఇది సూరత్ నాదయోగం వలన మాత్రమే సాధ్యం. ఈ యోగనే బి డి త్రిపాఠి 'రాజ యోగం' అని పిలుస్తున్నాడు [26] అట్టి నాదాన్ని విన్నపుడే సాధకునిలో అనిర్వచనీయమైన ఆధ్యా త్మికానుభూతి రేకెత్తుతుంది.

పై బోధను బట్టి వీరి విశ్వాసంలో నాలుగు ముఖ్యాంశాలున్నట్లు తెలిస్తు న్నది.

1 సంత్ సద్గురు మహరాజ్ - స్వామీజి మహరాజ్ - రాధాసామి అవతార పురుషుడు
2 రాధాసామి సన్నామ స్మరణమే విమోచనాక్రమంలో మొదటి మెట్టు
3. సజ్జన సహవాసం ఆధ్యాత్మిక జీవితాభివృద్ధికి ప్రధాన కారణం.
4. నిష్కళంకం, నిర్మలమైన ప్రేమను ప్రతి సంగీ ఆచరించడమే పరమవిధి

26. **B D Tripathi** *op cit.* **p** 49.

ఈ సమాజ సభ్యులు తప్పక పాటించవలసిన విధులు :-

1. వారికి ప్రసాదింపబడిన లేదా పొందిన ఆధ్యాత్మిక సూచనలను లేదా అనుభవాలను వేరెవ్వరికి ప్రకటించరాదు.
2. మత్తు పదార్థాలను సేవింపరాదు.
3. కోర్టు కేసుల్లో చిక్కుకొనరాదు.
4 మాంసాహారాన్ని భుజింపరాదు

పై షరతులకు అంగీకరించిన వారికి ప్రాథమిక పరీక్షను నిర్వహించి, అందు నెగ్గిన వారి తరపున ఆ శాఖ కార్యదర్శి దరఖాస్తును సత్సంగ్ సభకు సమర్పిస్తాడు. ఆ సభాధిపతి పంపే జవాబునుబట్టి ఎవరినైనా చేర్చుకొనడం, చేర్చుకొనకపోవడం జరుగుతుంది.

ఈ సత్సంగ్ దేవాలయాలను కాని, ప్రార్థనా స్థలాలను కాని, పరిశుద్ధ ప్రదేశాలనుగాని గుర్తింపదు వాటికొరకై సత్సంగీలను ప్రోత్సహింపదు. సత్సంగ్ గురువుగాని, ఆయన అవశేషాలుగాని ఎక్కడ వుంటే అదే దేవాలయం అదే ప్రార్థనా మందిరం, అదే పవిత్ర ప్రదేశం. వారి సమావేశాలలో భక్తుల గీతాలు, ఆయా మతగ్రంథాలలోని వేర్వేరు భాగాలను పఠించిన మీదట జీవన సూత్రాలను గూర్చి హితోపదేశాలుంటవి దైవనామసంకీర్తనం, సంస్మరణం, దైవరూపాత్మకమైన ధ్యానం ద్వారా, సత్సంగ్ తన జీవాత్మను పరమాత్మ నుండి విడుదలైన శక్తితో అనుసంధింప ప్రయత్నిస్తాడు. సత్సంగ్ సభ్యత్వాన్ని పొందడం కోసం ఎవరైనా తమ తమ మత సూత్రాలను విసర్జించుకోనక్కర లేదని సద్గురు మహరాజ్‌ల ఉపదేశం ఏ మతస్థులైనా సంగీలు కావచ్చు ఎందుకంటే ప్రతి మతస్థుడు దేవునిపై దృష్టిని కేంద్రీకరింపలేనంతగా పనుల్లో లీనమై వుంటున్నాడు. అందువల్ల విమోచన, ఆధ్యాత్మిక స్వేచ్ఛ ప్రతి వ్యక్తికి తప్పనిసరి అంతేగాదు, ఈ సత్సంగీలు తమ గృహస్థ జీవితాన్ని పరిత్యజింపనవసరం లేదు. నిజానికి సత్సంగ్ వ్యవస్థాపకుడై సామిజీ మహరాజ్‌తో సహా సద్గురు మహరాజ్‌లందరు ఆదర్శప్రాయమైన గృహస్థ జీవితాన్ని గడిపిన వారనే విషయాన్ని మనం మరచిపోరాదు. సర్వసామాన్య మానవ జీవితం గడుపుతూనే పవిత్రంగా జీవిస్తూ జీవాత్మ దైవాత్మల శక్తి మధ్య సంయోగాన్ని సాధించడమే వారి ధ్యేయం అది సత్సంగీలు అందరికీ అన్వర్తిస్తుంది. అయినప్పటికి అడిగిన

ప్రతి వారిని సత్‌సంగీగా గురువు అంగీకరింపడు. కొన్ని నియమ నిబంధనలున్నందున వాటిని విజయవంతంగా పాటించి, అమలుపరచిన మీదటే వారికి సభ్యత్వ ప్రాప్తి లభిస్తుంది.

ఆధునికోద్యమాలతో సంబంధం పెట్టుకోవడం సత్‌సంగ్ లక్షణం కాదు. గురుమహరాజ్‌లు అట్టి ప్రమేయంతో పాటు అధ్యయనా విధానాన్ని కూడ నిరుత్సాహ పరుస్తారు. అంతేగాక దేశీ యోద్యమాలతోగాని, జాతి జీవన విధానంతో గాని, వారి కెట్టి ప్రమేయం లేదు. ఏ సత్‌సంగీ అయినా, ఏదైనా పదవి నాశించినా, అదిష్టించినా, ఆ వ్యక్తిని చిన్నచూపు చూస్తారు. ఆధ్యాత్మికాన్ని ఆశించేవారికి లౌకిక హోదాలతో పని లేదని, అలా ఉండరాదని వారి విశ్వాసం. ఆర్థిక, విద్యావిషయక, సాహిత్యపరమైన ఏ అభివృద్ధి కూడ సంగీలకు తగని వ్యవహారం. ఇదొకరకంగా సనాతన సన్యాస విధానాన్ని జ్ఞాపకం చేస్తుంది అయితే క్రొత్తగా సంగీలు కాగోరు వారికి కొన్ని ఆకర్షణీయమైన విధానాలున్నవి. అందు కొన్ని :

1. సత్‌సంగ్ ప్రబోధించే రహస్య సాధనా విధానం ద్వారా జ్ఞానోదయాన్ని, మర్మాత్మక శక్తిని, మానవతీత అపూర్వ జ్ఞానాన్ని సముపార్జించవచ్చునసే నిరీక్షణ.
2. జీవించివున్న సత్‌గురువేదైనా శక్తి యొక్క అవతారం, ప్రతిరూపమనే విశ్వాసం.
3. సత్‌సంగ్ సమావేశాలలో సత్ సంగీలకు గల స్వేచ్ఛ. ప్రతి సత్‌సంగీకి మత వివక్షత లేకుండా సహవాసాన్ని. సహపంక్తి భోజనం ఆచరించడానికి గల స్వేచ్ఛ
4. సత్‌సంగీగా అంగీకరింపబడిన వ్యక్తి తన స్వీయ మతాచారాలను నిరాటంకంగా కొనసాగించుకొనే అవకాశం వుంది. ఎవరు సత్‌సంగీగా అంగీకరింపబడ్డారో బహిరంగంగా ప్రకటించే ప్రశ్న లేదు.
5 అన్ని మతాలు వాస్తవికాలు, అన్ని మతాల సారాంశాన్ని సత్‌సంగ్ ప్రబోధిస్తున్నదనే సత్‌సంగ్‌యొక్క ప్రకటనలో వున్న ఆకర్షణ. అయితే సత్‌సంగ్‌కు వెలుపల రక్షణ లేదని నిర్ద్వంద్వంగా సత్‌సంగ్ ప్రకటిస్తుంది.
6. మత మార్పిడి ప్రమేయం లేకపోవడం.

ఆయా మత నాయకులను విశ్వంలోని ఆయా విభాగాలలో అమర్చడానికి సత్‌సంగ్ ప్రయత్నిస్తుంది అయితే ఇది ఆయా నాయకుల్లోగల బాగోగుల నివృత్తినిబట్టి ఏర్పాటౌతుంది. అంతేగాదు, వారి బోధల్లో కొన్ని క్రైస్తవ మతాంశాలుకూడ చోటు చేసికొన్నాయి అగ్రాహ్యమైన పరమాత్మను సత్‌సంగ్ 'పరలోక మందున్న తండ్రీ' అని సంబోధించడం, ఆయన చిత్తాన్ని తరుచుగా నొక్కి చెప్పడం, ఆయన చిత్తాన్ని అంగీకరించాలని సత్‌సంగీలను హెచ్చరించడం మొదలైన అంశాలు క్రైస్తవులు విశ్వసించి, దినదినం పునరుక్తం చేసే "పరలోక ప్రార్థన"ను జ్ఞాపకం చేస్తున్నవి. పరలోక మందున్న తండ్రిని ప్రత్యక్షం చేయగల సత్ గురువే ఆయన కుమారుడని, దేవుడు మనిష్యుని తన పోలికలో సృష్టించినాడని చెప్పడం, క్రైస్తవ దృక్పథం నుండి జనించిన పద్ధతిలో ప్రేమను గూర్చి వీరు ముచ్చటించడం గమనించితే ఇవి క్రైస్తవ మతాభ్యాసం, బోధల ప్రభావమనే విషయం ఇట్టే తెలిసిపోతుంది. అంతేగాక, కనికరయుత కార్యాలు, ప్రేమ పూరిత పరామర్శలు, పొరుగువానిని ప్రేమించి సేవించాలనే హెచ్చరిక, సమావేశంలో కొనసాగే ఆరాధనా విధానము క్రైస్తవ సంఘ ఆచారాలనే జ్ఞాపకం చేస్తాయి.[27]

**రాధాసామి సత్‌సంగ్ బియాస్ యొక్క అభ్యాస విధానం :**[28]

ధ్యానాభ్యాస అనుభవం ద్వారా దైవసిద్ధి కార్యక్రమం సుమారు రెండు గంటలు జరిగిన తదనంతరం ఉదయకాల అల్పాహారం ముగించి, ఒక గంట సత్ సంగ్ బియాస్ పొలంలో స్వచ్ఛంద కార్యక్రమం కొనసాగిస్తారు. ఎనిమిది గంటలకు దర్శకులు, సభ్యులు ధ్యాన మందిరంలో ప్రవేశించి, ఉపన్యాసం కొరకు నిరీక్షిస్తారు. సద్గురు మహారాజుంటే ఆయనే హితోపదేశాన్ని గావిస్తారు.

ఆరోగ్యాభివృద్ధి కవసరమైన వైద్యసదుపాయాలు, సమృద్ధిగా కూర్చబడిన ప్రదేశ మిది. ప్రకృతి చికిత్సాలయంలో 125 రాత్రులుండి చికిత్స పొందడానికి అవకాశముంది. అలాగే నేత్ర చికిత్సా శిబిరం కూడా నిర్వహింపబడుతుంది.

27. See J. N. Farquhar, Modern Religious Movements.
28. Khushwant Singh, *Gurus, Godmen and good people* pp. 20-51. Also see Vishal Mangalwadi op.cit. p. 208.

అంతర్జాతీయ అతిథి గృహంలో ప్రపంచంలోని నలుమూలలనుండి వచ్చిన సత్ సంగీలు సత్ గురు దర్శనం చేసికొంటారు వారడిగే అనేక ప్రశ్నలకు ఆయన ఓపిగ్గా, సవివరంగా ఆధ్యాత్మిక స్పర్శతో సమాధానాలు, సలహాలిస్తారు. ఈ ప్రాంతాన్ని ప్రతి సంవత్సరం 70 దేశాల నుండి వచ్చి సుమారు 200 దర్శకులు దర్శిస్తారు. వారిక్కడ వుండగా ధ్యానం, ప్రార్థన, స్వచ్ఛంద సేవ మొదలైన కార్యక్రమాల్లో పాల్గొంటారు. విశేషం ఏమంటే, వీరిలో అధిక సంఖ్యాకులు జాతి విచక్షణా విధానాన్ని ప్రేరేపించి పోషిస్తున్న దక్షిణాఫ్రికాలోని శ్వేత జాతీయులు. ఈ అంతర్జాతీయ దర్శకులు వచ్చిపోయే సమయం సెప్టెంబరు నుండి ఏప్రిల్ మధ్యకాలం.

సత్ గురువుయొక్క ఆంతరంగిక శక్తి, మానసిక క్రమశిక్షణ శిష్య వర్గాన్ని ఆకర్షించి, తృప్తిని కలిగిస్తున్నవి. వీరు ఫలానా తెగకు చెందిన వారని సూచించే గుర్తులేవీ వారి దేహమ్మీద కనిపించవు ఇతరుల నుండి వారిని ప్రత్యేకించేది వారి నిజాయితీ, నైతిక ప్రవర్తన మాత్రమే.

సద్గురు మహరాజు స్థానం అత్యంత ఉన్నతమైంది, సద్గురు మహరాజ్ లేకుండ సంగీకి రక్షణ లేదనే నమ్మకం ప్రబల వ్యాపకంలో వున్నందువల్ల వీరి నిర్మాణ కార్యక్రమంకూడా ఆకర్షణీయమైంది. ఒక జిల్లాలో వుండే సత్ సంగీ శాఖలను, జిల్లా కార్యదర్శి అజమాయిషీ చేస్తుండగా కేంద్ర సత్‌సంగ్ సభ ఆధ్యాత్మిక మత విషయాలను, సామాజికాభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంది.

సత్‌సంగ్ ప్రస్తుతం వేర్వేరు మాటల చాటున, సామాన్య వ్యక్తినే ఆరాధిస్తున్నారనే అపవాదును ఈ సభ కొట్టివేస్తుంది. ఆరాధన గాని, పూజా వ్యవహారాలు గాని, వ్యవస్థాపక సద్గురు మహరాజ్ - సామిజీ మహరాజులో ప్రత్యక్షమైన రాధాసామికే గాని, మరే వ్యక్తికి కాదని వారి వాదం. సద్గురు మహరాజ్ తన అధికారాన్ని మరొకరికి ధారాదత్తం చేసేపుడు ప్రత్యేక కార్యక్రమంగాని ఆరాధనగాని జరుగదు దైవాంశ ప్రత్యక్షం కావడం అంటే ఒక ప్రత్యేక వ్యక్తిలో జీవాంశ ప్రవేశించడమేనని, ఆ అంశ పని చేయడం ప్రారంభించినపుడు గురుమహరాజ్ తన అనుచరులను ఆకర్షించి వారికి, ఆంతరంగిక బాహ్య అనుభవాలను కలిగిస్తాడని వారి విశ్వాసం, ప్రకటన కూడ. క్రమక్రమంగా ఈ జ్ఞానాంశ, భక్తుల హృదయాలను నింపుతూ వుంటుంది [29]

---

29. **See Sahebji Maharaj**, *Radha soami Mat Darsana*, **Dayalbagh Press 1960 pp. 23–24.**

## గురుమహరాజ్ జీ బాలయోగీశ్వర్ :[1]

### డివైన్ లైట్ మిషన్

పుట్టగొడుగులా పుట్టి, ఎలా పుట్టిందో అలాగే అంతరిస్తున్న మిషన డివైన్‌లైట్ మిషన్.

స్థాపకుడు ఉత్తర ప్రదేశ్‌లోని బద్రీనాథ్‌లో పుట్టిన శ్రీ హన్స్‌జీ మహరాజ్ బాల్యంలోనే ఆర్యసమాజ బోధలచే ఆకర్షితుడైనప్పటికి, ఆ తరువాత కేవలం ప్రమాదవశాత్తు కలిసిన దాదా గురువుకు శిష్యుడైనాడు. దీక్ష పొందిన మరునాడే సమాధి స్థితిని అనుభవించి గురు మన్ననల దీవెనల పొందిన వ్యక్తి హన్స్‌జీ.

దాదా గురు తన తదనంతరం ఆయన వారసునిగా హన్స్‌జీని నియమించి నప్పటికి, ఆ వెంటనే దాదాజీ శిష్యవర్గంలో అనేకు పేయన్ని దాదాజీ వారసునిగా గుర్తించనందువల్ల సింధ్ రాష్ట్రానికి వెళ్ళి, లాహోర్‌లో దివ్యజ్యోతి, పవిత్ర నామాన్ని గూర్చిన సమాచారాన్ని ప్రకటిస్తూ కొంతకాలం కాలక్షేపం చేశాడు 1930 తరువాత తరచు ఢిల్లీని దర్శిస్తూ, ఢిల్లీ క్లాత్‌మిల్ కార్మికులకు తన విశ్వాసాన్ని ప్రకటించడం హన్స్‌జీకి ఆనవాయితీ అయింది. గంభీరమైన రూపం, ఆకర్షణీయమైన స్వరంతో చేసే ప్రసంగాలు అనేకుల్ని మంత్రముగ్ధుల్ని చేశాయి క్రమక్రమంగా హన్స్‌జీ మహరాజ్ బోధలు అంతగా జ్ఞానంలేని కార్మిక జనాన్ని ఆకర్షించినందువల్ల 1960 వ సంవత్సరంలో దివ్యజ్యోతి మిషన్ స్థాపించాడు.

హన్స్ మహరాజ్‌కు మగ సంతానం లేనందువల్ల రెండో వివాహం చేసి కొన్నాడు. వీరికి నలుగురు మగ సంతానం కలిగింది. రెండవ భార్య రాజేశ్వరి దేవిని దైవమాతగా ప్రకటించాడు హన్స్‌జీ మహరాజ్. వీరుభయులకు పుట్టిన

1. This essay is heavily dependent on Kushwant Singh's book, *Gurus Godmen and goodpeople* pp. 66–72 and Vishal mangalwade *op.cit.* pp. 191–197.

నల్గురు కూడ దైవాంశ కలవారేనని, కాని కనిష్ఠుడైన బాలయోగీశ్వర్ పుట్టుకతోనే పరిశుద్ధుడైనందువల్ల సంపూర్ణ మాస్టరని హన్స్‌జీ ప్రకటించాడు హన్స్‌జీ 1966 జూలైలో మరణించడంతో బాలయోగీశ్వర్ ఈ డివైన్‌లైట్ మిషన్‌కు నాయకుడైనాడు.

1957 డిశంబరు 10 వ తేదీన హరిద్వార్‌లో పుట్టి, డెహ్రాడూన్ సెంట్ జోసఫ్స్ ఎకాడమీలో విద్యను కొనసాగిస్తున్న బాలయోగీశ్వర్ గురు మహారాజ్‌గా ప్రకటింపబడే నాటికి ఆయన వయస్సు ఎనిమిదిన్నరేండ్లు. అసలు పేరు ప్రతాప్ సింగ్ రావత్. ఆరు సంవత్సరాల ప్రాయంలోనే తండ్రి బాలయోగీశ్వర్‌కు దీక్షను ప్రసాదించాడట. ఆయన తనలో వున్న దేవత్వాన్ని, లేదా దైవాంశను పరిశీలించి గ్రహించడానికి దాదాపు నెలరోజులు ధ్యానం చేయవలసి వచ్చిందట.

తాను తొమ్మిది సంవత్సరాల వయసులో వుండి, 1966 అక్టోబరు ఒకటవ తేదీ 'సంపూర్ణ మాస్టర్' నని తనకు తానే ప్రకటించుకొన్నాడు. తన తండ్రి అంత్యక్రియలకు హాజరైన వేలాది ప్రజల నుద్దేశించి, "మీ రెందుకు దుఃఖిస్తున్నారు? మీ గురూజీ మీకు బోధించిన పాఠాన్ని నేర్చుకోలేదా? సంపూర్ణ సద్గుర్ ఎప్పటికీ చనిపోడు. మహరాజ్‌జీ మీమధ్య వున్నాడు" అని ప్రకటించాడు. తొమ్మిదేళ్ళ ప్రాయంలో వున్న బాలుడు చెప్పే సందేశం అనేకుల్ని విస్మయచకితులను చేస్తే, మరికొంతమందిని భయభ్రాంతుల్ని చేసిందిట. తల్లి, తోబుట్టువులు, ఈ వర్గంలో నాయకులు, ప్రముఖులు ఆయనకు సాష్టాంగదండ ప్రణామం గావించి ఆయన దీవెనల పొందారని ప్రజల్లో పుకారులున్నవి.

1970 నవంబరులో ఢిల్లీలో జరిగిన గొప్ప బహిరంగ సభలో 'ప్రపంచంలో శాంతిని స్థాపించగల'నని ప్రకటించి, మరోమారు లక్షలాది ప్రజల్ని సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తాడు బాలయోగీశ్వర్. అప్పటికి ఆయన వయసు పదమూడు సంవత్సరాలు. ప్రపంచ శాంతి స్థాపనా ప్రయత్నంలో భాగంగా బాలయోగీశ్వర్ బ్రిటన్, కెనడా, అమెరికాలను దర్శించాడు. 1972 నాటికే నలభై అయిదు కేంద్రాలు, 15000 సభ్యులున్నారని ప్రకటించారీ శాఖీయులు. మరో సంవత్సరం ప్రపంచ వ్యాప్తమైన 38 దేశాలలో 480 కేంద్రాలు నెలకొన్నట్లు ప్రకటించారు.

వీరి ప్రచారానికి ఒక సాధనంగా 'డి డివైన్ టైమ్స్' అనే పత్రికను, 'అండ్ ఇట్ ఈజ్ డివైన్' అనబడే 'మాగజైన్'ను స్థాపించారు. ఈ ప్రచారం కోసం 'లార్డ్ ఆఫ్ ది యూనివర్స్' మొదలైన చలన చిత్రాలను కూడ నిర్మించారు.

1973 లో హ్యూస్టన్ నగరంలో జరిగిన బ్రహ్మాండమైన సమ్మేళనంలో ఆయన అనుచరవర్గం ఈ బాల యోగీశ్వర్‌ను "సహస్ర వర్ష జగదేక రక్షకుడు"గా ప్రకటించారు. ఆ కాలంలో అమెరికాలో వున్న మిగిలిన సంప్రదాయాలు బాల యోగీశ్వర్ ప్రభావానికి తట్టుకోలేకపోయాయనే చెప్పాలి. ఆకాశం వరకు ఎత్తబడిన బాల యోగీశ్వర్ వైభవ పతనం కూడ అపుడే ప్రారంభమైంది.

కేవలం పదహారు సంవత్సరాల ప్రాయంలో జగదేకరక్షకుడని ప్రకటించు కొన్న బాల యోగీశ్వర్ తనకు కార్యదర్శిగ పనిచేస్తూవున్న ఇరవై నాలుగు సంవత్సరాల ఆమెరికా యువతి 'మేరిలిన్ లోయిన్ జాన్సన్'ను వివాహం చేసికొన్నాడు. ఎనిమిదిన్నర రేండ్ల ప్రాయంలో ఆయన ఉపదేశాన్ని విన్న జనం ఎంత దిగ్భ్రాంతి చెందారో, ఈ వివాహ వార్త- అందునా ఆ బాల్య వయస్సులో- విన్నవారి మతులే పోయాయి ఆయన తల్లి, సోదరులు, ఉద్యమ నాయకులీవివాహాన్ని దుయ్యబట్టడమే గాక, ఇది పరమ లౌకిక చర్య అని ఈసడించారు 1974 లో సంవత్సరం పాటు తల్లి కుమారుని తిరిగి సన్మార్గ గామిని చేయ ప్రయత్నించింది. ఆ ప్రయత్నాలేమీ ఫలించలేదు. సంభోగం, మద్యపానం, మాంసాహార భక్షణ నిషేధించి, బ్రహ్మ చర్యాన్ని పాటించవలసివున్న బాల యోగీశ్వర్ ఆ నాలుగు షరతులను ఆశ్రమం లోనే అతిక్రమించాడు.

ఈ 'దైవ కుటుంబం'లో చీలికలు అనివార్యమైనాయి. వారి శాఖా మందిరా లలో వుంచబడిన తన తల్లి పటాలను తొలగించవలసిందిగా బాల యోగీశ్వర్ ఆదేశాలు జారీ చేశాడు. తన తల్లి దైవమాతగా కొనసాగే అర్హతను కోల్పోయి నందువల్ల ఈ చర్య తప్పదని ప్రకటిస్తూ, ఆమె పటాల స్థానే తన భార్య పటాలను నిలుపవలసిందిగా సూచించాడు. అంతేకాదు, తన ఇరవై నాలుగేండ్ల భార్య సాక్షాత్ 'దుర్గ' అవతారమని ప్రకటించాడు ఈ చర్యను ఆయన పాశ్చాత్య అను

చరులందరు బలపరిచారు. ఆయన కార్యదర్శి ఒక ప్రకటన చేస్తూ, బాలయోగీశ్వర్ యొక్క ఆగమనోద్దేశం అలవాట్లను మానుకోవలసిందిగా హెచ్చరించడం కాదని, మానవుల్లో ఆంతరంగిక మార్పును తీసికొని రావడమేనని పత్రికా ముఖంగా ప్రకటించి సమర్థించాడు.

ఈ చేష్టలకు, ప్రకటనలకు విసిగివేసారిన తల్లి బాలయోగీశ్వరుని తొలగిస్తూ, మరో కుమారుడైన బాలభగవానుని 'డివైన్ లైట్ మిషన్'నాయకునిగా ప్రకటించడంతో కుటుంబ గుట్టు రట్టయి రచ్చకెక్కింది. ఆస్తుల కోసం కోర్టుల పాలయ్యారు. బాల భగవానుల బ్రతుకు బట్టబయలైంది.

వీరి జీవితాలెంత అక్రమంగా వున్నాయో వీరి బోధలు కూడ అలానే దిక్కుతెన్ను లేకుండా ఉండిపోయాయి ఈ శాఖకు తగిన సాహిత్యంలేదు. అట్టి సాహిత్యాన్ని సృష్టించగల మేధాసంపత్తి హన్స్‌జి మహరాజ్‌కు లేదు. కుమారులు ఆస్తులకోసం, అంతులేని లౌకికానందంకోసం పట్టుబట్టి ప్రాకులాడినంతగా బోధల్ని క్రోడీకరించడం, ప్రచురించడం, తమ సమాజ సభ్యులను కట్టుదిట్టం చేయడం వంటి కార్యక్రమాల జోలికి పోలేదు ఈ మిషన్ నాయకులు ఎవరైనా ఒక వ్యక్తిని చూచి ఆధ్యాత్మికంగా సిద్ధపడివున్నాడని నమ్మితే అతనికి దీక్ష నిస్తారు. ఆ తెలుసుకోడానికి వీరనుసరించే పద్ధతులు కూడ తెలియరావడం లేదు. ఇలా కొందరు ఎన్నిక చేయబడిన మీదట మహాత్ముడు- ఇది దీక్షనిచ్చే వ్యక్తి పేరు- వారిని గదిలోనికి తీసికొని వెళ్ళి, తలుపులు మూసిన పిదప వారి చెవి రంధ్రాలలో రెండు బొటన వ్రేళ్ళు పెట్టి బయట శబ్దాలు వినబడకుండ నిరోధించమని సలహా ఇస్తాడు. అలా నిరోధించిన మీదట, దీక్ష పొందే వారికి క్రమంగా వారి దేహంలో నుండే మామూలు అస్పష్ట స్వరాలు వినిపిస్తాయి. అలా వినగలిగితే, వారి దీక్షా కార్యక్రమం పూర్తి అయినట్లు భావన. వారిచేత కొన్ని ప్రమాణాలు చేయించాక ధ్యాన విధానాన్ని బోధించి పంపించివేస్తారు.

అయితే బాలయోగీశ్వర్ ఇండియాను దర్శించినప్పుడు స్వయంగా ఆయన్ని కలుసుకొని కుష్వంత్‌సింగ్ చేసిన గోష్ఠిలో కొన్ని ముఖ్యాంశాలు వెలికి వచ్చాయి:

1. ప్రతి వ్యక్తికి ఒక గురువు అవసరం. గురువులేని విద్య కొరగాని విద్య. వేయి సూర్యులు, నూరు చంద్రులు వెలుగుతూ వుండవచ్చుగాక, గురువు లేనపుడు అది వెలుగు గాదు, అంధకారమయం.

2. దైవజ్ఞానం ఖజానాలో వున్న సొమ్ము వంటిది. అది నా ఖాతాలో జమైంది. నా చెక్కు వ్రాసి, నేను సంతకం పెట్టిఇస్తేనేగాని అది ఎవరైనా మార్చుకొని సొమ్ము చేసికోలేరు. ఆ చెక్కును జారీ చేయగల వ్యక్తి గురువు మాత్రమే.
3. దివ్యజ్యోతిని దర్శించగల మూడవ నేత్రాన్ని ప్రసాదించగలవాడు గురువు.
4. నేను దేవుణ్ణి కాదు, దేవుని సేవకుడను మాత్రమే.
5. ఎవరైనా దేవుణ్ణి తృణీకరించవచ్చు కాని, ఎవరూ ఆయన్ని రద్దు పరచలేరు. దేవుని ఉనికి సర్వసత్యం. ఒక వ్యక్తికి రెండు కాళ్ళు, మేకకు నాలుగు కాళ్ళున్నవనుట ఎంత సత్యమో, దేవుడున్నాడనుట కూడ అంతే సత్యం.
6. మానవ మనసులో చెలరేగే ఆశాతరంగాలవల్ల అతని జీవితం భ్రష్టమౌతున్నది. కాని వాస్తవానికి అతడు స్వభావికంగా మంచివాడే.

ప్రారంభంలోనే ఈ మిషన్ జనాకర్షణను, ప్రజల్లో ఉప్పెనను రేకెత్తించింది. అందుకు ప్రధాన కారణం దాని నాయకుడు బాలుడు కావడమే. ఆ వయసులో 'విశ్వాధిపతి'గా తనను తానే ప్రకటించుకొన్నాడు. ఈ ఉద్యమంలో గురువుకీ దేవునికి తేడాలేదు. ఈ గురువే దేవుడు. దేవుని ఆరాధించినట్లే గురువును ఆరాధిస్తారు.

ఈ బాల యోగీశ్వరుని అనుచరులు ఆరాధించే విధం ఉద్రేకపూరితంగా ఉండి భక్తి యోగను తలపింప చేస్తుంది. గురు మహరాజ్ కి అనుచరులకుండే సంబంధం అవినాభాజ్యమైంది. బాల యోగీశ్వర్ పై వచ్చిన తీవ్ర ఆరోపణలుగాని, తల్లి అన్నలొకవైపు ఉండి సాగించిన పోరాటం కాని, ఆయా అనుచరులపై ఎట్టి ప్రభావాన్ని చూపకపోగా, ఆయన గావించే ఆగడాలన్నిటిని సమర్థిస్తూ వారొక పత్రికా ప్రకటనను కూడ కావించారు. తుదకు ఆయన 'డి డివైన్ యునైటెడ్ ఆర్గనైజేషన్' అనే వేరే సంస్థను పశ్చిమ ప్రపంచంకోసం స్థాపించుకొనవలసి వచ్చింది.

'డివైన్ లైట్ మిషన్" యొక్క సందేశ సారాంశంలో నాలుగు క్రియలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఒకటి చూడడం, రెండు వినడం, మూడు ఆఘ్రా

జించడం, నాలుగు శ్వాస పీల్చడం. ఈ నాలుగు క్రియల ద్వారా సాధకుడు దైవ శక్తిని పొంది దేవునితో ప్రత్యక్ష అనుభవాన్ని స్థాపించుకొంటాడు. అందుకే దీని వ్యవస్థాపకులీ వుద్యమాన్ని ఒక మతంగా కాక అనుభవంగా అభివర్ధించడం జరుగుతుంది.

ఈ నాలుగు క్రియా సాధనాలు సాధకునికి ప్రత్యక్షానుభవాన్ని కలిగిస్తాయి వెలుగు వీరి ప్రధాన లక్ష్యం. ఈ వెలుగును కనుగొనడానికి 'హఠయోగ' లోని 'యోనిముద్ర'ను అభ్యసించవలసి వుంది. అయినప్పటికి ఈ క్రియను సాధారణ పరిస్థితుల్లో అమలుపరచరు. అందరికి అందుబాటులో ఉన్న చతుఃక్రియా సాధనాన్ని ప్రోత్సాహపరుస్తారు.

వీరు మంత్రాల నుపయోగించరని చెప్పుతారు. కాని ఆ విషయాన్ని అంత తేలిగ్గా విశ్వసించడానికి వీలులేదు. వారి శాఖకు దేవ వాక్కు తాంత్రిక మంత్రంలో భాగం "షా-హమ్" - వానిని తిరగవేస్తే హమ్‌స-హంస తాంత్రిక విద్యలో అర్థయుక్తమైన సంజ్ఞ అనే విషయాన్ని విజ్ఞులు మరచిపోలేరు.

# మాతృమూర్తులు

స్త్రీ మూర్తిని దేవతగా ఎంచి ఆరాధించడం భారతీయ సంస్కృతిలో భాగం. ఆర్యులు భారతదేశాన్ని ఆక్రమించక ముందు మొహంజొదారో, హరప్పా పట్టణాలలోని సాంస్కృతిక అవశేషాలనుబట్టి స్త్రీమూర్తి ఆరాధన సర్వసామాన్య విషయంగా గ్రహించవచ్చు. స్త్రీ పురుష జననేంద్రియాలను మానవసృష్టి కాధారంగా ఎంచి అనార్యులు ఆరాధించారు. నిజానికి స్త్రీమూర్తి ఆరాధన ఆర్య సంస్కృతిలో మొదట లేదు. భారతదేశాన్ని ఆక్రమించుకొన్న పిదప పూర్వ భారతీయుల సంస్కృతి నుండి ఈ భావాన్ని స్వీకరించి తాము ఆరాధించే దేవుళ్ళకు భార్యలను, ఉపభార్యలను కల్పించారు ఆర్యులు.

ఆ ఫలితంగా ఋగ్వేదంలో మాతృదేవి ఆరాధన సూచనలున్నవి మరి కొన్ని సూచనలు వేదాలలో వున్నప్పటికి, తాంత్రిక సాహిత్యంలోనే సంపూర్ణంగా మాతృమూర్తి ఆరాధన ప్రధాన స్థానాన్ని ఆక్రమించుకొన్నది. ఉన్నతమైన దేవత ఆదిశక్తిగా శక్తి స్వరూపిణిగా తాంత్రిక సాహిత్యంలో అభివర్ణించబడింది. ఆమె దైవమాత కాగా సృష్టికార్యం కొనసాగింపునకు నాందిగా ఆదిశక్తి తన దేహాన్ని పెంచి, మొదట పతిగ ఆ పిదప పత్నిగా రెండుగా విడిపోయి, ఆ రెంటి సంపర్క క్రియ ఫలితంగా సృష్టి జరిగిందనే కథకూడా విజ్ఞులకు క్రొత్తకాదు. ఈ పురుష శక్తిని శివ అని, స్త్రీ శక్తిని ప్రకృతి అని సంబోధించడం కూడ కద్దు. ఈ ఆది శక్తి ప్రపంచాన్ని పర్యావలోకించి, సర్వసృష్టికి ఆదిమాత అయి పరిపోషిస్తున్న దనేది హిందూమత సంప్రదాయం భౌతికం, అధిభౌతికం కూడ ఆ శక్తిస్వరూపిణియే! ఆ విధంగా పురుష, ప్రకృతి అవిభాజ్యాలైనాయి.

ద్రావిడ సంస్కృతికి వారసులుగా వున్నవారు తమ పూర్వీకులు పురాతనంగా ఆచరిస్తూ వచ్చిన స్త్రీమూర్తి ఆరాధనను కొట్టివేయకుండా, కాలానుగుణ్యంగా మార్పులు చేర్పులు చేర్చి ఇప్పటికింకా కొనసాగిస్తూనే వున్నారు. గొంతేలమ్మ కొలుపు, పోలేరమ్మ కొల్పులు, మహంకాళి జాతరలు - ఇవన్నీ ద్రావిడ సంస్కృతిలో భాగంగా కొనసాగుతున్న విశేషాలు.

పూర్వకాలం ఈ శక్తినే వేర్వేరు నామాంతరాలతో ప్రజలు కొలిచే వారు. అట్టి విశేషనామాలలో కొన్ని అంబిక, ఉమ, దుర్గ, కాళి మొదలైనవి. ఆదిశక్తియే 'కన్యాకుమారి' గా తన కన్యత్వ దృక్పథం నుండి కూడ ఆరాధింపబడిన సూచనలున్నవి. ఇది పూర్వగాథ కాగా, మధ్యయుగాలలో కొంత స్త్రీ ప్రాధాన్యత తగ్గిపోయినప్పటికి తిరిగి భారతదేశంలో కొందరు స్త్రీ రత్నాలు తమ ముగ్ధ మధుర సౌందర్యవంతమైన జీవితాలను తాము నమ్మిన దైవార్పితం చేసి, అశేష జనసమూహానికి ఆరాధనా వ్యక్తులైనారని ప్రస్తుత వ్యాసం తెలియపరుస్తున్నది. ఆ విధంగా 20 వ శతాబ్దంలో తమ జీవితం, బోధలు ద్వారా లక్షోప లక్షలను ప్రభావితులను చేసి దేశ దేశాలలో శిష్య ప్రశిష్యకోటిని స్థాపించుకొని కూడ సర్వసామాన్య జీవితాన్ని నడిపి ధన్యులైన ముగ్గురు మాతృ మూర్తులను మనం పరిశీలింపనై వున్నాం. వీరు ముగ్గురు వివాహితులే. అందొకరు బిడ్డ తల్లి కూడా. అయిన నేమి, లోకాన్ని రోసి, పరలోకాన్ని కాంక్షించి, లోక కళ్యాణార్థం, జీవితాలను మలుపు త్రిప్పిన స్త్రీ మూర్తులు వీరు. అట్టివారిలో వయసును బట్టి, బోధనలను బట్టి, గ్రహించిన శిష్యవర్గాన్ని బట్టి మొదట పేర్కొనదగిన వ్యక్తి పాండిచేరి మాతాజి.

**1. మాతృమూర్తి పాండిచేరి మాత :**

1914 వ సంవత్సరంలో ఒకవైపు ప్రథమప్రపంచ సంగ్రామం ప్రారంభం ఔతుంటే, అరవింద ఆశ్రమంలో ఒక అపూర్వ వింత జరుగుతున్నది దర్శనంలో కనిపించి ఆహ్వానిస్తున్న గురువును అన్వేషిస్తూ ఫ్రెంచి వనిత మీర (ఆమె పేరు యొక్క ఇంగ్లీషు అక్షర క్రమం MIRA మైరా, కాని మీరా అనడంలో తప్పే ముంది?) ఆమె భర్త పాల్ రిచర్డ్ ఆశ్రమంలో ప్రవేశించారు. ఐరోపాఖండ సంస్కృతికి చెందిన దుస్తులను ధరించిన ఆమె ఉన్నత విద్యాభ్యాసం చేసిన రాజకీయ యోధుడై దేశం కోసం ప్రాణాలర్పింప సిద్ధపడి తుదకు దైవాన్వేషణా మార్గాన్ని అవలంబించి, అనిర్వచనీయమైన తేజస్సుతో ఎదురుగా సగటు దేహ పరిణామంతో నిల్చున్న అరవిందుడు ఒకర్నొకరు చూచు కొన్నారు. ఆ చూపుల్లో ఇతరుల కెవరికి గోచరం కాని పరమార్థం వెల్లడైంది. ఆయనలో ప్రపంచ బోధకుని ఆమె దర్శించింది. ఆమెలో మునుముందు తన ఆశ్రమాన్ని నడిపి, పాండిచేరి మాతాజీగా ప్రసిద్ధి చెందనై వున్న జగన్మాత వ్యక్తిత్వాన్ని ఆయన గ్రహించాడు. ఆశ్రమంలో చేరిపోవాలనే ఆమె కాంక్షను భర్త అడ్డగించలేదు. అరవిందుడు ముందే ఆమోదించాడు.

ఫ్రాక్, కత్తిరించిన జులపాలతో మధ్య వయస్సులో వున్న ఐరోపా యువతి ఆదిశక్తికి అపరావతారంగా పేరొందుతుందని ఆనాడు ఎవరూహించ లేదు. అసలు ఐరోపా వనిత శరీరాన్ని మాతృదేవి ధరించడం ఏమిటి? అయినా ఈ అసంభవం సంభవమై అనేకులను సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తింది.

మీర పారిస్ మహానగరంలో 1878 లో ఫిబ్రవరి 21 వ తేదీ జన్మించింది. బాల్యంనుండి ఆధ్యాత్మిక విషయాలలో చొరవ చూపిందని, నాల్గవ ఏటనే ధ్యాన నిమగ్నమైందని ప్రతీతి. పారిస్ సమీపంలో వున్న అరణ్యంలో సంచరిస్తూ, తన పంద్రెండవ ఏట మొక్కలతో, చిన్న చిన్న జంతురాశితో ఊసులాడాలని ఉబలాటపడిందట మీర. ఆ విధంగా బాల్యంనుండి తన ప్రత్యేకతను ఆమె రుజువు చేసుకుంటూనే వుంది.[1] ఇరవై సంవత్సరాలు దాటగానే మీరా మర్మ విద్యాభ్యాసం కొరకు ఆల్జీరియాకు వెళ్ళింది. అక్కడ అట్టి మర్మ యోగ విద్యాబోధనలో ఆరితేరిన దిట్ట మోన్సయూర్ థెయాన్ దగ్గర శుశ్రూష చేయాలనే ఆమె కోరిక అంత దూరం నడిపించింది. ఒకానొకనాడు దీర్ఘధ్యానంనుండి కళ్ళు తెరిచేసరికి పెద్ద త్రాచు పాము తన కభిముఖంగా అతి సమీపంలో పడగవిప్పి ఆడుతూ వుండడాన్ని గమనించింది. మనోనిగ్రహాన్ని కోల్పోకుండా తగిన ఉపశమనాన్ని కలిగించి, త్రాచుపాము బారినుండి తప్పించుకోగలిగింది మీరా. ఆవిడ తిరిగి ఇంటికి వస్తున్నప్పుడు పెనుతుఫానుకు లోనై, ప్రయాణీకులు, ఓడ నావికులు కంగారు పడిన సంఘటన జ్ఞాపకం చేసికొని మీరా, తరువాత వ్రాసిన ఉదంతం, ఆమె ఆదినుండి అతీతశక్తి సమన్వితురాలనే అభిప్రాయాన్ని ధృవపరుస్తున్నది.

> ఆలా కంగారు, భయాందోళనలతో వున్న ప్రయాణీకులను, నావికులను చూచి నేను నెమ్మదిగా ఓడలోని నా గదికి వెళ్ళి పడుకొని, నా ఆత్మను సముద్రంమీదికి పంపాను. అల్లకల్లోలంగా వున్న సముద్రం నీటిపై నృత్యం చేస్తున్న అనేక అశరీరజీవులను చూచి, ఇలా ప్రయాణీకులను భయభ్రాంతులను చేయవద్దని, వారి ప్రాణాలతో చెలగాట మాడరాదని మనవి చేశాను ఇలా అరగంట

1 For detailed information refer to Pasupati (Phanibhushan Nath), *On the Mother Divine*, **Calcutta**: Temple Press, 1968 pp. 4–14.

బ్రతిమాలాను ఆ తరువాత వారి ఆ గంతులు ఆగిపోయాయి. సముద్రం నిమ్మళించింది. తిరిగి నేను ఓడమీదికి వెళ్ళి చూశాను. నావికులు ప్రయాణీకులు ఆనందోత్సాహంతో కనిపించారు.[2]

అప్పటినుండి ఆమె 1914 లో పాండిచేరి చేరేవరకు ఆమె జీవిత విశేషాలు తెలియరాలేదు మీరాకు-పాల్ రిచర్డుకు వివాహం జరిగింది ఆ ఫలితంగా ఒక కుమార్తె కూడా కలిగింది అయితే, దర్శనాలలో తానొక భవిష్యత్ గురువును దర్శిస్తున్నదినాని, ఆయన ఎవరో, ఎక్కడివాడో మాత్రం పోల్చుకోలేకపోతున్నది. 1914 మార్చిలో భర్తతో కూడ కలిసి ఇండియాకు బయలుదేరింది-ఉద్దేశం గురువును కనుగొనడం అప్రయత్నంగా వారు పాండిచేరికి చేరడం, అక్కడ అరవిందుని దర్శించడం జరిగింది. ఆయన తన గురువని మీరా అంగీకరించింది. రిచర్డ్ కూడా ఆశ్రమంలో ఉన్నందువల్ల అరవిందుడు ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని, ఫ్రెంచి భాషలో Revue de grande synthese అనే పత్రికను కూడా నిర్వహించాడు[3] దీనితో పాటే 'ఆర్య' అనే ఇంగ్లీషు పత్రిక కూడ నిర్వహింపబడింది. ఈ పత్రికా ప్రచురణ కవసరమైన ఆర్థిక సహాయాన్ని మీర, పాల్ రిచర్డ్ దంపతులే అందించారని ఆ తరువాత వ్రాతలనుబట్టి తెలుస్తున్నది. సరిగా అపుడు ప్రారంభమైన ప్రథమ ప్రపంచ సంగ్రామంలో పాల్గొనవలసిందని స్వదేశం నుండి పిలుపు రావడంతో భార్యభర్తలు జంటగా తిరిగి ఫ్రాన్సుకు, ఆ వెనువెంటనే జపానుకు వెళ్ళిపోయారు. 1920 లో వారు విడిపోయినమీదట మీర ఒంటరిగా ఆశ్రమానికి వచ్చి స్థిరపడిపోయిందని తెలుస్తున్నది. ఈవా ఓల్సన్ అనే రచయిత్రి వారు విడిపోయిన సందర్భాన్ని ఉదహరించక, యుద్ధంలో రిచర్డ్ హతుడైనందువల్ల మీరా తిరిగివచ్చి పాండిచేరిలోనే స్థిరపడిపోయిందని వ్రాస్తున్నది.[4]

పాండిచేరి రాకముందు ఆమె జీవితంలో దుర్భర దారిద్ర్యం ఒక ప్రక్క, ఆధ్యాత్మిక తృష్ణ మరియొక ప్రక్క, అయినవారి చీదరింపులు, ఛీత్కారాలు

2. *Ibid*.
3. **Mervin H. Harper,** *op.cit.* **p. 141 and 147.**
4. **Eva Olson,** *The Philosophy of Aurabindo,* **Madras CLS. 1959. p 4.**

మరో ప్రక్క, ముక్కోణాలై ముప్పిరి వేసి, ఉక్కిరి బిక్కిరి చేసాయి. అయినా జీవితం అందించే ఆ హాలాహలాన్ని అమృతంగా అరగించి, శోధనలను కష్టాలను జయించి మీరాబాయి 1920 ఏప్రిల్‌లో తిరిగి పాండిచేరి ఆశ్రమానికి చేరింది. ఆమెను మాతృదేవిగా అరవిందుడు ఆశ్రమంలోకి స్వీకరించాడు.

అరవిందుడే స్వయంగా మాతృదేవి యొక్క జీవిత కర్తవ్యాన్ని, వ్యక్తిత్వాన్ని తన గ్రంథంలో -

> ఆమె యొక్క చతుర్విధ శక్తులు, చతుర్విధ దృక్పథాలు, విశ్వాన్ని నడిపించేందుకు నిక్షిప్తమై వున్నాయి. ఒకటి ఆమెలో తొనకక, బెణకక, నిదానంగా శాంతయుతంగా వుండే ప్రశాంత మనస్తత్వం. రెండవది ఆమె నిగ్రహ శక్తి, కార్యనిర్వహణా దక్షత. మూడవది సత్యం, శివం, సుందరమైన జీవిత నడవడిక. నాలుగవది సూక్ష్మం, తీవ్రమైన విషయ విచక్షణా జ్ఞానం అని స్పష్టం చేసాడు.[5]

ఆమెతో అనుబంధమున్న శిష్యవర్గం తమ ఆధ్యాత్మిక అవసరాలను మానసిక పరిభాషలో ఆమెతో నివేదించుకొనే అవకాశమున్నదని, వారు దూరంగా వున్నా సమీపంలో వున్నా ఈ సమాచార సరఫరా సర్వసామాన్యంగా జరుగుతూనే వుంటుందని, వారి అవసరాలను గూర్చిన అవగాహన మాతృదేవికి ఎపుడూ వుంటుందని విశ్వసించారు. ఆమెను ఆరాధించే భక్తుల జీవిత సంఘటనలతో ఆమెకు పరిచయమే గాదు- చొరవ వున్నది ఆత్మ చైతన్య శక్తితో వారిని పరామర్శించి, అవసరాలను తీరుస్తూంటుందని వారి ప్రగాఢ విశ్వాసం.

1920 లో మాతృదేవి ఆశ్రమానికి పునరాగమనమైనపుడు ఆశ్రమం అతి స్వల్పంగా వుండేది. ఆనాడు ఆశ్రమం అంటే అరవిందుడు నివసించే ఇల్లు మాత్రమే. ఇంటిపైభాగంలో మాతృదేవి, మిగిలిన గదుల్లో అరవిందుని శిష్యుల్లో ప్రథమాగ్రగణ్యులైన నలుగురు లేక అయిదుగు రుండేవారు. ఈనాడు ఈ ఆశ్రమం పాండిచేరిలోనే గాక, ప్రపంచంలోనే ప్రసిద్ధి చెంది స్వయం సమృద్ధమై కొనసాగుతున్నది. దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మింపబడిన

5. **Sri Aurobindo**, *The Mother*, **Pondicherry : Sri Aurobindo Ashram Press, 1937 pp. 48–50, passim.**

200 భవనాలలో సుమారు 1500 పైగా భక్తులు, అనుచరులు, శిష్యవర్గం అక్కడ నివసిస్తున్నారు. అనేకమైన ఐహికార్థసాధక కార్యక్రమాలను ఆశ్రమం నిర్వ హిస్తున్నది. ప్రతి విభాగానికొక ప్రయోక్త వుండి, ఆ విభాగం యొక్క వృద్ధి క్షయాలను, లాభనష్టాలను మాతృదేవికి నివేదిస్తూ వుంటాడు. ఆశ్రమవాసులు కూడ తాము కొనసాగించే ఆధ్యాత్మిక సాధనాలతో పాటు ఆయా విభాగాలలో సహాయం చేస్తూవుంటారు. అందరికొకే భోజనశాల వుంది. విశేషం ఏమంటే, భవన నిర్మాణానికి ఇంటి కవసరమైన సమస్త వస్తువులు ఆశ్రమంలోనే తయారు చేయడం. భోజన పదార్థాలకు అవసరమైన సమస్త వస్తు సామాగ్రి అక్కడే లభిస్తుంది వస్త్రాల నేతతో పాటు వాటిని కుట్టి సిద్ధం చేసే దర్జీలు కూడా అక్కడే వున్నారు ఆశ్రమంలో ముద్రణాలయంలో అసంఖ్యాకమైన గ్రంథాలు ముద్రణ పొంది ప్రచురణకు సిద్ధంగా వుంటాయి. ఉపాసనీ బాబా స్థాపించి, గోదావరి మాతాజీ నిర్వహిస్తున్న కన్యాకుమారి స్థాన్‌కి పాండిచేరి ఆశ్రమానికి భేద సాదృశ్యా లున్నాయి

మాతృదేవికి అత్యంత ప్రియం, అవసరమైన రెండు అంశాలున్నవి ఒకటి విద్యా ప్రచారం, అభ్యాసం. రెండు శరీర వ్యాయామాభ్యాసం అరవిందుని కాలం లోనే, అరవింద అంతర్జాతీయ విశ్వవిద్యాలయ కేంద్రం స్థాపింపబడి కొనసాగు తున్నప్పటికి, మాతృదేవి ఆయన మరణించిన ఏడాదికి ఆ కార్యక్రమాలను తీవ్ర తరం చేసి నిర్వహించింది. ఆశ్రమవాసుల నుండే ఉపాధ్యాయవర్గం ఎన్నిక చేయబడుతుంది. రాను రాను, స్వదేశీయులు, విదేశీయులు కూడ పాఠశాలలో పనికి ఆహ్వానింపబడినారు.

ఆశ్రమం నడిబొడ్డులో ఆటస్థలం దాదాపు ఫుట్‌బాల్ ఆటకు సరిపోవునంత ప్రత్యేకింపబడింది. ఆశ్రమవాసులు వ్యాయామ, క్రీడలలో పాల్గొనాలని మాతృదేవి యొక్క ఆశ, అనుజ్ఞ. చాల కాలం వరకు ఆమె స్వయంగా ఆటల్లో పాల్గొనేది, ఆధ్యాత్మిక సాధన, శారీరక వ్యాయామం రెండు కూడ సమపాళ్లలో మేళవింప బడిన జీవితం ఇక్కడ కొనసాగుతున్నది. ఆశ్రమం అంతటిలో ఒక ప్రార్థనా మందిరం కాని, దేవాలయంకాని, లేదనే విషయం పాఠకులు గమనించవలసివుంది. ఆదివారం, లక్ష్మివారం సాయంసమయాలలో ఈ క్రీడా స్థలంలోనే, మత సంబంధమైన సమావేశం జరుగుతుంది. శరీర వ్యాయామం కూడ ముగిసిన పిదప వ్యాయామస్థలంలోనికి ఎదురుగా వున్న గోడను చూస్తూ సాధకులు కూర్చుంటారు.

వారి కెదురుగా వున్న గోడమీద దక్షిణాసియా పటం, ఆ పటంలో అరవిందుని ఛాయా చిత్రం కనిపిస్తూ వుంటాయి.

అవురవిల్లె అంటే అరుణోదయనగరం-గా ఈ ఆశ్రమాన్ని అభివృద్ధి పరచాలనే మాతృ దేవి పథకం ఆశాజనకమైంది. ఆమెకు కలిగిన దర్శనంలో చూచిన ఆదర్శవంతమైన గ్రామాన్ని భూమి మీద నిర్మించాలనే సంకల్పమే ఈ ఆదర్శగ్రామ నిర్మాణానికి నాంది. పాండిచేరికి సుమారు పదిహేను కిలోమీటర్ల దూరంలో మూడు సరసులకు, సముద్రానికి మధ్యగల ప్రకృతి సౌందర్య సిద్ధమైన నివేశనస్థలం అది. నివేశన స్థలం, పారిశ్రామిక వాడ, సాంస్కృతిక స్థలం, అంతర్జాతీయ కేంద్రం అని స్థూలంగా ఈ ప్రదేశం నాలుగు రకాలుగా విభజింప బడివుంది. నివేశన స్థలంలో విభిన్న దృక్పథాలు, అభిరుచులతో, ఉద్యాన వనాల మధ్య నిర్మింపబడిన భవనాలుంటాయి. వీనికి శాంతి, వాగ్దానం, నిరీక్షణ, ఆకాంక్ష మొదలైన పేరులు ప్రతిష్టమై ప్రేక్షకుల నాకర్షిస్తూ వుంటాయి. పారిశ్రామిక వాడలో ఆశ్రమవాసుల కవసరమైన వస్తుసామాగ్రి, భోజన పదార్థాలతో సహా సిద్ధం ఔతాయి ఇక్కడ ముద్రణాలయం ప్రాముఖ్యమైంది. సాంస్కృతిక కేంద్రం, అంతర్జాతీయ కేంద్రం కూడ తగిన విధంగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తూన్నాయి ఇక్కడ యాభై వేల మంది నివసించడానికి ఏర్పాట్లు చేయ బడినాయి. దాని ముఖ్య గురి పాత క్రొత్తల కలియక. శారీరక ఆధ్యాత్మిక వ్యాయామం మిశితమైన ఆరోగ్య జీవనం.

1966 లో ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ UNESCO ఈ ఆదర్శ నగర నిర్మాణానికి ఆమోదాన్ని ఆర్థిక సహాయాన్ని ఏకగ్రీవంగా ప్రకటించింది.[6] జపానుతో సహా అనేక పారిశ్రామిక దేశాలు ఈ ప్రణాళికలో భాగస్వాములు కావడానికి సమ్మతి తెలియచేసాయి.

అరవిందుడు భౌతిక దేహాన్ని చాలించిన వెంటనే 'దివ్యజ్యోతి' మాతృ దేవిపై ప్రసరించిందట. ఆయన మరణంతో అంతకుముందున్న అనేక ఆలో చనలు, భావాలు మొదలైనవి అంతరించిపోయాయి. మాతృదేవి అరవిందుడు విడిచిపెట్టిన ఆశ్రమ బాధ్యతలనే గాదు, ఆయన గురుత్వాన్ని కూడ చేపట్టింది. మానవ ఊహాతీత వ్యక్తిగా కొనియాడబడినప్పటికి, మాతృదేవి ఆశ్రమంలో జరిగే

6. See Pasupati, *op.cit.* p. 390 f.

ప్రతి కార్యక్రమంపై తన వ్యక్తిత్వ ముద్రను వేసింది. అలా నిమగ్నమై తన బాధ్యతలను కొనసాగిస్తూనే అరవిందుని పునరుత్థానాన్ని, పునరాగమనాన్ని ఆమె నిరీక్షించింది. "ఆయన పునరాగమనం ఎపుడో ఎవరు చెప్పలేదు. అది ఇపుడే కావచ్చు లేదా అయిదు వందల సంవత్సరాల తదనంతరం కావచ్చు అట్టి ప్రవచనా జ్ఞానం నాకు లేనందువల్ల, ఆ విషయాలను నేను ప్రవచించి చెప్పలేను. నాకు దర్శనంలో ప్రసాదింపబడిన విషయాలనే నేను అభివర్ణించగలను"[7] అని ఆమె వాక్రుచ్చింది.

పాశ్చాత్య మర్మయోగ విద్యను అరవిందుని తాంత్రిక యోగంతో సమ్మిశ్రణం చేసి, క్రొత్త ఆధ్యాత్మిక సాధనకు నాందీ ప్రస్థానం చేసింది మాతృమూర్తి. ఈ ఆశ్రమవాసుల్లో ఇరువురిని గూర్చి ముచ్చటించడం అవసరం అందొకరు ఎమ్ పి పండిట్ కాగా, మరొక్కరు శ్రీ చిన్మయస్వామి శ్రీ పండిట్ 1939 లో ఆశ్రమంలో చేరి, ఆశ్రమవాసం, ఆధ్యాత్మిక సాధనం, సమగ్రయోగాన్ని గూర్చి విశేషమైన సాహిత్యాన్ని ప్రచురించగా, చిన్మయస్వామి దాదాపు ఇరవై సంవత్సరాలు అరవిందునితో సహజీవనం కొనసాగించి, మరణానంతరం సిద్ధియోగ ప్రచారకునిగా ఆయా దేశాలు సంచరించి, విశేషమైన గ్రంథాలు వెలువరించాడు. 1965 లో ఐక్యరాజ్యసమితి ధ్యానమందిరంలో తన సిద్ధియోగను అభ్యాసపూర్వకంగా ప్రకటించాడు [8]

1920 దశాబ్దంలో అప్పటి అమెరికా అధ్యక్షులు ఉడ్రోవిల్సన్ కుమార్తె మార్గరేట్ విల్సన్ పాండిచేరి ఆశ్రమాన్ని దర్శించి, ఆకర్షితురాలై అమెరికాకు వెళ్ళింది. ఆ తరువాత ఒకరిద్దరు జంటలు ఆశ్రమాన్ని దర్శించడం జరిగినా 1951 వరకు విదేశీ శిష్యవర్గం అంటూ ఏర్పడలేదనే చెప్పాలి కాలిఫోర్నియాలోని సాన్ ఫ్రాన్సిస్కోలో సాంస్కృతిక సమగ్ర సహవాస కేంద్రం స్థాపింపబడిన తరువాతనే పాండిచేరి ఆశ్రమ ప్రభావం అమెరికా పౌరులపై ప్రసరించింది ఈ కేంద్రం ప్రభుత్వ గుర్తింపును పొంది పన్ను మినహాయింపుకు కూడ అర్హతను

7. **K. D. Sethna**, *The Mother, Past Present and Future*, **Pondichery : Aurobindo Ashram Press** 977. **p** 69.
8. **J. Aagaard**, *New Religious Movements Up-date*, **Vol. IV. Issue** 3. **Oct.** 1980 **p.** 35.

సాధించినమీదట కొంత ఆర్థికమైన ఏర్పాట్లకు వీలు కలిగింది. 1953 లో మాతృదేవి అనుమతితో శ్రీమతి మాంటి గొమెర్రె న్యూయార్క్‌లో ది అరవింద్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సెంటర్‌ను స్థాపించింది. అవురవిల్లె సంస్థాపనకూడ విదేశీయ దృష్టిని, వ్యక్తులను ఆకర్షించిందని ముందే సూచించడం జరిగింది.

ఆధ్యాత్మిక జీవిత స్థాయిలో మాతృమూర్తి, అరవిందుడు ఒకేస్థాయిని చేరినవారని వీరుభయులను దర్శించినవారి అభిప్రాయం. ఆశ్రమానికి పునాదులు వేసింది అరవిందుడే అయినప్పటికి దాని సర్వతోముఖ వికాసానికి అహోరాత్రులు కృషిచేసిన వ్యక్తిమాత్రం మాతృమూర్తి. ఈనాడు అక్కడ నివసించే వారిలో ఉత్తర భారతీయులు-అందునా బెంగాలీలు-అధిక సంఖ్యలో వున్నప్పటికీ అమెరికా, ఫ్రెంచి, ఇంగ్లాండ్, స్విట్జర్లాండు మొదలైన దేశాలనుండి వచ్చినవారు కూడ కొందరున్నారు. వీరు ఉన్నత విద్యావంతులు, యోగాభ్యాసాలను ప్రేమించి సాధనచేసే వారైనందువల్ల ఆశ్రమవాసం, నియమనిబంధనల ఆచరణ మూడు పూవులారుకాయలుగా కొనసాగుతున్నది.

## 2. మాతృమూర్తి మా ఆనందమయి.[9]

ఒకనాటి భారతదేశంలో భాగంగా ఉండి, విభజనకు గురై తూర్పు బెంగాల్‌గా తెలియవచ్చి, తిరిగి 1971 లో స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొని ప్రత్యేక దేశంగా రూపొందిన బంగ్లాదేశ్ లోని కొమిల్లా జిల్లా ఖెయోర అనబడే కుగ్రామంలో జన్మించింది తండ్రి బిపిన్ బెహారి భట్టాచార్య, తల్లి మోక్షద. కుటుంబం ఆర్థికంగా వెనుకబడినప్పటికి ఆధ్యాత్మికంగా ముందడుగు వేసిందని సమకాలికుల అభిప్రాయం.

ఒకానొకనాడు మోక్షద తులసిమొక్క దగ్గర ఆరతి వెలిగించినపుడు ఆకాశంలో తేజోవంతమైన కాంతి తులసీదళం చుట్టూ పరిభ్రమిస్తూ తనలో ప్రవేశించినట్లు ఆలాపన కలిగి స్పృహ కోల్పోయిందని, ఆ పిదప బిపిన్‌బెహారి ఆమెను

9. For Fuller Treatment of Ma Ananda Maye refer to
   a) *Mother as Seen by her devotees*, Varanasi : Shree Shree Anandamaye Sangha, 1967 and
   b) Jyotish Chandra Roy, *Mother as Revealed to me* Varanasi : Shree Shree Anadamaye Sangha, 1962.

లోనికి తీసికొనివెళ్ళి ఉపచర్యలు చేసిన తదనంతరం తేరుకొని, భయభ్రాంతురాలై తన అనుభవాన్ని భర్తకు నివేదించినపుడు ఆయన అది మంగళప్రదమైన సూచన గనుక భయపడనక్కరలేదని ఓదార్చినాడని ఒక కథ జనవినికిడిలో వున్నది. ఆనాటినుండి మోక్షద నిద్రలో తాను శ్రీకృష్ణుని మురళీనాదాన్ని వింటున్నట్లుగా అనుభూతిని పొందేదట.

ఆ పిదప 1896 ఏప్రిల్ 30 వ తేదీ అరుణోదయానే ఆమెకు పుత్రిక ఉదయించింది. పుట్టిన వెంటనే కెవ్వుమని కేకపెట్టి ఏడ్వడానికి బదులు ఆమె చిరునవ్వులు చిందిస్తూ గదంతటిని వెలిగించింది. ఆ బాలిక పేరు నిర్మల. అప్పటి నుండి ఆ బాలిక ఆ గ్రామం అంతటికి అభిమాన పాత్రురాలై జీవితాన్ని ప్రారంభించింది. అక్షరాభ్యాసం నుండి అసాధారణ తెలివితేటల్ని ప్రదర్శిస్తూ నిర్మల తన కార్యకలాపాలను పాఠశాల వెలుపలకు కూడా విస్తరింపచేసింది. పుస్తక పఠనంగాక, భగవన్నామ సంకీర్తనం. సంకీర్తనం కొనసాగుతూ వుంటే పారవశ్యం చెందడం ఆమెకు సహజలక్షణాలైనాయి.

1909 లో దాదాపు పదమూడు సంవత్సరాల ప్రాయమపుడు రమణి మోహన్ చక్రవర్తితో ఆమెకు వివాహమైంది. ఆ పిదప నాలుగు సంవత్సరాలు రైల్వే ఉద్యోగి అయిన తన భర్త అన్నగారి ఇంటిలో గడిపింది. ఆ కాలంలో భర్తకు వేరే ఉద్యోగం అంటూ ఏదీలేదు. గృహకృత్య నిర్వహణలో వేణునాదం వినిపిస్తే చాలు పరవశం చెందిపోయేది. ఈ చర్య ఇంట్లో వున్న వారందరి ఆశ్చర్యానికి కారణమైంది. ఇది నిద్రా వ్యాధివంటిదని అనుమానించిన ఒకరిద్దరు బంధువులామె పక్షంగా వైద్యులను కూడ సంప్రతించారు. అయినా ఈ తన్మయ దశలు దినదినానికి పెరుగుతున్నాయే కాని, తరగడం లేదు. ఆమె భర్తకి ప్రవర్తన సంభ్రమాశ్చార్యాదులను కలిగించింది. ఆమెతో వంటరిగా గదిలో వున్నపుడు సైతం, నిర్మల మధ్యలో పడక మీద కూర్చుండి, ధ్యాన నిమగ్నయై వుండేది ఆమెను భర్తగా సమీపించడానికి ఎన్నిమార్లు ప్రయత్నించినా ఏదో ఒక అదృశ్య శక్తి, ఆయన్ని అడ్డగించి దూరం చేసేదట.

నిర్మల ఆధ్యాత్మిక దీక్ష కూడా బాహ్యాడంబరాలుగాని, మంత్ర పఠనం ఉపదేశం గాని లేకుండానే జరిగింది. అయితే దీక్షానంతరం దాని ప్రభావం ఆమెపై సాక్షాత్కరించింది. ఎవరితోను మాట్లాడక మౌనముద్ర ధారియైంది. ముఖం కాంతివంతమైంది. ఆ తరువాత కొద్ది కాలానికే ఆమె తన భర్తకు కూడ

దీక్ష నిచ్చింది. ఆ ఫలితంగా అతడు ఆమె యొక్క మొదటి శిష్యుడైనాడు. "బోలానాథ్" అనే క్రొత్త పేరును ఆయన కిచ్చి, అది మొదలు ఆయన్నదే పేరుతో సంబోధించడం ప్రారంభించింది. అందువల్ల అతడు కూడ వారిద్దరిని మొదట బంధించిన వైవాహిక బంధాలను మరచి, వాటికి అతీతంగా గురు శిష్య సంబంధంతోనే ప్రవర్తించాడు.

రమణిమోహన్ లేదా బోలానాధ్ కొన్ని ఉద్యోగాలు నిర్వహించాడు కాని, అవేవి అతనికి సహాయకరం కాలేదు తుదకు ఢాకా వచ్చి, నవాబ్ ఉద్యాన వనంలో ఉద్యోగాన్ని సంపాదించిన మీదటనే ఆమెలో గుప్తంగా వున్న ఆధ్యాత్మిక శక్తుల ప్రభావం లోకానికి తెలియ వచ్చింది. ఉన్నతోద్యోగులు వారి వారి కుటుంబ సమేతంగా ఆమె సంకీర్తనా సమావేశాలకు హాజరయ్యేవారు. ఆ సమయంలో ఇరవై ఏడు సంవత్సరాల ముగ్ధ, నిండు యౌవ్వనవతి, అక్షర జ్ఞానం గురూపదేశం లేకపోయినప్పటికి, ఆమె గావించిన ఆధ్యాత్మికోపదేశాలు విద్యావంతులను కూడ ఆశ్చర్య చకితులను చేసేవి. సాధారణంగా హిందూ గృహిణుల లక్షణమని భావించిన సిగ్గును అవల పెట్టి, సంకీర్తనం గావిస్తూ, నృత్యం చేస్తూ తన్మయత్వాన్ని పొందేది. ఆమె తేరుకొన్నపుడు పవిటచెంగుతో అరికాలు మొదలు నడి నెత్తివరకు కప్పుకొని అక్కడ నుండి భయ వినయ సంభ్రమాలతో నిష్క్రమించేది. ఆయా సమయాల్లో ఎవరికి తెలియని మర్మ భాషలో కీర్తనల నాలాపించడం కూడ కద్దు ఆ రోజుల్లోనే ప్రజానీకం ఆమెను "నిర్మల మాత" గా కొనియాడారు.

జ్యోతిష్ చంద్రరాయ్ అనబడే గొప్ప ప్రభుత్వోన్నతోద్యోగి మాతాజీ యొక్క ప్రభావానికి లోనై తన ఉద్యోగాన్ని తృణప్రాయంగా ఎంచుకొని విసర్జించి, "భాయిజీ" అనే నామాంతరంతో ఆమె సేవకుపక్రమించాడు. శశాంక్య మోహన్ ముఖర్జీ ఉద్యోగ విరమణానంతరం స్వామి అఖండానందగిరి అనే పేరుతో సన్యాసాన్ని స్వీకరించాడు. ఆయన కుమార్తె ''గురుప్రియదేవి'' గా దీక్ష తీసుకొని, మాతాజీకి జీవితాంతం సహచారిణి అయింది. దీక్ష కొరకు ఆమెను సమీపించేవారిని చూపులతోనే పరీక్షించి, "నీలో తగిన అంతర్య ప్రేరణ లేదు. అది సంభవించేవరకు ఆగడం మంచి"దని సలహా నిచ్చేది. అట్టి ప్రేరణ వున్నదని తనకు నిర్ధారణ అయితేనేగాని, దీక్ష నివ్వదు. ఇట్టి దీక్ష కొరకు వచ్చే జనంతో షహబాగ్ నిండిపోయేది. అనేక ప్రశ్నలకు ఆమె చెప్పే సమాధానాలే భక్తుల్లో

తీవ్రమైన ఆధ్యాత్మిక తృష్ణను ప్రేరేపించేవి. 'చెరుకు తీపి రుచిచూస్తేనే గాని ఎవరికైనా తెలియదు రుచిచూడాలంటే కొంచెం శ్రద్ధ, శ్రమ అవసరం. ఆధ్యాత్మిక రుచి కూడా అంతే. శ్రద్ధాశ్రమలేక ఆధ్యాత్మికత చేకూర'దని ఆమె తనను సమీపించిన జిజ్ఞాసువులు హెచ్చరించేది. మృదుత్వం, సౌశీల్యం, ఆమె గుణ విశేషాలు.

'దేవుడు కృపామయుడు అడుగకపోయినా అవసరాన్ని బట్టి ఆయన కృపను ప్రసాదిస్తాడు. అయితే ఆ కృప మీ పాత్రలను నింపడానికి వీలులేకుండ వానిని బోర్లవేసి, అడుగు పైకెత్తి పెట్టుకొన్నారు గదా, దైవకృప మీకెలా లభిస్తుంది? మీరే తిరస్కరిస్తున్నారు' అని కృపను గూర్చి ప్రశ్నించేవారు పొందే సమాధానం. 'దైవత్వాన్ని పొందడం మానవ జీవిత ధ్యేయం. సృష్టిరాశి యావత్తు సంతోషాన్ని ఆనందాన్ని కోర ప్రయత్నిస్తుంది. ఆనందం యొక్క అవసరం మానవ సహజాతంలోనే స్థిరపడివుంది. శారీరక ఇబ్బందుల్లో వ్యక్తి దేవుని సహాయాన్ని అర్థిస్తాడు. అంతవరకు దేవునికి దూరమై జీవించి ఆపద మ్రొక్కుల్లోనే ఆయన్ని సమీపించకోరడం మానవస్వభావం' అని మాతాజీ హెచ్చరిక. 'మానవ జీవితం ఒక జగన్నాటకం. అందు ప్రతివ్యక్తి ఒక పాత్రధారి. ఆ పాత్ర నిర్వహణలోనే మంచి పేరు పొందాలి. అలా సత్ప్రవర్తన, సచ్ఛీలాన్ని అలవర్చుకొన్న వ్యక్తులకు పరమాత్మ ఎపుడూ సన్నిహితంగానే వుంటాడు.'

ఇట్టి ఉద్బోధలతో ఢాకా చుట్టుప్రక్కలగల జనవాహినిని చైతన్యవంతం చేస్తూనే తన ముప్పయి సంవత్సరాల ముగ్ధ వయస్సులో (1926) భారతదేశ సంచారాన్ని ప్రారంభించింది ఆ సేతు హిమాచల ప్రదేశాన్ని తన బోధామృతంతో పునీతం చేసింది మాతాజీ ఆమెను ఆరాధించి, అనుసరించేవారి సంఖ్య క్రమక్రమంగా పెరిగింది. ఈ అనుచరవర్గం అధికంగా విద్యావంతులలోనే వుండడం గమనించవలసిన విషయం. అనేక సంవత్సరాలు సంచార సన్యాస జీవితాన్ని గడిపిన అనేకులు ఆమె సలహాకొరకు, ఉపదేశ సారాంశంకొరకు ఆమెను సమీపించేవారు.

ఆమె బోధలో ప్రధానంగా కనిపించే అంశం అద్వైతసూత్రం. నిరక్షర వ్యక్తి అయిన మాతాజీ అంత మర్మ గర్భితమైన జ్ఞానాన్ని ఎలా సముపార్జింపగలిగిందో ఎవరికీ అర్థం కాదు. ఉపదేశం కావిస్తున్నపుడు ఆమె పొందే అనుభూతి

అనుచరవర్గానికి ఆశ్చర్యం గొలిపేది. నిజంగా మాతాజీ మానవ మాతృరాలా దైవావతారమా అనే భావన ప్రేక్షకుల్లో కలగడం సహజమని ఆమెను స్వయంగా దర్శించిన వారు నివ్వెరపోయేవారు. తామెవరు అని ఎవరైన ప్రశ్నిస్తే వారిని సాదరంగా చూచి, చిరునవ్వు నవ్వి 'ఇదే అంతిమ సత్యం - పరబ్రహ్మం' అని మాత్రం చెప్పి మిన్నకుండేదట.

ఆవిడ సంచారం చేస్తూ, తాను నమ్మిన సత్యాలను ప్రచారం చేసికొన్నది. అవి నచ్చిన వారెవరో ఆమె భక్తులైనారు. కాని ఆమెకై ఆమె ఒక ఉద్యమాన్ని గాని, మతాన్ని గాని నిర్మించుకోలేదు. అందుకు ప్రయత్నించనూ లేదు. దేవున్ని స్మరిస్తూ అలౌకిక విషయానురక్తులై జీవించండనేది ఆమె ఉద్బోధ. ఆమె సంచారంలో 'వైద్యనాథ్‌ధమ్' చేరడం ఒక మలుపు. ఇక్కడే ద్వాదశ జ్యోతిర్లింగాలు ప్రతిష్ఠమై వున్నాయి. ఇక్కడే ప్రసిద్ధ సన్యాసి స్వామి బాలానంద బ్రహ్మచారి మకాం చేసి వున్నారు. తన అనుచరుల కోరికపై మాతాజి ఆయన్ని దర్శించి ఆయనతో కేవలఅద్వైత సిద్ధాంతాన్ని గూర్చి చర్చించింది. ఆ తరువాత బ్రహ్మచారిజీ కూడ ఆమె సూత్ర వివరణకు అంగీకరించాడు. ఈ వాద వివాదం విద్యావంతులైన అనేక మందిలో జ్ఞానోదయానికి దారి తీసింది.

ఆ తరువాత ఆనందమయి మా డెహ్రాడూన్‌లో మనోహరలాల్ దేవాలయాన్ని దర్శించింది. అశేష జనం ఆమెను ఆ సమయంలో చూడవచ్చారు. ఇక్కడే మొదట కమలానెహ్రూ ఆమెను దర్శించింది. అది మొదలు మరణ పర్యంతం ఆమె భక్తురాలుగా వుండిపోయింది. మాతాజీ కోరిక మేరకు ఆమె అంబికా దేవాలయంలో ఒక యజ్ఞాన్ని కూడ నిర్వహించింది. వీరుభయుల మధ్య ఎడతెగని అనుబంధం కొనసాగిందని లోక ప్రతీతి. మాతాజీ ముసూర్‌లో వున్నదని తెలుసుకొని, కమలానెహ్రూ ఆమెను దర్శించి ఆమె కోరికపై కొన్ని దినాలు అక్కడ గడిపింది. కమలనెహ్రూ ద్వారా, నెహ్రూజీకి కూడ ఆమెతో పరిచయం ఏర్పడింది. వారి ఏకైక కుమార్తె ఇందిరా ప్రియదర్శిని - 1934 అక్టోబరు 31 వరకు భారత ప్రధానిగా వుండి మతోన్మాదుల కుట్రకు బలైన మహా వ్యక్తి-కూడ మాతాజీ భక్తురాలే! మొన్న మొన్నటివరకు భారత దేశానికి ఉపాధ్యక్షుడిగా వున్న జి.యస్. పాథక్ ఇద్దరు కుమార్తెలు కూడ మాతాజి అనుచరులే!

1932 లో భోలానాథ్ - ఈ సంవత్సరం నుండే ఆయన్ని పితాజీ అని సంబోధించడం ప్రారంభమైంది-హిమాలయ పాదపీఠం దగ్గర ప్రతిష్ఠితమైవున్న డెహ్రాడూన్‌లో ఒక ఆశ్రమాన్ని నెలకొల్పాడు. ఆ తరువాత మరికొంత కాలానికి హిందూ పుణ్యనగరమైన వారణాసిలో రెండో ఆశ్రమం ఏర్పడింది. ఆ పిదప దేశం నలుమూలల ఆశ్రమాలు నెలకొన్నాయి ఆనందమయి మాను అభివర్ణించడానికి, అవతారంగా[10] గుర్తించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. కాని అవేమి ఫలించలేదు. ఏ సంప్రదాయంతో గాని, దేవత లేదా దేవునితో గాని, అనుబంధింపబడక తనను గూర్చి తాను సామాన్య సేవికనని చెప్పుకొంటూ తనదైన ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని ఆనందమయి పోషించుకొన్నది. ఆ విధంగా లోతైన ఆమె ఆధ్యాత్మిక అనుభవాన్ని, విశాల దృక్పథం గల వ్యక్తిత్వాన్ని విస్తృతమైన సేవా కార్యక్రమాన్ని గ్రహించడానికి భక్తులకున్న అల్పజ్ఞానం, స్వల్ప పరిచయం చాలదని ఆమె భక్తుల అభిప్రాయం. ఆమె విదేశీ భక్తురాలు ఈథెల్ మెర్‌స్టన్ 'కొందరికి మూర్తీభవించిన ప్రేమ, కొందరికి శ్రీ భగవానుడు, కొందరికి శక్తి, కొందరికి జ్ఞానాధారం, ఆమె చేసే బోధలు దివ్యజ్ఞాన సందేశాత్మకాలు,' అని అభివర్ణించింది.[11]

ఆమె బోధలు అత్యంత సామాన్యంగా సర్వజనగ్రాహ్యంగానే గాక మనోరంజకంగా వుంటాయి[12] మాతాజీ అనుచరవర్గం, భక్తకోటి ఆలోచించి, ఇటు భారతదేశంలోను, అటు విదేశాలలోను గల ఆమె భక్తులతో సంప్రతించి శ్రీశ్రీ ఆనందమయి సంఘాన్ని ఏర్పాటుచేశారు. ఇది 1950 లో జరిగింది. ఈ సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలు :

---

10. Gopinath Kaviraj, *Introduction to Mother as seen by her Devotees.*
11. *Ibid.* p. 57.
12. For the details of contents refer to B Kamal Bhattarjee (recorder), *Words of Shree Anandamayee*, Varanasi: Shree Shree Anandamayee Sangha, 1961 and Gurupriya Debi (recorder), *Matruvani*, Varanasi : Shree Shree Anandamayee Sangha 1963.

1. ఆనందమయి బోధనామృతాన్ని, ఆమె యొక్క వ్యక్తిత్వ మహిమను కార్యక్రమాలను ప్రపంచానికి తెలియచెప్పడం.
2. అప్పటికే ఏర్పడి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆశ్రమాలను అజమాయిషీ చేస్తూ మరికొన్ని క్రొత్త ఆశ్రమాలను స్థాపించి, అనేక తావుల్లో మాతాజీ కార్యక్రమాలను ప్రచారం చేయడం.
3. సందేశాత్మకమైన మత సాహిత్యాన్ని ప్రచురించడం.

ఈ సదుద్దేశాలతో ఆనందమయి సంఘం, కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. అవేవన :

1. 'ఆనందవార్త' అనే పేర ఒక త్రైమాస పత్రిక ప్రచురణ. ఇదిగాక, హిందీ, ఇంగ్లీషు, బెంగాలీలో మత సాహిత్య ప్రచురణ. ఈ కార్యక్రమాన్ని కొనసాగించడానికి సంఘం 21 ఆశ్రమాలను నెలకొల్పింది.
2. ఆల్మోరాలో బాలురకు విద్యాపీఠ్‌ను, వారణాసిలో బాలికలకు కన్యాపీఠ్‌ను రెండు విద్యాలయాల స్థాపన.
3. వారణాసి ఆశ్రమంలో ఒక కేంద్ర గ్రంథాలయం, ఆశ్రమ వాసులకు అవసరమైన వైద్య సదుపాయాలను కలిగిస్తూ పరిమిత సౌకర్యాలతో ఒక వైద్యశాలను స్థాపించింది.
4. బహుకాలంగా సంఘం యోచిస్తున్న ఉచిత వైద్య సదుపాయాలు కలిగించే వైద్యాలయ నిర్మాణంలో ప్రథమ దశగా రూ. 54,000 వెచ్చించి, వారణాసిలో స్థలాన్ని సేకరించగలిగింది. ఈ వైద్యాలయం పేరు 'ఆనందమయి కరుణావాత్సల్య చికిత్సాలయం'గా వుండాలని నిశ్చయించబడింది. ప్రారంభంలో ఈ వైద్యాలయానికి రెండు చికిత్సాలయాలున్నవి. ఒకటి అల్లోపతి వైద్యానికి, రెండవది హోమియోపతి వైద్యానికి సంబంధించినవి. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి నిపుణులైన వైద్యులు తదితరులతో ఒక కమిటీ కూడ ఏర్పాటైంది.
5. సుమారు 150 మంది రోగులు ఉచితంగా వైద్యం, మందులు పొందగల హోమియోపతి వైద్యాలయాన్ని కూడ సంఘం వారణాసిలో నిర్వహిస్తున్నది.
6. అన్నపానాలు కరువైన పేద శిశువులకు దినానికి యాభై మందికి ఉచితంగా పాలసీసాలు సరఫరాను కూడ ఈ సంఘం చేపట్టి కొనసాగిస్తున్నది.

ముందే సూచించినట్లు ఆమె ఎవరినీ-బోలానాథ్‌ను మినహాయించి-తన వర్గంలోనికి దీక్షనిచ్చి చేర్చుకోలేదు. ఆ మాటకువస్తే అమె ఒక వర్గాన్నిగాని శిష్య సముదాయాన్నిగాని ఏర్పరచుకోవలసిన అవసరాన్ని గుర్తించనే లేదు. సమీపించిన వారిలో జ్ఞానోదయాన్ని కలిగించి పంపడమే ఆమె కర్తవ్యంగా భావించింది. కాదు కూడదని ఎవరైన మంత్రోపదేశానికి వత్తిడి చేస్తే వారిని సాదరంగా తేరిచూచి 'మంత్రోచ్చారణ అవసరమని తోచినపుడు మీకు ఏ దేవుడు పేరు మనసుకు నచ్చితే ఆ పేరుకు ముందు 'ఓమ్' అనే మూలాక్షరాన్ని చేర్చి ఉచ్చరించవలసిం'దని ఆమె సలహా యిచ్చేది.

సుదీర్ఘమైన ఆమె జీవితకాలంలో భారతదేశంలోని అనేక పుణ్యక్షేత్రాల నామె దర్శించింది. కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, కంచి, చిదంబరం మొదలైన వానిని చూచి తిరుగు ప్రయాణంలో తిరువన్నామలైలో వున్న రమణ మహర్షిని కూడ దర్శించి సంభాషించింది. డాక్టర్ చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా వున్నపుడు మాతాజి హైదరాబాదును దర్శించడం, ఆమె దర్శనార్థం, హితోప దేశార్థం అనేకమంది సాయంత్రాలు సమావేశం కావడం అయా పత్రికలను చదివే వారికి చిరపరిచితమైన విషయమే! ఈ విషయాన్ని ఉటంకిస్తూ దక్కన్ క్రానికల్ అనే ఆంగ్ల పత్రిక 'జంట నగరాలలో అనేక ఆధ్యాత్మికోపదేశ కేంద్రాలు ఆయా విశ్వాస సూత్రాలను వ్యాపింపచేస్తున్నాయి. త్వరలో ఆనందమయి బోధలను వ్యాపింపచేసే కేంద్రం కూడ వెలువడకపోదు 'అనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.[13]

ఏ వ్యక్తిలోనైనా తాను నమ్మిన దేవునిలో విశ్వాసం, ఆ విశ్వాస బలంవల్ల చేకూరే వినయ విధేయతలు, వాస్తవికమైన సంభవాలను గుర్తించగలగడం అవ సరమనే ఆమె బోధ మత హద్దులను దాటిన సూచన అని చెప్పవచ్చు. "ప్రపంచ జ్యోతి వస్తుంది; పోతుంది- కాని నిత్యం వెలిగే జ్యోతి ఒకటుంది. అందున్నది ఆరనిజ్యోతి. ఆంతర్యంగా వున్న ఈ నిత్యజ్యోతి ద్వారా ప్రపంచజ్యోతిని దర్శించ

13. **Deccan Chronicile – September 12, 1982. Sunday magazine Section**

వచ్చు. ఈ జ్యోతి నిత్యం నీలోనే వుండి వెలుగుతున్నందువల్ల నీ ఆంతరంగిక అంధకారాన్ని పటాపంచలు చేసికొనే వీలు కలుగుతుంద"ని హెచ్చరించింది

ఆమె చెంత గడిపేక్షణాలలో అనుచరులకు మానవాతీత అనుభవ సంపన్నురాలైన సమకాలీన పవిత్రమూర్తి సమక్షంలో వున్నంత అనుభూతి కలుగుతుందని ఆమె భక్తుల సాక్ష్యం. ఇతర సద్గురు మహారాజులతో పోల్చినపుడు ఈ మాతృమూర్తి దయాళుత్వం సౌశీల్యం, ఆమెలో ముప్పిరిగొన్న మాతృగుణం, సౌమనస్యం, సౌజన్యాలు ప్రజాదృష్టిని ఆకర్షిస్తాయి పవిత్రతకు చిహ్నమైన తెల్లని చీరెలో పచ్చబంగారం వంటి ఛాయతో నవ్వుతూ దర్శకుల నాహ్వానించే ఆనందమయి సుదీర్ఘకాలం జీవించినా, ముఖవర్చస్సు వాడలేదు, కంఠస్వరం తగ్గలేదు. కురులు నెరవలేదు. ఆమె మరణించే నాటికి ఆమెకు దాదాపు 88 సంవత్సరాలు. అయిననేమి, ఆమె అపూర్వశక్తి సమన్వితగా జీవితాన్ని గడిపింది.

ఆనందమయి మా విద్యావిషయికంగా డిగ్రీలు సంపాదించలేదు. ఆ మాటకువస్తే అసలు అక్షరాభ్యాసం చేసిన దాఖలాలే లేవు. అయినా ఆమెచేసే ఉపన్యాసాలు విద్యావంతులకే విస్మయాన్ని కలిగిస్తూ, నానా విషయ సమ్మిశ్రణాత్మకంగానే గాక విశదీకరణా పరిమళంతో గుప్పుమంటూ వుంటాయి. ఆ విధంగా అధ్యాత్మిక అనుభవానికి లౌకిక గ్రంథపఠనంవల్ల సమకూరే జ్ఞానానికి తేడా హస్తిమసికాంతరం వున్నదని ఆనందమయి మా జీవితం చాటకనే చాటుతున్నది దేవుణ్ణి కనుగొనలేకపోవడానికి కారణం ఏమిటని ఒకానొక అనుచరుడు అడిగిన ప్రశ్నకు మా చెప్పిన సమాధానం 'విశ్వాసలేమి' అని "ఆ విశ్వాసాన్ని ఎలా పొందగలం" అని మళ్ళీ అడిగితే 'అది గురూపదేశఫలం' అని జవాబు ఇంత సూటిగా, స్పష్టంగా ఆధ్యాత్మిక విషయాలను బోధించకం ఎన్ని డిగ్రీలు సంపాదించితే మాత్రం అలవడుతుందా?

### 3. గోదావరి మాతాజీ :

పూలపరికిణీ, ఆపైన అదే గుడ్డతో కుట్టిన బుట్టచేతుల జాకెట్టు, జడ కుచ్చులతో, తండ్రిచేయి పట్టుకొని, దీర్ఘాలోచనా పరాధీనమైన మనసుతో అడుగులో అడుగువేస్తూ, ఉపాసనీ బాబా దర్శనం చేసికొన్న గోదావరి కుమారిని చూచి, ఉపాసనీ బాబా ప్రస్తుతం నీవు చూస్తూవున్న ఈ ఆశ్రమంలోని ప్రతి వస్తు

వును బాధ్యతతో పర్యవేక్షించి. అజమాయిషీ చేసే సుదినం త్వరలోనే రానై వుంది" అని ప్రవచించాడట. ఈ మాటలు తండ్రికేకాదు- అటనున్న వారందరికి విస్మయాన్ని గొల్పాయి. ఆధ్యాత్మికం, అలౌకికం అంటే ఏమిటో అవగాహన కాని వయస్సులో ఆ మాటలకు అచేతనంగా, నిరుత్తరంగా వుండిపోయింది, మరికొంత కాలానికి సతి గోదావరి మాతాజీగా లోకానికి సేవచేయనై వున్న గోదావరి కుమారి. ఇది 1924 లో జరిగిన సంఘటన.

ఆమె తండ్రి వాసుదేవరావు, తల్లి రామాబాయి. స్వస్థలం మహారాష్ట్ర లోని అహ్మద్ నగర్ జిల్లా షిగోన్ గ్రామం. జననం 1914 వ సంవత్సరం డిశంబరు 24 వ తేదీ గోదావరి పితామహుడు భాస్కర్రావు ఈ భాస్కర్రావు స్వగ్రామంలో వెలసిన 'గజానన మహారాజా' గురువున కతి ప్రియ భక్తుడు. భాస్కర్రావు తన కొక్కడే కుమారుడని, ఇక సంతానం లేదని విచారిస్తున్నపుడు, గజానన మహారాజు 'ఫరవాలేదు' ఒకడున్నాడు గదా! అతని ద్వారా నేను నిన్ను దీవిస్తాను. అంతేగాదు. మరెవరికి లభింపని అపూర్వమైన వరాన్ని, అవకాశాన్ని అదృష్టాన్ని నీకు ప్రసాదిస్తా'నని వాగ్దానం చేశాడట.[14] ఆ కారణంగా ఆ వాగ్దాన నెరవేర్పుకోసం వాసుదేవరావు, రామాబాయి గర్భాన గజానన మహారాజ్ గోదావరి రూపంలో జన్మించాడని, తల్లి దండ్రులు, ఈ విషయం తెలిసిన ఇతరుల యొక్క నమ్మకం. గోదావరి ఇంకా శిశువుగా వున్నపుడే ఒక దేవతవచ్చి గోదావరి మీదికి వాలి ఆమెను దీవించినట్లు రామాబాయి కొక ఆలాపన కూడ కలిగిందట. అందు వల్ల బాలిక యొక్క ప్రత్యేకతను కాపాడుతూ పెంచుకొంటూ వచ్చారు. అయితే గజానన మహారాజ్ వాగ్దానాన్ని పొందిన గోదావరి పితామహుడు భాస్కరరావు ఆ వాగ్దానం నెరవేరడానికి నాలుగు సంవత్సరాలు ముందే (1910) మరణించాడు.

మామూలుగ బాల్యదశలో వుండే చిత్తచాపల్యం, ఆటపాటలపై అనురక్తి, గోదావరికి ప్రారంభంనుండి లేవు. కాగా చిన్న చిన్న దేవతా విగ్రహాల్ని కొలవడం

14. **Peter Brunt** *op.cit.* **p. 141 ff.**
**Mani Shahukar**, *Sweetness and Height, An Exposition of Sati Godavary Mataji's Philosophy and Way of Life*, **Bharatiya Vidya Bhavan** 1966. **p.** 9. **Also See N S Tipnais**, *op.cit.* **966 pp. 41–45.**

అలవాటైంది. పాఠశాలకు వెళ్ళలేదు. అక్షరాభ్యాసం చేయలేదు. కాని ఆమెకున్న అపూర్వజ్ఞాపక శక్తివల్ల హిందూమత జానపదాలను, గ్రామీణ ప్రజా సంగీతాన్ని ఆకళింపు చేసుకొన్నది. కారణాంతరాలవల్ల భాస్కర్‌రావు కుటుంబం నాగపూరుకు వెళ్ళవలసివచ్చినపుడు, వారు తాజుద్దీన్ బాబా, మోతీబాబా జనాదర, జబల్ పూర్ కేర్ బాబా, మొదలైన సాధువులతో పరిచయం దిన దినం ప్రవర్ధమానమైంది. బాలికను పరిశీలనగా గమనిస్తున్న ఈ బాబాలు ఆమెలో నిగూఢంగా వున్న అసాధారణ ఆధ్యాత్మిక, క్రియాత్మక శక్తులను గ్రహింపగలిగారు.[15] ప్రప్రథమంగా ఈ బాబాల ద్వారానే ఈ కుటుంబం ఉపాసనీ బాబా జీవితాన్ని బోధనలను, కార్యక్రమాన్ని గూర్చి విన్నది. ఆనాటి నుండి తమ కుమార్తెను ఉపాసని బాబా సన్నిధికి తీసుకొని వెళ్లాలనే తహతహ ప్రారంభమైంది ఆ చిన్న వయసులో కూడా తన తండ్రి ఉపాసని బాబా ఎడచూపుతున్న గౌరవ మర్యాదలు, భక్తి ప్రపత్తులను బట్టి, గోదావరి కుమారి కూడ ఉపాసనీ బాబా ఎడ తనదైన ప్రత్యేక దృక్పథాన్ని అలవర్చుకొన్నది. 1924 లో సకూరికి చేరేనాటికి ఆమె వయస్సు పది సంవత్సరాలు. ఆ పిదప తల్లిదండ్రులు ఆమెను ఆయన శుశ్రూష కోసం విడిచిపోవడం. అనుభవశాలి, ఆధ్యాత్మిక మూర్తియైన ఉపాసన బాబా శిక్షణలో మాతాజి పెరగడం జరిగింది అయినా పదో సంవత్సరం వచ్చి రాకముందే, విష్ణుపంత్ చందోర్కర్ అనే యువకునితో ఆమెకు వివాహం జరిపించారు తల్లిదండ్రులు. అది పేరుకే వివాహం గాని, వారు కలసి వున్నది లేదు. ఆ తరువాత విష్ణుపంత్ తన చదువు కొనసాగించడంకోసం బొంబాయి వెళ్ళిపోయాడు. నాలుగు సంవత్సరాల తదనంతరం తిరిగి వచ్చి, ఆమె నొక అవతార మూర్తిగా గుర్తించి, ఉపాసని బాబా సేవార్థం అంకితం చేయాలని ఆశించి తన కోరికను ఉపాసనీ బాబాకు తెలియ పరచినపుడు బాబా దానికి అభ్యంతరం తెలిపాడు. కారణం వారు చేసికొన్న వివాహం 'ముందు రద్దు కావాలి గనుక అయినా బాబాజీ చందోర్కరుతో ముందు గోదావరిని శివార్పితం చేస్తే అపుడు వివాహం రద్దయినట్లు ఔతుంది ఆ తరువాత నేనామెను ఆశ్రమ సేవకోసం స్వీకరిస్తా'నని సూచించాడు. చందోర్కరు ఈ సూచనల పాటించి, ముందు గోదావరి కుమారి పాదాలపై సాష్టాంగ పడి దండ ప్రణామం ఆచరించి, శివాంకితం చేసి, తిరిగి తీసికొని వచ్చి, ఉపాసనీ

15. D. P Shama Rao, *op cit*. p. 19

బాబాకు అప్పగించి, తాను వెళ్ళిపోయాడు. ఇక వారెన్నడు కలుసుకొన్నట్లు సాక్ష్యాధారాలు లేవు. గోదావరి తనను తాను ఆశ్రమ సేవకు తన పక్షంగా సమర్పించుకొన్నది.

ఉపాసని బాబా భక్తులు ఆయనకు సాష్టాంగ దండ ప్రణామం ఆచరించడానికి ముందుకు వస్తే బాబా వారిని వారించి, నాకు గాదు గోదావరికి ముందు నమస్కరించుడని హెచ్చరించేవాడట. 1928 జూలై నెల గురు పూర్ణిమ నాడు ఉపాసని బాబా తన మెడ చుట్టూ వున్న రుద్రాక్షమాలను తీసి, మాతాజీ మెడకు అలంకరించాడు. ఈ రుద్రాక్షమాల షిర్డీ శాయిబాబా నుండి ఉపాసనీ బాబాకు సంక్రమించినందువల్ల, అది అపూర్వ మహిమలకు కారణ భూతమని భక్తులు విశ్వసించారు. ఆ విధంగా ఉపాసనీ బాబా గోదావరి కుమారిని గౌరవించి, ఆరతి పట్టడంతో ఆమెలోని గొప్పతనాన్ని గుర్తించినట్లైంది.[16] ఆనాటి నుండి ఆమె గోదావరి మాతాజీగ ప్రసిద్ధి చెందింది.

1941 డిశంబరు 24 వ తేదీ ఉపాసనీ బాబా తుదిశ్వాస విడిచినపుడు సకూరు దుఃఖసాగరంలో మునిగినట్లైంది. కాని ఈ విచారం ఎంతో కాలం లేదు. ఉపాసనీ బాబా తన శక్తులను, మహిమలను, మాతాజీకి సంక్రమింపచేసాడని, అందువల్ల బాబా యొక్క 'అమృతాంశ' మాతాజీలో లీనమైవుందని అశేష భక్త జనం విశ్వసించారు.[17] ఉపాసనీ బాబాజీ మాతాజీలో పునర్దర్శిస్తున్నాడని, ఆయన మరణానంతరం శిష్యవర్గం విశ్వసించింది. ఆ పిదప ఇరవై ఎనిమిది సంవత్సరాలు బాబా స్థాపించిన కన్యాకుమారి స్థాన్‌ను నడిపించింది మాతాజీ. ఆమె సారధ్యంలో యువతులు, స్త్రీలు, వితంతువులు, సంస్కృత విద్యాభ్యాసాన్ని కొనసాగించారు.

గోదావరి మాతాజీని ముంగుర్తుగా వుంచుకొని, అనేక మంది ఆనాటి కన్యకలు ఉపాసనీ బాబాకు తమను తాము సమర్పించుకొన్నారు. వారిని గూర్చి సంపూర్ణ బాధ్యతను మాతాజీ స్వీకరించింది. ఈ శిక్షణలో ప్రధానాంశం విద్యాభ్యాసమే అయినా నామ జపం కూడ అత్యంత గణనీయమైన స్థానాన్ని ఆక్రమించు

16. **Mervin H. Harper**, *op.cit.* **p.** 189.

17. **Mani Shahukar, op cit p. 18.**

కొంది. ప్రతి 'అభ్యాసి' పవిత్ర దైవ నామాన్ని పునశ్చరణం చేయాలి. ఈ విధమైన పునశ్చరణం మనసును పునీతం చేసి, మర్మగర్భితంగా వున్న దివ్య జ్యోతిని గుర్తించగలిగే శక్తిని ప్రసాదిస్తుందని వారి నమ్మకం. ఆ తరువాతనే ధ్యానం సాధ్యమౌతుంది. ముందే సూచించినట్లు సంస్కృత గ్రంథాధ్యయనం, శ్లోకపఠనం, మంత్రోపాసన మొదలైన అభ్యాసాలన్నీ స్వయంగా గోదావరి మాతాజీ పర్యవేక్షణలో జరిగేవి.

ఆమె భక్తులు, కన్యాస్థాన్ ఆశ్రమవాసులు, తమ అనుభవాలలో అనేకాంశాలను గోదావరి మాత మహత్కార్యాలకు ఆరోపించి ప్రచారం చేస్తున్నారు. వారికి సమయానుకూలంగా తటస్థించే శారీరక, మానసిక ఇబ్బందులను, రుగ్మతలను కేవలం స్పర్శతోను, కనుదృష్టితోను మాతాజీ స్వస్థతపరచేవారని వారి సాక్ష్యం. అంతేగాక, ఆమెలో ప్రవచనా శక్తి వున్నదని, రాబోయే విషయాలను ముందే ప్రకటించేదని వారి నమ్మకం. ఆమె చేసిన అనేక మహత్క్రియల జాబితా ఆమె జీవిత చరిత్ర వ్రాసిన గ్రంథకర్తలు పేర్కొన్నందువల్ల తిరిగి వాటిని చెప్పనవసరం లేదు. పాఠకుల దృష్టికి ఒక్క విషయాన్ని మాత్రం తీసికొనివస్తే సరిపోతుంది.

మాతాజీ యొక్క యువభక్తురాలు గీతాబాయి. తీవ్ర అస్వస్థతకు గురై కొన్ని సంవత్సరాలు రుగ్మతతో పడివున్నపుడు వైద్యాలకు మల్లబడిన గీతాబాయి వ్యాధిని మాతాజీ కుదిర్చిందని, ఆ విషయాన్ని గీతాబాయి, ఆమెకు వైద్యంచేసిన డా॥ హనుమంతరావు తనతో చెప్పారని, మెర్విన్ హెన్రీ హార్పర్ తన గ్రంథంలో వ్రాస్తున్నాడు [18] అంతేగాక, తాను ఆశ్రమాన్ని దర్శించినపుడు జరిగిన సంభాషణలో ఆశ్రమవాసులు, కాని వారు కూడ మహత్కార్యాలను గూర్చి సాక్ష్యం చెప్పారట.

మాతాజీ వ్రాసిన గ్రంథాలేవీ లేవు. షిర్డి సాయిబాబా సంప్రదాయంలో తెలియవచ్చిన ఇతర గురువులు, ఉపాసనీబాబా, మెహర్‌బాబా, సత్య సాయిబాబాల వలె మాతాజీ గ్రంథాలేమీ వ్రాయలేదు. వారివలె దేశాటనం చేసి ఉపన్యాసాలు కొనసాగించలేదు. ఆధ్యాత్మిక పారవశ్యాన్ని పొంది, అపూర్వ అనుభవాలను

18. Mervin H. Harper, op.cit. p 191.

ప్రజలకు ప్రకటింపనూ లేదు. ప్రపంచంనుండి దూరంగా పోతేనే విమోచన అని ఆమె ప్రబోధింప లేదు. జీవితం అర్థయుక్తం, ఆనందదాయకం కావాలనే ఆమె సందేశం ఇక తనలోని ఆధ్యాత్మిక జీవన ప్రగతి వ్యక్తం కావడానికి ఆమె రెండు మార్గాల నవలంబించింది. ఒకటి కార్య నిర్వహణ లేదా విధి నిర్వహణ రెండవది ఇతరులకు సేవ. గీతోపదేశాన్ని ఎవరైనా అనుసరింపగలిగితే, అదే జీవిత పరమావధి అని మాతాజీ విశ్వాసం లోక తాపత్రయంతో నిమిషం తీరిక లేకుండా వున్న ప్రజల కీకన్యాకుమారి స్థాన్ మంచి ఆధ్యాత్మిక పునరుజ్జీవ కేంద్రంగా సేవ చేస్తున్నది. అట్టి సేవ గోదావరి మాతాజీ సాన్నిధ్యంలోనే సాధ్యమౌతుందని ఆశ్రమాన్ని దర్శించిన వారిచ్చే సాక్ష్యం.

ఆశ్రమవాసులు, దర్శకులు, తమ ధ్యానం కోసం, తమకు నచ్చిన విధానాన్ని అవలంబించినప్పటికి, వారికి కొన్ని మార్గ దర్శక సూత్రాలను ఆశ్రమ నిర్వాహకులు సూచిస్తూ వుంటారు శాస్త్ర యుక్తంగా నిర్వహింపవలసిన అన్ని విషయాలలో ఆశ్రమ వాసులకు తగిన శిక్షణ లభిస్తున్నది అక్కడే జరిగే ఆచార కర్మకాండ అంతటిలో ఆరతి, యజ్ఞం అత్యంత ప్రధాన కార్యాలు. దినానికి నాల్గు సార్లు ఆరతి కొనసాగుతుంది. కన్యాకుమారి స్థాన్ వాసులు దీపాలు వెలిగించుకొని, ఉపాసనీ బాబా విగ్రహానికి, ఆ పిదప మాతాజీకి ఆరాధనా గీతాలను పాడుతూ పూజలు చేస్తారు.

ఉగ్రదేవతను ప్రీతిపరచడం కోసం కొనసాగించే ఆచార కర్మకాండ- యజ్ఞం- ఆకాశదేవతల సన్నిధికి అర్పణలను కొనిపోయే అగ్నిదేవుని సమక్షంలో కానుకల అర్పణ ఆశ్రమంలో తప్పనిసరిగా జరిగే విధులు. అటచేరిన భక్తులు, ఆ మంటల్లో తమకు దేవుళ్ళు, దేవతలు కనిపించి వారి జీవితాలను శాసించారని ప్రకటిస్తారు కన్యాకుమారి స్థాన్‌లో నిర్మితమైన యజ్ఞమందిరంలో ఈ కార్యక్రమం నిర్వహింపబడుతున్నది.

మాతాజీ బోధలు ఇంతవరకు గ్రంథరూపాన్ని పొందకపోవడం శోచనీయం. కాని కొంతవరకు గోదావరి మాతాజి బోధలను, తాత్విక ధోరణిని, జీవిత సరళిని సమీక్షిస్తూ, మణి షాహుకారు ప్రచురించిన గ్రంథమే ఆధారభూతమైంది. ఈ గ్రంథాన్ని రచయిత్రి ముందు మాతాజీకి చదివి వినిపించి వ్యాఖ్యానించి, ఆమె

ఆమోదాన్ని పొందినట్లు గ్రంథకర్తి ప్రేర్కొన్నందువల్ల[19] ప్రస్తుతం మాతాజీని గూర్చి అధికారికంగా తెలియవచ్చిన గ్రంథమిదేనని చెప్పవలసివుంది. అయినా షిర్డీ సాయిబాబా పారంపర్యంలో సమీక్షింపబడిన మిగిలిన బాబాల బోధలకు, మాతాజీ బోధలకు పెద్దగా భేదాలు లేవని పాఠకులు గమనింపగలరు. ఆమె ఆరాధించేదేవుడు నిర్గుణ దేవుడు, భేదాభేదరహితుడు. కాని అట్టి నిర్గుణుని గూఢమైన శక్తిని నమ్మి ఆరాధించడం మానవకోటికంతటికి సాధ్యమైన పనికాదని మాతాజి గుర్తించింది. అందువల్ల తన భక్తశ్రేణిలో నిరక్షరాస్యులైన వారికి, విస్తృతమైన అవగాహన శక్తిలేని సామాన్యుల కొరకు ఆమె సగుణదేవుని కూడ విశ్వసిస్తుంది, ప్రకటిస్తుంది. సగుణ బ్రహ్మారాధన సర్వజనులను స్వయం సిద్ధికి నడిపింపగలదని ఆమె నమ్మిక. అయితే ఈ నమ్మిక ఉత్కృష్టమైన నిర్గుణ దేవుని ఆరాధింపలేనివారి సహాయార్థమే. భక్తులు ఆరాధించే వ్యక్తిత్వ సగుణ బ్రహ్మకు, నిర్గుణబ్రహ్మకు భేదం లేదనే వివేకానందుని సూత్రాన్ని మాతాజి ఆమోదించింది. సర్వం బ్రహ్మమయమైనపుడు సగుణ, నిర్గుణ బ్రహ్మలను గూర్చిన ప్రశంస ఎందుకు? అని ఆమె ఎదురుప్రశ్న వేస్తుంది.

విశ్వంలో ప్రత్యక్షమైన ఈశ్వర- వ్యక్తిగత దేవుని-మాతాజి ప్రబోధి స్తుంది. అయినా ఆవిడ అద్వైతవాది గనుక ఆ సిద్ధాంత ప్రకారం బ్రహ్మమినహా సమస్తం మిధ్య లేదా మాయప్రభావం గనుక అట్టి మాయాప్రభావ ఫలితమైన ప్రపంచానికి ఆమె ఎట్టి విలువను ఆపాదింపదు. అన్ని ఆచరణీయమైన కార్యక్రమా లకు ప్రపంచం వాస్తవమైనదనే ఆమె విశ్వసించింది. అందువల్ల ప్రపంచాన్ని విసర్జించి, దూరంగా పోయి జీవించుడని ఆమె ఎవరికీ సలహా ఇచ్చిన దాఖలాలు లేవు తనలో వున్న మోహాన్ని గుర్తించి, దానిని దూరం చేసికొనలేని వ్యక్తి ప్రపంచానికి దూరంగా పోయినా ఫలితం శూన్యమని మాతాజి ప్రబోధం. అందు వల్ల సత్ప్రవర్తనతో లోకంలో జీవిస్తూ, ప్రపంచ పరిత్యాగం కన్న ఉన్నతమైన మానవసేవా కార్యక్రమాన్ని చేపట్టడం శ్రేయస్కరం అని మాతాజి ప్రకటి స్తుంది. అంతేకాదు, జీవిత బాధ్యతలనుండి తప్పించుకొని పోయేవారిని ఆమె హెచ్చరిస్తుంది కూడ.

మానవుడు ప్రాథమికంగా మరియు స్వభావికంగా దైవాంశ సంభూతుడు. 'మనం దేవుని అంశలో భాగమైనందువల్ల మనం దేవుళ్ళం. మనమే దేవుళ్ళ

19. Mani Shahukar, *op.cit.* p. VI

మైనపుడు తిరిగి ఉపవాసవ్రతాల వల్ల దేహాన్ని శ్రమలపాలు చేయవలసిన అవసరంగాని ప్రత్యక్షంగా సిద్ధిని పొందే సందర్భం కాని లేదని ఆమె ప్రబోధించింది. మనలో దేవుడున్నందువల్ల ఆయన శక్తిజనితమైన సన్నిధి మనలో నుండి బయల్వెడలే అవకాశం స్వాభావికంగా వుంది. అట్టి పరిస్థితుల్లో మరొక గురువును ఆశ్రయించవలసిన అవసరం ఎందుకు జనిస్తుందని ప్రశ్నిస్తున్నది మాతాజీ.

పవిత్రం, దైవసహజాతమైన నిజమైన ఆత్మ జీవనాన్ని మరచి దూరంగా పోవడమే పాపం మానవుని సత్ప్రవర్తకునిగా శాశ్వతంగా భద్రపరచాలనే దైవ ప్రయత్నం నుండి మనుష్యుడు దూరం ఔతున్నందువల్లనే అతడు పాపకూపంలో చిక్కుకొంటున్నాడు. అందువల్ల ఆ దశనదాటి పరమాత్మలో లీనం కావడమే రక్షణ. ఆ విధమైన సంపూర్ణ సంలీనం చెందకపోతే, జీవాత్మకు పూర్ణసిద్ధి కాని, ప్రయోజనంకాని లేదని మాతాజి ఉద్బోధ.

బాబాలలో కొందరు తాము ఫలానావారి అవతారాలమని, భగవానులమని, తమకు తోచినవిధంగా గుణాలను, బిరుదాలను ఆపాదించుకొంటున్నారు. అవే ఆనోట ఆనోటపడి గ్రంథాలలో ప్రవేశించాయి. కాని మాతాజి తననుగూర్చి తానొక్కమాట కూడ చెప్పకపోవడం విశేషం. 'మాతాజి తమరు సత్పురుష, అవతారమా, పవిత్రమూర్తులా?' అని మణిసాహుకారు అడిగినపుడు మాతాజి, 'పై మూడు లక్షణాలు ఒక్కటే కదా! ఆ స్థాయిని చేరేవరకే తారతమ్యాలు. ఒకసారి అట్టి, అంతిమదశను చేరిన పిదప సమస్తం సమానం, సర్వభేద రహితమ'ని సెలవిచ్చారు.[20]

గురువుయొక్క కర్తవ్యం రెండు విధాలని, కోరిన వారిని సన్మార్గ వర్తనులుగా దిద్దడం, తననుతాను సంపూర్ణంగా లోపరచుకొనడమని మాతాజి అభిప్రాయం. అందువల్ల ఈ రెండు కార్యాలను కొనసాగిస్తున్నది. ఆ దృష్టితో పరిశీలించినపుడు మాతాజి గురువ్యవస్థలో ప్రముఖవ్యక్తిగా భావించవచ్చు.

ఆమెను ఆరాధించే భక్తులకు ఆమె కలియుగ కృష్ణ. కొందరికి 'రాధ' మరికొందరికి భగవతి ఆద్యశక్తి. అనాదినుండి దేవునికిచెందిన స్త్రీ, శక్తి, దేవునిలో వుండి ఆయన వుద్దేశాలను క్రియాత్మక రూపాన్ని కలిగించి ప్రేరేపించే మూలశక్తి.

20. *Ibid* p. 63. also see pp. 23–28.

# ఉపసంహారము

ఇప్పటివరకు ఈ గ్రంథంలో దాదాపు ఒకటిన్నర శతాబ్దం ఇటు స్వదేశంలో అటు విదేశాలలో మతపరమైన అలజడితో పాటు ఆధ్యాత్మిక క్షేత్రాన్ని కలిగిస్తున్న బాబాలను, స్వామీజీలను గురుమహారాజులను, మాతృమూర్తులను వారి ఉద్యమాలతో సహా స్థాలీపులాకంగా చర్చించడం జరిగింది. ఈ చర్చ ఏ పరిస్థితుల్లోను సమగ్రమైందనిగాని, కూలంకషమైందనిగాని గ్రంథకర్త అభిప్రాయపడడం లేదు. సమకాలీనంగా ఆవిర్భవించిన హిందూమత గురూద్యమాలలో కొన్నిటినైనా పాఠకులకు పరిచయంచేసి, వారిలో మరింత పఠన, పరిశోధనాసక్తిని రేకెత్తించాలనే తహతహతోనే ఈ గ్రంథం వ్రాయబడింది. ఈ ఉద్యమాలన్నీ మూసలోపోసి తీసినట్లు ఒకే కోవకు చెందినవి కాకపోయినా, ఏ నాయకుని కానాయకుడే తన అభిరుచికి, అవకాశానికీ అనుకూలంగా వీనిని నిర్మించినప్పటికి, వీరి బోధల్లో కొన్ని సామ్యాలు కనిపిస్తున్నాయి.

ఒకరిద్దరు-ముఖ్యంగా స్వామిభక్తి వేదాంత ప్రభుపాద మినహా మిగిలిన వారందరు శంకరుడు ప్రతిపాదించిన అద్వైత సిద్ధాంతాన్ని నమ్మి, దాని కనుగుణంగా తమ బోధల్ని మలుచుకొన్నవారే. సర్వోన్నతమైన బ్రహ్మయొక్క స్వభావ లక్షణాదులను, జీవాత్మ పరమాత్మల సంబంధాన్ని, ఆయా వ్యక్తులకు మధ్య వుండే పరస్పర అనుబంధాన్ని అద్వైత్వ సిద్ధాంతంయొక్క పరిధుల్లోనే వివరింప ప్రయత్నించారు. బ్రహ్మయొక్క సర్వాతీతత్వం పరబ్రహ్మం. ఈ పరబ్రహ్మయొక్క ఉనికిని సూచించడానికి వారు వాడిన పదజాలం సత్ చిత్ ఆనంద్. ఈ సచ్చిదానంద మినహా మిగిలిన సమస్తం మాయాజనితమైన మిథ్య అని వారి ప్రచారం. 'నీవు బ్రహ్మ, నేను బ్రహ్మ, సర్వం బ్రహ్మమయం' అనేది వారి ప్రగాఢ విశ్వాసం. కాగా భక్తి సిద్ధాంతాన్ని అనుసరించిన వేదాంత ప్రభుపాద విశిష్టాద్వైతాన్ని, వల్లభాచార్యుడు ప్రతిపాదించిన ద్వైతాద్వైత సిద్ధాంతాన్ని ప్రకటించి, పై గురువర్గం నుండి వేరైనాడు.

అద్వైత సిద్ధాంత ప్రకారం సంసార బంధాల నుండి విమోచనకు ఏకైక మార్గం బ్రహ్మైక్యాన్ని సాధించడం. బ్రహ్మైక్యానికి మూల మార్గం వేదాంతా

ధ్యయనం. ఏ వ్యక్తి కూడ తనకై తాను స్వీయాధ్యయనం వల్ల వేదాంత పర మార్గాన్ని గ్రహించలేడు గనుక గురువు నాశ్రయింపక తప్పదు. ఆ గురు సాన్ని ధ్యంలో పఠించే వేదాంతమే వేదాంతం ఆ విధంగా గురువు యొక్క అవసరాన్ని నొక్కి చెపుతూ, పరబ్రహ్మ స్వరూపమే గురువనే భావాన్ని అనుచర వర్గంపై ముద్రించారు.

గురువు బ్రహ్మ యొక్క ప్రతినిధిగా మాత్రమే గాక దైవావతారంగా ప్రకటించుకొని ఈ గురు వర్గం శిష్యకోటి నుండి సమస్త గౌరవ మర్యాదలను పొందుతున్నారు. కంటి ముందు సాక్షాత్కరించిన గురువే అదృశ్య దేవుని ప్రతి రూపంగా వీరి అనుచర వర్గం భావించడానికి దోహదం కలిగించారు. అయితే స్వామి భక్తి వేదాంత ప్రభుపాద "దేవుడు దేవుడే-మనుష్యుడు మనుష్యుడే. ఏ మనుష్యుడైనా తాను దేవుణ్ణని ప్రకటించుకొంటే అతడు దేవుడు (God) కాదు గాని డాగ్ (Dog)" అని విస్పష్టంగా ప్రకటించి తన ప్రత్యేకతను ఋజువు చేసి కొన్నాడు.

షిర్డీ సాయిబాబా తాను దైవ అవతారాన్నని ప్రకటింప, ఆ సంప్రదాయానికి చెందిన మెహర్బాబా "ఈ యుగ క్రీస్తునని" తెలియజేశాడు. ఇక అదే సంప్ర దాయానికి చెందిన సత్యసాయిబాబా తాను షిర్డీ సాయిబాబా యొక్కయు, శివ, శక్తి యొక్కయు అవతారాన్నని శిష్యవర్గానికి సూచించాడు. అంతటితో ఆగలేదు- "నీవు క్రీస్తువా?" అని అడిగిన ఒక విదేశీ విలేఖరి ప్రశ్నకు "కాదు, నే నాయన తండ్రిని" అని చెప్పి, తాను లేకపోతే క్రీస్తు లేడనే భావాన్ని ధ్వనింప చేశాడు. అయితే తాము క్రీస్తు అవతారాలమని ప్రకటించుకొన్నవారి జీవితాలను, బోధలను సమన్వయం చేసి వారి జీవిత సరళిని క్రీస్తు జీవిత సరళితో తులనాత్మకమైన పరిశీలన చేస్తేనేగాని అందలి సత్యాసత్యాలు వెలికిరావు. ఈ గ్రంథకర్తకు తెలియ వచ్చిన పై గురువుల జీవిత విశేషాలు, బోధలనుబట్టి వారి స్వయం ప్రకటనలకు జీవన విధానానికి వ్యత్యాసం హస్తిమశకాంతరం వున్నదనే విషయాన్ని నొక్కి చెప్పవలసివుంది.

ఆచార్య రజనీష్ తన వాకచక్యం, మాటల కూర్పులో గల నేర్పును ప్రదర్శించి భగవాన్ రజ్నీష్‌గా పాశ్చాత్య ప్రపంచంలో ఉప్పెన తీసికొని వచ్చి

నాడు ఈ గ్రంథకర్త "భగవాన్" అంటే ఏమిటని ఒక విదేశీయుని ప్రశ్నించి నపుడు అతడు "అది ఆయన యింటి పేరని" జవాబిచ్చాడు. ఇది శోచనీయమైన పరిస్థితి, వారి అమాయకత్వానికి, అంధ అనుగమనానికి ప్రతీక.

ఈ గురువులందరు తమదైన ప్రత్యేక బోధల సరళిని అవలంబించి, తమ మత గ్రంథాలకు ప్రాముఖ్య స్థానాన్ని కల్పించక పోవడం గమనార్హమైన మరో విషయం. ప్రతి గురువు తన ఉపదేశాలను భద్రపరుస్తున్నందువల్ల వారి వారి శిష్యులు వారి మూలమత గ్రంథాలను గాక, ఈ బోధలకే అత్యంత ప్రధాన మిచ్చే పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ఉదాహరణం మెహర్ బాబా శిష్యులను, సత్సంగీలను పేర్కొనవచ్చు.

ఈ గురువులందరు ధనాన్ని, జనాన్ని కూడదీసినవారే! ధన సంపాదనకు జనాన్ని కూడగట్టాలి జనాన్ని కూడగట్టడానికి నానా విధమైన ఆకర్షణా పద్ధతుల నవలంబించాలి. అనేక విషయాలతో రాజీ పడాలి. ఈ రాజీ "ఐహికసుఖమే ఆముష్మిక సాధనం" అన్నంతవరకు వెళ్ళడం శోచనీయమని వేరుగా చెప్పనక్కర లేదు. ధనాకాంక్ష ఎంత అధః పతనానికి నడిపిస్తుందో ఒకరిద్దరి వృత్తాంతాలు గుర్తు చేస్తున్నవి.

వీరు సృష్టించి అయితే ఉచితంగా లేదా నామమాత్రపు ఖరీదునకు సరఫరా చేస్తున్న సాహిత్యాన్నిబట్టి వీరు ప్రచార సాహిత్య నిర్మాతలేగాని సిద్ధాంతులు కాదన వలసి వస్తుంది. ఆచార్య రజనీష్ మాటల్లో, చేతల్లో పొంతన లేకపోతే పోయె బాహాటంగా పెట్టుబడిదారుగా, ధనిక వర్గాన్ని బలపరుస్తూ ప్రబోధిస్తున్నారు అది ధనికవర్గాన్ని ఆకర్షించి డబ్బుచేసికోడం కోసమే! మహర్షి మహేష్ యోగి రచనలు శాస్త్రీయ పరిశోధనకు నిలవవలసివుంది. భక్తివేదాంత ప్రభుపాద తన రచనల విస్తృత పరిధిని తగ్గించి కృషిచేస్తే మంచి సిద్ధాంత నిర్మాతగా రూపొంది వుండే వాడు.అనేక ప్రణాళికలను చేపట్టి విస్తృత రచనా వ్యాసాంగాన్ని కొనసాగించినందు వల్ల ప్రచారకుడుగానే ఈ గ్రంథకర్త దృష్టిలో ఆయన స్థిరపడిపోయాడు. వారున్న తావుల్లో - ఆశ్రమాలనబడే నివాస భవనాలు గల ప్రదేశాలలోనే - ధ్యాన మంది రాల నిర్మాణం కొనసాగించడం గూడ ఈ గురు పరంపర యొక్క లక్షణం వారే గురువులు, వారే పూజారులు, వారే ఆచార్యులు, వారే మనస్తత్వ విశ్లేషణ

కర్తలు. ఒక వ్యక్తికి లౌకిక జీవనం కోసం ఏమేమి అవసరమో-జీవనోపాధితో సహా-వానిని ఈ గురు వర్గం తమ అనుచరుల అందికలోనికి తీసికొని వచ్చారు. రాధాసామి సత్సంగ్ తమ అనుచరులకోసం కుటీర పరిశ్రమలను నిర్మించింది. వేదాంత ప్రభుపాద 'నవీన ద్వారక'లను, 'బృందావనా'లను నిర్మింప, ఆచార్య రజ్నీష్ సన్యాస సామూహిక సహజీవన కేంద్రాలను నిర్మించడాన్ని ఇందుకు ఉదాహరణలుగ పేర్కొనవచ్చు.

ఈ ఉద్యమాలన్ని మిషనెరీ ఉద్యమాన్ని తీవ్రతరం చేసి కొనసాగిస్తున్నవి. గురువులు, వారి వారి అనుచరులు గణనీయమైన ఆధ్యాత్మిక సత్యాలను సాధించి నామని నమ్మి, వానిని ఇతరులతో పంచుకోడానికి తహ తహ లాడిపోతున్నారు. వారి అనుచరులు తమ సమయాన్ని సంపదను ధారాళంగా గురువుల పాదాంకితం చేస్తారు. నిలువుదోపిడీ దేవుడికివ్వడం విన్నాం వీరు తమ గురువులకు తమ శరీరాలను ఒలిచి సమర్పిస్తారు. ఆచార్య రజ్నీష్, భక్తి వేదాంత ప్రభుపాద, మహర్షి మహేష్ యోగి, సత్యసాయిబాబా, రాధాసామి సత్సంగ్ బియాస్-ఒకరుకాదు, దాదాపు అందరూ ఈ విషయంలో ముందడుగు వేసినవారే!

కాగా, ఈ ఉద్యమాలు ఇంటా బయటా అభివృద్ధి కావడానికి-ఎన్నో పరిస్థితులు కలసికట్టుగాను, విడి విడిగాను తోడ్పడిన మాట వాస్తవం. ఆ పరిస్థితులను మూడు వర్గాలుగా విశ్లేషించి, ఒక్కొక్క వర్గంయొక్క విశేషాంశాలను పరిశీలించవలసి వుంది స్వదేశంలోనూ, విదేశాలలోను మొత్తం మీద ఈ గురూద్యమాలు ప్రగతిని సాధించి ప్రజలను ఆకర్షించడానికి తోడ్పడిన పరిస్థితులు మొదటి వర్గం. కేవలం భారతీయ సంస్కృతి యొక్క పరిధిలోనే ఉద్యమాలు విజయానికి వ్యాపకానికి తోడ్పడిన కారణాలు రెండవ వర్గం. విదేశాలలో ఈ ఉద్యమాలు వేరూనడానికి కొంతవరకు స్థిరపడడానికి, అవకాశాన్ని కల్పించిన మత సాంఘిక పరిస్థితులు మూడవ వర్గం.

మొత్తంగా గురూద్యమాల ప్రగతికి దోహదం చేసిన పరిస్థితులు :

1. ఈ ఉద్యమాలలో దీక్షపొందిన వ్యక్తుల యొక్క ధ్యేయం కేవలం గురునాజ్ఞలను, ఉపదేశాలను శిరసావహించి, ఆయన నిర్దేశించిన మతాచార కర్మకాండను, అనుష్టాన పద్ధతిని, క్రమశిక్షణను పాటించడంవల్ల ఉభయుల

మధ్య ఏర్పడిన సన్నిహిత సంబంధం. సంప్రదాయ మతాలలో-క్రైస్తవ మతంతో కలుపుకొని గురువుకు వ్యక్తికి మధ్య ఇట్టి సన్నిహిత సంబంధం కాని, పరస్పర అనుబంధం, సహవాసంగాని అంతగా లేకపోవడాన్ని గమనించవలసి వుంది. పురోహితుడు, మౌల్వీ, ఆచార్యుడు, పాస్టర్ వీరు వారి వారి నిర్దేశిత కార్యక్రమాలకే అంకితమై, యాంత్రికంగా తమ విధులను నిర్వహిస్తూన్నందువల్ల ఎక్కడో ఎప్పుడో తప్ప పై పూజారి వర్గం ప్రత్యేకం, వ్యక్తిగతం, సన్నిహితం, కేంద్రీకృతమైన దృష్టితో తమ సభ్యులను సేవించలేక పోతున్నారు. ఆధ్యాత్మిక తృష్ణతో తపించే వారికీ ఈ మత నాయకులకు మధ్య అగాధాలు లేకపోవచ్చు కాని, అన్ని సందర్భాలలో సన్నిహిత సంబంధం కూడా లేదు. అక్కడలేని అవకాశాన్ని గురువులు తమ శిష్యులకు కల్పిస్తున్నారు. పరస్పరం మనసు విప్పి మాట్లాడుకోవటానికే కాదు – గురువు తన నే స్థితికైనా నడిపింప శక్తిగల వాడనే విశ్వాసం తమ శిష్యవర్గంలో ఏర్పడుతున్నది.

౭. గురు, శిష్యులు ఇద్దరు కూడా సామాన్య మానవులే! అన్ని విషయాలలో ఒకరివంటివారు మరొకరు. కాగా, తనవంటి వ్యక్తి కేవలం కొన్ని ఆధ్యాత్మిక ప్రక్రియల నభ్యసించి, క్రమశిక్షణను పాటించి, మరొకరిని తనంతటి స్థితికి నడిపింపగల సమర్థతను సాధించి తన కంటె ముందున్నపుడు తాను కూడా అట్టి క్రమశిక్షణాబద్ధమైన జీవన విధానం ద్వారా అంతటి వాడు కాగలడనే స్వీయనమ్మకం శిష్యునిలో కుదురుకొనేటంతగా గురువులు కృషి చేస్తున్నారు. అట్టి మార్పు సంభవమనే నమ్మిక శిష్యుని మనో ఫలకంపై ముద్రించగలుగుతున్నారు.

గురువు ప్రత్యక్షంగా శిష్యుని ఆధ్యాత్మిక జీవిత ప్రస్థానంలో భాగస్వామి కావడం మరో కారణం. అతని సమస్యలను పరిష్కరించి, అతని తప్పొప్పులు కట్టిపెట్టి, తప్పటడుగుల నుండి స్వయం సమృద్ధి సిద్ధించే పర్యంతం వారి ప్రగతిని పర్యవేక్షించడమే గాక సహాయం చేయడం ద్వారా శిష్యుల్లో నమ్మికను కలిగిస్తున్నారు. అంతేగాక సిద్ధాంతపరంగా, ఆచరణీయంగా శిష్యు డెదుర్కొనే అనేక క్లిష్ట సమస్యలను అవలీలగా

పరిష్కరించగల, జ్ఞాన వివేచన గురువునకున్నదనే శిష్యవర్గం విశ్వసిస్తున్నది. వేదవేదాంగాలు ఏమి ఘోషిస్తున్నాయనేదిగాక, గురువేమి సెలవిస్తున్నాడనేది శిష్యవర్గం యొక్క సంబంధిత విషయం. ఆయన మాటే వేదంగా, ఆయన జీవితమే ఆదర్శప్రాయంగా శిష్యవర్గం భావిస్తుంది. అట్టి ప్రగాఢ విశ్వాసాన్ని తమ శిష్యుల్లో కలిగించి వారి జీవితాలను గురువులు అక్షరార్థంగా ఏలగలుగుతున్నారు

3. సంప్రదాయ మతాలు యాంత్రికమైన పూజాపురస్కారాలు, ఆచార కర్మకాండ, మసీదు ప్రార్థనలు, దేవాలయ ఆరాధనలతో కాలక్షేపం చేస్తూవుంటే, ఈ గురువుల్లో కొందరు- అందరు కాదు సుమా- అట్టి యాంత్రిక పరిచర్య ద్వారా నిరాశాని స్పృహాలకు లోనైన వ్యక్తులయొక్క వయస్సుతో నిమిత్తం లేకుండా వారిని ఆకర్షిస్తున్నారు. వారికి ఆపద్బాంధవులుగా, ఆత్మీయులుగా కనిపిస్తున్నారు.

ఈ ఉద్యమాలలో కొన్ని భారతదేశంలో బలపడడానికిగల కారణాలు :

1. భారతీయ సంస్కృతి పరిధిలోనే తమ విశ్వాసాన్ని ప్రకటించి, భారతీయ జీవన విధానాన్ని ఆకళింపు చేసికొని, ఆ జీవన విధానాన్ని అవలంబించి నూటికి నూరుపాళ్ళు దేశీయంగా ప్రజల్లో తమను తాము ప్రత్యక్షపరచుకొనడం ప్రధాన కారణం. షిర్డీ సాయిబాబా, మరికొందరు దరిద్ర నారాయణుల జీవిత స్థాయిని కొనసాగించారు. భిక్షాటనంలో లభించిన పదార్థాలను తిరిగి దానం చేసి, మిగిలితేనే వారు తినడం జరిగింది. అపుడపుడు సాదరంగా ప్రజలతో సంభాషించడం, మహత్క్రియలు చేయగలరనే నమ్మకం ప్రజల్లో కలిగించడం వీరి ఉద్యమాలు ఇట వృద్ధి కావడానికి, ఇక్కడ స్థిరపడడానికి తోడ్పడినై.

2. మతపరంగా సరాసరి జ్ఞానవంతులైన భారతీయులు అవతార సిద్ధాంతాన్ని బేషరతుగా విశ్వసిస్తారు. అందువల్ల షిర్డీ బాబా, సత్యసాయిబాబా తదితరులు తాము దైవావతారులమని, మహత్క్రియలు చేయగల వారనే అభిప్రాయాన్ని ప్రజల్లో కలిగించినందువల్ల ఈ రెండు లక్షణాలుంటే. మిగిలిన వానిని అంతగా పట్టించుకొనని ప్రజలు, వీరి చుట్టూచేరి భజనలు ప్రారం

ఖించారు. మొదట గ్రామం, ఆ పిదప ప్రాంతం - ఇలా వేలంవెర్రిగా ప్రజలు ఎగబడడం జరుగుతున్నది. మరికొందరు ఆదర్శవంతమైన జీవితం, వయసుకు అనుభవానికి మించిన బోధలు చేస్తూ భారతీయుల నాకర్షించారు. అలాగే ఆడంబరం, పటాటోపం, ప్రచార సాధనాలను ఆసరా చేసికొని, ఉన్నతస్థానంలో ఉన్నవారి ప్రాపకాన్ని సంపాదించి వారి పలుకుబడిని ఆయా సందర్భాలలో వారు వెలువరించే పత్రికా ప్రకటనల ద్వారా ప్రజలదృష్టిని, ఆదరాభిమానాలను వారు పొందగలుగుతున్నారు.

3. విద్యాజ్ఞానం, విచక్షణాశక్తి అంతగాలేని గ్రామీణప్రజ ఈ స్వామీజీలను, గురు మహారాజులను సాక్షాత్తు దైవావతారాలుగ ఎంచి, వారి శక్తికిమించి ప్రచారం చేయడం మరో కారణం. అయితే ఇట్టి పూజా పురస్కారాలు కేవలం భక్తితో చేసేవే కావని, అందులో కొన్ని భయభీతులవల్ల ప్రజలు చేస్తున్నారనే ఆరోపణ వున్నది. షిర్డీ సాయిబాబా, ఆయన శిష్యుడు ఉపాసనీ బాబా తీవ్ర క్రమశిక్షణ, ఆదర్శవంతమైన జీవితం ద్వారా ప్రజల్ని ఆకర్షించారు. మా ఆనందమయి, సతీ గోదావరి మాతాజీ కేవలం అక్షరజ్ఞానం లేనివారు. అయినా వారివెంట అశేష ప్రజానీకం నడుస్తున్న దంటె అందుకు కారణం వారి ఆదర్శ జీవితం.

4. రాధాసామి సత్సంగ్ హిందూ, ముస్లిమ్, సిఖ్, క్రైస్తవ మత గ్రంథాల నుండి సూక్తులను స్వేచ్ఛగా ప్రయోగిస్తూ తమదొక ప్రత్యేక మత శాఖకాదని అందరికి అవసరమైన ఆధ్యాత్మికోపదేశం సాధనం వారిదగ్గర లభిస్తుందని ప్రకటించి, సాంఘిక కార్యక్రమాల చేపట్టి ప్రజాభిమానాన్ని చూరగొన్నది. స్వామి శివానంద, వివేకానందుడు ప్రారంభించిన నవీన వేదాంతోద్యమాన్ని ఆసరా చేసికొని, ఉన్నతవిద్యతో రెండుచేతులా సంపాదిస్తున్న ఆస్తిని దానంచేసి, కోరి సన్యాసిగా జీవించి, ఆశ్రమాన్ని స్థాపించి, హిందూ మత సంప్రదాయాలకు తు చ. తప్పక తనను, తన బోధనలను లోబరచు కొని, సంప్రదాయ భారతీయుల్లో నవీన చైతన్యాన్ని తీసికొనిరా ప్రయత్నించాడు. కాగా, సామాన్య ప్రజలయొక్క అవగాహన స్థాయిని దాటిపోయిన 'శ్రీ కృష్ణ చైతన్య సంఘం' 'అతీంద్రియధ్యానం' మొదలైన ఉద్యమాలు అవి పుట్టిన కాలంలో ఇక్కడ పెరిగి పెద్ద కాలేకపోయాయి. 1950 లోనే

చైతన్య మహాభక్తుని జన్మస్థలంలో వెలసిన హరేకృష్ణ ఉద్యమం 1966 లో అమెరికా వెళ్ళేంతవరకు ఇక్కడ తెలియరాలేదు. 'హరేకృష్ణ' అన్నంత వరకు అర్థం చేసికోగల సామాన్య ప్రజ 'కృష్ణ చైతన్యం' అనే భావాన్ని గ్రహించలేకపోయింది. ఆనాడు ఆ భావాన్ని ఇక్కడ విడమర్చి చెప్పే స్తోమతుగలవా రున్నప్పటికి, ఆర్థికంగా వనరులు లేనందువల్ల ప్రజా బాహుళ్యంలోనికి చొచ్చుకొని పోలేకపోయింది. అలానే అతీంద్రియ ధ్యానం కూడ. 'నీవున్న చోటనే పది నిమిషాలు నీ మనసును లగ్నం చేయి. ఆధ్యాత్మికంగా క్రమబద్ధం చేసికొని 'ప్రశాంత చలనశక్తిని' పొందితే పునఃశక్తి సంధానులు కావచ్చు' అనే నినాదం సామాన్యులకు ఎలా అర్థం ఔతుంది? పైగా, ఈ ధ్యానానికి ఏ విగ్రహంగాని పటంగాని అక్కరలేదన్నపుడు విగ్రహాలకు, పటాలకు,చెట్టుకు పుట్టకు కొబ్బరికాయలు కొట్టి పాలు పోసే గ్రామీణ సంస్కృతి కిధ్యానం ఎలా అతుకుతుంది? కాగా రజనీష్ ఆశ్రమం ప్రారంభం నుండి ఆర్థిక స్తోమతుగల వారికేగాని సామాన్యులకు కాదని వేరుగా చెప్పనక్కర లేదు. అందువల్ల సామాన్య ప్రజల స్థాయికి దిగి రాలేదు. ఆయన్ని గూర్చి ఆశ్రమవాసులకు మించి ఎవరికైనా ఏమైనా తెలిస్తే, అది వార్తా పత్రికల ద్వారా, విమర్శలు ప్రతి విమర్శల ద్వారానేగాని అనుభవపూర్వకంగా కాదు. ఆయన ఉద్యమం మొదట పూనేకు పిమ్మట అమెరికాకు ఆ పిదప అనేక దేశాలకు వ్యాపించింది. ఆయన అనుచరవర్గం స్థాపించిన సన్యాస సామాజిక సహజీవన కేంద్రాలలో కొన్నిటిని ప్రస్తుత గ్రంథకర్త అమెరికా యూరప్ దేశాలలో దర్శించడం జరిగింది. పూనేలో ఏమి జరిగిందో ఆయా కేంద్రాలలో కూడా అదే జరుగుతున్నది. ఆ విధానాలు భారతీయ సంస్కృతికి-మరీ ముఖ్యంగా గ్రామీణ సంస్కృతికి అతకని విషయాలు.

మెహర్ బాబా కోకొల్లలుగ సత్యసాయి బాబా చెల్లా చెదురుగా విదేశీయుల నాకర్షిస్తే-రాధాసామి సత్సంగ్, దివ్య జీవన సమాజం, కృష్ణచైతన్య సంఘం, అతీంద్రియ ధ్యానం, రజ్నీష్ వుద్యమం ఆ దేశాలలో చాలావరకు స్థిరపడివున్నాయి. విదేశాలలో ఒక్కొక్క వుద్యమ విజయానికి తోడ్పడిన కారణాలు వేర్వేరుగా వున్నప్పటికి ఈ వుద్యమాలన్ని ఆయా దేశాల్లో ముఖ్యంగా అమెరికాలో స్థిరపడి శతాబ్దాల తరబడి పాదుకొనివున్న క్రైస్తవ మత ప్రభావంనుండి అనేకుల్ని

ముఖ్యంగా 'యువతను' ఆకర్షించడానికి అనేక కారణాలున్నవి. వాటిని కూడ ఇట కొంతవరకు ప్రస్తావించవలసివుంది.

ఈ గ్రంథకర్త 1978 - '80 కాలంలో విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో ఆసియా మతాల తులనాత్మకాంశాలను అధ్యయనం చేస్తూ పరిశోధన గావిస్తున్న సమయంలో న్యూయార్క్, చికాగో, హోస్టన్ మొదలైన మహా నగరాలలో స్థాపింపబడిన అనేకోద్యమ సంస్థలతో పాటు రెండవ స్థాయి నగరాలలో విశేషాంను స్వయంగా పరిశీలించే అవకాశం కలిగింది. సాధారణంగా అమెరికన్ యువత స్వేచ్ఛాకాముకమైంది. తల్లిదండ్రుల ఇతర పెద్దల దృక్పథం కూడ వారిలో ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాన్ని పెంపొందించేదే కాని త్రుంచేది గాదు. అట్టి స్వేచ్ఛా ప్రవృత్తికి అలవాటుపడినవారు ఎక్కడో పదివేల మైళ్ళ దూరం నుండి వచ్చిన భక్తివేదాంత ప్రభు పాదకో, మహర్షి మహేష్ మహాయోగికో, చరణ్‌సింగ్ గురు మహారాజుకో, బాలయోగీశ్వర్‌కో- ఆచార్య రజనీష్ అప్పటికింకా అమెరికాలో అడుగు పెట్టలేదు- పాదాభివందనం చేసి తమ సర్వస్వంతోపాటు వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని ధారాదత్తం చేయడాన్ని గమనించినవారికి అనేక ఆలోచనలు తలెత్తక పోవు ఇందుకు కారణం గురు ప్రభావమా? లేక అమెరికాలో మారుతున్న సాంఘిక, మత పరిస్థితుల ప్రభావమా? అనే మీమాంస కలుగుతుంది. గురు ప్రభావాన్ని గూర్చి తిరిగి ఇక్కడ చర్చించ నక్కరలేదు, ఆయా గురు మహారాజుల జీవిత విశేషాలు, బోధల తీరుతెన్నులు ఇంతకు ముందే ప్రస్తావించడం జరిగింది. కాకుంటే ఇక్కడొక విషయాన్ని జ్ఞాపకం చేయాలి.

ప్రత్యేకంగా పాశ్చాత్య యువతను, కొంచెం మధ్య వయసు దాటి మత విషయాలలో గట్టి పట్టుదల లేనివారిని ఆకర్షించడానికి దాదాపు గురువు లందరు- షిర్డీ సాయిబాబా, ఉపాసనీ బాబా మినహాయించి- హిందూ క్రైస్తవ మత బోధలను స్వేచ్ఛగా సమ్మిశ్రణంగా వాడుకొన్నారని చెప్పాలి.

భక్తి వేదాంత ప్రభుపాద తాను స్థాపించిన **'Back to Godhead'** అనే మాస పత్రికలో అనేక మారులు క్రైస్తవ మత గ్రంథం నుండి అనేక వచనాలను స్వేచ్ఛగా, తన వాదనకు సరిపడునట్లు వ్యాఖ్యానించినాడు. మహర్షి మహేష్‌యోగి తనదొక మత సంస్థ కాదని కేవలం ఇష్టముండి చేర వచ్చిన వారిలో అతీంద్రియ ధ్యానాభ్యాసం ద్వారా నూతన జీవితానికి నాంది పలకడమే తన

గుర్తైనందువల్ల తనది లౌకికోద్యమమేనని ప్రకటించాడు చరణ్‌సింగ్ సద్గురు మహరాజ్, బాలయోగీశ్వర్ తదితరులు అసందర్భంగా గాని, లేదా వారి ఇచ్చను బట్టి గాని, నూతన నిబంధనలోని యోహాను వ్రాసిన సువార్తను వినియోగించు కొన్నారనే విషయాన్ని ఇంతకు ముందే తెలుసుకొన్నాం. యేసుక్రీస్తు బోధల్లో ప్రయోగించిన అనేక సాదృశ్యాలను యధాతధంగా గాని పేరు మార్చి గాని, సత్యసాయిబాబా తన బోధల్లో వాడుకొంటున్నాడు. ఇలా ఎందుకు రెండు మతాలను సమ్మేళింప ప్రయత్నిస్తున్నారనే ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టం కాదు. వారి ఉద్దేశాలు వేరగుగాక, చూపరులకు అది మతపరంగా తటస్థంగా వున్న పాశ్చాత్యుల నాకర్షించడానికేనననే భావం కలిగితీరుతుంది.

పాశ్చాత్యుల్లో ఎవరేమతస్థులైనా తమ తమ పూర్వం మత విశ్వాసానికి స్వస్తి చెప్పకుండానే ఈ ఉద్యమాలలో చేరవచ్చుననేది ఈ గురువులు అవలం బించిన మరో విధానం. ఈ అంశాన్ని ఆయా గురువులను, వారి బోధలను చర్చిస్తున్నపుడు ప్రస్తావించాం పాశ్చాత్యులు వివాహాది కార్యాలకు, భూస్థాపనా కార్యక్రమాలకు తోడ్పడే క్రైస్తవ సభ్యత్వాన్ని అలా కొనసాగిస్తూనే అనేక ఉద్యమాలలో ప్రవేశించిన వారనేకులతో గ్రంథకర్త ముచ్చటించాడు. ఈ విధమైన ద్వంద్వ సభ్యత్వంవల్ల వ్యక్తులకు కలిగే అధిక ప్రయోజన మేమిటో తెలియదు. కాని, వుద్యమాలు ఆర్థికంగా బలపడగా, క్రైస్తవ సంఘారాధనలో పాల్గొనేవారి సంఖ్య ఆ దేశాలలో పలచబడడం జరిగింది. ఇట్టి ప్రచారకుల్లో బాల యోగీశ్వర్, రాధాసామి సత్సంగ్ బియాస్, మహర్షి మహేష్‌యోగి ప్రప్రధములు కాగా, భక్తి వేదాంత ప్రభుపాద రెండవ స్థాయికి చెందినవారు. 'భూతలంలో స్వర్గం' అరచేతిలో వైకుంఠమైనందువల్ల ప్రవేశించగోరేవారికేమీ కొదువలేదు.

ఈ సాంకేతిక వైజ్ఞానిక యుగంలో హేతువాదం ప్రబలడంవల్ల ప్రశ్నించి, వెంటనే తగిన సమాధానం రాకపోతే శీఘ్ర నిర్ణయాలు తీసికొని, పాతను విడిచి క్రొత్తవైపు పురోగమించడానికి యువత అలవాటు పడింది. గత ఇరవై యిదు సంవత్సరాలలో అమెరికాలో సంభవించిన అనేక పరిణామాలు కూడ ఈ ద్యమాలు అక్కడ వ్యాప్తి చెందడానికి ప్రబలంగా తోడ్పడినవనే చెప్పవలసి ంది. వియత్నాం యుద్ధంలో అమెరికా పాత్ర ప్రతి సామాన్య పౌరుని, ముఖ్యంగా యువతను దిగ్భ్రాంతి పరచింది. ఎవరికోసం ఎందుకోసం ఈ జన నష్టం అనేది

సామాన్యుల నినాదమయింది. ఆయా విద్యాసంస్థల్లోని విద్యార్థులు తదితరులు ప్రభుత్వ విధానానికి నిరసన ప్రకటించే ప్రయత్నంలో ప్రకోపించి, ప్రజ్వరిల్లిన అశాంతి జ్వాలనాపి, వారిని చల్లబరచటానికి అటు ప్రభుత్వంగాని, ఇటు సంప్ర దాయకమైన క్రైస్తవ మతంగాని ముందుకు రాలేకపోవడం, ఒకవేళ వచ్చినా అది అవసరమైనంత ఉత్సాహాన్ని వ్యక్త పోవడం జరిగింది. కారుచిచ్చులా అమెరికా అంతా వ్యాపించిన మాదకద్రవ్యాల సేవనంవల్ల యువతలో ఏర్పడిన నిశ్చేతన స్థితి, జీవితంపై అసహ్యం మొదలైన పరిస్థితుల్లో గురు మహారాజుల్లో వారికి కావలసిన నాయకుణ్ణి చూడగలిగారు. తల్లిదండ్రులిచ్చే అధిక స్వాతంత్ర్యంవల్ల వక్రించిన మేధగల యువతకు వారి అభిరుచులను పెద్దగా త్యాగం చెయ్యకుండానే ఏదో ఒక మత ఉద్యమాన్ని ఎన్నుకునే అవకాశం ఏర్పడుతున్నపుడు పాతను వీడి, క్రొత్తను కౌగలించడంలో పొరబాటు లేదనే తలంపు అనేకుల్లో ప్రబలంగా వ్యాపించి ఉంది. విపరీతంగా అమెరికాలో లేవనెత్తిన రాక్ ఉత్సవాలు, ఈ వుత్సవాలు సృష్టించిన వేలంవెర్రితనం కూడా తోడైంది.

యువత నూతనాన్ని ఆహ్వానించే స్వభావం గలది. ప్రతి ఆదివారం జరిగే ఒకే రకమైన క్రైస్తవ ఆరాధనా విధానంకంటే తాత్కాలికంగానైనా గురు సంస్థలు క్రొత్త విధానాన్ని పరిచయం చేశాయి అతీంద్రియ ధ్యానం ధ్యానాన్ని, రాధాసామి సత్‌సింగ్ పవిత్ర నాదశ్రవణాన్ని, భక్తి వేదాంత ప్రభుపాద సంకీర్తనా పద్ధతిని, ఆచార్య రజనీష్ చరాత్మక ధ్యాన విధానాన్ని లేదా రజనీష్ ధ్యానయోగాన్ని-ఒక్కొక్క గురువు ఒక్కొక్క విధానాన్ని ప్రచారం చేసి, తమ దగ్గరేదో క్రొత్త చికిత్సాప్రక్రియ వున్నదనే భావాన్ని కలిగించి యువతను ఆకర్షించగలిగారు.

ఇలా ఎన్నైనా కారణాలను సూచించవచ్చును. వీనికి తగినట్లు సరిగా ఆ లక్షణాలు గల వారికోసమే తమ ఉద్యమం ప్రారంభమైందన్నట్లుగా అన్ని సంప్రదాయాలకు తిలోదకాలిచ్చి చౌకబారు ప్రచారం, అంతకంటే చౌకబారు ధనంకోసం రాజీ ధోరణి అలవర్చుకోగల ఉద్యమ నాయకు లుండడంవల్ల ఈ వుద్యమాలు పై దేశాలలో రాణిస్తున్నాయి. ఎక్కడ చూచినా రజనీష్ బొమ్మలే! అతీంద్రియ ధ్యాన మందిరాలే! ఎక్కడ విన్నా హరే కృష్ణ భజనలే!

ఈ భజనలు, ఈ కేంద్రాలు, ఈ అతీంద్రియ ధ్యానాలు జనాన్ని ఆకర్షించడం వెనుక క్రొత్త కోసం తహతహలాడే యువత వున్నమాట ఎవరూ కాదనలేరు. కాని ఆ యువతను ఆకర్షించే బలమైన కారణాలీ ఉద్యమాలు సూచిస్తున్నాయనడం కన్న పారంపర్యంగా వస్తున్న క్రైస్తవ సంఘం తన భావి సభ్యుల ఎడ తగిన శ్రద్ధ చూపక నిర్లక్ష్యం చేయడమే ప్రధాన కారణం అనడం సబబేమో!

ఈ అలసత్వాన్ని ఆ మతనాయకులు విడిచి తమ యువ సభ్యులకేది అవసరమో దానిని అందించి వారిలోని క్రియాత్మక శక్తులు వికసించడానికి దోహదం కలిగించ కలిగితే ఈ ఉద్యమాల ప్రభావం అంతగా ఆయా పాశ్చాత్య దేశాల్లో వుండదని చెప్పవచ్చు. కాలిఫోర్నియా రాష్ట్రంలో టి ఎమ్ నాయకులపై కోర్టులో నడుస్తున్న అభియోగం చాల వరకు ఈ వుద్యమం యొక్క ఆవజీవాలను కృంగదీస్తున్నది. స్వామి భక్తి వేదాంత ప్రభుపాద మరణానంతరం ఏర్పడిన కార్యనిర్వాహక కమిటీ అనేక దేశాల్లో తమ ఆస్తుల విషయంలో అపవాదుల నెదుర్కొంటున్నందువల్ల అస్తిత్వం కోసం అది పోరాడే పరిస్థితులేర్పడినై. దివ్యజ్యోతి మిషన్- పేరుతోపాటు నాయకత్వాన్ని మార్చుకొని, నామావశిష్టంగా వుంది. ఆచార్య రజ్నీష్, రజ్నీష్ పురం నుండి బయటపడిన మీదట ఆ ఆశ్రమ కార్యకలాపాలు వీధికెక్కాయి. ఇలా వుండగా ఈ వుద్యమాలన్ని మహానగరాలకే పరిమితంగా వుండి గ్రామీణ జీవనంలోనికి ప్రవేశించలేకపోయాయి. నిత్యం పరిణామ శీలాన్నే ప్రథమ గుణంగా ధరించిన మహానగరాలలో వెలసిన ఈ వుద్యమాల భవిష్యత్తు కూడా ఏనాడు ఏ పరిణామానికి గురిఔతుందో వేచి చూడవలసి వుంది.